సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 18 సంచిక: 134
సోమవారం 4-8-2025



'రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు పాడిపంటలతో పులకించాలి'



ఇంకా ఉంది!
వానతో భారత్, ఇంగ్లండ్ ఐదో టెస్టు తుది ఫలితం నేటికి వాయిదా -14లో



రూ.10 లక్షలున్నా ప్రాపర్టీ కింగ్!
ఇళ్లు, వాణిజ్య భవనాలు, గోదాములు.. నచ్చిన ప్రాపర్టీపై పెట్టుబడికి వీలు -15లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



చందమామపై బతికేయొచ్చు!
ఆక్సిజన్, నీటి కొరత సమస్యను తీర్చేలా చంద్రుని మట్టి నుంచే ఆ రెండింటినీ చైనా శాస్త్రవేత్తలు తయారుచేశారు.
వివరాలు 6లో ▸



అణు విద్యుత్ కేంద్రంపై దాడి
ఉక్రెయిన్‌కు చెందిన అత్యంత కీలకమైన జపోరిజియా అణువిద్యుత్ కేంద్రంపై ఆదివారం రష్యా దాడి చేసింది.
వివరాలు 6లో ▸



కాలువలో పడిన కారు..
యూపీలోని గోండా జిల్లాలో కారు సరయూ నది కాలువలో పడి ఒకే కుటుంబానికి చెందిన 9 మంది సహా 11 మంది మృత్యువాతపడ్డారు.
వివరాలు 6లో ▸



రష్యాలో మళ్లీ భూకంపం
రష్యాలోని కురిల్ దీవుల సమీపంలో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై ఇది 7.0గా నమోదైంది.
వివరాలు 6లో ▸



యూరియా కోత.. రైతన్న వెత...

- వరినాట్లు ఊపందుకోవడంతో పెరిగిన డిమాండ్
- అవసరానికి మించి యూరియా సరఫరా చేశామన్న కేంద్రం ప్రకటనతో గందరగోళం
- డీఏపీ, ఎంఓపీ, కాంప్లెక్స్..ఇలా అన్ని ఎరువులూ కలిపి చెప్పారంటున్న రాష్ట్ర అధికారులు
- రైతులకు తప్పుడు సంకేతాలు వెళ్లే అవకాశం ఉందంటూ ఆందోళన
- వానాకాలానికి 10.48 ఎల్‌ఎంటీల యూరియా అడిగితే 9.80 ఎల్‌ఎంటీలే కేటాయించారు
- 4 నెలల్లో 6.60 ఎల్‌ఎంటీలు ఇవ్వాల్సి ఉంటే ఇప్పటివరకు 4.50 ఎల్‌ఎంటీలే ఇచ్చారు
- కేంద్రమంత్రికి రాష్ట్ర మంత్రి తుమ్మల లేఖ.. తక్షణమే యూరియా సరఫరాకు విజ్ఞప్తి
- ఆగస్టులో కనీసం 2 ఎల్‌ఎంటీలైనా వస్తేనే గండం గట్టెక్కుతామంటున్న అధికారులు

తీవ్రమైన కొరత నేపథ్యంలో ఒక్కొక్కరికి 2 బస్తాలే ఇస్తున్న ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్

ఇటీవలి వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలో వరినాట్లు ఊపందుకున్నాయి. దీంతో ఎరువుల కోసం డిమాండ్ పెరుగుతోంది. ముఖ్యంగా అవసరమైన మొత్తంలో యూరియా కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. అయితే తీవ్రమైన కొరత నేపథ్యంలో ప్రభుత్వం రేషన్ విధానంలో ఒక్కొక్కరికి రెండు బస్తాలే ఇస్తుండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు ఈ ఆగస్టు నెలలో రైతుల అవసరాలు తీరాలంటే కనీసం 2 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్‌ఎంటీ) యూరియా అవసరమని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. కేంద్రం నుంచి ఆ మేరకు యూరియా వస్తేనే గండం గట్టెక్కే అవకాశం ఉంటుందని, లేకపోతే రైతులు రోడ్లు ఎక్కే పరిస్థితి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రానికి కేంద్రం వానాకాలం సీజన్‌కు గాను నెలల వారీగా కేటాయించిన 9.80 ఎల్‌ఎంటీల యూరియాలో కోత పెట్టడంతోనే రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర ప్రభుత్వం చెబుతుండగా..రాష్ట్రానికి కోటాకు మించి ఎరువులు సరఫరా చేశామంటూ కేంద్ర మంత్రి చేసిన ప్రకటనతో గందరగోళం నెలకొంది. ఇది రైతులకు తప్పుడు సంకేతాలను ఇస్తుందని, గ్రామాల్లో యూరియా కోసం ఆందోళనలు పెరిగే అవకాశం ఉందని
మిగతా 12వ పేజీలో ▶

పెండింగ్.. పరిష్కారమయ్యేనా?

59-జీవో దరఖాస్తులు 20 నెలలుగా పెండింగ్‌లోనే..

- ప్రభుత్వ భూముల్లోని తమ నివాసాలు క్రమబద్ధీకరించాలంటూ విజ్ఞప్తులు
- సీఎంతో పాటు రెవెన్యూ మంత్రిపై ప్రజాప్రతినిధుల ఒత్తిడి
- ఈ నెలలో ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశముందంటున్న అధికారులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెండింగ్‌లో పెట్టిన జీవో 59 అమలు కోసం ఒత్తిడి పెరుగుతోంది. గత 20 నెలల కాలంగా తమ దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోకుండా పెండింగ్‌లో ఉన్నాయని, వీలున్నంత త్వరలో నిర్ణయం తీసుకుని తాము నివాసాలు ఏర్పాటు చేసుకున్న ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరించాలనే డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. గత ప్రభుత్వ హయాంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల కారణంతో తమ దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టడం సమంజసం కాదంటూ మంత్రులు, ఎమ్మెల్యేల వద్దకు దరఖాస్తుదారులు వస్తున్నారని, మరోవైపు ముఖ్యమంత్రితో పాటు రెవెన్యూ శాఖ మంత్రిపై కూడా పలువురు ప్రజాప్రతినిధులు ఒత్తిడి తెస్తున్నారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో జీవో 59 ద్వారా ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణ విషయంలో ఈ నెలలోనే ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయని రెవెన్యూ అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. దరఖాస్తుదారులకు మరోమారు నోటీసులిచ్చి, అవసరాన్ని బట్టి ఆ భూములపై మరోమారు కూలంకషంగా విచారణ జరిపి అర్హులకు క్రమబద్ధీకరించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉందని ఆ శాఖ వర్గాలంటున్నాయి.

కేబినెట్ సబ్ కమిటీకి ఇప్పటికే నివేదిక

ఆదాయ వనరుల సమీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీకి గతంలోనే రెవెన్యూ శాఖ జీవో 59కి సంబంధించిన నివేదికను సమర్పించింది. ఈ నివేదిక ప్రకారం.. జీవో 59 కింద మొత్తం 57,661 దరఖాస్తులు రాగా, 55,997 దరఖాస్తుల మిగతా 12వ పేజీలో ▶

న్యూస్‌రీల్

ఉద్దండాపూర్ నిర్వాసితులకు రూ.250 కోట్ల పరిహారం



ఉద్దండాపూర్ నిర్వాసితుల కోసం మొత్తం రూ.250 కోట్ల పరిహారం విడుదల చేసినట్టు 'ఎక్స్'వేదికగా ఆదివారం రాత్రి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. గతంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామన్నారు.
- వివరాలు 2లో▶

రాష్ట్రానికి శకునిలా కిషన్‌రెడ్డి



రాష్ట్రానికి మేలు చేయాల్సిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శకునిలా అడ్డుపడుతున్నాడని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ దుయ్యబట్టారు. బీసీల ఓట్లతో గెలిచిన బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు కిషన్‌రెడ్డి, అమిత్ షాకు భయపడి నోరుమెదపడం లేదని అన్నారు.
- వివరాలు 12లో▶

మళ్లీ ఉద్యోగాల్లోకి...



నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించటం, కొన్ని తప్పిదాలు, అక్రమాలకు పాల్పడటం లాంటి చర్యలతో ఉద్యోగాలు కోల్పోయిన వారి గత పనితీరును సమీక్షించి.. వారిలో కొంత మెరుగైన పనితీరు ఉన్న వారిని తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవాలని ఆర్టీసీ నిర్ణయించింది.
- వివరాలు 3లో▶

హైదరాబాద్-ఆదిలాబాద్ డైరెక్ట్ రైల్వే లైన్



హైదరాబాద్-ఆదిలాబాద్ కొత్త రైల్వే లైన్‌ను ట్రిపుల్‌ఆర్‌తో అనుసంధానిస్తూ నిర్మించే అంశాన్ని పరిశీలిస్తూ రైల్వే శాఖ కొత్త అలైన్‌మెంటును రూపొందించింది. దీని నిర్మాణానికి రూ.6 వేల కోట్లు ఖర్చవుతాయని తేల్చారు.
- వివరాలు 3లో▶

మెగా టెక్స్‌టైల్ పార్కుతో వేలకోట్ల పెట్టుబడులు


ప్రత్యక్షంగా, పరోక్షంగా 2 లక్షల మందికి ఉపాధి

- చేనేత దినోత్సవంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
- చేనేత పరిశ్రమను జీడీపీలో 5 శాతానికి తీసుకెళ్లాలి
- ప్రపంచంలో ఎక్కడ చూసినా మన ఉత్పత్తులే ఉండాలి



మాదాపూర్ (హైదరాబాద్): దేశంలో ఏడు మెగా టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేయనున్నట్టు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఇందులో ఒకటి రాష్ట్రంలోని వరంగల్‌లో ఏర్పాటు కానుందని చెప్పారు. టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుతో వేల కోట్లలో పెట్టుబడులు వస్తాయని పేర్కొన్నారు. 2 లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. మాదాపూర్‌లోని శిల్పారామం ఎత్నిక్ హాల్‌లో ఆదివారం నేషనల్ హ్యాండ్లూమ్ డే నిర్వహించారు. హైదరాబాద్ వీవర్స్ సర్వీస్ సెంటర్, హ్యాండ్లూమ్స్
మిగతా 2వ పేజీలో ▶

ఎగువ నుంచి ప్రవాహం తగ్గిపోవడంతో మూసివేసిన నాగార్జున సాగర్ గేట్లు 5లో



వారం తర్వాతే వానలు!

ప్రస్తుతం వర్షాలకు అనుకూలించని వాతావరణ పరిస్థితులు

తేలికపాటి వానలతో సరి.. భారీ వర్షాలకు వేచి చూడాల్సిందే

10 శాతం లోటుకు పడిపోయిన నైరుతి వర్షాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వర్షపాతం గణాంకాలు క్రమంగా పడిపోతున్నాయి. పది రోజుల క్రితం కురిసిన వర్షాలు ఉత్సాహపర్చినప్పటికీ... ఆ తర్వాత తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం రాష్ట్రంలో సగటున 10 శాతం లోటు వర్షపాతం ఉంది. గత ఐదేళ్ల వర్షపాతం గణాంకాలను పరిశీలిస్తే... ఆగస్టు నాటికి రాష్ట్రంలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. కానీ ప్రస్తుతం నైరుతి సీజన్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు వర్షపాతం లోటులోనే ఉంది. గత వారం వరకు సాధారణ స్థితికి వచ్చిన గణాంకాలు మళ్లీ పడిపోయాయి. ప్రస్తుతం రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు, ఒకట్రెండు చోట్ల మోస్తరు వర్షాలు నమోదవుతున్నాయి. కానీ వరుస వర్షాలకు అవకాశం లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. మరో వారం వరకు ఇలాంటి పరిస్థితులే ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. నైరుతి రుతుపవన సీజన్‌లో ఇప్పటివరకు బంగాళాఖాతంలో బలమైన
మిగతా 5వ పేజీలో ▶

చుక్క నీటినీ వదులుకోం

- రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీరందేలా పకడ్బందీ కార్యాచరణ
- పదేళ్లలో బీఆర్‌ఎస్ చేసిందేమీ లేదు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



కమలాపురం సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ముదిగొండ: తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన సాగునీటి వాటాలో ఒక్క చుక్క నీటిని కూడా వదులుకోబోమని, తమకు రాజకీయాల కంటే రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బనకచర్ల పాపం బీఆర్‌ఎస్‌దేనని, ఈ విషయంలో ఏపీ ప్రభుత్వ కుట్రలను అడ్డుకుని తీరతామని అన్నారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం కమలాపురంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో రూ.10 కోట్లతో నిర్మించనున్న 10 వేల మెట్రిక్ టన్నుల గోదాముల పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతంలో 5.91 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములే
మిగతా 5వ పేజీలో ▶


'కాళేశ్వరం' బాధ్యులపై ఏసీబీ లేదా సిట్!

పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై చర్చించేందుకు నేడు భేటీకానున్న కేబినెట్
- వివరాలు 2లో

- కమిషన్ ఏం తేల్చిందో పరిశీలించనున్న మంత్రివర్గం..
- తదుపరి కార్యాచరణపై నిర్ణయం


ఎంఎస్‌ఎంఈల్లో.. మహిళా శక్తి

భారతీయ మహిళా వ్యాపారులు పారిశ్రామిక రంగంలోనూ గణనీయమైన పురోగతి సాధిస్తున్నారు. ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) ఏర్పాటు, నిర్వహణలో వారు కీలకపాత్ర పోషిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ఎంఎస్‌ఎంఈల్లో సుమారు 40 శాతం కంపెనీలకు యజమానులు మహిళలే కావడం విశేషం.
-వివరాలు 2లో▶



మరి చచ్చిన పాములను మళ్లీ ఎందుకు చంపుతున్నారని అడుగుతున్నారు సార్!

6 నెలల్లో 13% తగ్గిన
సైబర్ నేరాలు



- ఈ ఏడాది తొలి అర్ధసంవత్సరంలో 228 మంది సైబర్ నేరస్తుల అరెస్టు
- నిందితులకు తెలంగాణలో 189, దేశవ్యాప్తంగా 1,313 సైబర్ నేరాలతో లింకు
- అత్యధికంగా పెట్టుబడులు, ఉద్యోగాల పేరిట మోసాలు
- తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో గణాంకాల్లో వెల్లడి

- వివరాలు 16లో▶

భేతాళ కుట్రలో మరో అంకం

ఏసీబీ కోర్టులో అడ్డంగా దొరికిపోయిన సిట్

ఎదురు దెబ్బ తగిలేసరికి తెరపైకి ఇంకో కట్టుకథ

- ఇందులో భాగంగా ఓ వీడియో లీక్
- దానిపై ఎల్లో మీడియా ద్వారా విపరీత ప్రచారం
- ఎన్నికల్లో పంచిన నోట్లతో వెంకటేశ్ నాయుడంటూ ట్రోలింగ్
- 2023 నవంబర్ నాటి దృశ్యాలంటూ అచ్చేసిన వైనం
- ఆ వీడియోలో రూ.2 వేల నోట్లతో కనిపిస్తున్న వెంకటేశ్ నాయుడు
- దేశంలో రూ.2 వేల నోట్ల చలామణి పూర్తిగా ఆగిపోయిందని 2023 మే 19న ప్రకటించిన ఆర్బీఐ
- అలాగైతే టీడీపీ నేతలతోనూ ఇదే వెంకటేశ్ నాయుడికి సంబంధాలు
- రామ్మోహన్, భరత్, పుట్టా, పెమ్మసానిలతో ఫొటోలు
- మరి ఈ డబ్బు వారందరిదీ అంటే..

12లో



టీడీపీకి చెందిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, విశాఖ, ఏలూరు ఎంపీలు భరత్, పుట్టా మహేశ్‌తో వెంకటేశ్ నాయుడు (ఫైల్)

లోకేశ్ మాటలు పట్టించుకోం

- ఏపీ ప్రతిపాదిత బనకచర్లను వ్యతిరేకిస్తున్నాం
- మా ఫిర్యాదుతోనే కేంద్రం ఆ ప్రాజెక్టును తిరస్కరించింది
- గోదావరిలో 968 టీఎంసీల వాటా వాడుకొనేలా ప్రాజెక్టులు కడతాం

రామగుండం ఎత్తిపోతల ప్రారంభోత్సవంలో మంత్రి ఉత్తమ్



రామగుండం ఎత్తిపోతలను ప్రారంభిస్తున్న మంత్రులు ఉత్తమ్, తుమ్మల, శ్రీధర్‌బాబు, పొన్నం, అడ్లూరి

సాక్షి పెద్దపల్లి: 'నారా లోకేశ్ సహా ఏపీ మంత్రుల మాటలు పట్టించుకోం. ఏపీ ప్రతిపాదిత బనకచర్ల ప్రాజెక్టును పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం. అది తెలంగాణ నీటిహక్కుల ఉల్లంఘనే అవుతుందని సీఎం రేవంత్‌రెడ్డి, నేను పలుమార్లు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాం. మా ఫిర్యాదుతోనే బనకచర్లను కేంద్ర జలసంఘం తిరస్కరించింది. ఏపీ సీఎంతో జరిగిన సమావేశంలోనూ మేం బనకచర్లను వ్యతిరేకించాం 'అని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం గోలివాడ వద్ద రామగుండం ఎత్తిపోతల
మిగతా 5వ పేజీలో ▶

ఎంఎస్ఎంఈల్లో.. మహిళా శక్తి

ఈ పరిశ్రమల్లో సుమారు 40% మగువలవే



భారతీయ మహిళా వ్యాపారులు పారిశ్రామిక రంగంలోనూ గణనీయమైన పురోగతి సాధిస్తున్నారు. ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) ఏర్పాటు, నిర్వహణలో వారు కీలకపాత్ర పోషిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ఎంఎస్ఎంఈల్లో సుమారు 40 శాతం కంపెనీలకు యజమానులు మహిళలే కావడం విశేషం. అత్యధికంగా 30 లక్షలపై చిలుకు మహిళా పారిశ్రామికవేత్తలతో దేశంలో మహారాష్ట్ర తొలి స్థానంలో ఉంది. టాప్ - 10 రాష్ట్రాల జాబితాలో రెండు తెలుగు రాష్ట్రాలూ ఉన్నాయి.

- సాక్షి, స్పెషల్ డెస్క్


భారత్‌లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) రంగం ముఖ్య భూమిక పోషిస్తోంది. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తిలో 45%, మొత్తం ఎగుమతుల్లో 45% వాటా ఎంఎస్ఎంఈలదే అంటే ఇవి ఏ స్థాయిలో పురోగతి సాధించాయో అర్థం చేసుకోవచ్చు. జీడీపీలో ఎంఎస్ఎంఈల వాటా 37.54%కి చేరింది. దేశవ్యాప్తంగా 2025 జూలై 24 నాటికి 6,57,97,647 ఎంఎస్ఎంఈలు ఉన్నాయి. వీటిలో 39.59 శాతం కంపెనీలకు యజమానులు మహిళలే. దేశంలోని మొత్తం ఎంఎస్ఎంఈల్లో సూక్ష్మ, చిన్న తరహావే 99.99%. సూక్ష్మ కంపెనీల్లో 39.79 శాతం, చిన్న తరహా కంపెనీల్లో 11.63 శాతం మహిళలు నెలకొల్పినవి ఉన్నాయి.

ప్రభుత్వ ప్రోత్సాహంతో..

ప్రధాన మంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ (పీఎంఈజీపీ) సూక్ష్మ సంస్థల ఏర్పాటుకు మద్దతు ఇవ్వడం ద్వారా స్వయం ఉపాధిని ప్రోత్సహిస్తోంది. 2008లో ప్రారంభమైన నాటి నుండి ఇది 9.87 లక్షలకు పైగా యూనిట్లకు సహాయం అందింది. 2023 సెప్టెంబర్‌లో రూ.13,000 కోట్ల వ్యయంతో ప్రారంభించిన పీఎం విశ్వకర్మ పథకం సంప్రదాయ చేతివృత్తుల వారి నైపుణ్యాలను, మార్కెట్‌తో అనుసంధానించడంలో కీలకపాత్ర పోషిస్తోంది. 2025 జూన్ 26 నాటికి ఈ పథకం లబ్ధిదారుల సంఖ్య 30 లక్షలు దాటింది. 2020లో ప్రవేశపెట్టిన ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పోర్టల్ ఎంఎస్ఎంఈలకు ఉచిత, పేపర్ రహిత రిజిస్ట్రేషన్‌కు వీలు కల్పిస్తోంది. అనధికారిక వ్యాపారాలకు అధికారిక ప్రయోజనాలను విస్తరించడానికి ఉద్యమ్ అసిస్ట్ ప్లాట్‌ఫామ్ 2023లో అందుబాటులోకి వచ్చింది. ఎంఎస్ఎంఈ రంగంలో మహిళలను ప్రోత్సహించేందుకు, వారికి మార్గదర్శనం చేసేందుకు 'యశస్విని' అనే కార్యక్రమాన్ని కేంద్రం ప్రారంభించింది. మార్కెట్ అనుసంధానాన్ని పెంచడానికి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు వినియోగించే వస్తు, సేవల్లో 25 శాతం సూక్ష్మ, చిన్న సంస్థల నుండి సేకరించాలని ప్రభుత్వ సేకరణ విధానం నిర్దేశించింది. దీనికింద ఇందులో 3 శాతం మహిళల యాజమాన్యంలోని వ్యాపారాల నుండి కొనుగోలు చేయాలి. ఇలాంటి అనేక కార్యక్రమాలతో మహిళలు ఈ రంగంలో దూసుకుపోతున్నారు.

2.60 కోట్లకుపైగా 'మహా రాణులు'! దేశవ్యాప్తంగా ఉన్న సూక్ష్మ, చిన్న పరిశ్రమల్లో..

	సూక్ష్మ	చిన్న	మొత్తం
మొత్తం	6,53,20,665	4,76,982	6,57,97,647
పురుషులు	3,90,87,412	3,98,546	3,94,85,958
స్త్రీలు	2,59,93,932	55,509	2,60,49,441



ఉద్యమ్ రిజిస్ట్రేషన్, ఉద్యమ్ అసిస్ట్ ప్రోగ్రాం ద్వారా నమోదైన మహిళా పారిశ్రామికవేత్తల యాజమాన్యంలోని సూక్ష్మ, చిన్నతరహా కంపెనీలు

ఎగుమతుల జోష్ — భారత్ నుంచి జరిగిన మొత్తం ఎగుమతుల విలువలో ఎంఎస్ఎంఈల వాటా శాతాల్లో, విలువ రూ.కోట్లల్లో

సంవత్సరం	వాటా	విలువ
2019-20	49.77	13,31,280
2020-21	49.35	12,38,314
2021-22	45.03	16,34,163
2022-23	43.59	16,77,413
2023-24	45.73	17,18,968

కేంద్రం విడుదల చేసిన 'ఎంఎస్ఎంఈ వార్షిక నివేదిక 2024-25' ప్రకారం..
- ఎంఎస్ఎంఈలు.. వ్యవసాయం తరవాత అతిపెద్ద ఉద్యోగ కల్పనా రంగం.
- మొత్తం సృష్టించిన ఉద్యోగాలు 24.4 కోట్లు
- మొత్తం ఎంఎస్ఎంఈల్లో సూక్ష్మ పరిశ్రమలు 98.6 శాతం.
- 2024 డిసెంబరు 31 నాటికి.. మొత్తం ఎంఎస్ఎంఈల్లో మహిళలు యజమానులుగా ఉన్న వాటి శాతం 28.8.

ఎంఎస్ఎంఈలు అందుకున్న రుణాలు మొత్తం (రూ.కోట్లలో)

తేదీ	మొత్తం
2023 మార్చి 31	22,60,135
2024 మార్చి 31	27,25,657
2025 మార్చి 31	31,08,917

సంఖ్యాపరంగా చూస్తే ఇవి 2.60 కోట్లకుపైనే • తెలుగు రాష్ట్రాల్లోనూ రాణిస్తున్న అతివలు

ఉద్యోగాల్లో 18.73%

ఉపాధి: ఎంఎస్ఎంఈలకు సంబంధించిన ఉద్యమ్ పోర్టల్లో నమోదిత మహిళా వ్యాపారులు ఏర్పాటు చేసిన యూనిట్ల ద్వారా సృష్టించిన ఉద్యోగాలు.. మొత్తం ఉద్యోగాల్లో సుమారు 18.73%

పెట్టుబడి: మొత్తం పెట్టుబడిలో మహిళల యాజమాన్యంలోని ఎంఎస్ఎంఈల వాటా 11.15%

టర్నోవర్: మొత్తం టర్నోవర్‌లో వాటా 10.22%

క్లుప్తంగా...

ఈ-నామ్‌లో 32 లక్షలకు పైగా తెలుగు రాష్ట్రాల రైతులు

కేంద్రమంత్రి రామ్‌నాథ్ ఠాకూర్



సాక్షి, న్యూఢిల్లీ: ఈ ఏడాది జూలై 30 నాటికి తెలుగు రాష్ట్రాల నుంచి 32,78,188 మందికి పైగా రైతులు ఈ-నామ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్నట్లు లోక్‌సభలో కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ సహాయమంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఈ మొత్తంలో తెలంగాణకు చెందిన 18,23,959 మంది, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 14,54,229 మంది రైతులు ఉన్నారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 106 మంది, తెలంగాణలో 81 మంది డ్రోన్ దీదీలు.. నానో ఫెర్టిలైజర్స్‌ను స్ప్రే చేశారని మరో ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. రైతులు తమ ఉత్పత్తులకు మెరుగైన ధర పొందాలనే లక్ష్యంతో ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్ (ఈ-ఎన్ఏఎం)ను కేంద్రం ప్రారంభించింది.

జీవన్‌దాన్‌కు జాతీయ పురస్కారం

ఢిల్లీలో ప్రదానం చేసిన కేంద్రమంత్రి నడ్డా

సాక్షి, హైదరాబాద్: పదిహేనో ఇండియన్ ఆర్గాన్ డొనేషన్ డే సందర్భంగా తెలంగాణ మరోసారి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది. అవయవ దానంలో అత్యధిక దాతల నిష్పత్తిని నమోదు చేసిన రాష్ట్రంగా జాతీయ అవార్డు సాధించింది. 2024లో రాష్ట్రం ప్రతి 10 లక్షల (మిలియన్) జనాభాకు 4.88 మందిని అవయవ దాతలుగా నమోదు చేసింది. ఇది దేశ సగటు 0.8 శాతం కంటే చాలా ఎక్కువగా ఉంది. ఈ ఘనతకు గుర్తింపుగా ఢిల్లీలోని నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా నుంచి తెలంగాణ ప్రభుత్వం తరఫున డాక్టర్ జి.మల్లికార్జున్, జీవన్‌దాన్ బృందం స్వీకరించింది.

అది జనరహిత పాదయాత్ర

మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆర్మూర్‌లో చేస్తున్నది జనహిత పాదయాత్ర కాదని.. అది జనరహిత పాదయాత్ర అని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఎ.జీవన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఆయన ఆదివారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. పాదయాత్ర సందర్భంగా ఆర్మూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేశారని విమర్శించారు. మీనాక్షి నటరాజన్ మాటల్లో గాంధేయవాదం.. చేతల్లో గాడ్సే వాదం కనిపిస్తున్నాయని ఆరోపించారు.

ఆదాయం పెంచేదెలా?!

కొత్త ఎక్సైజ్ పాలసీపై అధికారుల మల్లగుల్లాలు

వచ్చే నవంబర్‌తో ముగియనున్న ప్రస్తుత షాపుల గడువు
- సీఎం రేవంత్‌రెడ్డితో ఉన్నతాధికారుల భేటీ
- ఈసారి పాలసీ రెండేళ్లేనా.. మూడేళ్లకు పొడగించాలా అన్న దానిపై చర్చ
- త్వరలో కొలిక్కిరానున్న కొత్త ఎక్సైజ్ పాలసీ ప్రక్రియ



సాక్షి, హైదరాబాద్: ఆదాయ పెంపే లక్ష్యంగా కొత్త పాలసీ రూపకల్పన కోసం ఎక్సైజ్ శాఖ కసరత్తు చేస్తోంది. ఈ పాలసీ మేరకు రాష్ట్రంలో ఏర్పాటు చేయబోయే వైన్ (ఏ4) షాపులకు సంబంధించి వివిధ రూపాల్లో ఆదాయం ఎలా పెరుగుతుందా అన్న దృష్టితోనే ఆ శాఖ ముందుకెళుతోందని తెలుస్తోంది. ఈ ఏడాది నవంబర్ 30తో ప్రస్తుతమున్న పాలసీ గడువు ముగియనున్న నేపథ్యంలో రానున్న రెండేళ్ల కాలానికి కొత్త విధానం రూపొందించాలా.? లేక గడువు మూడేళ్లకు పొడిగించాలా? ఈ పాలసీ ప్రకారం వైన్‌షాపుల టెండర్లలో పాల్గొనే దరఖాస్తు ఫీజును రూ.2 లక్షలు గానే ఉంచాలా? లేక మరికొంత పెంచాలా? అన్న దానిపై మల్లగుల్లాలు పడుతున్నట్టు సమాచారం. కొత్త పాలసీపై ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో ఆ శాఖ ఉన్నతాధికారులతో సుదీర్ఘంగా భేటీ అయిన సందర్భంగా.. కొత్త ఎక్సైజ్ పాలసీతో పాటు రాష్ట్రంలో మైక్రో బ్రూవరీల చట్ట సవరణకు కేబినెట్ ఆమోదం దరిమిలా రూపొందించాల్సిన మార్గదర్శకాలపై చర్చ జరిగినట్టు తెలిసింది.

ఏది చేసినా పకడ్బందీగా..!
2023–25 సంవత్సరాలకు గాను గతంలో ఎక్సైజ్ శాఖ రూపొందించిన పాలసీ గడువు నవంబర్ 30తో ముగియనుంది. ఈలోగా కొత్త పాలసీని రూపొందించడంతో పాటు వైన్‌షాపుల టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి కొత్త షాపుల ఏర్పాటుకు లైసెన్సులు మంజూరు చేయాల్సి ఉంది. ఈ ఏడాది డిసెంబర్ 1వ తేదీ నుంచి ఏర్పాటు చేయాల్సిన ఈ షాపులకు దరఖాస్తులను ఎప్పుడు ఆహ్వానించాలన్న దానిపై సీఎం సమక్షంలో జరిగిన సమావేశంలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా కనీసం నెలన్నర రోజుల పాటు దరఖాస్తుల సమర్పణకు గడువివ్వాలని, అప్పుడు ఎక్కువ దరఖాస్తులు వచ్చే అవకాశముందని ఎక్సైజ్ ఉన్నతాధికారులు చేసిన ప్రతిపాదనకు సీఎం అంగీకరించారని సమాచారం. మరోవైపు పాలసీ గడువును రెండేళ్లకే పరిమితం చేస్తే 2027 సంవత్సరం చివర్లో మరోమారు టెండర్లు పిలవచ్చని, అప్పుడు రెండు సార్లు ఆదాయం వస్తుందని, అదే పాలసీని మూడేళ్లకు పొడిగిస్తే 2028 డిసెంబర్ నాటికి జరగాల్సిన అసెంబ్లీ ఎన్నికలు అడ్డు వచ్చే అవకాశముందని అధికారులు చెప్పినట్టు సమాచారం. అయితే అప్పుడు గత ప్రభుత్వం తరహాలోనే రెండు నెలల ముందే నోటిఫికేషన్ ఇచ్చి దరఖాస్తులు స్వీకరించవచ్చని, లైసెన్సు గడువు రెండేళ్లకు అయితే దరఖాస్తు ఫీజు ప్రస్తుతమున్న విధంగానే రూ.2 లక్షలు, మూడేళ్లకు పెంచాల్సి వస్తే రూ.3 లక్షలకు పెంచవచ్చని వివరించినట్టు తెలిసింది. గతంలో టెండర్లు పిలిచినప్పుడు రూ.2,900 కోట్ల వరకు దరఖాస్తుల రూపంలోనే ఆదాయం వచ్చిందని, ఈసారి దరఖాస్తు ఫీజు పెంచకపోయినా ఎక్కువ గడువు ఇస్తే రూ.3,500 కోట్ల వరకు వస్తుందని, అదే రూ.3 లక్షలకు పెంచితే రూ.5 వేల కోట్ల వరకు వస్తుందని వివరించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో పాలసీ గడువుతో పాటు దరఖాస్తు ఫీజు పెంపునకు సంబంధించిన ప్రతిపాదనలను పకడ్బందీగా రూపొందించి నివేదిక తయారు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో కొత్త ఎక్సైజ్ పాలసీ రూపకల్పనకు అతి త్వరలోనే ఆమోదం లభిస్తుందని, మరోమారు సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అనంతరం తుది నిర్ణయం తీసుకుంటామని ఎక్సైజ్ వర్గాలు చెబుతున్నాయి.

'కాళేశ్వరం' బాధ్యులపై ఏసీబీ లేదా సిట్ విచారణ!

- పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై చర్చించేందుకు నేడు భేటీకానున్న కేబినెట్
- కమిషన్ ఏం తేల్చిందో పరిశీలించనున్న మంత్రివర్గం.. తదుపరి కార్యాచరణపై నిర్ణయం
- బాధ్యులపై తీసుకోవాల్సిన చర్యల గురించి పరిశీలించే అవకాశం

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు కేబినెట్ భేటీ కానుంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలపై విచారణ చేపట్టిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ గత నెల 31న సమర్పించిన నివేదికపై చర్చించి తదుపరి కార్యాచరణను సిద్ధం చేసేందుకు మంత్రివర్గ సమావేశాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోంది. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదివారం రాత్రి సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్‌తో సమావేశమై కేబినెట్ నోట్ తయారీపై చర్చించారు. కమిషన్ ఇచ్చిన 650 పేజీల నివేదికపై అధ్యయనం చేసేందుకు ఐఏఎస్ అధికారులతో ప్రభుత్వం కమిటీ వేసిన విషయం తెలిసిందే. కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల వైఫల్యానికి కారణాలు, బరాజ్‌ల నిర్మాణంలో జరిగిన అవకతవకలు, వాటికి బాధ్యులు ఎవరనే అంశాల్లో కమిషన్ ఏం తేల్చిందో నిర్ధారించే బాధ్యతను ప్రభుత్వం ఈ కమిటీకి అప్పగించింది. ఈ కమిటీ సూచనల ఆధారంగా కేబినెట్ నోట్‌ను సిద్ధం చేసి కేబినెట్ సమావేశంలో చర్చకు పెట్టనున్నారు. తదుపరి కార్యాచరణపై మంత్రివర్గం చర్చించి నిర్ణయం తీసుకోనుంది. బాధ్యులపై ఏసీబీతో అవినీతి నిరోధక చట్టం కింద విచారణ జరిపించాలా? లేక సిట్ ఏర్పాటు చేయాలా? అనే అంశాలను మంత్రివర్గం పరిశీలించే అవకాశం ఉంది.


ఉద్ధండాపూర్ నిర్వాసితులకు రూ.250 కోట్ల పరిహారం

సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఉద్దండాపూర్ నిర్వాసితుల కోసం రూ.250 కోట్ల పరిహారం విడుదల చేసినట్టు 'ఎక్స్'వేదికగా ఆదివారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. 'పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఉద్దండాపూర్ రిజర్వాయర్ పరిధిలో గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి కన్నీళ్ల సాక్ష్యంగా మిగిలిన బాధితులకు అండగా నిలిచాం. అధికారంలోకి వస్తే పరిహారం ఇచ్చి కన్నీళ్లు తుడుస్తామన్న హామీని నిలబెట్టుకున్నాం. ఏడాదిన్నరలో రూ.250 కోట్ల పరిహారం మంజూరు చేశాం'అని సీఎం పేర్కొన్నారు. ఇందులో రూ.25 కోట్లు గత నెలలో విడుదల చేశామని, ఈనెలలో మరో రూ. 175 కోట్లు విడుదల చేశామని వెల్లడించారు. నిర్వాసితులతో సహపంక్తి భోజనం చేసి డిసెంబర్ 9లోపు పూర్తి పరిహారం అందిస్తామని తన మాటగా చెప్పాల్సిందిగా స్థానిక శాసనసభ్యుడు అనిరుధ్‌రెడ్డికి గతంలో సూచించినట్టు తెలిపారు. ఈ మేరకు 6 వేల మందితో ఆదివారం సహపంక్తి భోజనం చేసి తన హామీ మేరకు వారికి భరోసా ఇచ్చిన అనిరుధ్‌కు సీఎం అభినందనలు తెలిపారు.

గడువు ముగిసింది.. నివేదిక ఏమైంది?

కనీస వేతన సవరణపై నివేదిక కోరిన రాష్ట్ర ప్రభుత్వం
- ఒక్కసారి కూడా భేటీ కాని కేబినెట్ సబ్ కమిటీ



సాక్షి, హైదరాబాద్: అసంఘటిత రంగ కార్మికుల కనీస వేతన సవరణపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించేందుకు మంత్రివర్గ ఉపసంఘానికి ప్రభుత్వం ఇచ్చిన గడువు ముగిసింది. జూలై 27నాటికి మంత్రివర్గ ఉపసంఘం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలి. నివేదిక సంగతి అటుంచితే... కనీసం ఈ కమిటీ ఒక్కసారి కూడా భేటీ కాకపోవడం గమనార్హం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2006 నుంచి 2012 మధ్య కాలంలో ఇచ్చిన వేతన సవరణ తుది ఉత్తర్వులే ఇప్పటికీ అమలవుతున్నాయి. పనికి తగిన వేతనానికి బదులు..యాజమాన్యాలు నిర్ణయించిన పరిమితులకు లోబడే వేతన చెల్లింపులు జరుగుతున్నాయి. కనీస వేతన సవరణకు కార్మిక సంఘాలు ప్రభుత్వంపై ఒత్తిడి చేయడంతో గతేడాది జనవరి 29న అసంఘటిత రంగంలోని 73 ఎంప్లాయిమెంట్లకు సంబంధించి నోటిఫికేషన్లు జారీ చేసింది. వీటిని సమీక్షించిన తెలంగాణ కనీస వేతన సలహామండలి... ఈ ఏడాది ఏప్రిల్ నెలాఖరులో ప్రతిపాదనలను రాష్ట్ర కార్మిక శాఖకు సమర్పించగా, ప్రస్తుతం కనీస వేతన సవరణ ప్రక్రియ కార్మిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉంది.

ముగ్గురు మంత్రులతో కమిటీ....
తెలంగాణ కనీస వేతన సలహా మండలి నివేదికను అధ్యయనం చేసి రిపోర్టు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముగ్గురితో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి చైర్మన్‌గా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, సభ్యులుగా మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జి.వివేక్ వెంకటస్వామిని, కన్వీనర్‌గా రాష్ట్ర కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జూన్ 27న ఉత్తర్వులు జారీ చేశారు. నెలరోజుల వ్యవధిలో అధ్యయనం పూర్తి చేసి నివేదిక సమర్పించాలని సీఎస్ ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. పారిశ్రామికాభివృద్ధి, సంతృప్తికర వేతన చెల్లింపులకు సంబంధించి కార్మికుల కనీస వేతనాల స్థిరీకరణకు ఎలాంటి నిబంధనలను వర్తింపజేయాలి? అనే అంశంపై ప్రభుత్వానికి సిఫారసు చేస్తూ నివేదిక ఇవ్వాల్సిన బాధ్యతను మంత్రి వర్గ ఉపసంఘానికి అప్పగించింది. కానీ ఈ సబ్ కమిటీ ఇప్పటివరకు భేటీ కాలేదు.

ఏ నివేదికపై అధ్యయనం?

రాష్ట్ర కనీస వేతన సలహా మండలి నివేదికపై మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం చేయాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై కార్మిక శాఖ అధికారుల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఇప్పటివరకు నాలుగు బోర్డులు ఏర్పాటయ్యాయి. ఈ నాలుగు బోర్డులు కూడా అసంఘటిత రంగ కార్మికుల కనీస వేతనాల నిర్ణయంపై ఎలాంటి నివేదికలు సమర్పించలేదు. పారిశ్రామికాభివృద్ధి, సంతృప్తికర వేతన చెల్లింపుల విషయంపై అధ్యయనం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఏ బోర్డుకు కూడా ఆదేశాలు ఇవ్వలేదు. ప్రస్తుతం కొనసాగుతున్న కనీస వేతన సలహా బోర్డు మూడు నెలల క్రితం కార్మిక శాఖకు కనీస వేతనాలపై ప్రతిపాదనలు పంపింది. కానీ మంత్రివర్గ ఉపసంఘానికి ఇచ్చిన ఆదేశాల్లో ఈ ప్రతిపాదనల అంశాన్ని ప్రస్తావించలేదు. దీంతో మంత్రివర్గ ఉపసంఘానికి ఏ నివేదిక ఇవ్వాలి? ఏయే అంశాలపై చర్చించాలనే విషయంలో కార్మిక శాఖ అధికారులకు స్పష్టత లేకపోవడంతో వారంతా మిన్నకుండా ఉన్నారు. దీంతో ప్రభుత్వం నిర్దేశించిన గడువు దాటినా, మంత్రివర్గ ఉపసంఘం నివేదికపై దృష్టి సారించలేదని కార్మిక సంఘాల ప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలుసుకున్న సినీ నటుడు చిరంజీవి. - సాక్షి, హైదరాబాద్

'అభ్యాసం' అభివృద్ధికి మార్గం

డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ ఎండీ జీవీ ప్రసాద్



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఆనంద్ మహీంద్ర

సుభాష్‌నగర్: 'అభ్యాసం'అభివృద్ధికి మార్గమని డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ ఉపాధ్యక్షుడు, మేనేజింగ్ డైరెక్టర్ జీవీ ప్రసాద్ అభిప్రాయపడ్డారు. బహదూర్‌పల్లిలోని మహీంద్ర యూనివర్సిటీ నాలుగో స్నాతకోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జీవీ ప్రసాద్, మహీంద్ర యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆనంద్ మహీంద్రాలు ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, లా, ఎడ్యుకేషన్ స్కూల్స్‌కు చెందిన 943 మంది విద్యార్థులు, 13 మంది పీహెచ్‌డీ స్కాలర్లకు డిగ్రీలు ప్రదానం చేశారు. ప్రతిభ కనబరిచిన 21 మందికి బంగారు పతకాలు అందజేశారు. అనంతరం బయో టెక్నాలజీ ల్యాబ్స్, సెంటర్ ఫర్ రిస్క్ మేనేజ్‌మెంట్‌ను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా జీవీ ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎదుగుదల, ప్రభావం చూపడానికి.. నేర్చుకోవడమే అత్యంత అవసరమని స్పష్టం చేశారు. ఇంజనీరింగ్, డిగ్రీలు పూర్తి చేసిన విద్యార్థులు ఎన్నో కలలు, ఆశలతో ప్రపంచంలోకి అడుగు పెడుతున్నారని, ఈ సమయంలో ఇతరులతో కలసి పని చేయడం, నేర్చుకోవడం అలవరచుకోవాలని సూచించారు. మహీంద్రా యూనివర్సిటీ చాన్స్‌లర్ ఆనంద్ మహీంద్రా మాట్లాడుతూ.. ఉజ్వల భవిష్యత్ రూప శిల్పులను తయారు చేయడమే తమ లక్ష్యమన్నారు. విద్యార్థులు కరుణ, విమర్శనాత్మక ఆలోచన, నైతికత వంటి విలువలు అలవర్చుకోవాలని ఉద్బోధించారు. విద్యార్థులు మెరుగైన ప్రపంచ నిర్మాణం వైపు అడుగులు వేయాలన్నారు. యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ యాజులు మేదురి, సీఈవో ఎండీ మోహిత్ జోషిలు మాట్లాడుతూ.. ఈ ఏడాది ఎంబీఏ, ఎల్ఎల్‌బీ, ఎంఏ, బీటెక్ నానో టెక్నాలజీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ఇది తొలి స్నాతకోత్సవమని పేర్కొన్నారు.

మెగా టెక్స్‌టైల్ పార్కుతో వేలకోట్ల పెట్టుబడులు

▶ మొదటి పేజీ తరువాయి

డెవలప్‌మెంట్ కమిషనర్, కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

వ్యవసాయం తర్వాత చేనేతే..: 'దేశంలో వ్యవసాయ రంగం తర్వాత అత్యధికంగా ఉపాధి కల్పించేది చేనేత రంగం. దేశ ఆర్థిక వ్యవస్థలో కూడా ఈ రంగం కీలకపాత్ర పోషిస్తోంది. మన చేనేత ఉత్పత్తులు ఎంతో నాణ్యత, నైపుణ్యంతో తయారు చేసినవి. విదేశాల్లోని పలు విమానాశ్రయాలు, ప్రముఖ షాపింగ్ కాంప్లెక్స్‌లలో కూడా మన దేశానికి సంబంధించిన, రాష్ట్రానికి సంబంధించిన పట్టు చీరలు, చేనేత ఉత్పత్తులు ప్రదర్శిస్తున్నారు. సుమారు 5 కోట్ల మంది ఈ రంగంపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు. అయితే కొన్ని కారణాల వల్ల చేనేత పరిశ్రమకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఆయా సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలి.

తెలంగాణ చీరలు, తివాచీలకు జీఐ ట్యాగ్: తెలంగాణలో పోచంపల్లి ఇక్కత్, గద్వాల్ చీరలు, నారాయణపేట కాటన్ చీరలు, సిద్దిపేట గొల్లభామ చీరలు, వరంగల్ తివాచీలకు జీఐ ట్యాగ్ ఉండాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. చేనేత కార్మికులను మరింత ప్రోత్సహించి గిట్టుబాటు ధర వచ్చే విధంగా చూడాలి. ప్రపంచ మార్కెట్‌లో మరింత విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది. దేశంలో చేనేత పరిశ్రమ జీడీపీలో 2.3 శాతంగా ఉంది. దీనిని 5 శాతం వరకు తీసుకువెళ్ళాలి. ఇందుకు ప్రతి చేనేత కార్మికుడు పట్టుదలతో కృషి చేయాలి. నైపుణ్యం పెంచుకోవాలి. శిక్షణ ఇచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయి. అలా చేస్తే రానున్న రోజుల్లో ప్రపంచ దేశాల్లో ఎక్కడ చూసినా భారతదేశంలో తయారైన ఉత్పత్తులే అందుబాటులో ఉంటాయి..'అని కిషన్‌రెడ్డి చెప్పారు.

చేనేత దుస్తులు ధరించాలి: 'మన ఉత్పత్తులను బయటి దేశాలలో అమ్మకాలు చేస్తుంటే, కొందరు అక్కడ కొనుగోలు చేసి మన దేశానికి తెచ్చుకుంటున్నారు. అలా కాకుండా స్వదేశీ వస్తువులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. వాడే ప్రతి వస్తువు మేడ్ ఇన్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా అన్నట్టు ఉండాలి. ప్రతి కుటుంబం నెలకు వారం రోజులు చేనేత దుస్తులు ధరించాలి..'అని కేంద్రమంత్రి పిలుపునిచ్చారు. పద్మశ్రీ అవార్డు అందుకున్న చింతకింది సుదర్శన్‌ను ఈ సందర్భంగా సత్కరించారు. చేనేత కళాకారులకు సర్టిఫికెట్‌లు అందజేశారు. చేనేత మగ్గాలను, ఉత్పత్తులను తిలకించారు. ఈ కార్యక్రమంలో శిల్పారామం ప్రత్యేక అధికారి జి.కిషన్‌రావు, నిఫ్ట్ డైరెక్టర్ మాలిని, డాక్టర్ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీసీఏతోనే ప్రజాస్వామ్యం బలోపేతం

రాష్ట్ర పోలీస్ ఫిర్యాదు అథారిటీ (ఎస్పీసీఏ) ప్రారంభంలో జస్టిస్ శివశంకర్ రావు



సాక్షి, హైదరాబాద్: ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో, పోలీసు వ్య వస్థపై ప్రజల విశ్వాసాన్ని పెంపొందించడంలో రాష్ట్ర పోలీస్ ఫిర్యాదుల అథారిటీ (ఎస్పీసీఏ)ది కీలక పాత్ర అని.. తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఫిర్యాదుల అథారిటీ చైర్మన్, జస్టిస్ బి.శివశంకర్ రావు అన్నారు. బీఆర్కే భవన్‌లోని 8వ అంతస్తులోని డి బ్లాక్‌లో ఆదివారం రాష్ట్ర పోలీస్ ఫిర్యాదు అథారిటీ (ఎస్పీసీఏ) కార్యాలయ ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా జస్టిస్ బి.శివశంకర్ రావు మాట్లాడుతూ.. ఎస్పీసీఏ స్వతంత్రంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది దుష్ప్రవర్తన లేదా పోలీసు అధికారాల దుర్వినియోగంపై ఫిర్యాదు చేయడానికి పౌరులకు అందుబాటులో ఉండే వేదికను అందిస్తుందని స్పష్టం చేశారు. పోలీసుల పనితీరుపై ఫిర్యాదులు, వాటి పరిష్కారానికి హైదరాబాద్‌లోని బీఆర్కే భవన్‌లోని 8వ అంతస్తు, డి బ్లాక్ లోని ఎస్పీసీఏ కార్యాలయాన్ని నేరుగా సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్పీసీఏ సభ్యులు, రిటైర్డ్ ఐపీఎస్ పి.ప్రమోద్ కుమార్, డాక్టర్ వ్రరై. వెంకటేశ్వర్లు, జిల్లా పోలీస్ ఫిర్యాదు అథారిటీ (డీపీసీఏ) చైర్మన్ వై.అరవింద్ రెడ్డి, సభ్యులు రిటైర్డ్ అదనపు ఎస్పీ కేవీ రామ్ నర్సింహారెడ్డి, ఎస్.రాజేందర్, లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఐజీ రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక, ద్వితీయ స్థాయి వైద్య విభాగాలపై నిర్లక్ష్యం

తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ధ్వజం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఆరోగ్య శాఖ పరిధిలోని ప్రాథమిక, ద్వితీయ స్థాయి వైద్య విభాగాలను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీజీడీఏ) విమర్శించింది. సంఘం కార్యాలయంలో ఆదివారం టీజీజీడీఏ అధ్యక్షుడు డాక్టర్ డి.నరహరి, సెక్రటరీ జనరల్ డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్, కోశాధికారి డాక్టర్ ఎం.కె.రౌఫ్ విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ), ఆరోగ్య సంచాలకుల విభాగం (డీహెచ్) వైద్యుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. టీవీవీపీని డైరెక్టర్ ఆఫ్ సెకండ్ హెల్త్ సర్వీసెస్‌గా మార్చే ప్రక్రియ నిరంతరం వాయిదా పడుతోందని చెప్పారు. ఆసుపత్రుల పునర్ వ్యవస్థీకరణ ఫైలు.. ఎలాంటి ఆర్థిక భారం లేకపోయినా వాయిదా పడుతూనే ఉందన్నారు. 2018 తర్వాత సివిల్ అసిస్టెంట్ సర్జన్ల (స్పెషలిస్ట్ నియామకాలు జరగలేదని, డిప్యూటీ సీఎస్, సీఎస్ఎస్‌లకు పదోన్నతులు కల్పించలేదన్నారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత డీసీహెచ్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ పదోన్నతులు జరగలేదని తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌లో.. జీవో నంబర్ 142 సవరణ ఇంకా పెండింగ్‌లోనే ఉందని, సివిల్ సర్జన్‌ల పదోన్నతులు ఆలస్యం అవుతున్నాయని వివరించారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని.. లేకపోతే తదుపరి కార్యాచరణను రాబోయే రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నిర్ణయించనున్నట్లు హెచ్చరించారు.

హైదరాబాద్-ఆదిలాబాద్ డైరెక్ట్ రైల్వే లైన్

ఔటర్ రింగ్ రైల్ ద్వారా రైల్వే శాఖ కొత్త ప్రతిపాదన

డీపీఆర్ సిద్ధం, త్వరలో రైల్వే బోర్డు ముంగిటకు	పటాన్‌చెరు-జోగిపేట మధ్య ఔటర్ రింగ్ రైల్ నుంచి మొదలు	నాగులపల్లి స్టేషన్ నుంచి ప్రారంభమయ్యేలా మరో అలైన్‌మెంట్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్‌కు నేరుగా నిర్మించాలని ప్రతిపాదించిన రైల్వే లైన్‌ను ఔటర్ రింగ్ రైలు ప్రాజెక్టుతో అనుసంధానించే కసరత్తు మొదలైంది. రీజినల్ రింగురోడ్డును అనుకుని నిర్మించే ప్రాజెక్టులో ఇటీవల కదలిక వచ్చిన విషయం తెలిసిందే. దానికి భూసేకరణ సమస్యగా ఉండే అవకాశం ఉన్నందున, రీజినల్ రింగురోడ్డుకు సేకరించిన భూమిలోనే నిర్మిస్తే బాగుంటుందని ఇటీవల స్వయంగా రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్ ప్రతిపాదించారు. దీంతో ట్రిపుల్ ఆర్‌తోపాటు కొంత అదనపు భూసేకరణపై కసరత్తు మొదలైంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్-ఆదిలాబాద్ కొత్త రైల్వే లైన్‌ను ట్రిపుల్‌ఆర్‌తో అనుసంధానిస్తూ నిర్మించే అంశాన్ని పరిశీలిస్తూ రైల్వే శాఖ కొత్త అలైన్‌మెంటును రూపొందించింది. దీని నిర్మాణానికి దాదాపు రూ.6 వేల కోట్లు ఖర్చవుతాయని తేల్చారు.

సంగారెడ్డి-జోగిపేట మధ్య ప్రారంభం..

హైదరాబాద్-ఆదిలాబాద్ కొత్త రైల్వేలైన్ పటాన్‌చెరు సమీపంలోని నాగులపల్లి స్టేషన్ నుంచి ప్రారంభం అయ్యేలా తొలుత ప్రతిపాదించారు. ఆ అలైన్‌మెంటు ప్రకారమే ఫైనల్ లొకేషన్ సర్వే మంజూరైంది. ఈ సర్వే సమయంలోనే రైల్వే అధికారుల్లో ప్రత్యామ్నాయ ఆలోచన వచ్చింది. నాగులపల్లి వద్ద కాకుండా కొత్తగా నిర్మించబోయే ఔటర్ రింగు రైల్ నుంచి ఆదిలాబాద్ కొత్త లైన్‌ను ప్రారంభించాలని ప్రతిపాదించారు. ఔటర్ రింగు రైలు లైన్ ఇటు సంగారెడ్డి ఇవతల హైదరాబాద్-వాడీ లైన్‌ను క్రాస్ చేస్తుంది. అటు జోగిపేట అవతల అక్కన్నపేట-మేడ్చల్ లైన్‌ను దాటుతుంది. ఈ రింగురైల్ లైన్‌లో సంగారెడ్డి-జోగిపేట మధ్య హైదరాబాద్-ఆదిలాబాద్ లైన్ ప్రారంభమవుతుంది. ముస్లాపూర్- నిజాంపేట్- మగ్దూంపూర్-బాన్స్‌వాడ-రుద్రూరు మీదుగా వెళ్లి బోధన్ వద్ద ప్రస్తుత రైల్వే లైన్‌లో కలుస్తుంది. బోధన్ నుంచి నిజామాబాద్ మీదుగా ఆర్మూర్ వరకు ప్రస్తుతం ఉన్న లైన్‌లో కొనసాగి, ఆర్మూర్ స్టేషన్ వద్ద మళ్లీ కొత్త లైన్ ముందుకు సాగుతుంది. అక్కడి నుంచి బుస్సాపూర్ - బాల్కొండ - ఇచ్చోడ మీదుగా వెళ్లి ఆదిలాబాద్ స్టేషన్ వద్ద ప్రస్తుత లైన్‌లో కలుస్తుంది.

మహారాష్ట్ర మీదుగా వంద కి.మీ. అదనంగా తిరిగి..

- ప్రస్తుతం హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్‌కు నేరుగా రైల్వే లైన్ లేదు. హైదరాబాద్ నుంచి నిజామాబాద్‌కు, అక్కడి నుంచి బాసర మీదుగా మహారాష్ట్రలోని ముద్ఖేడ్‌కు వెళ్లి, అక్కడ లోకో ఇంజిన్‌ను రివర్స్ చేసుకుని సహస్రకుండ్, హిమాయత్‌నగర్, ఉమ్రి మీదుగా ఆదిలాబాద్ చేరుకుంటుంది. హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గాన 303 కి.మీ. నిడివితో ఆదిలాబాద్ చేరుకుంటుండగా, మహారాష్ట్ర మీదుగా తిరగాల్సి రావటంతో రైల్వే మార్గంలో 416 కి.మీ. ప్రయాణించాల్సి వస్తోంది.
- ప్రతిపాదిత కొత్త లైన్ కేవలం 316 కి.మీ. నిడివితో ఆదిలాబాద్ చేరుకునే వీలుంటుంది. దీనివల్ల సమయంతోపాటు డబ్బు కూడా ఆదా అవుతుంది
- ప్రస్తుతం హైదరాబాద్ నుంచి నిజామాబాద్‌కు నేరుగా రైల్వే లైన్ ఉంది. దాన్ని వినియోగించుకుంటూ ఆర్మూర్ నుంచి ఆదిలాబాద్‌కు కొత్త లైన్ నిర్మిస్తే కేవలం 150 కి.మీ. నిడివితో ఆదిలాబాద్‌కు హైదరాబాద్ నుంచి నేరుగా లైన్ ఏర్పాటవుతుంది. అయితే, దీనివల్ల నిజామాబాద్ మార్గంపై అదనపు భారం వేసినట్టవుతుంది. మరోవైపు ఆర్మూర్ ఎగువన బాల్కొండ, నిర్మల్, ఇచ్చోడ లాంటి కీలక ప్రాంతాలకు మాత్రమే రైల్వే వసతి కలుగుతుంది. పటాన్‌చెరు మీదుగా కొత్త లైన్ నిర్మించటం వల్ల పటాన్‌చెరు, బాన్స్‌వాడ, రుద్రూరు లాంటి కొత్త ప్రాంతాలకు కూడా కనెక్టివిటీ ఏర్పడుతుంది.
- ఈ కొత్త లైన్ వల్ల హైదరాబాద్ -వాడీ, హైదరాబాద్-మెదక్, నిజామాబాద్-నాందేడ్, నిజామాబాద్-పెద్దపల్లి తదితర లైన్ల అనుసంధానం జరుగుతుంది.
- ప్రస్తుతం నిజామాబాద్-బోధన్ లైన్ అసంపూర్తిగా ఉంది. బోధన్ స్టేషన్‌తోనే ఆ లైన్ ఆగిపోతోంది. కొత్త లైన్‌ను దానికి అనుసంధానం చేస్తే భవిష్యత్తులో బోధన్ లైన్ హైదరాబాద్‌తో అనుసంధానమవుతుంది. హైదరాబాద్-నిజామాబాద్‌కు మరో ప్రత్యామ్నాయ లైన్ ఏర్పడుతుంది.



రింగ్ రైల్ కుదరకుంటే..

ఔటర్ రింగ్‌రైల్ చాలా క్లిష్టమైన ప్రాజెక్టు. దీనికి భూసేకరణ పెద్ద సమస్యగా మారింది. ఏదైనా కారణాలతో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కకపోయినా లేదా తీవ్ర జాప్యం జరిగే అవకాశం ఉన్నా.. పాత ప్రతిపాదన ప్రకారం పటాన్‌చెరు సమీపంలోని నాగులపల్లి స్టేషన్ వద్ద ఆదిలాబాద్ లైన్‌ను ప్రారంభిస్తూ పను లు మొదలుపెట్టనున్నారు. అది సంగారెడ్డి మీదుగా కొనసాగి మగ్దూంపూర్- బాన్స్‌వాడ మీదుగా బోధన్ లైన్‌తో అనుసంధానమవుతుంది

డబుల్ డెక్కర్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు

రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి

మన్సూరాబాద్/వనస్థలిపురం: చింతలకుంట నుంచి హయత్‌నగర్ రేడియో స్టేషన్ వరకు.. డబుల్ డెక్కర్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖమంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే పనులను ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని మన్సూరాబాద్ డివిజన్ ఆగమయ్య కాలనీ వద్ద జరుగుతున్న వరద కాలువ పనులను మంత్రి పరిశీలించారు. వనస్థలిపురం వద్ద ఎలివేటెడ్ కారిడార్ ఏర్పాటుకు.. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డిలతో ఆయన ఆదివారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత మాజీ కౌన్సిలర్ పోచబోయిన ఈశ్వరమ్మయాదవ్ నివాసంలో మంత్రి విలేకరులతో మాట్లాడారు. చింతలకుంట నుంచి మల్కాపురం వరకు జాతీయ రహదారి అభివృద్ధి పనులు దాదాపు పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఎల్బీనగర్ ప్రాంత ప్రజల ట్రాఫిక్ కష్టాలు తెలుసని, భవిష్యత్తులో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. చింతలకుంట నుంచి హయత్‌నగర్ రేడియో స్టేషన్ వరకు రూ.650 కోట్లతో.. మూడు అంచెలతో 6 కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఈనెల 6న కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసి వివరించి నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వరకు.. 8 లైన్ల జాతీయ రహదారి విస్తరణ పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. రెండు గంటల్లోగా విజయవాడ చేరుకునేలా గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు వివరించారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసామంటున్న కేటీఆర్.. ఉప్పల్ నారపల్లి ఫ్లైఓవర్‌ను ఎందుకు పూర్తి చేయలేదని మంత్రి ప్రశ్నించారు.



పనులు పరిశీలిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

7న గోవాలో జాతీయ ఓబీసీ మహాసభ: జాజుల



సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు ఈ నెల 7న గోవాలో నిర్వహించే జాతీయ ఓబీసీ మహాసభను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. మహాసభల పోస్టర్‌ను ఆయన ఆదివారం సంఘ కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు, రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి ఎత్తివేత, క్రీమీలేయర్ రద్దు, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ల అమలు తదితర అంశాలపై చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. రాష్ట్రీయ ఓబీసీ మహాసంఘ్ ప్రధాన కార్యదర్శి సచిన్ రాజోల్కర్ మాట్లాడుతూ ఓబీసీ రిజర్వేషన్లు అమల్లోకి వచ్చిన ఆగస్టు 7ను గుర్తుచేసుకుంటూ ఏటా ఒక్కో రాష్ట్రంలో మహాసభను నిర్వహిస్తున్నామని, ఈసారి గోవాను వేదికగా ఎంచుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం. చంద్రశేఖర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి డి.రమ, బీసీ సంఘాల నేతలు కుందారం గణేశాచారి పాల్గొన్నారు.

మళ్లీ ఉద్యోగాల్లోకి..!

- క్రమశిక్షణ చర్యలతో ఉద్యోగాలు కోల్పోయిన ఆర్టీసీ సిబ్బందికి మళ్లీ పోస్టింగ్
- సంస్థ నిర్ణయం.. పాత సీనియారిటీ రద్దుచేసి కొత్తవారిగా నియామకం
- తొలి విడతలో 8 మందికి అవకాశం

సాక్షి, హైదరాబాద్: నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించటం, కొన్ని తప్పిదాలు, అక్రమాలకు పాల్పడటం లాంటి చర్యలతో ఉద్యోగాలు కోల్పోయిన వారి గత పనితీరును సమీక్షించి.. వారిలో కొంత మెరుగైన పనితీరు ఉన్న వారిని తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఇందులో భాగంగా తొలివిడతలో ఎనిమిది మందికి పోస్టింగులు ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులో ఐదుగురు కండక్టర్లు, ఇద్దరు డ్రైవర్లు, ఒక శ్రామిక్ ఉన్నారు. తదుపరి విడతల్లో మరి కొందరిని తీసుకోనున్నారు. చిన్నచిన్న తప్పిదాలు చేసిన దాదాపు 400 మందిని గతంలో విధుల నుంచి తొలగించారు. వారు పెట్టుకున్న పిటిషన్లను కూడా తిరస్కరించటంతో వారంతా ఉద్యోగాలు కోల్పోవాల్సి వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పలు దఫాలుగా వారు ప్రజాభవన్‌కు వెళ్లి ప్రభుత్వానికి విన్నవించారు. దీంతో వారి కేసులను పరిశీలించి తగు నిర్ణయం తీసుకోవాల్సిందిగా ప్రభుత్వం గతంలో ఆర్టీసీని ఆదేశించింది. దీంతో వారి కేసులను ఒక్కోటి పరిశీలించి తగు నిర్ణయం తీసుకునేందుకు ఈడీ, సీటీఎం, ఆర్ఎం, సీపీఎంలతో ఆర్టీసీ ఓ కమిటీని వేసింది. తాజాగా ఆ కమిటీ ఎనిమిది మందిని తిరిగి విధుల్లోకి తీసుకోవాల్సిందిగా తొలి సిఫారసును ఆర్టీసీ ఎండీకి అందించింది. ఆ మేరకు వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సంస్థ నిర్ణయించింది.

సీనియారిటీ రద్దు.. జూనియర్లుగా తిరిగి విధుల్లోకి..

వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని నిర్ణయించినప్పటికీ, వారి గత సీనియారిటీ రద్దయి కొత్తగా విధుల్లోకి చేరుతున్నట్టుగానే పరిగణించాల్సి ఉంటుందని కమిటీ తన సిఫారసులో పేర్కొనటం విశేషం. ఆయా పోస్టుల్లోని కనిష్ఠ వేతనాన్ని వారికి ఫిక్స్ చేయనున్నారు. ఉద్యోగం కోల్పోయేముందు వరకు ఉన్న సెలవుల నిల్వ కూడా రద్దవుతుందని ఆర్టీసీ పేర్కొంది.



"ఎప్పటి దాక మనస్సులో రాగం ఉంటుందో,
ఎప్పటి దాక మనస్సులో ద్వేషం ఉంటుందో, అప్పటిదాక దుఃఖమే దుఃఖం.
మనస్సు మాలిన్యాల నుండి విముక్తి పొందలేదు.
- ఎస్.ఎన్. గోయెంకా

సాక్షి

సోమవారం, 4 ఆగస్టు 2025

యాభై ఏళ్ల షోలే

థియేటర్‌లోని ప్రేక్షకులు సీటు కిందకు తల ఒంచి అటూ ఇటూ వెతికారు... కాయిన్ ఇక్కడెక్కడైనా పడిందా అని.

'షోలే' క్లయిమాక్స్‌లో అమితాబ్ మరణించాక అతని చేతిలోని కాయిన్ చూసి ధర్మేంద్ర షాక్ అవుతాడు. ఆ కాయిన్‌కు రెండు వైపులా 'హెడ్స్' ఉంటుంది. ఇంతకాలం తన ప్రాణమిత్రుడు దొంగటాస్ వేసి మోసం చేశాడని, ఇవాళ అదే టాస్‌తో తనను కాపాడి తాను మరణించాడని గ్రహించి, ఆగ్రహంతో కాయిన్‌ని విసిరి కొడతాడు. అది గల్‌గల్‌మంటూ థియేటర్‌లోనే ఎక్కడో పడుతుంది. ఒక క్షణం ప్రేక్షకులు దాని కోసం అటూఇటూ వెతుకుతారు. ఎందుకంటే అందాక వారికలాంటి అనుభూతి తెలియదు. స్టీరియోఫోనిక్ వల్ల వచ్చింది. షోలేను షోలే అభిమానులు స్టీరియోఫోనిక్ థియేటర్ వెతుక్కుంటూ నగరాలకు వెళ్లి చూశారు. 70 ఎం.ఎంలో చూశారు. స్కోప్‌లో చూశారు. 35 ఎం.ఎం.లో చూశారు. చిన్న ఊళ్లలో నిడివి కుదించి జయభాదురి ఫ్లాష్‌బ్యాక్ లేని వెర్షన్ రిలీజ్ చేస్తే అదీ చూశారు. దూరదర్శన్‌లో చూశారు. కేబుల్ టీవీలో చూశారు. యూ ట్యూబ్‌లో చూశారు. ఓటీటీలో చూశారు. యాభై ఏళ్లుగా చూస్తూనే ఉన్నారు. షోలే అభిమానులది వేరే లెవల్.

ఆడే సినిమాలు ఆడదగ్గ రీతిలో తీస్తే ఆడతాయి. సెట్స్ వల్ల, విఎఫ్‌ఎక్స్ వల్ల, భారీ బడ్జెట్ వల్ల, ముహూర్తబలం వల్ల ఆడవు. ఆడదగ్గ రీతిలో కథ అనుకుని ఇవన్నీ కలిపితే ఆడొచ్చు. షోలే సినిమా తొలిషాట్ తీయడం కుదరలేదు. వాన. ముహూర్తం అప్‌సెట్ అయ్యింది. రెండోరోజు తెల్లచీర కట్టుకుని వితంతువు పాత్రలో ఉన్న జయభాదురి అమితాబ్‌కు ఇనప్పెట్టె తాళాలు ఇవ్వడం ఫస్ట్‌షాట్‌గా తీశారు. దక్షిణాది సినీచరిత్రలో నేటి వరకు వితంతువు పాత్రపై ముహూర్తం షాటు తీసిన దాఖలా లేదు. అలా తీస్తే ఫ్లాప్ అవుతుందా? అలా తీయకపోతే హిట్ ఏమైనా అయ్యిందా? తాము చేసే దుర్మార్గాలకు, దోపిడీలకు దైవబలాన్ని తోడు అడగడం కూడా షోలే తీసేసింది. గబ్బర్ సింగ్ ఒక్కనాడు కూడా కాళీమాత విగ్రహం ఎదుట ప్రమాణం చేసి దోపిడీకి బయలుదేరడు. అప్పటి వరకూ హిందీ సినిమాలలోని బందిపోట్లు అందరూ కాళీమాత బలాన్ని తోడు అడిగేవారే.

సమాజం చెడ్డను భరించగలదుగానీ మరీ దారుణమైన చెడ్డను సహించలేదు. ఆ చెడ్డను పరిహరించడానికి మెరుగైన చెడ్డనైనా శరణుజొచ్చడానికి వెనుకాడదు. గబ్బర్ సింగ్ అఘాయిత్యాలు పట్టనలవి కానప్పుడు అంత చెడ్డవాణ్ణి నిర్మూలించడానికి కొంచెం చెడ్డవాళ్లను నియమిస్తారు. వీరు, జయ్ చిల్లర దొంగలే గాని వారిలో బహాదూరి ఉంది. మానవత్వం కూడా ఉంది. ఊరు వారిని ఆదరిస్తుంది. వర్తమానంలో కరడుగట్టిన నేరస్తుల శిక్షకు పోలీసులు ఎన్‌కౌంటర్ అనే చెడ్డమార్గం ఎంచుకుంటే ప్రజలు ఆదరించడం ఇలాంటిదే కావచ్చు.

వ్యక్తిగత ఆగ్రహాన్ని సామాజికస్థాయికి తీసుకెళ్లమని షోలే చెబుతుంది. గబ్బర్ సింగ్ వల్ల ఠాకూర్ తన కుటుంబం మొత్తాన్ని కోల్పోయాడు. గబ్బర్‌ని శిక్షించడం వ్యక్తిగతమైన కక్షే... కాని అందులో సామాజిక న్యాయం ఉంది. ఇవాళ సగటు మనిషి తన నెత్తిన పన్నులు పడుతున్నా, తన ప్రమేయం లేకుండా కుల, మత, పార్టీల జంజాటంలో పడుతున్నా, తన సంపాదనను స్కూళ్లు, హాస్పిటళ్లు బట్టలిప్పించి దోచుకుంటున్నా, చిల్లర జీతాలతో సంస్థలు గాడిద చాకిరీ చేయిస్తున్నా, న్యాయం కోసం ఏళ్లకేళ్లు అంగలార్చాల్సి వస్తున్నా కిమ్మనడం లేదు... శాపనార్థాలు పెట్టుకోవడం తప్ప. ఎలుక శాపం పిల్లికి తగలదు. ఠాకూర్‌లా కార్యాచరణకు దిగితే, ఒకరొకరుగా కదిలి ఊరు మొత్తం గబ్బర్ అంతు చూసినట్టు సమస్య అంతు చూడొచ్చు. దురదష్టవశాత్తు జనంలో అది పూర్తిగా పోయింది.

షోలేలోని మహిళలు ధీర వనితలు. గబ్బర్‌ను ధిక్కరించే బసంతి గాని, పరిస్థితులకు చలించక స్థైర్యం చూపే ఠాకూర్ కోడలుగాని 'ఊ అంటావా మావా... ఉఊ అంటావా' తరహా కాదు. షోలే కథ 'రేప్' సీన్‌కు చోటివ్వలేదు. నేడులా బడ్జెట్‌లో సగాన్ని బకెట్ల బకెట్ల బ్లడ్‌కు కేటాయించే పని లేకుండా రక్తమే చూపలేదు. కొండలు, గుట్టలు, పచ్చదనం ఉన్న బెంగళూరు సమీపంలోని రామ్‌నగర్ అనే చోట షూటింగ్ చేయడం తప్ప షోలే చేసిన సర్కస్ ఏదీ లేదు. షోలే మానవ ఉద్వేగాల మేజిక్. కెమెరా, సంగీతం, మాట, పాత్ర, దర్శకత్వం... వీటిని ఎంత మేలిమి నైపుణ్యంతో వాడి ఈ మేజిక్ చేయవచ్చో చరిత్ర చెప్పుకునేలా చూపింది.

1975 ఆగస్టు 15న షోలే విడుదలైంది. ఈ ఆగస్టు 15కు యాభై ఏళ్లు. ఇప్పటికే దేశంలో చర్చలు, కార్యక్రమాలు, జ్ఞాపకాల రీవిజిట్‌లు సాగుతున్నాయి. తెలుగు అభిమానులు ఎలాగూ ఉత్సవాలు జరుపుతారు. మన పరిశ్రమ... ముఖ్యంగా సినీ రచయితలు, దర్శకులు షోలేకు ఎటువంటి స్మరణ, సత్కారం చేస్తారో చూడాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణ మాసం, **తిథి:** శు.దశమి ఉ.9.44 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** అనూరాధ ఉ.8.31 వరకు, తదుపరి జ్యేష్ఠ, **వర్జ్యం:** ప.2.38 నుండి 4.23 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.29 నుండి 1.19 వరకు, తదుపరి ప.3.00 నుండి 3.50 వరకు, **అమృత ఘడియలు:** రా.1.29 నుండి 2.55 వరకు.

సూర్యోదయం: 5.42
సూర్యాస్తమయం: 6.29
రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు

సోషల్ టాక్

గొప్ప సంపద



ప్రాచీన భారత మనస్తత్వ శాస్త్రం అత్యంత అభివృద్ధి చెందినది. దానితో పోల్చినప్పుడు ఆధునికమైనది కిండర్ గార్టెన్ స్థాయి. వేయి సంవత్సరాల పాటు మా టిబెటన్లం 'మీ' జ్ఞానాన్ని చెక్కుచెదరకుండా కాపాడాం. దురదృష్టవశాత్తూ ఆధునిక భారతదేశం, ఆధునిక గురువులు దీన్ని నిర్లక్ష్యం చేశారు. ఇప్పుడంతా కేవలం ఆచారాలు, ప్రార్థనలు!

- దలై లామా, బౌద్ధ గురువు

విశ్వాస కవచం



విశ్వాసం మీ కవచం. అవాస్తవిక భద్రతలు మిమ్మల్ని ఎదగనివ్వవు. దైవమే మీ నిజమైన భద్రత. దేవుడు చర్య తీసుకోవడానికి వీలు కల్పించేది విశ్వాసం.

- రవిశంకర్, ఆధ్యాత్మిక గురువు

నో షార్ట్‌కట్!



పెద్ద కంపెనీలతో భాగస్వామ్యం పెట్టుకోవడం ఎదగడానికి ఒక షార్ట్‌కట్ అని తరచుగా స్టార్టప్స్ భావిస్తాయి. కానీ దాదాపుగా అది పని చేయదు. చెప్పాలంటే అసలు ఏ షార్ట్‌కట్స్ పనిచేయవు. మీ యూజర్లతో సన్నిహితంగా ఉండటమే ఎదగడానికి మార్గం!

- పాల్ గ్రాహమ్, కంప్యూటర్ శాస్త్రవేత్త

ప్రాచీన ఆస్తి



నలంద కేవలం 'మొదటి విశ్వ విద్యాలయం' కాదు. మధ్య యుగ విశ్వవిద్యాలయాలను నిర్మించడానికి అదే నమూనా. దాన్నుంచే ప్రపంచంలో సమస్త ఆధునిక విద్యా విధానం ఆవిర్భవించింది. దాన్ని నిర్మించిన మఠ నియమావళి ఇదే చాటుతోంది. ఇంత కీలకమైన అంశం మీద భారతీయులకు ఎందుకు అవగాహన లేదు?

- జోసెఫ్ టి. నూనీ, రచయిత

తట్టుకుంటున్నామా?



ప్రపంచంలో హెలికోబ్యాక్టర్ పైలోరి ఇన్ఫెక్షన్లు అత్యధికంగా (50-90 శాతం) ఉన్న దేశాల్లో ఇండియా ఒకటి. తరచుగా బాల్యంలోనే ఇది సోకుతుంది. అదే జపాన్‌లో దీని వ్యాప్తి కేవలం 55 శాతం. అయినప్పటికీ ఇండియాలో గ్యాస్ట్రిక్ క్యాన్సర్ల సంభావ్యత (లక్షకు 4.5 మంది)... జపాన్(27.6), చైనా(13.7)లతో పోల్చితే తక్కువ. ఇదొక భారతీయ ప్రహేళిక.

- ఆదిత్య గుధేనియా, గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్

తలతిక్క సుంకాల తలనొప్పి!

సందర్భం



సుభాష్ చంద్ర గర్గ్



◆ దుందుడుకు ధోరణితో విధిస్తున్న సుంకాల తాలూకు ప్రతికూల పర్యవసానాలను ట్రంప్ పాలనా యంత్రాంగం అనతి కాలంలోనే చవిచూడక తప్పదు.

◆ చివరకు ట్రంప్ తాను విధించిన సుంకాలలో చాలా వాటిని వెనక్కి తీసుకోవడం అనివార్యమవుతుంది. లేదంటే అమెరికాలో తీవ్ర రాజకీయ ప్రతిచర్యను ఆయన ఎదుర్కోవలసి ఉంటుంది.

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఆయన బృందంతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడంపై భారత్ నాలుగు నెలలు చర్చలు జరిపినా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. భారతదేశం నుంచి దిగుమతి చేసుకుంటున్నవాటిపై 26 శాతం సుంకం విధిస్తామని ఏప్రిల్ 2న బెదిరించిన ట్రంప్ ఆగస్టు 30న 25 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు.

చర్చలు మొదలైనప్పటి నాటికన్నా పరిస్థితి ఇపుడు మరింత దారుణంగా తయారైంది. రష్యా నుంచి చమురు, రక్షణ సామగ్రి కొనుగోళ్లను నిలిపివేయకపోతే జరిమానా కింద మరికొంత సుంకాన్ని విధిస్తామని కూడా ట్రంప్ హెచ్చరించారు. అయితే, ఆ సుంకం శాతాన్ని నిర్దిష్టంగా ప్రకటించలేదు. భారత్ సుంకాలు ప్రపంచం మొత్తంమీద చాలా ఎక్కువగా ఉన్నాయని, ద్రవ్యేతర వాణిజ్య చర్యలు ''అత్యంత శ్రమ పెట్టేవిగా, అప్రియమైనవిగా'' ఉన్నాయని ఆయన అన్నారు.

ట్రంప్ కోరుతున్నదేమిటి?

అమెరికాతో వాణిజ్యం విషయంలో, ట్రంప్ కుయుక్తులను, మనం ఎలా అర్థం చేసుకోవాలి? అన్ని రకాల చర్చలనూ విరమించుకోవాలా లేక లొంగిపోవాలా?

ద్వైపాక్షిక వాణిజ్య లోటును నిర్మూలించే పేరుతో ట్రంప్ మొదలెట్టిన జూదం దాని భాగస్వామ్య దేశాలకు ఎంత రుచించనిదైనా, ఆయన లక్ష్యాలు మాత్రం స్పష్టం. అమెరికాతో వాణిజ్యంలో మిగులులో ఉన్న దేశాలు, ఆ వాణిజ్య లోటును భర్తీ చేసేందుకు నాలుగు చర్యలు తీసుకోవాలని ట్రంప్ కోరుతున్నారు. 1. సుంకం పైసా కూడా లేకుండా అన్ని అమెరికా ఉత్పత్తులకూ సంపూర్ణ మార్కెట్ సౌలభ్యం కల్పించడం; 2. అమెరికాకు ఎగుమతి చేసే వాటిపై 15–25 శాతం సుంకం విధించడానికి అంగీకరించడం; 3. వాణిజ్య లోటును భర్తీ చేసేందుకు వీలుగా అమెరికా నుంచి ఇపుడు కొంటున్నవాటికి తోడుగా విమానాలు, ఇంధనం వంటివాటిని కొనడం; 4. అమెరికాలో వస్తూత్పత్తికి పెట్టుబడులు పెట్టడం.

చాలా దేశాలు రెండు కారణాలతో అమెరికాకు ఎగుమతులు ఇష్టపడతాయి. ఒకటి– అది చాలా పెద్ద మార్కెట్ (మొత్తం ప్రపంచం ఎగుమతుల్లో సుమారుగా 15 శాతం దానికే వెళుతున్నాయి), రెండు – ఎగుమతిదారులకు లాభాలు సమకూరుతాయి. కానీ అదనపు సుంకాల భారాన్ని నెత్తికెత్తుకుని అనిష్టంగానైనా ఎగుమతులు చేస్తే వారికొచ్చే లాభాలు ఏమీ ఉండవు. అదనపు సుంకాల భారాన్ని భరించినా ఎంతో కొంత లాభాన్ని మిగుల్చుకోగలిగిన అవకాశం భారతీయ ఎగుమతిదారులకు లేదు. కనుక, అదనపు 25 శాతం సుంకానికీ, జరిమానా సుంకానికీ భారత్ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించకూడదు.

తీర్చలేని డిమాండ్లు

జన్యుపరంగా సవరించిన గింజలతో తీసిన వంటనూనె దిగుమతులను (జీఎం నూనె మనుషుల ఆరోగ్యానికి మంచిది కాదని నిరూపించే శాస్త్రీయ అధ్యయనాలు ఏవీ జరగలేదు), పాడి పరిశ్రమ ఉత్పత్తులను, పౌల్ట్రీ ఉత్పత్తులను (అమెరికన్ చికెన్ లెగ్స్ వినియోగదారుల సంక్షేమాన్ని మెరుగుపరుస్తాయి) అనుమతించడం అంటే... వ్యావసాయిక వాణిజ్యాన్ని భారత్ సరళీకృతం చేయడం. ఇది వివేకవంతమైన చర్యగానే తోస్తుంది. కానీ, దేశీయ రైతులను సంరక్షించవలసిన బాధ్యత వల్ల, ఈ విషయంలో భారత దేశం పాలుపోని స్థితిలో ఉంది. వ్యవసాయ ఉత్పత్తులపై అమెరికాకు ఎలాంటి రాయితీలూ ఇవ్వగలిగిన స్థితిలో ఇండియా లేదు.

భారతదేశ రక్షణ అవసరాలకు ఒదగని లేదా మరీ ఖరీదుతో కూడిన ఎఫ్–35 విమానాలను లేదా ముడి చమురును కొనాలని అమెరికా బలవంతపెట్టడం బ్లాక్ మెయిల్ చేయడమే! దానికి లొంగిపోతే భారత్ బలహీనమైనదనే ముద్రపడుతుంది.

ఇక భారత్, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను స్వీకరించడమేకానీ, ఇవ్వడం చాలా అరుదు. విదేశాల్లో భారత్ పెట్టుబడులు కొద్దిగానే ఉన్నాయి. రానున్న 5–10 ఏళ్ళలో, అమెరికాలో 50 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టడం కూడా మనకు కష్టమే. ట్రంప్ అడుగుతున్న నాలుగింటిలో దేన్నీ తీర్చగల స్థితిలో ఇండియా లేదు.

ట్రంప్ నాలుగు డిమాండ్లకూ వియత్నాం, జపాన్, ఇండోనేషియా, యూరోపియన్ యూనియన్ మాత్రమే అంగీకరించాయి. అమెరికా అదనపు సుంకాలను దిగమింగుకుని ఈ దేశాల ఎగుమతిదారులు తమ వస్తువుల ధరలను తగ్గిస్తారా లేక అమెరికా వినియోగదారులకు ఆ భారాన్ని బదలీ చేస్తారా? లేక రెండింటి మిశ్రమంతో ముందుకు సాగుతారా? ఆ యా ఎగుమతి దేశాలు అదనపు సుంకాలను తామే భరించడంలో లేదా అమెరికా వినియోగదారులకు బదిలీ చేయడంలో విఫలమైతే నష్టపోయేది అమెరికా, దాని వినియోగదారులే!

ఇచ్చిన వాగ్దానం మేరకు, ఆ యా దేశాలు, నిజంగా చెప్పినంత సంఖ్యలో విమానాలను, ఇంధన ఉత్పత్తులను, రక్షణ పరికరాలను కొనుగోలు చేయగలుగుతాయా? దానికి చాలా కాలం పడుతుంది. పైగా, వాటి ధరలు తగ్గించాలని అవి అమెరికాను డిమాండ్ చేయవచ్చు. తాము దిగుమతి చేసుకుంటున్న వస్తువులు ఇలా ఉండాలి, అలా ఉండాలని చర్చలతో సుదీర్ఘ కాలయాపన చేయవచ్చు. ఈ తతంగం ద్వారా ట్రంప్ ఏ ప్రయోజనాన్ని ఆశిస్తున్నారో అది నెరవేరకపోవచ్చు. లేదా ఆశించింది కొండంత, లభించింది ఆవగింజంతగా పరిణమించవచ్చు.

ఇండియా ముందున్న మార్గం

భారత్ ఎదుట రెండు అవకాశాలున్నాయి. ఒకటి– జపాన్, వియత్నాం, ఇండోనేషియా, యూరోపియన్ యూనియన్‌ల మాదిరిగా తలొగ్గి ఒప్పందం కుదుర్చుకోవడం. తర్వాత, భారత్ ప్రయోజనాలను కాపాడుకునేందుకు ఎగువ పేర్కొన్న ఎత్తుగడలను అనుసరించడం. రెండు– ట్రంప్ వాణిజ్య బృందంతో అన్ని చర్చలకూ స్వస్తి పలికి, ఏ సుంకాలు విధించుకుంటావో విధించుకో అనడం. అదనపు సుంకాల భారాన్ని నెత్తిన రుద్దుకోకుండా, వస్తువులను వాటి సాధారణ ధరలకే విక్రయించవలసిందని ఎగుమతిదారులకు నచ్చజెప్పడం. అమెరికాలోని దిగుమతిదారులు కొంటే మంచిదే. లేదంటే, ఆ వస్తువులను, అటువంటి అసంబద్ధ సుంకాలు లేని ఇతర దేశాలకు విక్రయించడం. దేశీయ మార్కెట్ లోనూ అమ్ముకునేటట్లు చూసుకోవడం. కొన్ని ఎంపిక చేసుకున్న వాటికి అంగీకరించి, మధ్యే మార్గాన్ని అనుసరించడం వల్ల భారత దేశానికి పెద్దగా ఒనగూడేది ఏమీ ఉండదు. అంతకంటే, రెండవ దారిని ఎంచుకుని ముందుకు సాగడమే మంచిది.

ట్రంప్ పాలనా యంత్రాంగం తలతిక్కతో తీసుకుంటున్న సుంకాల చర్యల ప్రతికూల పర్యవసానాలను త్వరలోనే (మహా అయితే 3–6 నెలల్లో) చవిచూడవలసి రావచ్చు. అమెరికా దిగుమతులు మందగిస్తాయి (ఏప్రిల్–జూన్ త్రైమాసిక గణాంక వివరాలు దాన్ని ధ్రువపరుస్తున్నాయి). సుంకాల రాబడి కింద అమెరికాకు కొద్ది వందల బిలియన్ల డాలర్లు లభించవచ్చు. కానీ, దానిలో చాలా భాగాన్ని అమెరికాలోని దిగుమతిదారులు, వినియోగదారులే చెల్లించవలసి ఉంటుంది. ధరలు మంట పుట్టించడంతో వినియోగదారుల తిరుగుబాటుకు ఎంతో కాలం పట్టదు.

పరిస్థితులు తేటతెల్లమవుతున్నకొద్దీ, ట్రంప్ తాను విధించిన చాలా సుంకాలను వెనక్కి తీసుకోక తప్పదు. అందుకే ఇండియా వేచి చూడటమే మంచిది. దానివల్ల పెద్దగా ఖర్చయ్యేదేమీ ఉండదు.

వ్యాసకర్త ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

ఎవరిని ఉద్ధరించడానికి ఈ ఒప్పందం?

అభిప్రాయం



ప్రొ॥ జయతీ ఘోష్



◆ నిర్బంధ లైసెన్సులకు బదులు 'స్వచ్ఛంద లైసెన్సు'లను యూకే – ఇండియా ఒప్పందం ప్రోత్సహిస్తోంది. భవిష్యత్తులో ధరల తగ్గింపు అవకాశాలను ఈ నిబంధన నీరుగార్చుతుంది. ఔషధాల విషయంలో భారత పౌరులు, దేశీయ ఉత్పత్తి సంస్థల కంటే యూకే 'బిగ్ ఫార్మా' ప్రయోజనాలకే ప్రాధాన్యం లభించింది.

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వాణిజ్య విధానాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో గందరగోళం సృష్టించాయి. ట్రంప్ రోజుకో మాదిరిగా మార్చివేస్తున్న ఈ సుంకాలు ఎంతోకాలం మనలేవు. అయితే, వీటిని భౌగోళిక రాజకీయ ఆయుధాలుగా ప్రయోగిస్తున్న తీరు మాత్రం రానున్న సంవత్సరాల్లో అంతర్జాతీయ వాణిజ్య రూపురేఖలను మార్చేస్తుంది.

ఇతర దేశాలు తమ వస్తువుల మీద అధిక సుంకాలు విధిస్తున్నాయని అదేపనిగా చెబుతూ అమెరికా ప్రపంచ ప్రజల దృష్టి మళ్లిస్తోంది. నిజానికి సుంకాల ముసుగులో అగ్రరాజ్యం అల్పాదాయ దేశాల అభివృద్ధిని బలిచేస్తూ, తమ కంపెనీలకు ప్రపంచ మార్కెట్లలో పెద్ద పీట వేయించడమే ఎజెండాగా పెట్టుకుంది. టెక్నాలజీ వంటి కీలక రంగాల్లో అమెరికా ఆధిపత్యానికి గండి కొట్టకుండా చైనాను నిలువరించాలన్న వ్యూహాత్మక లక్ష్యాన్ని ఇది ప్రతిబింబిస్తుంది. పేటెంట్లు, కాపీరైట్లు, పారిశ్రామిక డిజైన్లతో కూడిన మేధాసంపత్తి వర్ధమాన దేశాలకు అందకుండా నిరోధించడం అమెరికా ధ్యేయం. ఇండోనేషియాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందం ఇందుకు ఒక ఉదాహరణ.

ఇండోనేషియాకు జరిగినట్టే...

అమెరికా పారిశ్రామిక, ఆహార, వ్యవసాయ ఉత్పత్తులపై ఇండోనేషియా 99 శాతం సుంకాలను ఎత్తివేసింది. ఇక ఆ దేశ ఎగుమతులపై అమెరికా 19 శాతం సుంకం విధిస్తుంది. ఈ ఒప్పంద ఫలితంగా ఇండోనేషియా రైతులు ప్రభుత్వ భారీ సబ్సిడీల ఫలితంగా చౌకగా లభించే అమెరికా వ్యవసాయోత్పత్తులతో పోటీ పడాల్సి ఉంటుంది. అమెరికా సంస్థలు అత్యధిక ప్రయోజనాలు పొందుతాయి. యూఎస్ తయారీ వస్తువులపై పరిమాణపరంగా ఎలాంటి నిబంధనలూ ఉండవు. అమెరికా వెహికల్ సేఫ్టీ నిబంధనలను, ఉద్గార ప్రమాణాలను ఇండోనేషియా యథాతథంగా ఆమోదించింది. వైద్య పరికరాలు, ఔషధాల విషయంలోనూ అమెరికా ఎఫ్డీఏ (ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్) అనుమతులను అంగీకరిస్తుంది. యూఎస్ ఆహార, వ్యవసాయ ఉత్పత్తులకు స్థానిక లైసెన్సింగ్ నిబంధనల నుంచి మినహాయింపు ఇచ్చింది.

మరింత సమస్యాత్మకంగా మేధాసంపత్తి నిబంధనలు ఉన్నాయి. సాంప్రదాయిక విజ్ఞానం, జన్యు వనరులు, నిర్బంధ లైసెన్సులు వంటి అంశాల్లో ఇప్పటికే ఉన్న అన్ని వివాదాలనూ పరిష్కరించుకోవాలని ఈ ఒప్పందం ఒత్తిడి చేస్తోంది. దీంతో, అమెరికా కంపెనీలు ఎలాంటి సమ్మతి పొందాల్సిన, పరిహారం చెల్లించాల్సిన అవసరం లేకుండానే అక్కడి సాంప్రదాయిక విజ్ఞానాన్ని కొల్లగొడతాయి.

ఇండియాకు ఏం లాభం?

ఇలాంటి ఎజెండాతో ముందుకు పోతున్న దేశం అమెరికా ఒక్కటే కాదు. యూకేతో ఇటీవలే ఇండియా కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందం ఇండోనేషియా ఒప్పందం కంటే ఎక్కువగా ప్రశ్నలు రేకెత్తిస్తోంది. చెప్పాలంటే ఈ ఒప్పందానికి వాణిజ్యపరంగా ఎలాంటి ప్రాధాన్యతా లేదు. కారణం, ఈ రెండు దేశాలు ప్రపంచ వ్యాప్తంగా చేసే ఎగుమతుల విలువలో వీటి ద్వైపాక్షిక వాణిజ్యం 2.5 శాతం కంటే కూడా తక్కువే.

యూకే–ఇండియా తాజా ఒప్పందం పర్యవసానంగా, 92 శాతం యూకే ఎగుమతులకు ఇండియా పూర్తిగానో పాక్షికంగానో సుంకాల మినహాయింపు ఇచ్చింది. అలాగే యూకేకు ఇండియా చేసే 99 శాతం ఎగుమతులు 'ట్యాక్స్ ఫ్రీ'గా ఉంటాయి. వాటిపై ఆ దేశం ఎలాంటి సుంకాలూ విధించదు. అయితే, యూఎస్–ఇండోనేషియా ఒప్పందంలో వలే ఈ ఒప్పందంలోనూ మేధాసంపత్తి నిబంధనలు కీలకమైనవి. ఇవి పశ్చిమ దేశాల పేటెంట్ దారులకు అనుకూల రీతిలో ఉన్నాయి. ఔషధాల విషయంలో భారత పౌరులు, దేశీయ ఉత్పత్తి సంస్థల కంటే యూకే 'బిగ్ ఫార్మా' ప్రయోజనాలకే ప్రాధాన్యం లభించింది.

ఉదాహరణకు, నిర్బంధ లైసెన్సులకు బదులు 'స్వచ్ఛంద లైసెన్సు'లను ఈ ఒప్పందం ప్రోత్సహిస్తోంది. భవిష్యత్తులో ధరల తగ్గింపు అవకాశాలను ఈ నిబంధన నీరుగార్చుతుంది. పేటెంటు ప్రమాణాల సమన్వయీకరణ క్లాజుకూ ఇండియా అంగీకారం తెలిపింది. దీంతో ప్రస్తుత ఔషధాలకు చిన్నా చితకా మార్పులు చేసి వాటి పేటెంట్ హక్కులు పొడిగించుకునే దొడ్డిదారికి ద్వారాలు పూర్తిగా తెరచినట్లయింది.

ఇండియాలో పేటెంటెడ్ డ్రగ్ వాడకం వివరాలు వెల్లడించాల్సిన గడువును ఏడాది నుంచి మూడేళ్లకు పొడిగించే నిబంధన వినాశకరమైంది. గిరాకీకి తగినంత సరఫరా లేదని (అన్ మెట్ డిమాండ్) నిరూపించడం ఆ ఔషధం ఉత్పత్తి చేయదలచిన కొత్త దరఖాస్తుదారుకు కష్టతరంగా మారుతుంది. ఇవి ఫార్మా పరిశ్రమ భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తాయి. అంతే కాకుండా, అందుబాటు ధరలకు మందులు లభ్యం కాని పరిస్థితి ఉత్పన్నమవుతుంది.

బలహీన పడిన ఒక మాజీ వలసవాద దేశానికి, అదీ ప్రధాన వాణిజ్య భాగస్వామి కూడా కానటువంటి దేశానికి ఇండియా ఇలా రాయితీలు ఇవ్వడం దిగ్భ్రాంతి కలిగిస్తోంది. యూరోపియన్ యూనియన్ (ఈయూ), యూఎస్‌లతో జరుపుతున్న వాణిజ్య చర్చల మీదా ఈ ఒప్పందం వల్ల మరింత ఆందోళనకరమైన ప్రభావం పడుతుంది.

వ్యాసకర్త యూనివర్సిటీ ఆఫ్ మసాచూసెట్స్‌లో ఎకనామిక్స్ ప్రొఫెసర్

డేటా పాయింట్

811 మందికి ఒక వైద్యుడు

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం, ఒక దేశంలో ప్రతి 1,000 మందికి ఒక వైద్యుడు ఉండాలి. మన దేశంలో 2020లో సగటున ప్రతి 845 మందికి ఒక వైద్యుడు ఉండేవాడు. ప్రస్తుతం ఇది 811:1కి పెరిగింది.



ప్రస్తుతం భారత్‌లో వైద్యుల నిష్పత్తి 811:1

దేశంలో రిజిస్టర్డ్ అల్లోపతి వైద్యులు	13,86,157
రిజిస్టర్డ్ ఆయుష్ వైద్యులు	7,51,768
దేశంలో ప్రస్తుతం ఉన్న మెడికల్ కాలేజీలు	780
మొత్తం ఎంబీబీఎస్ సీట్లు	1,15,900
పీజీ వైద్య సీట్లు	74,306

ఆధారం: లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

తెలుసుకున్న సత్యం

అలెగ్జాండర్ గురించి చెప్పుకునే తాత్విక కథ ఇది. భారతదేశానికి బయలుదేరే ముందు, ఆయన భారతీయ జ్ఞానం, ఋషులు, అద్భుతాల గురించి విన్నాడు. వాటిలో ఒకటి ఉత్తర భారతదేశంలోని ఒక గుహలో ఒక నీటి బుగ్గ ఉందని, ఆ నీటి బుగ్గ నుండి నీరు త్రాగినవారు అమరత్వాన్ని పొందుతారని! అలెగ్జాండర్ భారతదేశం నుండి తిరిగి వెళ్ళే ముందు ఆ గుహను కనుగొన్నాడు.

జ్యోతిర్మయం

తన సైన్యాన్ని ఆపి, అలెగ్జాండర్ ఒంటరిగా గుహలోకి వెళ్ళాడు. గుహ చివరన ఒక చిన్న నీటిబుగ్గను చూశాడు. వంగి, రెండు చేతులతో నీటిని తీసి, 'ఎంత అద్భుతం! నేను ఇక చనిపోను. నేను యావత్ ప్రపంచాన్నీ ప్రయాణించగలను. నేను ప్రపంచాన్ని జయించగలను. నేను మరణాన్ని జయించేశాను' అని అనుకున్నాడు.

అప్పుడు ఒక కాకి ఇలా అంది: 'ఒక్క నిమిషం... ఆ నీళ్ళు తాగే ముందు, నా కథ వినండి. నేను కూడా, మీలాగే... కొన్ని వందల సంవత్సరాల క్రితం, ఈ నీళ్ళు చాలా కోరికతో తాగాను. ఈ లోక సుఖాలను పూర్తిగా ఆస్వాదించాను. చూడటానికి ఏమీ లేదు. అనుభవించడానికి ఏమీ లేదు. నాతో ఉన్న నా బంధువులు, స్నేహితులు చనిపోయి చాలా సంవత్సరాలు అయ్యింది. నా సొంతమని చెప్పుకోవడానికి నాకు ఎవరూ లేరు. నాకు బతకాలని కూడా లేదు. ఈ నీళ్ళు తాగిన తర్వాత నాకు అమరత్వం అనే వరం లభించింది. కాబట్టి నేను చనిపోలేను. జీవితం ఒక సజీవ నరకంగా మారింది. ఈ పరిస్థితి ఎవరికీ రాకూడదని నేను ఇక్కడ కూర్చున్నాను. మీలాంటి వారు ఎప్పుడైనా వస్తే, నేను వారిని హెచ్చరిస్తుంటాను. ఇక మీ ఇష్టం'.

దాంతో అలెగ్జాండర్ అయోమయంలో పడ్డాడు. అతను కళ్ళు మూసుకుని కొన్ని నిమిషాలు ఆలోచించాడు. చివరికి, కాకి ఏమి చెబుతోందో దాని తర్కాన్ని అర్థం చేసుకున్నాడు. మరణం పట్ల స్పష్టత కలిగింది. నిజానికి మరణం అనేది ఆనందించాల్సిన విషయం. మరణం వల్ల దుఃఖాల నుండి విముక్తి, దేవుని పాదాల వద్ద ఆనందమూ!

– యామిజాల జగదీశ్



పెరిగిన సింహాలు, పులులు, చిరుతలు, ఏనుగులు.. గజ రాజుల దాడి వల్ల పెరుగుతున్న మరణాలు

అభయారణ్యాలతో వన్య మృగాలకు రక్షణ చర్యలు

అడవి రాజులు.. అడుగడుగునా ప్రమాదాలు

సాక్షి, స్పెషల్ డెస్క్: హైదరాబాద్‌లో చిరుత పులి సంచరిస్తోంది.. తిరుపతి శ్రీవారి మెట్టు మార్గంలో ఏనుగులు తిరుగుతున్నాయి.. పులి దాడులతో భయాందోళనలో జనం.. పంట పొలాలను నాశనం చేసిన ఏనుగుల గుంపు.. ఇలాంటి వార్తలు తరచూ వింటుంటాం. ఇలా వార్తల్లో నిలిచే పులులు, చిరుత పులులు, ఏనుగులు, సింహాలు దేశంలో ఎన్ని ఉన్నాయో తెలుసా? వీటి దాడిలో ఏటా ఎంతమంది మరణిస్తున్నారో తెలుసా?

➤ ఆంధ్రప్రదేశ్ సహా దేశంలో 15 రాష్ట్రాల్లో ఏనుగుల కోసం 150 కారిడార్లను కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ గుర్తించింది. రెండు, అంతకంటే ఎక్కువ సహజ ఆవాస ప్రాంతాలను కలిపే నిర్దేశిత ప్రాంతమే 'కారిడార్'. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి జంతువులు సురక్షితంగా ప్రయాణించడానికి, వాటి నివాసానికి ఈ కారిడార్ వీలు కల్పిస్తుంది. 14 రాష్ట్రాల్లో ఏనుగుల సంరక్షణ కోసం 33 అభయారణ్యాలు ఏర్పాటు చేశారు. ఇక పులుల అభయారణ్యాలు దేశంలో 58 ఉన్నాయి. దేశ భూభాగంలో ఇవి 2.5% ప్రాంతంలో విస్తరించడం విశేషం.

పెరుగుతూనే ఉన్నాయి

దేశవ్యాప్తంగా 2022 నాటికి పులుల సంఖ్య 3,682కు చేరుకుంది. 2018లో ఈ సంఖ్య 2,967.

➤ 2025 లెక్కల ప్రకారం సింహాల సంఖ్య 891గా నమోదైంది. 2020లో ఈ సంఖ్య 674 మాత్రమే.

➤ ఏనుగులు 2012లో 29,391–30,711 మధ్య ఉంటే.. 2017 నాటికి ఇవి 29,964 ఉన్నట్టు అంచనా వేశారు.

➤ 2022 లెక్కల ప్రకారం చిరుత పులుల సంఖ్య ఏకంగా 13,874 ఉంది. మధ్య భారతం, తూర్పు కనుమల్లో దాదాపు 8,820, పశ్చిమ కనుమల్లో 3,596 ఉన్నాయి. వీటి జనాభా పరంగా 9వ స్థానంలో నిలిచిన ఆంధ్రప్రదేశ్‌లో 569 ఉన్నాయి. తెలంగాణలో 297 చిరుత పులులు జీవనం సాగిస్తున్నాయి.

మహారాష్ట్రలో పులి పంజా

దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాల్లో పులుల దాడిలో ఐదేళ్లలో 378 మంది మృత్యువాత పడ్డారు. వీరిలో అత్యధికంగా మహారాష్ట్ర నుంచి 218 మంది ఉన్నారు. మరణాల సంఖ్యా పరంగా ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్ తరువాతి స్థానాల్లో ఉన్నాయి.

➤ ఇక ఏనుగుల దాడిలో 2019 ఏప్రిల్ నుంచి 2024 మార్చి మధ్య 2,869 మంది కన్నుమూశారు. ఒడిశాలో అత్యధికంగా 624 మంది మరణించారు. ఆ తరువాతి స్థానాల్లో జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, అస్సాం, తమిళనాడు ఉన్నాయి.

➤ ఏనుగులు, పులుల వల్ల ఆస్తి నష్టం, ప్రాణ నష్టం సంభవిస్తే కేంద్ర ప్రభుత్వం పరిహారం ఇస్తోంది. ప్రాణ నష్టం జరిగితే ప్రాజెక్ట్ టైగర్, ప్రాజెక్ట్ ఎలిఫెంట్‌లో భాగంగా రూ.10 లక్షల పరిహారం చెల్లిస్తారు.



చిరుతలు

2022 గణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 569, తెలంగాణలో 297 చిరుత పులులు ఉన్నాయి. ఇవి అధికంగా ఉన్న రాష్ట్రాలు, సంఖ్య

మధ్యప్రదేశ్	3,907
మహారాష్ట్ర	1,985
కర్ణాటక	1,879
తమిళనాడు	1,070
ఛత్తీస్‌గఢ్	722

2022 నాటి లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 63 పులులు ఉన్నాయి. పులులు ఎక్కువగా ఉన్న రాష్ట్రాలు, సంఖ్య

మధ్యప్రదేశ్	కర్ణాటక	ఉత్తరాఖండ్	మహారాష్ట్ర	తమిళనాడు
785	563	560	444	306

ఏనుగులు..

2017 నాటి లెక్కల ప్రకారం ఏనుగులు అధికంగా ఉన్న రాష్ట్రాలు

కర్ణాటక	6,395
అస్సాం	5,828
కేరళ	3,054
తమిళనాడు	3,063
ఒడిశా	1,976
ఉత్తరాఖండ్	1,839
మేఘాలయ	1,754
అరుణాచల్ ప్రదేశ్	1,614

ప్రాణాలు తీస్తున్న గజరాజులు

ఏనుగుల దాడిలో మరణించిన వారి సంఖ్య ఇటీవలి కాలంలో పెరిగింది.

2019-20	595
2020-21	479
2021-22	561
2022-23	605
2023-24	629

పులులు చంపేస్తున్నాయి

పులుల దాడిలో మరణించిన వారి సంఖ్య

2020	51
2021	59
2022	110
2023	85
2024	73



దంతాల కోసం..

రైలు ప్రమాదాలు, విద్యుత్ షాక్ వంటి అనుకోని కారణాలవల్ల కొన్ని ఏనుగులు మరణిస్తోంటే.. వాటి దంతాల కోసం వేటాడి, విష ప్రయోగం చేసి చంపిన సంఘటనలూ నమోదవుతున్నాయి. ఇలా మరణించిన ఏనుగుల సంఖ్య

కారణం	2022-23	2023-24
రైలు ఢీకొని	15	17
విద్యుత్ షాక్	100	94
వేట	14	9
విష ప్రయోగం	4	1

డొక్లా గ్యాంగ్‌కు 'సృష్టి'తో లింకు?

- నలుగురు కిడ్నాపర్లను పట్టుకున్న అక్కడి పోలీసులు
- శిశువులను అపహరించి విక్రయించినట్లు గుర్తింపు
- ముగ్గురిని హైదరాబాద్‌లోనే అమ్మిన ఆ ముఠా
- 'సృష్టి'వ్యవహారంలో ప్రమేయంపై అనుమానాలు
- ఈ విషయంపై ఆరా తీస్తున్న గుజరాత్ పోలీసులు



సాక్షి, హైదరాబాద్: గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఉన్న డొక్లా ప్రాంతం నుంచి ఐదుగురు చిన్నారులను కిడ్నాప్ చేసి విక్రయించిన మనీషా సోలంకి గ్యాంగ్‌ను అక్కడి పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వారి వ్యవహార శైలిని పరిగణనలోకి తీసుకున్న అధికారులు హైదరాబాద్ కేంద్రంగా సరోగసీ పేరుతో శిశువుల అక్రమ రవాణాకు పాల్పడిన యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌తో లింకులు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఈ కోణంలో లోతుగా దర్యాప్తు చేస్తున్న డొక్లా పోలీసులు.. త్వరలో హైదరాబాద్‌కు ఓ ప్రత్యేక బృందాన్ని పంపాలని నిర్ణయించారు. మరోపక్క 'సృష్టి'కేసు దర్యాప్తు చేస్తున్న గోపాలపురం పోలీసులు తాజాగా 'సృష్టి'లో ల్యాబ్ టెక్నీషియన్లుగా పనిచేసిన నందిని, ఆర్.హర్షతోపాటు మరొకరిని అరెస్టు చేశారు. దీంతో ఈ కేసులో ఇప్పటివరకు అరెస్టయిన వారి సంఖ్య 11కు చేరింది.

అండాల విక్రయంతో మొదలైన వ్యవహారం...

గుజరాత్‌లోని ఖేదా ప్రాంతానికి చెందిన మనీషా సోలంకి డొక్లాలో స్థిరపడింది. అలాగే డొక్లాకే చెందిన బినాల్ సోలంకి, జయేశ్ బెల్దార్, మహేశ్ సోలంకి ప్రైవేట్ ఉద్యోగులు. కొన్నేళ్ల క్రితం ఉద్యోగం కోల్పోయిన మనీషా.. బతుకు తెరువు కోసం ఫెర్టిలిటీ సెంటర్లకు తన అండాలను విక్రయించడం మొదలు పెట్టింది. అందులో భాగంగా ఆమె గుజరాత్, మహారాష్ట్రతో పాటు తెలంగాణలో ఉన్న అనేక ఐవీఎఫ్ కేంద్రాలకు వచ్చింది. ఇలా తనకు ఏర్పడిన పరిచయాలతో శిశువులకు ఉన్న డిమాండ్ గురించి తెలుసుకుంది. మిగిలిన ముగ్గురితో కలిసి ముఠాగా ఏర్పడి తేలిగ్గా డబ్బు సంపాదనకు శిశువుల అక్రమ రవాణాకు తెర లేపింది.

కొన్నాళ్లుగా గుట్టుగా సాగినప్పటికీ...

ఏడాదిలోపు వయసున్న శిశువుల్ని అపహరిస్తున్న ఈ ముఠా సంతాన లేమితో బాధపడుతున్న వారితోపాటు ఐవీఎఫ్, ఫెర్టిలిటీ సెంటర్లకు విక్రయించడం మొదలెట్టింది. దీనికోసం వివిధ ప్రాంతాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకుంది. ప్రధానంగా ఫుట్‌పాత్‌పై జీవించే వారి నుంచి ఈ ముఠా శిశువుల్ని అపహరిస్తోంది. తమ పిల్లల్ని కోల్పోయినా ఆ తల్లిదండ్రులు పోలీసుల వరకు వచ్చి ఫిర్యాదు చేయకపోవడంతో వారి వ్యవహారాలు నిరాటంకంగా కొనసాగాయి. ఈ గ్యాంగ్ డొక్లాలో అపహరించిన శిశువును ఆ ప్రాంతానికి చెందిన సిద్ధాంత్ జగ్‌పత్‌కు రూ. 3 లక్షలకు విక్రయించినట్లు నిందితులు అంగీకరించారు. దీంతో అతన్ని కూడా పోలీసులు అరెస్టు చేసి శిశువును కాపాడారు. మనీషా ముఠాను డొక్లా తరలించి లోతుగా విచారించగా ఇప్పటి వరకు ఐదుగురిని అపహరించిన విషయం వెలుగులోకి వచ్చింది. మిగిలిన నలుగురు శిశువుల్లో ముగ్గురిని హైదరాబాద్‌లోని ఓ ఐవీఎఫ్ సెంటర్ ద్వారా.. ఒకరిని ముంబైలో విక్రయించినట్లు తేలింది. ఇటీవలే హైదరాబాద్ కేంద్రంగా యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ వ్యవహారం వెలుగులోకి రావడంతో ఈ ఉదంతం వెనక మనీషా గ్యాంగ్ ప్రమేయం ఉండొచ్చని డొక్లా పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న డొక్లా కేసు నిందితులను కస్టడీలోకి తీసుకొని ఈ కోణంలో విచారించాలని.. వాళ్లు విక్రయించిన ముగ్గురు శిశువుల్ని కాపాడేందుకు నిందితుల్ని హైదరాబాద్ తీసుకురావాలని అక్కడి పోలీసులు నిర్ణయించారు.

హైదరాబాద్‌లోనూ ముగ్గురు శిశువుల విక్రయం...

ఇటీవల డొక్లా ప్రాంతంలో ఫుట్‌పాత్‌పై జీవించే ఓ జంట నుంచి ఏడు నెలల పసికందును ఎత్తుకెళ్లింది. దీనిపై బాధిత కుటుంబం పోలీసులను ఆశ్రయించడంతో తొలిసారి కేసు నమోదైంది. ఘటనాస్థలిలో ఉన్న సీసీ కెమెరాల్లో లభించిన ఆధారాలతో దర్యాప్తు మొదలు పెట్టిన అక్కడి క్రైమ్ బ్రాంచ్ పోలీసులు.. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో తల దాచుకున్న నలుగురినీ అరెస్టు చేశారు.

చుక్క నీటినీ వదులుకోం

▶ మొదటి పేజీ తరువాయి

రైతులకు అందుబాటులో ఉండేవని, తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర వ్యవధిలోనే కొత్తగా 10.75 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాంలు నిర్మించామని తెలిపారు. అన్నదాతల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని చెప్పారు. దాని ఫలితంగానే దేశంలోనే అత్యధికంగా వరి పండించే రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని అన్నారు.

సీఎం, ఉత్తమ్ వల్లే బనకచర్లకు బ్రేక్

ఉమ్మడి ఏపీలో సాగునీటి రంగంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఇప్పుడు కూడా రాష్ట్రంపై అవే కుట్రలు జరుగుతున్నాయని భట్టి చెప్పారు. తెలంగాణలో పంటలు ఎండిపోయేలా ఏపీ అక్రమ ప్రాజెక్టుల నిర్మాణానికి శ్రీకారం చుడుతోందని, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి సమర్థంగా వాదనలు వినిపించడం వల్లే బనకచర్ల ప్రాజెక్టుకు బ్రేక్ పడిందని చెప్పారు. కృష్ణా, గోదావరిపై గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన ప్రాజెక్టుల ద్వారానే పంటలకు నీరందుతోందని, బీఆర్‌ఎస్ హయాంలో ఒక్కటి కూడా పనికొచ్చే ప్రాజెక్టు నిర్మించలేదని విమర్శించారు. రూ.లక్ష కోట్లు వెచ్చించిన కాళేశ్వరంతో ఒక్క ఎకరాకు కూడా నీరందడం లేదన్నారు. నాడు పోలవరం నిర్మిస్తుంటే చోద్యం చూశారని, బనకచర్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నా పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వం కృష్ణా, గోదావరి నీటిని సద్వినియోగం చేసుకుంటూ రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీరందించేలా పకడ్బందీ కార్యాచరణతో ముందుకెళ్తోందని భట్టి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్ మాటలు పట్టించుకోం

▶ మొదటి పేజీ తరువాయి

పథకాన్ని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఉత్తమ్ ఆదివారం ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ ఏపీ మంత్రుల మాటలను పట్టుకొని బీఆర్‌ఎస్ నేతలు మాట్లాడుతూ ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు పంపుతున్నారని విమర్శించారు. గోదావరి జలాలను రాయలసీమకు తీసుకువెళ్తానని కేసీఆర్ గతంలో అన్నారని ఆయన గుర్తుచేశారు. గోదావరిలో రాష్ట్రానికి ఉన్న 968 టీఎంసీల నీటి వాటాను సంపూర్ణంగా వినియోగించుకునేలా ప్రాజెక్టులు నిర్మిస్తామని తెలిపారు.

తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీని పునఃప్రారంభిస్తాం..

గత ప్రభుత్వం దోపిడీ కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిందని మంత్రి ఉత్తమ్ ఆరోపించారు. సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డలో నీరు నిల్వ చేస్తే దిగువన ఉన్న 44 ఊళ్లు, భద్రాచలం వరదలో కొట్టుకుపోతాయని జాతీయ డ్యామ్‌ల భద్రత ప్రాధికార సంస్థ నివేదిక అందించిందని చెప్పారు. అందుకే మూడు బ్యారేజీల మరమ్మతులకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రూ. 38 వేల కోట్లతో ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు కట్టి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. కాళేశ్వరం ఉపయోగంలో లేకపోయినా రికార్డుస్థాయిలో వరి పండిందని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అక్రమాలపై జస్టిస్ ఘోష్ కమిషన్ అందించిన నివేదికను కేబినెట్ ముందు పెడతామని.. దీనిపై అసెంబ్లీలో చర్చిస్తామని మంత్రి వెల్లడించారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణాన్ని పునఃప్రారంభిస్తామన్నారు. ఇచ్చంపల్లి వద్ద కూడా మరో ప్రాజెక్టు నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం, పెద్దపల్లి ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, విజయరమణారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం, సాగర్ గేట్ల మూసివేత

- ఎగువ నుంచి వరద తగ్గుముఖం పట్టడంతో అధికారుల నిర్ణయం
- ప్రస్తుతం శ్రీశైలంలో 200 టీఎంసీలు, సాగర్‌లో 300 టీఎంసీల నీటి నిల్వ



దోమలపెంట/నాగార్జునసాగర్: ఎగువ ప్రాంతాల నుంచి వరద తగ్గుముఖం పట్టడంతో శ్రీశైలం, నాగార్జునసాగర్ డ్యామ్‌ల క్రస్ట్ గేట్లను అధికారులు ఆదివారం మూసేశారు. ఆదివారం రాత్రి 7 గంటల వరకు శ్రీశైలానికి మొత్తం 1,18,468 క్యూసెక్కుల నీటి ప్రవాహం రాగా భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,536 మొత్తం 65,851 క్యూసెక్కుల నీటిని దిగువనున్న నాగార్జునసాగర్‌కు విడుదల చేశారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 882.1 అడుగుల వద్ద 199.7354 టీఎంసీల నీటి నిల్వ ఉంది. మరోవైపు సాగర్ జలాశయానికి శ్రీశైలం కుడి, ఎడమ విద్యుదుత్పాదన కేంద్రాల ద్వారా 47,592 క్యూసెక్కుల వరద వస్తోంది. సాగర్ జలాశయం గరిష్టస్థాయి నీటిమట్టం 590 అడుగులు (మొత్తం నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు) కాగా ప్రస్తుత నీటిమట్టం 586 అడుగుల వద్ద 300 టీఎంసీల నిల్వ ఉంది. కుడి, ఎడమ కాల్వలు, ప్రధాన విద్యుత్పాదన కేంద్రం, ఏఎమ్మార్పీ, వరద కాల్వల ద్వారా మొత్తం 47,592 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయానికి గత 29 నుంచి ఈ నెల 3 వరకు ఇన్‌ఫ్లో 101.918 టీఎంసీలు రాగా.. క్రస్ట్‌గేట్ల ద్వారా 84.92 టీఎంసీలు, విద్యుదుత్పాదన ద్వారా 12.404 టీఎంసీలు, కుడి, ఎడమ కాల్వలకు 6.59 టీఎంసీలు కలిపి మొత్తం 103 టీఎంసీల నీటిని విడుదల చేశారు. సాగర్ జలాశయానికి జూన్ మొదటి వారం నుంచి ఆదివారం వరకు సుమారు 260 టీఎంసీల నీరు వచ్చి చేరింది. కాగా, సాగర్ క్రస్ట్ గేట్లను ఆదివారం మధ్యాహ్నానికే మూసేయడంతో వరదనీటి విడుదలను చూసేందుకు భారీగా తరలివచ్చిన పర్యాటకులు నిరాశకు లోనయ్యారు.

వారం తర్వాతే వానలు!

▶ మొదటి పేజీ తరువాయి

అల్పపీడనం, వాయుగుండం, తుఫాను లాంటివి ఏర్పడలేదు. సాధారణంగా నైరుతి సీజన్‌లో రాష్ట్రంలో వర్షాలు కురవాలంటే బంగాళాఖాతంలోని వాతావరణ పరిస్థితులే కీలకం. కానీ ఇప్పటివరకు బంగాళాఖాతంలో తుఫానులాంటివి ఏర్పడకపోవడంతో వర్షాలు అంతంతమాత్రంగానే కురిశాయి. ఈనెల 10వ తేదీ తర్వాత రుతుపవనాల గమనం అనుకూలంగా ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

12 జిల్లాల్లో లోటు వర్షపాతం: నైరుతి రుతుపవన సీజన్‌లో ఆదివారం నాటికి రాష్ట్రంలో 37.80 సెం.మీ. సగటు సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా... 34.30 సెం.మీ. నమోదైంది. అంటే సాధారణం కంటే 10 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో మాత్రమే సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదుకాగా, 12 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది.

- ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, సంగారెడ్డి, జనగామ, సూర్యాపేట, జనగామ జిల్లాల్లో సాధారణం కంటే 20 శాతం తక్కువ వర్షాలు కురిశాయి. మిగిలిన జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.
- మండలాల వారీగా వర్షపాతం గణాంకాలు పరిశీలిస్తే... ఆరు మండలాల్లో మాత్రమే అత్యధిక వర్షాలు కురిశాయి. 73 మండలాల్లో అధిక వర్షపాతం నమోదు కాగా.. 315 మండలాల్లో సాధారణ వర్షపాతం, 227 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది.

క్లుప్తంగా...

మంత్రి తుమ్మల ఫోన్ చోరీ

- లొకేషన్ ఆధారంగా గంటలో కనుగొన్న పోలీసులు

శంకరపట్నం: కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కేశవపట్నంలో రేషన్‌కార్డుల పంపిణీలో పాల్గొన్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఫోన్ చోరీ అయింది. మంత్రులు ఉత్తమ్, పొన్నం, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న క్రమంలో లబ్ధిదారులు, ప్రజలు ఎక్కువ సంఖ్యలో వేదికపైకి చేరుకున్నారు. కార్యక్రమం ముగించుకుని మానకొండూర్ మండలానికి వెళ్లిన తర్వాత.. తన ఫోన్ పోయిందని మంత్రి తుమ్మల గమనించారు. దీంతో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంకు ఆయన సమాచారం అందించారు. ఆయన వెంటనే కేశవపట్నం పోలీసులను అప్రమత్తం చేశారు. వారు లొకేషన్ ఆధారంగా.. ఫోన్ కరీంపేటలో ఉన్నట్లు నిర్ధారించుకుని అక్కడికి వెళ్లారు. ఒక మహిళ నుంచి ఫోన్‌ను స్వాధీనం చేసుకుని.. కమిషనరేట్‌కు పంపించారు. ఈ విషయమై ఎస్‌ఐ శేఖర్‌రెడ్డిని వివరణ కోరగా.. ఒక కాంగ్రెస్ కార్యకర్త వద్ద మంత్రి ఫోన్ ఉందని, దానిని తిరిగి మంత్రికి పంపించామని పేర్కొన్నారు.

బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరు: సంగిశెట్టి

సాక్షి, హైదరాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పెద్దఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీశ్వరరావు తెలిపారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం వచ్చాక కార్మిక సంఘాలు లేకుండా చేశారని, అదానీ, అంబానీలకు అప్పనంగా లబ్ధి చేకూరుస్తూ కార్మిక హక్కులను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. ఆదివారం గాంధీ భవన్‌లో జరిగిన టీపీసీసీ లేబర్ సెల్ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, ఇందుకు సంబంధించిన కార్యాచరణను సమావేశంలో సిద్ధం చేశామని చెప్పారు. కార్మిక హక్కులను కాపాడడమే లక్ష్యంగా పీసీసీ లేబర్ సెల్ ముందుకెళుతుందని ఆయన చెప్పారు.

పాముకాటుతో విద్యార్థిని మృతి


నవ్య

జోగిపేట(అందోల్): పాముకాటుతో విద్యార్థిని మృతిచెందిన ఘటన సంగారెడ్డి జిల్లా జోగిపేటలో చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన పిట్ల శ్రీనివాస్‌కు కూతురు, కొడుకు ఉన్నారు. కూతురు నవ్య (10) కృష్ణవేణి పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. ఆదివారం మధ్యాహ్నం 3.30 సమయంలో ఆమెను ఇంట్లోనే నాగుపాము కరవడంతో పట్టణంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో పరీక్షించిన వైద్యులు వెంటనే యాంటీ స్నేక్ వీనమ్ ఇంజక్షన్ చేశారు. పరిస్థితి విషమంగా ఉండటంతో సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడికి చేరుకున్న పది నిమిషాల్లోనే బాలిక మృతిచెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

ఇద్దరు విద్యార్థినుల బలవన్మరణం


అశ్విని


శివాని

భిక్కనూరు(కామారెడ్డి)/ మంచిర్యాల క్రైం: వేర్వేరు జిల్లాల్లో ఇద్దరు విద్యార్థినులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన దండు అశ్విని (24) భిక్కనూరు మండలం తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో ఎంఏ తెలుగు ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆదివారం సాయంత్రం ఆమె తన గదిలోని ఇతర విద్యార్థులతో కలిసి టీ తాగేందుకు బీటీఎస్ చౌరస్తాకు బయలుదేరింది. కొద్ది దూరం వెళ్లాక ఫోన్ మాట్లాడుతూ.. తిరిగి గదిలోకి వెళ్లింది. ఆమె రూమ్‌మేట్లు టీ తాగి హాస్టల్‌కు వచ్చారు. గది తలుపులు తట్టినా తెరవకపోవడంతో.. తలుపులను పగులగొట్టి చూడగా.. అశ్విని ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని కనిపించింది. వెంటనే ఆమెను దోమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యుడు చెప్పడంతో.. అంబులెన్స్‌లో కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తీసుకువెళ్లారు. కాగా, అప్పటికే ఆమె మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. భిక్కనూరు ఎస్‌ఐ ఆంజనేయులు సంఘటన స్థలాన్ని సందర్శించి మృతురాలి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

తరగతి గదిలో ఆత్మహత్య

కుటుంబంపై బెంగతో ఇంటికి వచ్చిన ఒక విద్యార్థిని.. తిరిగి కాలేజీకి వెళ్లిన రెండ్రోజులకే ఆత్మహత్య చేసుకుంది. మంచిర్యాల పట్టణంలోని హమాలివాడకు చెందిన మిట్టపల్లి కుమార్, కవిత దంపతులు.. తమ కూతురు శివాని (16)ని హనుమకొండలోని నయీమ్‌నగర్‌లోని ఒక కార్పొరేట్ కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూప్‌లో చేర్పించారు. ఇటీవలే హోంసిక్ సెలవుల్లో ఇంటికి వచ్చిన శివాని.. ఈ నెల 1న కళాశాలకు తిరిగి వెళ్లింది. కళాశాలకు వెళ్లిన రెండు రోజులకే ఆదివారం తరగతి గదిలో శివాని ఆత్మహత్య చేసుకున్నట్లు కళాశాల నుంచి కుటుంబసభ్యులకు సమాచారం అందింది. చెల్లిని మంచి కాలేజీలో చదివించాలని సూసైడ్ నోట్‌లో కోరింది. శివాని మృతిపై తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేశారు. కళాశాలకు వెళ్లి యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఎత్తిపోస్తున్న గాయత్రి పంప్ ఆరో మోటార్

ఎత్తిపోసిన 'బాహుబలి'

- గాయత్రి పంపుహౌస్ నుంచి నీటి విడుదల

రామడుగు: కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ వద్దగల గాయత్రి పంపుహౌస్ (బాహుబలి) ఆరో పంపు ద్వారా అధికారులు ఆదివారం ఉదయం 9 గంటలకు నీటిని కాలువకు ఎత్తిపోశారు. ఈ నీరు వరద కాలువ ద్వారా మిడ్ మానేరుకు చేరనుంది. చొప్పదండి నియోజకవర్గంలోని రైతులు సాగునీటికి ఇబ్బంది పడుతున్న తరుణంలో.. స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన నీటి విడుదలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాది తొలిసారిగా మోటార్ ఆన్ చేసి నీటిని విడుదల చేశారు.


ఆలేరు పోస్టాఫీసు వద్ద చేయూత పింఛన్ కోసం నిరీక్షిస్తున్న పింఛనర్లు


'చేయూత'కు సాంకేతిక అవరోధాలు

- ఫేషియల్ రికగ్నిషన్ కాక లబ్ధిదారుల పాట్లు

ఆలేరు: ముఖ గుర్తింపు (ఫేషియల్ రికగ్నిషన్) విధానంతో చేయూత పింఛన్ల పంపిణీకి సాంకేతిక ఇబ్బందులు తప్పడం లేదు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు తపాలా కార్యాలయంలో రెండు రోజులుగా.. ముఖ గుర్తింపు విధానంలో చేయూత పింఛన్‌ల పంపిణీ కొనసాగుతోంది. పింఛన్ కోసం శనివారం తపాలా కార్యాలయానికి వివిధ వార్డుల నుంచి వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, కల్లు గీత, బీడీ, చేనేత కార్మికులు అధిక సంఖ్యలో వచ్చారు. ఆన్‌లైన్‌లో ముఖ గుర్తింపు కాకపోవడంతో గందరగోళం ఏర్పడింది. దూరం నుంచి వచ్చి గంటల తరబడి నిరీక్షిస్తే.. తీరా సాంకేతిక సమస్య వల్ల పెన్షన్ పంపిణీ ఆగిపోవడంపై లబ్ధిదారులు మండిపడ్డారు. ముఖ గుర్తింపు కాని పింఛనర్లకు.. మున్సిపల్ సిబ్బంది నుంచి క్లియరెన్స్ తీసుకొని డబ్బులు పంపిణీ చేస్తున్నట్లు ప్రధాన పోస్టుమాస్టర్ శ్రావణ్ చెప్పారు.

గ్రానైట్ క్వారీలో ఘోర ప్రమాదం

- రాయి మీద పడి ఆరుగురు కార్మికులు దుర్మరణం
- ఏపీలోని బాపట్ల జిల్లాలో విషాదం


రాయి పడిన క్వారీ ఇదే..

బల్లికురవ/నరసరావుపేట టౌన్/సాక్షి, అమరావతి: గ్రానైట్ క్వారీలో రాయి తీస్తుండగా ఘోర ప్రమాదం జరిగింది. రాయి మీద పడి ఆరుగురు కార్మికులు దుర్మరణం పాలయ్యారు. ఈ దుర్ఘటన ఏపీలోని బాపట్ల జిల్లా బల్లికురవ మండలం ఈర్లకొండ వద్ద ఉన్న సత్యకృష్ణ గ్రానైట్ క్వారీలో ఆదివారం జరిగింది. ఈ ఘటనలో ఒడిశా రాష్ట్రం నుంచి వచ్చి పనిచేస్తున్న నలుగురు కార్మికులు అక్కడికక్కడే మరణించగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయాలపాలయ్యారు. వీరిలో ఇద్దరు నరసరావుపేట వైద్యశాలకు తరలిస్తుండగా మృతిచెందారు. పోలీసుల కథనం ప్రకారం.. బల్లికురవ సమీపంలోని ఈర్లకొండ వద్ద సత్యకృష్ణ గ్రానైట్ క్వారీ ఉంది. ఈ క్వారీలో ముడి రాయిని తీసి ఎగుమతి చేస్తుంటారు. ఆదివారం 10.30 సమయంలో క్వారీలో రాయి తీసేందుకు తొమ్మిది మంది కూలీలు జాకీలతో పనిచేస్తున్నారు. ఉన్నట్టుండి తీసే రాయికి పై భాగంలో ఉన్న రాయి దొర్లి కార్మికుల మీద పడింది. దీంతో ఒడిశాకి చెందిన టుకున దలాయ్ (37), బనమల చెహ్రా (30), భాస్కర్ బిషోయ్ (40), సంతోస్ గౌడ్ (36) అక్కడికక్కడే మృతిచెందారు. ఎం.సుదర్శన్, కె.నాయక్, శివాగౌడ, దండా బడత్యా (48), ముస్సా జనా (43) తీవ్ర గాయాలపాలయ్యారు. వీరిని నరసరావుపేట వైద్యశాలకు తీసుకెళ్తుండగా మార్గ మధ్యలో దండా బడత్యా, ముస్సా జనా మృతిచెందారు. మిగిలిన ముగ్గురు నరసరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. కాగా, క్వారీలో ప్రమాదం జరిగిన సమయంలో ఆరు జాకీలతో జాకీకి ముగ్గురు వంతున డ్రిల్లింగ్ పనులు చేస్తున్నట్లు సమాచారం. కానీ అధికారులు అక్కడ పనిచేస్తుంది 9 మందేనని, అందులో ఆరుగురు మృతిచెందారని ప్రకటిస్తున్న నేపథ్యంలో మిగిలిన కార్మికులు ఏమయ్యారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మృతుల సంఖ్య విషయంలో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చందమామపై ఎంచక్కా బతికేయొచ్చు!

- చంద్రధూళి నుంచి నీరు, ఆక్సిజన్‌ను సృష్టించిన చైనా శాస్త్రవేత్తలు
- కీలక వనరుల కొరతకు వినూత్న సాంకేతికతతో చెక్‌పెడుతున్న చైనా
- చంద్రునిపై స్థిరనివాస కలలను సాకారంచేసే దిశలో ప్రయోగ ఫలితాలు

చిన్నతనంలో గోరు ముద్దలు తినిపించేందుకు అమ్మ చందమామను చూపిస్తుంది. అన్నం తినేందుకు పరోక్షంగా అక్కరకొచ్చే చందమామ మన శాశ్వత స్థిరనివాసానికి ఆమోదయోగ్యంగా లేదని ఇన్నాళ్లూ అంతా భావించారు. భూమి మాదిరి అక్కడ వాతావరణం, గాలి, నీరు వంటివేమీ అక్కడ లేకపోవడమే ఇందుకు ప్రధానకారణం. జీవన మనుగడకు కీలకమైన ఆక్సిజన్, నీటి కొరతల సమస్యను తీర్చేలా చంద్రుని మట్టి నుంచే ఆ రెండింటినీ తయారుచేసి చూపి చైనా శాస్త్రవేత్తలు మానవాళి చంద్రునిపై స్థిరనివాస కలలకు కొత్త రెక్కలు తొడిగారు. నీటి తయారీకి పనికొచ్చే కీలక మూలకాలు చంద్రుని మట్టిలో పుష్కలంగా ఉన్నాయని చైనా శాస్త్రవేత్తలు తాజాగా ప్రకటించారు. చాంగ్–ఈ–5 మిషన్ ద్వారా తీసుకొచ్చిన చంద్రశిలలు, చంద్రుని మట్టిని సమగ్ర స్థాయిలో విశ్లేషించడం ద్వారా చంద్రునిపైనే ఉదజని, జీవ జలం పునర్‌సృష్టి సాధ్యమని చైనా శాస్త్రవేత్తలు వెల్లడించారు. కొత్త సాంకేతికత సాయంతో చంద్రుని నేల నుంచి నీరు, ఆక్సిజన్‌ను తయారుచేసి చూపడం విశేషం. సంబంధిత పరిశోధనా తాలూకు వివరాలు సెల్ ప్రెస్ వారి 'జూలీ' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

లీటర్ నీటికి రూ.19 లక్షలు !!

అంతరిక్ష పరిశోధనలో భాగంగా వ్యోమగాములు భవిష్యత్తులో చంద్రునిపై ఎక్కువ కాలం గడపాల్సి రావొచ్చు.ఆ సమయంలో ఆక్సిజన్, నీరువంటి ప్రాణాధార వ్యవస్థలను అక్కడ సమకూర్చుకోవాల్సి ఉంటుంది. భూమి మీద నుంచి వ్యోమనౌక ద్వారా వందల లీటర్ల నీటిని, భారీ స్థాయిలో ఆక్సిజన్ సిలిండర్లను తరలించడం ఎంతో శ్రమతో, అంతకుమించిన ఖర్చుతో కూడిన వ్యవహారం. కేవలం 3.785 లీటర్ల(ఒక గ్యాలన్) నీటిని భూమి మీద నుంచి చంద్రుడి వద్దకు వ్యోమనౌకలో చేర్చాలంటే కనీసం రూ.72 లక్షలు ఖర్చు అవుతుంది. అంటే ఒక లీటర్ నీటిని ఇక్కడి నుంచి అక్కడికి పంపాలంటే అక్షరాలా పంతొమ్మిది లక్షల రూపాయలు ఖర్చు అవుతుంది. ఇంతటి వ్యయప్రయాసలకోర్చి పంపేకంటే అక్కడే నీటిని తయారు చేస్తే ఉత్తమం అన్న నిర్ణయానికొచ్చి ఆమేరకు చైనా శాస్త్రవేత్తలు కొత్త సాంకేతికతను విజయవంతంగా అభివృద్ధిచేశారు. చందమామ మట్టి నుంచి నీటిని సంగ్రహించి ఆ నీటి సాయంతో కార్బన్‌డయాక్సైడ్‌ను ఆక్సిజన్‌గా, ఇతర ఇంధన సంబంధిత రసాయనాలుగా మార్చే సాంకేతికతను చైనా శాస్త్రవేత్తలు అభివృద్ధిచేశారు.

ఏమిటీ టెక్నాలజీ?

ఈ టెక్నాలజీ సాయంతో చంద్రుని మట్టి నుంచి నీటిని సంగ్రహించవచ్చు. ప్రయోగాల కోసం అక్కడే ఉన్న వ్యోమగామని ఉచ్ఛ్వాస నుంచి వెలువడిన కార్బన్‌డయాక్సైడ్‌ను ఇదే నీటి సాయంతో కార్బన్ మోనాక్సైడ్, హైడ్రోజన్ వాయువుగా మార్చొచ్చు. ఇలా అందుబాటులోకి వచ్చిన కార్బన్‌మోనాక్సైడ్, హైడ్రోజన్ ఇంధనం, ఆక్సిజన్ తయారీ కోసం ఉపయోగించుకోవచ్చు. ఇలా తయారైన ఆక్సిజన్‌ను మళ్లీ అక్కడి వ్యోమగాముల కోసం సిలిండర్‌లలో భద్రపరుస్తారు. ఈ టెక్నాలజీ పనిచేయడానికి అవసరమయ్యే వేడిని తీక్షణమైన సూర్యరశ్మి నుంచి సంగ్రహించనున్నారు. టైటానియం ఐరన్ ఆక్సైడ్ ధాతువు లున్న చంద్రుని 'ఇన్మెనైట్' మట్టితో నీటిని సృష్టించడం సాధ్యమేనని శాస్త్రవేత్తలు చెప్పారు. ల్యాబ్‌లో సూక్ష్మస్థాయిలో నీటిని, ఆక్సిజన్‌ను సృష్టించగలిగామని, చంద్రునిపై వ్యోమగాములు నిరంతరం శ్వాసించి, ఉపయోగించుకునే స్థాయిలో ఆక్సిజన్ తయారీకి మరికొంత కాలం ఆగకతప్పదని పరిశోధకులు తెలిపారు. ఆ రోజు కోసం మేం కూడా ఎదురుచూస్తున్నామని వారు వ్యాఖ్యానించారు.



– సాక్షి, నేషనల్ డెస్క్

తేజస్వీ యాదవ్‌కి రెండు ఓటర్ ఐడీలా?

బీజేపీ ఆరోపణల అనంతరం ఈసీ నోటీస్ • ఆరోపణలపై దర్యాప్తు చేపడతామని వెల్లడి



పట్నా: బిహార్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్‌ఐఆర్)అనంతరం విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాలో తన పేరు గల్లంతయిందంటూ ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్ చేసిన తీవ్ర ఆరోపణలను ఎన్నికల కమిషన్(ఈసీ) తీవ్రంగా పరిగణిస్తోంది. ఓటరు ఐడీ నంబర్ మారిందని తేజస్వీ శనివారం వ్యాఖ్యానించగా ఈసీ వెంటనే ఖండించడం తెల్సిందే. ముసాయిదా ఓటరు జాబితాలో తేజస్వీ పేరు ఉందని స్పష్టం చేసింది. తేజస్వీ చూపుతున్న ఓటరు ఐడీ కార్డు తాము జారీ చేసిందేనని భావించడం లేదని, దర్యాప్తు చేపట్టి నిజాలు తేలుస్తామని పట్నా సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్, దిఘా ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి త్యాగరాజ పేర్కొన్నారు. ఈ మేరకు తేజస్వీకి ఆయన ఒక నోటీస్ పంపారు. కొత్త ఓటరు కార్డును తమకు అందజేయాలని కోరారు. రెండు వేర్వేరు నంబర్లతో కూడిన రెండు కార్డులను ఆయన కలిగి ఉండటంపై దర్యాప్తు చేయాల్సి ఉందన్నారు. ఓటరు జాబితాలోని పోలింగ్ స్టేషన్ నంబర్ 204 పరిధిలో ఓటరు సీరియల్ నంబర్ 416 తేజస్వీదేనని వివరించింది. ఆయన ఓటరు కార్డు నంబర్ ఆర్‌ఏబీ0456228 అని పేర్కొంది. 'మీరు మీడియా సమావేశంలో ప్రదర్శించిన ఓటరు ఐడీ నంబర్ ఆర్‌ఏబీ2916120. ఆ ఎపిక్ నంబర్ మేం అధికారికంగా జారీ చేసింది కాదని దర్యాప్తులో వెల్లడైంది. మీరు చూపిన ఆ ఎపిక్ కార్డు ఒరిజినల్ కాపీని మాకు అందజేయండి. దీనిపై మరింత లోతుగా దర్యాప్తు చేపట్టాల్సి ఉంది' అని ఈసీ ఆ నోటీసులో తేజస్వీని కోరింది.

తేజస్వీపై కేసు పెట్టాలి: బీజేపీ

రెండు ఓటరు గుర్తింపు కార్డులను కలిగి ఉన్న తేజస్వీ యాదవ్ నేరానికి పాల్పడ్డారని బీజేపీ ఆరోపించింది. అధికారికంగా వెల్లడించిన ఓటరు గుర్తింపు కార్డు నంబర్, తేజస్వీ మీడియా ఎదుట ప్రదర్శించిన కార్డు నంబర్ ఒక్కటి కాదని తెలిపింది. 'ఈ వ్యవహారం ఆర్‌జేడీ, కాంగ్రెస్‌ల అసలు స్వరూపాన్ని బట్టబయలు చేసింది. ఎన్నికల కమిషన్‌కు అబద్ధాలు చెప్పి, వాగ్దాన భంగానికి పాల్పడ్డారు' అని బీజేపీ నేత సంబిత్ పాత్ర ఆరోపించారు. శనివారం తేజస్వీ మీడియాకు చూపిన ఓటరు ఐడీ నంబర్ 2020లో జారీ చేసిన ఓటరు ఐడీ నంబర్ ఒక్కటి కాదన్నారు. రెండు ఓటరు ఐడీలు కలిగి నేరానికి పాల్పడిన తేజస్వీపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టాలని బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఈసీ విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాలో 65 లక్షల మంది అనర్హులైన ఓటర్ల పేర్లను తొలగించినట్లు ఈసీ ప్రకటించడం, ప్రతిపక్షాలు తీవ్ర ఆరోపణలకు దిగడం తెల్సిందే.



బాహుబలి సినిమాలో నదీప్రవాహంలో మునిగిపోకుండా ఒంటిచేత్తో పసిబిడ్డను పైకెత్తి పట్టుకున్న శివగామి పాత్ర గుర్తుండే ఉంటుంది. అచ్చం అలాగే నదీప్రవాహంలో నిజమైన నయా బాహుబలి ఫొటో ఒకటి ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్‌గా మారింది. దాదాపు భుజం ఎత్తులో ప్రయాగ్‌రాజ్ నగరాన్ని, గంగానదీ ప్రవాహం ముంచెత్తడంతో తమ బిడ్డను ఒక జంట ఇలా పైకెత్తి పట్టుకుని భద్రంగా సురక్షిత ప్రాంతానికి తీసుకెళ్లింది. ఆదివారం ప్రయాగ్‌రాజ్ నగర వీధిలో తీసిందీ ఫొటో.

తన సమాధిని తానే తవ్వుకుంటూ..

- హమాస్ చెరలో ఉన్న ఇజ్రాయేలీ దీన గాథ
- ఎముకల గూడును తలపిస్తున్న 24 ఏళ్ల ఎవ్యతార్ డేవిడ్
- వీడియో విడుదల చేసిన హమాస్

డెయిర్ అల్–బలాహ్: ఇజ్రాయెల్ దళాలు గాజా నుంచి ఉపసంహరిస్తే తప్ప బందీలను విడుదల చేయబోమని హమాస్ చెబుతోంది. తమ దేశ పౌరులను కాపాడుకోవడానికి చొరవ చూపాల్సిన ఇజ్రాయెల్ మరింత పాశవికంగా వ్యవహరిస్తూ పాలస్తీనియన్లను చంపుతూ పోతోంది. రెండు అధికార పక్షాల యుద్ధ కాంక్షలో రెండు దేశాల సామాన్య పౌరులు బలవుతుంటే... హమాస్ చెరలో బందీలుగా ఉన్నవారి స్థితి మరింత దీనంగా ఉంది. హమాస్ దగ్గర బందీగా ఉన్న ఓ ఇజ్రాయేలీ తన సమాధి గొయ్యిని తానే తవ్వుకుంటున్న వీడియోను హమాస్ విడుదల చేసింది. గత 48 గంటల్లో రెండు వీడియో క్లిప్పులను హమాస్ ప్రసారం చేయగా.. అందులోని దృశ్యం మనసును కకావికలం చేస్తోంది. భవిష్యత్‌పై ఎలాంటి ఆశ లేక... సరైన ఆహారం అందక.. ఎముకల గూడులా ఉన్న దేహంతో మాట్లాడేందుకు కూడా ఇబ్బంది పడుతున్న డేవిడ్ వీడియో గుండెలను మెలిపెడుతోంది. ''నేను ఇప్పుడు నా సమాధిని నేనే తవ్వుకుంటున్నా. రోజురోజుకు నా శరీరం బలహీనపడుతోంది. నేను విడుదలై నా కుటుంబంతో నా ఇంటిలో నిద్రిస్తాననే ఆశ లేదు. రోజురోజుకూ పరిస్థితి మించిపోతోంది. అందుకే నా సమాధి వైపు నేను నేరుగా నడుచుకుంటూ వెళ్తున్నాను. నన్ను ఖననం చేసే సమాధిని నేనే తవ్వుకుంటున్నా'' అని హిబ్రూలో చెప్పారు. 24 ఏళ్ల ఎవ్యతార్ డేవిడ్ ఇజ్రాయెల్ పౌరుడు. అతన్ని



అక్టోబర్ 7, 2023న హమాస్ కిడ్నాప్ చేసింది. ఆ రోజు జరిగిన ఘోరమైన దాడిలో అతను దక్షిణ ఇజ్రాయెల్‌లోని నోవా సంగీత ఉత్సవం నుంచి డేవిడ్ అపహరణకు గురయ్యారు. రెండేళ్లుగా గాజాలో హమాస్ చెరలో ఉన్నాడు. హమాస్ దగ్గర ఇప్పటికీ బందీలుగా ఉంచిన 49 మందిలో ఆయన ఒకరు. వీడియోలో డేవిడ్‌ను చూసిన అతని కుటుంబం కదిలిపోయింది. జీవించి ఉన్న అస్థిపంజరంలా ఉన్నాడని, తమ కొడుకును సజీవంగా ఖననం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. అంతకుముందు, మరో బందీ అయిన 21 ఏళ్ల రోమ్ బ్రాస్లావ్స్కీ సహాయం కోసం వేడుకుంటున్న వీడియోను పాలస్తీనియన్ ఇస్లామిక్ జిహాద్ విడుదల చేసింది. అందులో రోమ్ పాలిపోయి, బలహీనంగా కనిపించారు. తమ కుమారుడు ఆకలితో అలమటిస్తున్నారని, అతనికి మందులు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారని, మనిషి కృశించి పోయారని రోమ్ కుటుంబం వాపోయింది.

తమిళనాడు ఓటరు జాబితాలో 6.5 లక్షల మందిని చేర్చారు: చిదంబరం

న్యూఢిల్లీ: ఎన్నికల కమిషన్(ఈసీ) రాష్ట్రాల ఎన్నికల తీరును మార్చడానికి, ఫలితాలను ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ ఎంపీ పి.చిదంబరం ఆరోపించారు. ఈసీ పాల్పడుతున్న అధికార దుర్వినియోగాన్ని రాజకీయంగా, న్యాయపరంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. బిహార్‌లో ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్‌ఐఆర్)పై ఆరోపణలు వెల్లువెత్తుతున్న వేళ ఆయన ఆరోపణలు చేయడం గమనార్హం. బిహార్‌లో ఓటరు జాబితా సవరణ వ్యవహారం మరింత సంక్లిష్టంగా, గందరగోళంగా మారుతోందని విమర్శించారు. దీని ఫలితంగా రాష్ట్రంలో 65 లక్షల మంది తమ ఓటు హక్కు కోల్పోయే ప్రమాదంలో పడిందన్నారు. అదే సమయంలో, తమిళనాడులో 6.5 లక్షల మందిని కొత్త ఓటర్లను ఈసీ చేర్చడంపై చిదంబరం అనుమానం వ్యక్తం చేశారు. ఈ మొత్తం వ్యవహారం ఆందోళనకరం, చట్ట విరుద్ధమని ఆదివారం ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. కొత్తగా జాబితాలో చేర్చిన వారంతా శాశ్వత వలస కార్మికులనడం వలస కార్మికులను అవమాన పర్చడమేనన్నారు. వీరంతా బిహార్‌కు వాసులు, అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎప్పటి మాదిరిగానే తిరిగి వీరు ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. ఓటరుగా నమోదయ్యే వ్యక్తి శాశ్వత, చట్టబద్ధమైన ఒకే నివాసం కలిగి ఉండటం తప్పనిసరి అంశమని చిదంబరం చెప్పారు. తమిళనాడులోని వలస కార్మికులకు బిహార్‌లో ఇలాంటి సొంత ఇళ్లుండగా తమిళనాడు ఓటర్లుగా ఎలా చూపిస్తారని ఈసీని ఆయన నిలదీశారు.

తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు: ఈసీ

బిహార్‌లో చేపట్టిన ఎస్‌ఐఆర్‌ను తమిళనాడుతో పోల్చుతూ కాంగ్రెస్ నేత చిదంబరం చేసిన వ్యాఖ్యలు నిరాధారాలు, తప్పుదోవపట్టించేలా ఉన్నాయని ఈసీ పేర్కొంది. తమిళనాడు ఇంకా ఎస్‌ఐఆర్‌ను చేపట్టనే లేదని పేర్కొంది. దేశ పౌరులు ఏ ప్రాంతంలోనైనా స్థిర నివాసం ఏర్ప రుచుకునే హక్కును మన రాజ్యాంగం కల్పిస్తోందని ఈసీ గుర్తు చేసింది. అర్హులైన సామాన్య ఓటర్లు తమ ఇష్టమొచ్చిన నియోజకవర్గంలో ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశముందని తెలిపింది.

ముసాయిదాపై అభ్యంతరాలు రాలేదు: ఈసీ

న్యూఢిల్లీ: ఈ నెల ఒకటో తేదీన విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాపై రాజకీయ పార్టీలు ఎలాంటి అభ్యంతరాలను వ్యక్తం చేయలేదని ఎన్నికల కమిషన్(ఈసీ)తెలిపింది. ఆ జాబితా నుంచి ఏదైనా పేరును తొలగించాలని గానీ, చేర్చాలని గానీ తమను కోరలేదని పేర్కొంది. ఆగస్టు ఒకటో తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి ఆగస్టు 3వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు తమకు అభ్యంతరాలు, వినతులు అందలేదని తెలిపింది. అయితే, ఓటర్ల నుంచి మాత్రం 941 అభ్యంతరాలు వచ్చాయని పేర్కొంది.

రష్యాలో మళ్లీ భూకంపం

- రిక్టర్ స్కేల్‌పై 7.0గా నమోదు
- బద్దలైన క్రషెనినీకోవ్ అగ్నిపర్వతం



అగ్ని పర్వతం నుంచి వెలువడుతున్న ధూళి

మాస్కో: ప్రకృతి విపత్తులు రష్యాను వణికిస్తున్నాయి. రష్యాలోని కురిల్ దీవుల సమీపంలో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై ఇది 7.0గా నమోదైనట్లు అత్యవసర సేవల శాఖ ఆదివారం వెల్లడించింది. రష్యా తూర్పు తీరంలో కమ్‌చట్కా ద్వీపకల్పంలోని మూడు ప్రాంతాల్లో సునామీ అలలు విరుచుకుపడే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. అలలు తక్కువ ఎత్తులోనే సంభవించనున్నట్లు అంచనా వేసింది. సముద్ర తీరం ప్రాంతాల నుంచి ప్రజలు దూరంగా ఉండాలని సూచించింది. 7.0 తీవ్రతతో సంభవించిన భూకంపం తర్వాత పసిఫిక్ సునామీ వార్నింగ్ సిస్టమ్ సునామీ హెచ్చరికలు జారీ చేయలేదు. రష్యాలో భూకంపాన్ని అమెరికా భూభౌతిక సర్వే విభాగం సైతం ధ్రువీకరించింది. భూకంపం తీవ్రత కారణంగా కమ్‌చట్కాలోని క్రషెనినీకోవ్ అగ్నిపర్వతం బద్దలైంది. దట్టమైన పొగ, బూడిద వెలువడుతున్నాయి. ఈ అగ్నిపర్వతం బద్దలై నిప్పులు చిమ్ముతుండడం గత 600 ఏళ్లలో ఇదే మొదటిసారి. రష్యా తూర్పు తీరంలో గత వారం 8.8 తీవ్రతతో భారీ భూకంపం సంభవించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో సునామీ హెచ్చరికలు జారీ చేశారు. ఫ్రెంచ్ పాలినేసియాతో పాటు చిలీలోనూ సునామీ వార్నింగ్స్ జారీ చేయాల్సి వచ్చింది. కమ్‌చట్కా ద్వీపకల్పంలో అత్యంత క్రియాశీలకంగా ఉన్న కిలీచెవ్‌స్కో అగ్నిపర్వతం ఈ భూకంపం ధాటికి బద్దలైంది. కమ్‌చట్కాలో మరికొన్ని వారాల పాటు భూప్రకంపనలు సంభవిస్తాయని సైంటిస్టులు హెచ్చరించారు. కురిల్–కమచట్కా జోన్‌లో భూగర్భంలో తీవ్రస్థాయిలో సర్దుబాట్లు జరుగుతున్నాయని, అందుకే తరచుగా భూకంపాలు చోటుచేసుకుంటున్నాయని అంచనా వేస్తున్నారు. ఈ జోన్ పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్ పరిధిలోనే ఉంది.

జపోరిజియా అణు విద్యుత్ కేంద్రంపై దాడి

- ఉక్రెయిన్‌లో ప్లాంట్ చుట్టూతా పొంచి ఉన్న రేడియోధార్మికత ముప్పు
- అప్రమత్తమైన యూరప్ దేశాలు
- వెంటనే పర్యవేక్షణా బృందాన్ని పంపిన అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ

మాస్కో: జనావాసాలపై పరస్పర బాంబులేసుకుంటున్న ఉక్రెయిన్, రష్యాలు ఒక్కసారిగా యుద్ధంలో రేడియోధార్మికత భయాలను పెంచాయి. ఉక్రెయిన్‌కు చెందిన అత్యంత కీలకమైన జపోరిజియా అణువిద్యుత్ కేంద్రంపై ఆదివారం దాడి జరిగింది. ఈ న్యూక్లియర్ ప్లాంట్ ఆవరణలోని నిర్మాణం నుంచి భారీ స్థాయిలో మంటలు, పొగ వెలువడుతున్న దృశ్యాలు అంతర్జాతీయ మీడియాలో ప్రసారమయ్యాయి. అయితే దాడిలో అణువిద్యుత్ కేంద్రం ప్రధానభాగం దెబ్బతిన్నదా? లేదా? అనేది తెలియరాలేదు. దీంతో రేడియోధార్మికత వ్యాపించవచ్చన్న భయాలు ఒక్కసారిగా యూరప్‌లో వ్యాపించాయి. యూరప్ ఖండంలోనే అతిపెద్ద అణువిద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా పేరొందిన జపోరిజియా న్యూక్లియర్ ప్లాంట్‌ను యుద్ధసమయంలో రష్యా బలగాలు ఆక్రమించుకున్నాయి. ప్రస్తుతం ఈ ప్లాంట్ రష్యా అధీనంలో ఉంది. దీంతో ఉక్రెయిన్ సేనలే తమ డ్రోన్ ద్వారా దాడికి పాల్పడిందని ఆరోపణలు వెల్లువెత్తాయి. ప్లాంట్ ప్రధాన నిర్మాణానికి 1,200 మీటర్ల దూరంలో దాడి వి ధ్వంసం జరిగిందని, ప్రమా ద అంచనా, నిజానిజాలు నిగ్గుతేల్చేందుకు అంతర్జాతీ య అణుఇంధన సంస్థ (ఐఏఈఏ) తమ ప్రత్యేక పర్యవేక్షణా బృందాన్ని హుటాహుటిన జపోరి జియా ప్లాంట్‌కు పంపించింది. '' మా ఏజెన్సీ టీమ్‌ను ఇప్పటికే పంపించాం. దాడి ధాటికి రేడియో ధార్మికత వెలువడితే పరిస్థితులు దారుణంగా ఉంటాయి. ఈ ఉపద్రవాన్ని అడ్డుకోక తప్పదు'' అని ఐఏఈఏ డైరెక్టర్ జనరల్ రఫేల్ గ్రోసీ ఆందోళన వ్యక్తం చేశారు.



రష్యా చమురు నిల్వ కేంద్రంపై దాడి

రష్యాలోని చమురు నిల్వ కేంద్రంపై ఉక్రెయిన్ దాడులకు తెగబడింది. దీంతో చమురు కేంద్రం తగలబడి అగ్నికీలలు ఎగసిపడ్డాయి. పెద్ద ఎత్తున దట్టమైన పొగలు వెలువడ్డాయి. ఆస్తి నష్టం పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. నల్ల సముద్ర తీరంలో రిసార్ట్‌లకు పేరెన్నికగన్న సోచీ సిటీలో ఈ ఆయిల్ డిపో ఉంది. ఏకంగా 120కిపైగా అగ్నిమాపక సిబ్బంది మంటల్ని ఆర్పేందుకు శ్రమించారని క్రాస్నోడార్ రీజనల్ గవర్నర్ వెనియామిన్ కోంద్రాతెవ్ తన 'టెలిగ్రామ్' ఖాతాలో ఒక పోస్ట్‌చేశారు. దట్టంగా కమ్ముకున్న పొగ కారణంగా ముందజాగ్రత్తగా సోచీ ఎయిర్‌పోర్ట్ నుంచి విమానాల రాకపోకలను నిలిపేశారు. గత 24 గంటల్లో 93 ఉక్రెయిన్ డ్రోన్లను నేలరాల్చామని రష్యా రక్షణ శాఖ ఆదివారం ప్రకటించింది. మరోవైపు తమపై 76 డ్రోన్లు, 7 క్షిపణులను రష్యా ప్రయోగించిందని ఉక్రెయిన్ ఆదివారం తెలిపింది.

రిజిస్టర్డ్ పోస్ట్ ఇక కనుమరుగు

50 ఏళ్ల ప్రస్థానానికి తెర • పోస్టల్ శాఖ నిర్ణయం

న్యూఢిల్లీ: కోట్లాది మందికి చిరపరిచితమైన పోస్టల్‌శాఖ వారి 'రిజిస్టర్డ్ పోస్ట్' ఇక కనుమరుగుకానుంది. దేశవ్యాప్తంగా గత 50 సంవత్సరాలుగా కీలకమైన సర్టిఫికేట్లు, ఉద్యోగ నియామక పత్రాలు, లీగల్ నోటీసులు, ప్రభుత్వ ఉత్తర్వులను రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా ప్రజలకు చేరవేసిన పోస్టల్ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి 'రిజిస్టర్డ్ పోస్ట్' సేవలను కొనసాగించబోమని 'ది ఇండియన్ పోస్టల్ డిపార్ట్‌మెంట్' ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. అయితే రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా ఇన్నాళ్లూ అందించిన సేవలనే స్పీడ్‌పోస్ట్ లేదంటే ఇతర సేవల్లో భాగంగా అందించనున్నట్లు తెలుస్తోంది. కేవలం ఆ పేరు మాత్రమే ఇకపై వినియోగించబోరని పోస్టల్‌శాఖ వర్గాలు తెలిపాయి. తక్కువ ఖర్చులో, అత్యంత విశ్వసనీ యమైన, అత్యంత అనువైన తపాలా సేవగా గత యాభై ఏళ్లుగా రిజిస్టర్డ్ పోస్ట్ జనం మదిలో నిలిచిపోయింది. అప్పట్లో ప్రభుత్వ ఉద్యోగ అపాయింట్‌మెంట్ లెటర్ వచ్చిందంటే అది దాదాపు రిజిస్టర్డ్ పోస్ట్‌లో రావాల్సిందే. ఉత్తరప్రత్యుత్తరాల కాలంలో రిజిస్టర్డ్ పోస్ట్‌కు ఎనలేని విలువ ఉండేది. 2011–12 కాలంలో దేశవ్యాప్తంగా 24.44 కోట్ల రిజిస్టర్డ్ పోస్ట్‌లను తపాలా శాఖ పంపించగా 2019–20 కాలానికి వచ్చేసరికి కేవలం 18.46 కోట్ల రిజిస్టర్డ్ పోస్ట్‌లే పంపించగల్గింది. అంటే ఏకంగా 25 శాతం రిజిస్టర్డ్ పోస్ట్‌లు తగ్గిపోయాయి. వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాల్లోనూ కీలకమైన పీడీఎఫ్, ఇతర ఫైళ్లు, పత్రాలను పౌరులు నేరుగా సెకన్ల వ్యవధిలో పంపే సంస్కృతి పెరగడంతో రిజిస్టర్డ్ పోస్ట్‌కు ఆదరణ తగ్గిపోయిందని తెలుస్తోంది.

జల దిగ్బంధంలో ప్రయాగ్‌రాజ్, వారణాసి

లక్నో: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలతో యూపీలోని నగరాలు ముఖ్యంగా ప్రయాగ్‌రాజ్, వారణాసి వరద దిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఈ రెండు నగరాలను కలిపే ప్రధాన రహదారులు నీట మునిగాయి. లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. పలు ప్రాంతాలను వరద చుట్టుముట్టింది. వరదతో నిండిన వీధుల గుండా పడవల్లో ఆఫీసులకు, కార్యాలయాలకు చేరుకోవడం కన్పిస్తోంది. రాష్ట్రంలోని 14 జిల్లాలపై వరద ప్రభావం కనిపిస్తోంది.



రాష్ట్రపతితో ప్రధాని, హోంమంత్రి భేటీ

న్యూఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వేర్వేరుగా భేటీ అయ్యారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జరుగుతున్న సమయంలో ఇరువురు నేతలు గంటల వ్యవధిలోనే రాష్ట్రపతితో భేటీ అయ్యారు. అయితే భేటీకి కారణాలు, చర్చించిన అంశాల గురించి వివరాలు బయటికి తెలియలేదు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా.. రాష్ట్రపతిని ఆదివారం కలిశారని రాష్ట్రపతి భవన్ ఎక్స్ ఖాతాలో పేర్కొంది. పార్లమెంట్ సమావేశాలు, ఉపరాష్ట్రపతి ఎన్నిక నేపథ్యంలో జరిగిన ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది.

కాలువలో పడిన కారు.. 11 మంది మృతి

గోండా: ఉత్తరప్రదేశ్‌లోని గోండా జిల్లాలో ఆదివారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సరయూ నది కాలువలో కారు పడిపోవడంతో అందులోని ఒకే కుటుంబానికి చెందిన 9 మంది సహా 11 మంది మృత్యువాతపడ్డారు. నలుగురు గాయాలపాలయ్యారు. వీరంతా ఖర్గుపూర్‌లోని పృథ్వీనాథ్ ఆలయానికి వెళ్తుండగా బెల్వా బహుతా గ్రామ సమీపంలో ఈ ఘటన జరిగింది. బాధితులంతా గోండా జిల్లా సిహాగావ్ గ్రామానికి చెందిన వారని ఇటియాథోక్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో కృష్ణ గోపాల్ రాయ్ చెప్పారు. ప్రమాద సమయంలో వాహనంలో డ్రైవర్ సహా 15 మంది ఉన్నారన్నారు. గ్రామస్తులు, సహాయక బృందాల సాయంతో కాలువలో మునిగిన వాహనం నుంచి 11 మృతదేహాలను వెలికి తీసినట్లు ఆయన వివరించారు. వర్షం కురుస్తుండటంతో రోడ్డంతా జారుడుగా మారిందని ప్రత్యక్ష సాక్షి ఒకరు తెలిపారు. డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో అదుపు తప్పి కాలువలో పడిపోయిందని తెలిపారు. వెంటనే పోలీసులకు తెలిపామన్నారు. తాడు సాయంతో వాహనాన్ని బయటకు లాగామన్నారు. మృతుల్లో ఆరుగురు మహిళలు, ముగ్గురు చిన్నారులు ఉన్నారు. సిహాగావ్‌లో మేవాలాల్ మాధ్యమిక పాఠశాల మేనేజర్‌గా పనిచేస్తున్న ప్రహ్లాద్ కుటుంబంలోని 9 మంది ఉన్నట్లు చెప్పారు.

ప్రధాని మోదీ దిగ్భ్రాంతి

ఆలయానికి వెళ్తున్న వారు ప్రమాదానికి గురికావడంపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులు రూ.50 వేల చొప్పున సాయం అందజేస్తామని ప్రకటించారు. సీఎం యోగి ఆదిత్యనాథ్ కూడా ఘటనపై స్పందించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున అందజేస్తామని ఆదిత్యనాథ్ ప్రకటించారు. కాగా, మృతుల్లో ప్రహ్లాద్ భార్య బీనా, ఇద్దరు కుమార్తెలు కాజల్, రింకీ, ప్రహ్లాద్ సోదరుడు రాంకరణ్, ఆయన భార్య అనుసూయ, వీరి కుమార్తె సౌమ్య, కుమారుడు శుభ్, ప్రహ్లాద్ మరో సోదరుడు రాంరూప్, ఆయన భార్య నందిని, కుమారుడు అమిత్ ఉన్నారు. ప్రహ్లాద్ పొరుగింట్లో ఉండే రామలలన్ వర్మ భార్య సంజు, అతడి సోదరి అంజు కూడా చనిపోయిన వారిలో ఉన్నారు. ప్రహ్లాద్ కుమారుడు సత్యం, రామ్ లలన్ వర్మ, వాహనం డ్రైవర్ సీతారామన్ గాయపడ్డారు. వీరు స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషాదం తెలిసిన సిహాగావ్ గ్రామస్తులు ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

సాక్షి హైదరాబాద్

సోమవారం । 4 । ఆగస్టు । 2025



చీటీకి ఏదీ చెల్లుచీటి

హైదరాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్లలో ఇప్పటికీ చిట్టీలపైనే రాతలు కొనసాగుతున్నాయి. వ్యాపారులు ఇష్టారాజ్యంగా క్రయవిక్రయాలు సాగిస్తున్నారు. -10లో



ఆడేద్దామా.. అష్టాచెమ్మా..

ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడిన నేటితరానికి ఒకప్పటి ఆటల్లోని మజా తెలియకపోవచ్చు. ఆనాటి ఆటల పట్ల బాలలకు ముచ్చటగొలిపేలా కృషి చేస్తోంది 'క్రీడ' సంస్థ. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం 32.0/24.0

వాతావరణం

నగరంలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 32, కనిష్టంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.



పట్టాభిషేకం



బిట్స్ పిలానీ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన 12వ స్నాతకోత్సవం ఆద్యంతం ఉల్లాసంగా సాగింది. సుమారు 1200 మందికి గ్రాడ్యుయేట్ పట్టాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు ప్రొఫెసర్ అజయ్‌కుమార్ సూద్ మాట్లాడుతూ.. శిక్షణ పూర్తి చేసుకున్న గ్రాడ్యుయేట్లు ప్రపంచంలోని బహుళ కంపెనీలలో ముఖ్య భూమికను పోషించాలని పేర్కొన్నారు. బిట్స్ పిలానీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ రాంగోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు. - జవహర్‌నగర్





రన్.. రంజితం

ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్‌కు ముందు డ్రైరన్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు, ఎన్ఎండీసీ సంయుక్తంగా ఈ మారథాన్‌ను నిర్వహించాయి. నగరంలోని పీపుల్స్‌ప్లాజా, మాదాపూర్‌లో ప్రారంభమైన డ్రై రన్ గచ్చిబౌలి స్టేడియంలో ముగించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్ దేశంలోనే రెండో అతిపెద్దదిగా గుర్తింపు పొందిందన్నారు. ప్రతిష్టాత్మక ప్రపంచ అథ్లెటిక్స్ లేబుల్ రేస్ ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. - గచ్చిబౌలి

అమాత్యులపై 'జూబ్లీహిల్స్' భారం

రంగంలోకి ముగ్గురు రాష్ట్ర మంత్రులు

- అనుకూల పరిస్థితుల కోసం సంక్షేమ అస్త్రాలు
- క్షేత్రస్థాయిలో పకడ్బందీ వ్యూహాలు
- నోటిఫికేషన్ కంటే ముందే కాంగ్రెస్‌లో ఉప ఎన్నికల వేడి

సాక్షి, సిటీబ్యూరో: అధికార కాంగ్రెస్ పార్టీ ఏడాదిన్నర పాలనకు 'జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక' రెఫరెండంగా భావిస్తూ ముందస్తు కార్యాచరణకు దిగింది. అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నిక తర్వాత జూబ్లీహిల్స్ కావడంతో ఈ స్థానాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకుంది. ఎన్నికల షెడ్యూలు విడుదలతో సంబంధం లేకుండా, అభ్యర్థి ఎంపిక అంశానికి పెద్దగా ప్రాధాన్యమివ్వకుండా కేవలం పార్టీ గెలుపే లక్ష్యంగా రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్, సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్‌లు జూబ్లీహిల్స్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. ఏకంగా ముగ్గురు రాష్ట్ర మంత్రులను రంగంలోకి దింపి జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక బాధ్యతలను అప్పగించారు. జూబ్లీహిల్స్ బీఆర్ఎస్‌కు సిట్టింగ్ సీటు కావడంతో ఉప ఎన్నికల నోటిఫికేషన్ వెలువడకముందే.. క్షేత్రస్థాయిలో అధికార కాంగ్రెస్‌కు పూర్తి స్థాయిలో అనుకూల పరిస్థితులు తీసుకొచ్చేందుకు మంత్రులు రంగంలోకి దిగారు. సుడిగాలి పర్యటనతో సంక్షేమ, అభివృద్ధి అస్త్రాలను ప్రయోగిస్తున్నారు. మరోవైపు పార్టీ శ్రేణుల్లో అంతర్గత కుమ్ములాటలు లేకుండా సమన్వయ సాధన కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ ఉనికి లేకుండా చేయడంతోపాటు బీజేపీని నిలవరించేందుకు సికింద్రాబాద్ కంటోన్మెంట్ తరహాలో జూబ్లీహిల్స్ కూడా కాంగ్రెస్ ఖాతాలో పడాలన్నదే అధికార కాంగ్రెస్ అన్ని అస్త్రాలకు సిద్ధమైనట్లు కనిపిస్తోంది.

ఒక్కో మంత్రికి రెండు డివిజన్ల బాధ్యతలు

అధికార కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఎదురులేని శక్తిగా అవతరించేందుకు ముందస్తు కసరత్తు చేస్తోంది. నియోజక వర్గాన్ని మూడు విభాగాలుగా విభజించింది. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, గడ్డం వివేక్‌లకు బాధ్యతలను అప్పగించింది. ఒక్కో మంత్రికి రెండు డివిజన్ల చొప్పున కేటాయించారు. తుమ్మల నాగేశ్వరరావుకు వెంగళ్‌రావు నగర్, ఎర్రగడ్డ, సోమాజిగూడ డివిజన్లలో కొంత భాగం.. పొన్నం ప్రభాకర్‌కు యూసఫ్‌గూడ, బోరబండ డివిజన్లు, గడ్డం వివేక్ వెంకటస్వామికి షేక్‌పేట రహమత్‌నగర్ డివిజన్లను కేటాయించారు. మంత్రులకు సహాయంగా ఉండేందుకు ఆరుగురు చొప్పున మొత్తం 18 మంది కార్పొరేషన్ల చైర్మన్లకు బాధ్యతలు అప్పగించింది. వారంతా సంబంధిత మంత్రులతో సమావేశమవుతూ ఎన్నికలు పూర్తయ్యే వరకు డివిజన్లపై దృష్టి సారించి ఇక క్షేత్రస్థాయిలో సంక్షేమ, అభివద్ధి పథకాల అమలు పర్యవేక్షణ, ప్రచార బాధ్యతలు నిర్వర్తించనున్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నారు.

క్షేత్ర స్థాయి పర్యటనలు..

మంత్రులు సైతం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను సీరియస్‌గా తీసుకున్నారు. తమకు కేటాయించిన డివిజన్లల్లో అత్యధిక ఓటు బ్యాంకు సాధించేందుకు కసరత్తు చేస్తున్నారు. నియోజవర్గంలోని డివిజన్లలో క్షేత్ర స్థాయి పర్యటనలకు మంత్రులు శ్రీకారం చుట్టారు. బూత్ స్థాయి నేతలతో సమావేశమై ఎన్నికలపై చర్చిస్తున్నారు. ఇటీవల బంజారాహిల్స్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రులు తుమ్మల, పొన్నంతో పాటు పలువురు కార్పొరేషన్ల చైర్మన్లు సమావేశమయ్యారు. ఉప ఎన్నికలో పార్టీ గెలుపునకు ఉన్న అవకాశాలపై చర్చించారు.. సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులపై డివిజన్ల వారీగా వ్యవహరించాల్సిన అంశాలపై స్థానిక నేతలకు మంత్రులు తుమ్మల దిశానిర్దేశం చేసినట్లు సమాచారం.

ఐపీ అడ్రస్‌తో చిక్కింది!

ఇష్టపడిన వ్యక్తిపై కక్షగట్టిన భగ్నప్రేమికురాలు

- ఐదు నెలల్లో 12 రాష్ట్రాలకు బెదిరింపు మెయిల్స్
- కొన్నింటిలో 'హైదరాబాద్ రేప్ కేసు' ప్రస్తావన
- పొరపాటున వైఫై కనెక్ట్ కావడంతో కటకటాల్లోకి
- రోబోటిక్ ఇంజినీర్ రినే జోషిదా వ్యవహారం

దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల్లోని వివిధ సంస్థలకు 22 బెదిరింపు ఈ-మెయిల్స్ పంపిన కేసులో నిందితురాలు రినే జోషిదా ఆద్యంతం చాలా తెలివిగా వ్యవహరించింది. తాను ఇష్టపడిన వ్యక్తి మరో యువతిని వివాహం చేసుకోవడంతో కక్షగట్టిన రినే అతడి పేరునే వినియోగించింది. డార్క్ వెబ్, వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్ (వీపీఎన్) సహాయంతో తన ఆచూకీ బయటపడకుండా ఐదు నెలల పాటు పోలీసులను పరుగులు పెట్టించిన రినే.. ఆమెకు తెలియకుండా జరిగిన వైఫై కనెక్టివిటీతో చిక్కింది. ఇటీవల అహ్మదాబాద్ పోలీసులు అరెస్టు చేసిన ఈమెను శంషాబాద్ అధికారులు పీటీ వారెంట్‌పై తీసుకువచ్చి శనివారం జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. -సాక్షి, సిటీబ్యూరో



ఉన్నత విద్య.. ఎమ్మెన్సీ ఉద్యోగం..

చెన్నైకి చెందిన రినే జోషిదా తొలుత ఇంజినీరింగ్, ఆపై రోబోటిక్స్‌లో అడ్వాన్స్‌డ్ కోర్సు చేసింది. ఈమె ప్రతిభకు మెచ్చిన మల్టీ నేషనల్ కంపెనీ (ఎమ్మెన్సీ) డెలాయిట్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ద్వారా తమ సంస్థలో ఉద్యోగం ఇచ్చింది. ఆ సంస్థలో సీనియర్ కన్సల్టెంట్‌గా పని చేసిన రినే తన సహోద్యోగి దివిజ్ ప్రభాకర్‌ను ఇష్టపడింది. అతడినే పెళ్లి చేసుకోవాలని భావించిన ఆమె అందమైన జీవితాన్ని ఊహించుకుంది. అనివార్య కారణాల నేపథ్యంలో ఈమె ప్రేమను తిరస్కరించిన ప్రభాకర్ ఈ ఏడాది ఫిబ్రవరిలో మరో యువతిని వివాహం చేసుకున్నాడు. దీంతో అతడిపై కక్షకట్టిన రినే కటకటాల పాలు చేయడం ద్వారా భార్య నుంచి విడగొట్టాలని పథకం వేసింది. దీన్ని అమలులో పెట్టడం కోసం పక్కా పథకం ప్రకారం కథ నడిపింది.

ప్రభాకర్ పేరుతో మెయిల్ ఐడీలు..

తొలుత రినే తన ల్యాప్‌టాప్ నుంచి డార్క్‌వెబ్‌ను యాక్సస్ చేసింది. దాని ద్వారానే తన వివరాలు పొందపరచకుండా ప్రభాకర్ పేరు, వివరాలతో ఈ-మెయిల్ ఐడీలు క్రియేట్ చేసింది. వీపీఎన్ ద్వారా ఇంటర్‌నెట్‌ను యాక్సస్ చేసే రినే.. దేశంలోని 12 రాష్ట్రాల్లో ఉన్న విమానాశ్రయాలు, కార్పొరేట్ స్కూళ్లు, ఆస్పత్రులకు 22 బెదిరింపు మెయిల్స్ పంపింది. ఒక ప్రాంతానికి పంపిన మెయిల్‌లో మరో ప్రాంతంలో ఓ నేరం జరిగినట్లు, దాన్ని పోలీసుల దృష్టికి తీసుకురావడానికే బాంబు పెట్టినట్లు రాసింది. అహ్మదాబాద్‌కు పంపిన ఓ ఈ-మెయిల్‌లో '2023లో హైదరాబాద్‌లోని లెమన్ ట్రీ హోటల్‌లో బాలికపై అత్యాచారం చేసిన రేపిస్ట్ విషయం పోలీసుల దృష్టికి తీసుకురావడానికి మీ స్కూల్‌లో బాంబు పేల్చబోతున్నారు' అంటూ ప్రస్తావించింది. వీటిలో శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చిన బెదిరింపు మెయిల్ కూడా ఉంది. ఈ మేరకు కేసులు నమోదు చేసుకున్న ఆయా పోలీసులు దర్యాప్తు చేశారు.



ఆ ప్రమాదం తర్వాత తీవ్రంగా పరిగణించి..

ఇలా రినే తెలంగాణ, మహారాష్ట్ర, రాజస్థాన్, తమిళనాడు, ఢిల్లీ, కర్ణాటక, కేరళ, బిహార్, పంజాబ్, మధ్యప్రదేశ్, హరియాణా, గుజరాత్‌ల్లోని వివిధ సంస్థలకు మెయిల్స్ పంపినా ఆమె ఆచూకీ పోలీసులకు చిక్కలేదు. పోలీసులు ప్రభాకర్‌ను అనుమానితుగా భావించడం, విచారణ అనంతరం వదిలేయడం జరిగాయి. అహ్మదాబాద్‌లో జూన్ 12న ఎయిర్ ఇండియా విమానం బీజే మెడికల్ కాలేజీపై కూలి భారీ ప్రాణనష్టం సంభవించింది. ఆ మర్నాడు అదే కాలేజీకి పాక్ ఉగ్రవాదుల పేరుతో మెయిల్ పంపిన రినే మరోసారి విధ్వంసం తప్పదని హెచ్చరించింది. దీంతో రంగంలోకి దిగిన గుజరాత్ ఏటీఎస్, అహ్మదాబాద్ క్రైమ్ బ్రాంచ్ అధికారులు లోతుగా దర్యాప్తు చేశారు. అప్పటి వరకు 12 రాష్ట్రాలకు వచ్చిన 22 ఈ-మెయిల్స్‌కు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి అధ్యయనం చేసింది.

ఆ పొరపాటుతో ఆమె ఆటలకు చెక్...

ఈ ఏడాది ఏప్రిల్‌లో అహ్మదాబాద్‌లోని ఓ స్కూల్‌కు రినే ఇలానే బెదిరింపు మెయిల్ పంపింది. ప్రతి సందర్భంలోనూ డార్క్‌వెబ్ ద్వారా, వీపీఎన్ నెట్‌వర్క్ వాడటంతో ఆమె వివరాలు పోలీసులకు చిక్కలేదు. ఆయా సందర్భాల్లో వైఫై ఆఫ్ చేసి ఉండే రినే.. మొబైల్ డేటా ద్వారానే హాట్‌స్పాట్ కనెక్ట్ చేసుకుని, వీపీఎన్‌ను యాక్టివేట్ చేసింది. అయితే ఏప్రిల్‌లో మెయిల్ పంపుతున్న సందర్భంలో పొరపాటున రినే ల్యాప్‌టాప్ ఆమె నివసిస్తున్న వైఫైకి కనెక్ట్ అయింది. దీంతో ఆ మెయిల్ పంపిన ఐపీ అడ్రస్ రికార్డుల్లో నమోదైంది. ఈ వివరాలను సాంకేతికంగా సేకరించిన గుజరాత్ పోలీసులు ఐపీ అడ్రస్ ఆధారంగా రినే ఫోన్ నెంబర్, ఈ-మెయిల్ ఐడీలతో పాటు లోకేషన్ సంగ్రహించారు. గత వారం చెన్నైలోని ఆమె ఇంటిపై దాడి చేసి అరెస్టు చేశారు.

1,100 నుంచి 900కు

తగ్గిన ప్రభావిత ఆస్తులు

- పాతబస్తీ మెట్రో విస్తరణ
- అలైన్‌మెంట్‌లో మార్పు
- ఇప్పటికి 380 ఆస్తుల కూల్చివేత
- కొనసాగుతున్న మార్కింగ్

సాక్షి, సిటీబ్యూరో: పాతబస్తీ మెట్రో విస్తరణతో ప్రభావితమయ్యే ఆస్తుల సంఖ్య తగ్గింది. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు సుమారు 7.5 కి. మీ మార్గంలో 1,100 ఆస్తులను సేకరించనున్నట్లు హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైల్ లిమిటెడ్ మొదట గుర్తించింది. తాజాగా ఇంజినీరింగ్ నైపుణ్యంతో ఎలైన్‌మెంట్‌ను సరిదిద్దడంతో సేకరించాల్సిన ఆస్తులు 900కు తగ్గినట్లు హెచ్ఏఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఆస్తుల కూల్చివేత, రోడ్డు విస్తరణ, పిల్లర్స్ మార్కింగ్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని ఆయన చెప్పారు. పాతబస్తీ మెట్రోపై ఆదివారం సమీక్షించారు.

412 నిర్మాణాలకు పరిహారం..

ఆస్తుల సేకరణలో భాగంగా ఇప్పటి వరకు 412 నిర్మాణాలకు పరిహారం ప్రకటించారు. 380 ఆస్తులను కూల్చివేశారు. బాధితులకు రూ.360 కోట్ల పరిహారం చెల్లించారు. మెట్రో పనులకు సంబంధించి ఇంజినీరింగ్, రెవెన్యూ అధికారులతో ప్రతిరోజు సమీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎన్వీఎస్ చెప్పారు. ప్రభావిత ఆస్తులను స్వాధీనం చేసుకుంటూ, కూల్చివేసిన శిథిలాలను తొలగించడంలో అనేక సవాళ్లు ఎదురవుతున్నాయన్నారు. వాటిని అధిగమించి పనులను ముమ్మరంగా కొనసాగిస్తున్నట్లు చెప్పా రు. చాలాచోట్ల ఇళ్లు ఒకదానికొకటి ఆనుకుని ఉండటంతో కూల్చివేత పనులను జాగ్రత్తగా కొనసాగించాల్సి వస్తోందన్నారు. పైగా విద్యుత్ లైన్‌లు, ఇతర కేబుళ్ల తొలగింపు ఎంతో సంక్లిష్టంగా ఉందన్నారు. ప్రతి క్షణం అప్రమత్తతను పాటిస్తూ ముందుకెళ్తున్నట్లు ఎండీ పేర్కొన్నారు. మిగిలిన ఆస్తుల స్వాధీనానికి, త్వరితగతిన కూల్చివేతలు పూర్తిచేసేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు ఎన్వీఎస్ వెల్లడించారు.

త్వరలో భూసామర్థ్య పరీక్షలు..

మెట్రో నిర్మాణ పనులను చేపట్టేందుకు అవసరమైన చర్యలను కూడా హెచ్ఏఎంఆర్ఎల్ ప్రారంభించింది. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు మెట్రో కారిడార్‌లో ఏర్పాటు చేయనున్న పిల్లర్లకు తగిన స్థలాలను ఎంపిక చేసి మార్కింగ్ పనులను పూర్తి చేశారు. వయాడక్ట్‌లను నిలిపే పిల్లర్ల మధ్య 25 మీటర్ల (సుమారు 82 అడుగులు) దూరం ఉంటుందని మెట్రో ఎండీ చెప్పారు. మెట్రో స్తంభాలు, స్టేషన్లు వచ్చే ప్రదేశాల్లో భూసామర్థ్య పరీక్షల కోసం ప్రత్యేక ఏజెన్సీని నియమించినట్లు పేర్కొన్నారు. త్వరలో భూసామర్థ్య పరీక్షలను చేపట్టనున్నట్లు చెప్పారు. పిల్లర్లు, స్టేషన్లు ఏర్పాటు చేయనున్న ప్రాంతాల్లో భూగర్భ మురుగు నీటిపైపులైన్లు, మంచినీటి పైపులైన్లు, వరదనీటి డ్రైన్లు, పైన వేలాడే విద్యుత్ లైన్లను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు విద్యుత్ లైన్లను అండర్ గ్రౌండ్ లేబుళ్లుగా మార్చనున్నట్లు తెలిపారు. ఇందుకోసం వాటర్ బోర్డు, జీహెచ్ఎంసీ, టీజీఎస్పీడీసీఎల్ విభాగాల నుంచి అంచనాలు సమర్పించాల్సిందిగా కోరినట్లు చెప్పారు. వివిధ విభాగాలకు చెందిన అధికారులతో సమన్వయం చేసుకుంటూ క్షేత్ర స్థాయిలో పనులను కొనసాగిస్తున్నట్లు ఎన్వీఎస్ వివరించారు.

కొనసాగుతున్న ఆస్తుల కూల్చివేత



ఆలోచన తీరు మార్పుతోనే అభివృద్ధి సాధ్యం

- మంత్రి శ్రీధర్ బాబు



ఉప్పల్: ఐ ఫోకస్ సేవలు రాష్ట్రంతో పాటు దేశానికి సైతం ఉపయోగ పడేలా ఉండాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సమాజంలో మార్పు రావాలంటే మన ఆలోచన తీరు మారాలని అభిప్రాయపడ్డారు. ఆదివారం ఉప్పల్ శిల్పారామం ఆడిటోరియంలో ఐ ఫోకస్ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మైత్రి వారధి- 2025' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఐ ఫోకస్ సంస్థ వ్యక్తిగతం కాదు వ్యక్తిత్వాన్ని పెంచే ప్లాట్‌ఫాం అని కొనియాడారు. మనం నడక నేర్చింది మొదలు చివరి శ్వాస వరకు మన కోసమే పరుగులు పెడుతుంటామని, ఈ ప్రయాణంలో సమాజం గురించి ఆలోచించే తీరిక లేకుండా పోతోందన్నారు. సమాజం అంటే కేవలం నలుగు మనుషులు కాదని, మన చుట్టూ ఉండేవారందరిని గుర్తించాలని సూచించారు. ఒంటరిగా ఉండి ఏమీ సాధించలేమని.. సమష్టిగా అడుగు ముందుకేస్తే మార్పు సాధ్యవుతుందన్నారు. కార్యక్రమంలో ఐ ఫోకస్ మిషన్ నిర్వాహకుడు వాసుదేవ శర్మ తదితరులు పాల్గొన్నారు.

అంతులేని అవినీతి!

- ట్యాక్స్ సెక్షన్ నుంచి టౌన్‌ప్లానింగ్ దాకా
- ట్రాన్స్‌పోర్ట్ నుంచి డిప్యూటీ కమిషనర్ల వరకు
- అధికారులందరిదీ ఇదే వరస..
- బల్దియాను బాగుపరిచేదెవరు?

సాక్షి,సిటీబ్యూరో: జీహెచ్ఎంసీలో క్షేత్రస్థాయిలో ప్రజలకు అవసరమైన అన్ని సమస్యలు పరిష్కరించేది.. మౌలిక సదుపాయాలు సమకూర్చేది సర్కిల్ కార్యాలయం. సర్కిల్ కార్యాలయానికి బాస్ డిప్యూటీ కమిషనర్ (డీసీ). గ్రేటర్ మొత్తానికి కమిషనర్ చేసే పనులన్నీ సర్కిళ్లలో స్థానికంగా నిర్వహించేది డీసీలే. అలాంటి డీసీలు అక్రమాలు జరగకుండా, అవినీతికి తావులేకుండా, అందరికీ మార్గదర్శకంగా ఉండాలి. మరి వీరే అవినీతికి పాల్పడితే.. ఇక బల్దియా బాగుపడేదెలా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. గత వారం రాజేంద్రనగర్ డీసీ రూ.2 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కడమే ఉదాహరణగా చెప్పవచ్చు.

- నిబంధనల ఉల్లంఘనల పేరుతో ఓ హోటల్ యాజమాన్యాన్ని బెదిరించి రూ.5 లక్షలు డిమాండ్ చేసి.. రూ.2 లక్షలు స్వీకరించారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఏవైనా కట్టుదిట్టమైన చర్యలకు దిగితే దానిని సైతం అవినీతికి వాడుకుంటున్నారు. వాస్తవానికి గతంలో ఫుడ్‌సేఫ్టీ విషయాన్ని పట్టించుకున్నవారే లేరు. జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్.. ఆరోగ్య విభాగం కమిషనర్‌గా ఉన్నప్పటి నుంచే కల్తీని అరికట్టేందుకు హోటళ్లపై చర్యలు చేపట్టారు. అన్ని హోటళ్లు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నట్లు వెల్లడైంది. దానినే అస్త్రంగా వాడుకుంటూ, నిబంధనల ఉల్లంఘన పేరుతో అధికారులు అక్రమార్జనకు పాల్పడుతున్నారు. కింది స్థాయి తప్పు చేస్తే సరిదిద్దాల్సిన ఉన్నతాధికారులే ఇలాంటి చర్యలతో వారికి మార్గదర్శకులవుతున్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఉదంతాలివిగో..

- రాజేంద్రనగర్ సర్కిల్‌లోని ఒక ఫ్యాక్టరీ ఆస్తి పన్ను పెంచకుండా ఉండేందుకు గత ఫిబ్రవరిలో మధు అనే ఉద్యోగి రూ.45 వేలు లంచం తీసుకుంటుండగా ఒక ప్రైవేట్ వ్యక్తితో సహా పట్టుబడ్డారు.
- గత నెలలోనే కాప్రా, అంబర్‌పేట సర్కిళ్లలో ఇద్దరు మహిళా ఇంజినీర్లు కాంట్రాక్టర్ల నుంచి లంచాలు తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన విషయం తెలిసిందే.



- మూసాపేట సర్కిల్‌లో ట్యాక్స్ విభాగానికి చెందిన ఓ మహిళా ఉద్యోగి మ్యుటేషన్ కోసం వచ్చిన వ్యక్తి నుంచి రూ.30 వేలు తీసుకుంటూ పట్టుబడ్డారు. అవినీతికి బల్దియా నెలవుగా మారడంపై ప్రజలు నివ్వెరపోతున్నారు.
- శేరిలింగంపల్లి జోన్‌లో బయోడైవర్సిటీ విభాగం డిప్యూటీ డైరెక్టర్ మొదటి దఫా 1.5 లక్షలు తీసుకున్నాక, రెండోదఫా రూ.70వేలు లంచం తీసుకుంటూ దొరికిపోయారు. సర్కిల్, జోనల్ కార్యాలయాల్లోనే గతంలో ఇలాంటి ఘటనలు జరిగేవి. బహుశా జోన్లలోని వారు ప్రధాన కార్యాలయానికి వస్తే అక్కడా అవినీతి మరకలు పడుతున్నాయి.
- ఇంజినీరింగ్ క్వాలిటీ కంట్రోల్ విభాగంలో గత మార్చిలో ఒక డీఈఈ రూ. 20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిపోయారు.

పై ఆదాయం ఎక్కడో.. అక్కడే..

కొందరు అధికారులు కొన్ని జోన్లు, సర్కిళ్లలోనే ఎక్కువకాలం తిష్ట వేయడం కూడా అవినీతి పెరగడానికి కారణంగా చెబుతున్నారు. అలాంటి వారు తాము అక్కడి నుంచి కదలకుండా ఉండేందుకు పైవారిని కూడా తృప్తిపరుస్తున్నారనే ఆరోపణలున్నాయి. వారికి మాత్రం బదిలీలు లేకపోవడం.. బదిలీ అయినా పై ఆదాయం వచ్చే సర్కిళ్లకే బదిలీ అవుతుండటంతో ఇలాంటి ఆరోపణలకు బలం చేకూరుతోంది.

కిందివారిని గాడిలో పెట్టాల్సిన ఉన్నతాధికారులే వారినిలా ప్రేరేపిస్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

గత ఏడాది సైతం..

జీహెచ్ఎంసీలో అవినీతికి పాల్పడ్డా, రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డా తగిన చర్యలంటూ లేకపోవడంతో అక్రమాలు,అవినీతి ఆగడం లేవనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలోనూ ఎందరో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. టౌన్‌ప్లానింగ్, ట్యాక్స్ సెక్షన్లలో ఈ ఘటనలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. గత సంవత్సరం జూబ్లీహిల్స్ సర్కిల్‌లో ఇద్దరు శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లు సైతం రూ. 60వేలు డిమాండ్ చేసి, రూ. 25వేలు తీసుకుంటూ పట్టుబడ్డారు.

సినారె సేవలు మరువలేనివి



పురస్కార గ్రహీతలతో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

తుర్కయంజాల్: తెలుగు సాహిత్యానికి డా.సి.నారాయణ రెడ్డి సేవలు ఎనలేనివని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మహాకవి సినారె కళాపీఠం హైదరాబాద్ అధ్యక్షుడు మల్లికేడి రాములు నిర్వహణలో సి.నారాయణ రెడ్డి 94వ జయంతి వేడుకలను ఆదివారం పురపాలక సంఘం పరిధిలోని రాగన్నగూడలో ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. తెలుగు చలన చిత్ర రంగంలో ఆయన రాసిన ఎన్నో పాటలు అన్ని వర్గాల ప్రజలను అలరించాయన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు డా. నందిని సిధారెడ్డి మాట్లాడుతూ.. నారాయణ రెడ్డి గేయ నాటికలు, పద్య గేయ సంపుటి, దీర్ఘగీతం, గేయ నాటికలు, గేయ కావ్యం, కవితా సంపుటి, వచన కవితా సంపుటి, వ్యాఖ్యానం, నృత్య గేయరూపకం, సినీగీతాల సంకలనం వంటి ఎన్నో రచనలను చేశారని గుర్తుచేశారు. అనంతరం సినారె జీవన సాఫల్య పురస్కారాన్ని డా. లింగంపల్లి రామచంద్రకు అందజేశారు. సాహిత్య పురస్కారాలను తెలంగాణలోని పది జిల్లాలకు చెందిన డా. నాశేశ్వరం శంకరం, డా. రాధశ్రీ, డా. ఆచార్యా ఫణీంద్ర, కాసుల ప్రతాప్ రెడ్డి, దోరవేటి చెన్నయ్య, మౌన శ్రీ మల్లిక్, జువ్వాడి దేవి ప్రసాద్, తత్వాతి ప్రమోద్ కుమార్, మంథని శంకర్, అగ్రహారం ఛందోజీ రావు, అరుణ నారదభట్ల, పెద్దూరి వెంకటదాసు, పాన్నాల బాలయ్యకు అందజేశారు. కార్యక్రమంలో నేటి నిజం దినపత్రిక సంపాదకుడు బైస దేవదాసు, మాజీ కౌన్సిలర్ కాకుమాను సునీల్, ప్రముఖ సంఘ సేవకులు దాసరి దయానంద్ రెడ్డి, తేజ సాహిత్య సేవా సంస్థ అధ్యక్షుడు డా. పోరెడ్డి రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఢీ కొరియోగ్రాఫర్ కృష్ణ అరెస్ట్

గచ్చిబౌలి: పోక్సో కేసులో ఢీ షోలో కొరియో గ్రాఫర్‌గా వ్యవహరించిన కృష్ణను గచ్చిబౌలి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నమ్మకంగా ఉంటూ స్నేహితుడి కూతురిపై లైంగిక దాడికి యత్నించినట్లు ఫిర్యాదు అందడంతో గచ్చిబౌలి పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ప్రాథమిక విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడు కృష్ణను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

చేవెళ్ల డిక్లరేషన్‌ను అమలు చేయాలి

చిక్కడపల్లి: చేవెళ్ల డిక్లరేషన్‌ను అమలు చేయాలని, ఎస్సీలకు ప్రకటించిన 18 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని తెలంగాణ మాల సంఘాల జేఏసీ చైర్మన్ ఎం.దయానంద్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం గాంధీనగర్‌లోని జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో తెలంగాణ మాల సంఘాల జేఏసీ నూతన కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దయానంద్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ యాక్ట్ ఉపసంహరించుకోవాలన్నారు. లేని యెడల పంజాబ్ రైతులను స్ఫూర్తిగా తీసుకొని పోరాటం చేస్తామన్నారు. జీవో నెంబర్ 99ని సవరించాలన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో మాలలకు అన్యాయం జరుగుతోందన్నారు. అనంతరం ఐకాస కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా ఎం.దయానంద్, వర్కింగ్ కమిటీ చైర్మన్లుగా అనంత రాములు, కేశవులు, సత్యనారాయణ, పద్మారావు, కో చైర్మన్లుగా నర్మెట్ట మల్లేష్, పద్మారావు, నరేష్, వైస్ చైర్మన్లుగా శంకర్, నరసింహ, లక్ష్మణ్, మారుతి, మహిళా విభాగం అధ్యక్షురాలిగా భువనగిరి మంగను ఎన్నుకున్నారు.



మాల సంఘాల జేఏసీ సమావేశంలో మాట్లాడుతున్న దయానంద్

నకిలీ సర్టిఫికేటుగాళ్లు..!

గుర్తింపు లేని సంస్థల్లో గుట్టుగా సౌందర్య కోర్సులు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

- నగరంలో వందలాది మందికి సర్టిఫికెట్లు జారీ
- మూడు సంస్థలకు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ నోటీసులు
- 30 మందికి పైగా కేసులు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: వైద్యారోగ్య శాఖలో నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారంలో రోజుకో కోణం వెలుగులోకి వస్తోంది. నగరంలో ఎలాంటి అర్హత లేని సంస్థలు విచ్చలవిడిగా సర్టిఫికెట్లు జారీ చేస్తున్నాయి. అక్రమార్జనే ధ్యేయంగా గత కొన్నేళ్లుగా ఈ అక్రమ దందా నడిపిస్తున్నాయి. ఇటీవల తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదులు అందడం, తనిఖీల్లో నకిలీ సర్టిఫికెట్లు లభించడంతో కథ అడ్డం తిరిగింది. నగరంలో మూడు సంస్థలు ఎలాంటి అర్హత లేకుండా సర్టిఫికెట్లను జారీ చేస్తున్నట్లు గుర్తించారు. దీంతో సదరు సంస్థలపై చర్యలకు రంగం సిద్ధమవుతున్నారు.

◆ జాతీయ మెడికల్ కౌన్సిల్‌లో గుర్తింపు లేని యూనివర్సిటీలు సంస్థలు సర్టిఫికెట్లు జారీ చేయరాదని, అలా చేస్తే నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని కౌన్సిల్ చెబుతోంది. నగరంలో మాత్రం ఈ నిబంధనలు తమకు వర్తించవన్నట్లు ప్రభుత్వ పరంగా ఎలాంటి అనుమతులు లేని సంస్థలు ఏస్తటిక్స్, బ్యూటీ, కాస్మొటాలజీ రంగంలో విచ్చలవిడిగా సర్టిఫికెట్లు జారీ చేస్తున్నాయి. దీంతో కాస్మొటాలజీ కేంద్రాల్లో వైద్యులుగా చెలామణీ అవుతున్నారు. గత కొన్ని రోజులుగా తనిఖీలు నిర్వహిస్తున్న తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డెంటల్ వైద్యులు, ఇతరులు సైతం స్కిన్ కేర్, హెయిర్, ఇతర సౌందర్య చికిత్సలు అందిస్తున్నట్లు గుర్తించారు. ఇది నిబంధనలకు విరుద్ధమని నిలదీసినపుడు మేం బ్యూటీ కోర్సులు పూర్తి చేశామని పలువురు సర్టిఫికెట్లు చూపించినట్లు తెలుస్తోంది. సర్టిఫికెట్లు చెల్లవనే విషయమై ఫిర్యాదులు అందినట్లు సమాచారం. దీంతో ఆయా సర్టిఫికెట్లు జారీ చేసిన సంస్థలకు ఎన్ఎంసీ గుర్తింపు ఉందా? లేదా? అని ఆరా తీశారు. అసలు సర్టిఫికెట్లు నకిలీవా, ఒరిజినలా అనే కోణంలోనూ విచారణ చేపట్టగా గుర్తింపు లేని సంస్థలు అక్రమార్జనే ధ్యేయంగా సాగిస్తున్న అక్రమ దందాగా గుర్తించారు. దీంతో నగరంలోని మూడు సంస్థలపై కేసులు నమోదు చేశారు. అక్రమ పద్ధతుల్లో కాస్మొటాలజీ చికిత్సలు అందిస్తున్న సుమారు 30 మందిపై కేసులు నమోదు చేశారు.

ఆ సర్టిఫికెట్లు చెల్లుబాటు కావు



జాతీయ మెడికల్ కౌన్సిల్‌లో గుర్తింపు పొందిన సంస్థల్లో మాత్రమే కోర్సులు పూర్తి చేయాలి. గుర్తింపు లేని సంస్థలు జారీ చేసిన సర్టిఫికెట్లు చెల్లుబాటు కావు. ఇలాంటి సర్టిఫికెట్లతో ప్రాక్టీస్ చేసే వారిపై ఎన్ఎంసీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తాం. ఎంబీబీఎస్, ఫాం డీ, బీడీఎస్, బీఎస్సీ, హోమియో చేసిన వారు సర్టిఫికెట్లు తెచ్చుకుంటున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో కాస్మొటాలజీ సేవలందిస్తున్న 30 మందిపై కేసులు నమోదయ్యాయి. అనధికారిక సంస్థల నుంచి పొందిన సర్టిఫికెట్లతో హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్, పీలింగ్, ఏస్తటిక్ సర్జరీలు చేస్తున్నారు. ఇటువంటి వారిపై కేసులు నమోదు చేస్తున్నాం.

– శ్రీనివాస్, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు

గంజాయి పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని పలు ప్రాంతాల్లో ఎక్సైజ్ ఎస్టీఎఫ్ బృందాలు దాడులు నిర్వహించి గంజాయి, డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో భువనేశ్వర్ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న 6.15 కిలోల గంజాయిని రైల్వే పోలీసుల సహకారంతో స్వాధీనం చేసుకున్నారు. సరూర్‌నగర్ గుర్రంగూడ ప్రాంతంలోని ఒక ఇంట్లో గంజాయి పెంచుతున్నట్లు సమాచారం అందడంతో డీటీఎఫ్ పోలీసులు నిర్వహించగా మూడు గంజాయి మొక్కలు లభించాయి. సికింద్రాబాద్ రసూల్ పుర ప్రాంతంలో 1.60 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురి పైనా కేసులు నమోదు చేశారు.

చెరువులో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

మణికొండ: గండిపేట చెరువులో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. నార్సింగి పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గండిపేట చెరువులో చేపలు పట్టేందుకు వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి(40) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. ఆదివారం చెరువు నీటి మట్టాన్ని పరిశీలించేందుకు వచ్చి జలమండలి ఉద్యోగి మునీర్ మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికి తీశారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, మృతి ఒంటిపై తెల్ల టీషర్టు, బ్రౌన్ కలర్ డ్రాయర్ ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి



లక్ష్మయ్య మృతదేహం

హస్తినాపురం: రోడ్డు దాటుతున్న వ్యక్తిని వేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వనస్థలిపురం పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పల్నాడు జిల్లా, రెంటచింతల మండలం, పాసర్లపాడు గ్రామానికి చెందిన వేల్పుల లక్ష్మయ్య(55) భార్య పిల్లలతో సహా నగరానికి వలస వచ్చి ఫిల్మ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో మేస్త్రీ పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. పని మీద స్వగ్రామం వెళ్లిన లక్ష్మయ్య బస్సులో హైదరాబాద్ తిరిగి వచ్చాడు. శనివారం రాత్రి ఆటోనగర్ వద్ద బస్సు దిగిన అతను రోడ్డు దాటుతుండగా హయత్‌నగర్ వైపు నుంచి దిల్‌సుఖ్‌నగర్ వైపు వెళుతున్న టిప్పర్‌లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన లక్ష్మయ్యను స్థానికులు సమీపంలోని ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మరో నలుగురికి తీవ్ర గాయాలు

నందిగామ: శుభకార్యానికి బైక్‌పై వెళ్తున్న దంపతులను కారు ఢీకొట్టిన ఘటనలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన నందిగామ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ కథనం ప్రకారం.. శంషాబాద్ మండలం పెద్దషాపూర్ గ్రామానికి చెందిన విజయ్ కుమార్ (30), శిరీష దంపతులు. ఆదివారం రాత్రి బైక్‌పై మండల పరిధిలోని నర్సప్పగూడలో జరిగే ఓ శుభకార్యానికి బయలు దేరారు. నందిగామలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న చౌరస్తా వద్ద నర్సప్పగూడకు మళ్లేందుకు ప్రయత్నిస్తుండగా సింబయాసిస్ అంతర్జాతీయ యూనివర్సిటీ వైపు నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. అంతటితో ఆగకుండా రహదారి పక్కన ఆగిఉన్న డీసీఎం వాహనాన్ని సైతం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న విజయ్ కుమార్ మృతి చెందగా, శిరీష తీవ్రంగా గాయపడింది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి సైతం తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

యూట్యూబ్‌లో వీడియోలు బ్లాక్ చేశారని ఫిర్యాదు

నిందితుడిపై కేసు నమోదు..

బంజారాహిల్స్: తాము పాట రాసుకుని పాడి వీడియోలు చిత్రీకరించుకుని రూ. లక్షలు ఖర్చు చేసి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసిన వీడియోలను మహారాష్ట్రకు చెందిన ఓ వ్యక్తి తమకు తెలియకుండా డౌన్‌లోడ్ చేసుకుని తమ వీడియోను బ్లాక్ చేశారంటూ ఐదుగురు యూట్యూబర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2 జవహర్‌కాలనీకి చెందిన రమావత్ విజయ్ అనే యూట్యూబర్..విజయ్ ఆడియోస్ అండ్ వీడియోస్ పేరుతో తానే పాటలు పాడి వీడియో చిత్రీకరించి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తుంటాడు. అతడికి 6 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. అయితే మహారాష్ట్రకు చెందిన విశాల్‌రాథోడ్ అనే వ్యక్తి విజయ్ అప్‌లోడ్ చేసిన వీడియోలను డౌన్‌లోడ్ చేసుకుని తానే వీటిని రూపొందించినట్లుగా ఫ్రెష్‌గా యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసి విజయ్ వీడియోలను బ్లాక్ చేశాడు. విజయ్‌తో పాటు బనావత్ ఆంజనేయులు, అరవింద్, రమావత్ నితిన్, సాయికుమార్ అనే యూట్యూబర్ల వీడియోలు కూడా డౌన్‌లోడ్ చేసుకుని వీటిని బ్లాక్ చేసి తానే వీటిని నిర్మించినట్లుగా విశాల్ రాథోడ్ అప్‌లోడ్ చేయసాగాడు. దీంతో అసలైన యూ ట్యూబర్లు నష్టాలు ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని విశాల్ దృష్టికి తీసుకెళ్లగా తిరిగి వీడియోలు అప్‌లోడ్ కావాలంటే అన్‌లాక్ చేసేందుకు రూ.10 లక్షలు డిమాండ్ చేస్తున్నాడని, తమను బెదిరింపులకు గురిచేస్తున్నాడంటూ విజయ్‌తో పాటు నలుగురు యూట్యూబర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇది కాపీరైట్ చట్టం కిందికు కూడా వస్తుందని, చీటింగ్ చేయడమేగాక, బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్నాడని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒక్కో వీడియో చిత్రీకరించడానికి రూ.2 నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చు చేశామని, తమ వీడియోలను బ్లాక్ చేయడం ద్వారా భారీగా నష్టపోతున్నామని ఆరోపించారు. విశాల్‌పై బంజారాహిల్స్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీసీ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలి



మాట్లాడుతున్న ఆర్. కృష్ణయ్య

కవాడిగూడ: రాష్ట్రంలోని వందలాది ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించి విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య అన్నారు. హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించకుంటే రాష్ట్రంలోని మంత్రుల నివాసాలను కబ్జా చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే అద్దె భవనాల్లో కొనసాగుతున్న హాస్టళ్లకు అద్దె బకాయిలు చెల్లించాలన్నారు. ఆదివారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు జిల్లపల్లి అంజి ఆధ్వర్యంలో ప్రభుత్వ హాస్టళ్ల, గురుకులాలకు సొంత భవనాలను నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ ఎంపీలు, మంత్రుల కోసం ఇంద్ర భవనాలు నిర్మిస్తున్న ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థులకు సొంత భవనాలు ఎందుకు నిర్మించడం లేదని ప్రశ్నించారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గత 27 ఏళ్లుగా 295 హాస్టళ్లలో ఒక్క హాస్టల్‌కు కూడా సొంత భవనం నిర్మించకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ విద్యార్థుల పట్ల వైఖరిని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వర్కర్ల పెంచాలని డిమాండ్ చేశారు. ప్రతి హాస్టల్‌కు డైనింగ్ హాల్, లైబ్రరీ, టీవీహాల్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు పగిళ్ల సతీష్, నాయకులు అనంతయ్య, సి.రాజేందర్, పృథ్వీగౌడ్ రవికుమార్, మణికంఠ, నిఖిల్,ర అశిష్ గౌడ్‌తోపాటు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఫోన్ కాల్‌తో స్పందించారు.. బాలికను కాపాడారు..

- ఒడిశా నుంచి సమాచారం
- అప్రమత్తమై బాలికను కాపాడిన బాచుపల్లి పోలీసులు

నిజాంపేట్: బాచుపల్లి ఇన్‌స్పెక్టర్ సతీష్‌కుమార్‌కు శనివారం ఒడిశాలోని కటక్ నుంచి ఓ ఫోన్ వచ్చింది. దక్షిణాసియా మహిళా ఫౌండేషన్‌లో ప్రోగ్రాం ఆఫీసర్‌గా పని చేస్తున్న తాన్వి సింగ్ అనే వ్యక్తి ఫోన్ చేసి ఒడిశా రాష్ట్రం, కేంద్రపాడా జిల్లా, ఔల్ మండలం, సహిరా గ్రామానికి చెందిన బాలిక(16) అపహరణకు గురైందని, ఆమెను బాచుపల్లిలోని ఓ ఇంట్లో నిర్బంధించినట్లు సమాచారం అందించాడు. దీంతో తక్షణమే స్పందించిన ఇన్‌స్పెక్టర్ సతీష్ కుమార్ గాలింపు చర్యలు చేపట్టారు. స్థానికుల సహకారంతో కొద్ది గంటల్లోనే బాలికను ఇందిరానగర్‌లోని ఓ ఇంట్లో బంధించినట్లు గుర్తించి రక్షించారు. అనంతరం ఆమెను సూరారంలోని సఖి సెంటర్‌కు తరలించారు. ఆమె తలిదండ్రులు లేదా ఒడిశా పోలీసులకు అప్పగించే వరకూ తాత్కాలిక రక్షణలో ఉంచనున్నట్లు ఇన్‌స్పెక్టర్ సతీష్ కుమార్ తెలిపారు.

నాకు న్యాయం చేయాలి

- రూ.18 లక్షలు మోసం చేసిన తండ్రి కొడుకులపై కేసు నమోదు చేయాలి
- కుటుంబ సభ్యులతో సహా పోలీస్ స్టేషన్ ఎదుట బాధితుడి ధర్నా



హుస్సేనీ ఆలం పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న బాధితుడు

చార్మినార్/దూద్ బౌలి: తనను ఆర్థికంగా మోసం చేసిన తండ్రి, కొడుకుల పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ఓ వ్యాపారి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం హుస్సేనీ ఆలం పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టాడు. అనంతరం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. అగర్వాల్ రైస్ ఇండస్ట్రీస్ నిర్వాహకుడైన మనోజ్‌కుమార్ అగర్వాల్ బియ్యం వ్యాపారం చేసేవాడు. పాతబస్తీ చంద్రికపురం ప్రాంతానికి చెందిన అనిల్ శర్మ, అతని కుమారుడు ప్రేమ శర్మ బియ్యాన్ని కొనుగోలు చేసి దానికి సంబంధించిన నగదు రూ.18 లక్షలు బకాయిపడినట్లు తెలిపాడు. డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేస్తే తన పైన పోలీసులకు తప్పుడు ఫిర్యాదులు చేస్తూ తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. వీరి పైన చట్టపరంగా చీటింగ్ కేసు నమోదు చేసి తనకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు. ఈ మేరకు అతను కుటుంబ సభ్యులతో కలిసి పాతబస్తీలోని అతని ఇంటి వద్ద ఆందోళన చేపట్టాడు. అనంతరం వారిపై చీటింగ్ నమోదు చేయిలని డిమాండ్ చేస్తూ హుస్సేనీఆలం పోలీసులను ఆశ్రయించాడు. లేని పక్షంలో వారి ఇంటి ఎదుటే ఆత్మహత్యకు పాల్పడతానని హెచ్చరించాడు. తనకు న్యాయం చేయాలని పోలీసు ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపాడు.

ఫాంహౌస్‌లో డ్రగ్స్ కలకలం

- బర్త్ డే పార్టీలో డ్రగ్స్ వినియోగం ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడి
- ఆరుగురి అరెస్ట్.. పరారీలో మరో ఇద్దరు
- డ్రగ్స్, విదేశీ మద్యం స్వాధీనం




పోలీసుల అదుపులో ఐటీ ఉద్యోగులు

మొయినాబాద్: డ్రగ్స్ వినియోగిస్తూ బర్త్ డే పార్టీ నిర్వహిస్తున్న ఫాంహౌస్‌పై ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేశారు. ఆరుగురు ఐటీ ఉద్యోగులను అదుపులోకి తీసుకుని డ్రగ్స్, విదేశీ మద్యం స్వాధీనం చేసుకున్నారు. మొయినాబాద్ మండలం, మేడిపల్లి ఫాంహౌస్‌లో శనివారం రాత్రి జరిగిన ఈ సంఘటన కలకలం రేపింది. చేవెళ్ల ఎక్సైజ్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. నగరంలో ఉండే ఐటీ ఉద్యోగి అభిజిత్ తన బర్త్ డే పార్టీ నిర్వహించేందుకు మేడిపల్లి రెవెన్యూ పరిధిలోని సీరినే ఓర్చర్డ్స్ ఫాంహౌస్‌ను అద్దెకు తీసుకున్నాడు. శనివారం రాత్రి అభిజిత్‌తోపాటు మరో ఏడుగురు ఐటీ ఉద్యోగులు అక్కడికి వచ్చారు. బర్త్‌డే పార్టీలో భాగంగా వారు డ్రగ్స్, విదేశీ మద్యం వినియోగిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు ఫాంహౌస్‌పై దాడి చేశారు. అభిజిత్‌తోపాటు సింప్సన్, పార్థు, గోయల్, యశ్వంత్, సేవియో డెన్నిస్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2 లక్షల విలువ చేసే ఎల్ఎస్‌డీ బ్లాట్స్, హష్ ఆయిల్ డ్రగ్స్, ఐదు విదేశీ మద్యం బాటిళ్లు, మూడు లగ్జరీ కార్లు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు ఐటీ ఉద్యోగులు పరారయ్యారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



లారీ బీభత్సం

ఇద్దరి మృతి, ఒకరికి గాయాలు



రామకృష్ణ(ఫైల్)



సాయికుమార్(ఫైల్)



గోడ మధ్యన ఇరుక్కుపోయిన రామకృష్ణ

భువనగిరి: భువనగిరి పట్టణంలోని జగదేవ్‌పూర్ చౌరస్తాలో లారీ బీభత్సం సృష్టించింది. లారీ ఢీకొని ఇద్దరు మృతి చెందగా.. ఒకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం పోతిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన చిలమామిడి రామకృష్ణ(35), చిలమామిడి సాయి కుమార్(22) హైదరాబాద్‌లోని సూరారం కాలనీలో కొంతకాలంగా నివాసం ఉంటున్నారు. రామకృష్ణ ప్రైవేట్ కంపెనీలో మేనేజర్‌గా, సాయికుమార్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం భువనగిరి పట్టణంలోని సంతోష్‌నగర్‌లో నిశ్చితార్థం వేడుకకు బంధువులతో కలిసి వచ్చారు. నిశ్చితార్థం జరుగుతున్న క్రమంలో స్వీట్స్ కోసం రామకృష్ణ, సాయికుమార్ ఇద్దరూ కారులో పట్టణంలోని జగదేవ్‌పూర్ చౌరస్తాకు బయలుదేరారు. కారును రోడ్డు పక్కన పార్కింగ్ చేసి షాపు దగ్గరకు వెళ్తున్నారు. ఇదే సమయంలో రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన లారీ ఉత్తరప్రదేశ్ నుంచి జగదేవ్‌పూర్ రోడ్డు మార్గం నుంచి చెన్నైకు వెళ్తున్న లారీ వేగంగా దూసుకువచ్చి అక్కడే ఉన్న పాదచారులు, ద్విచక్రవాహనదారులను ఢీకొట్టింది. దీంతో అక్కడే నిలబడి ఉన్న రామకృష్ణ మృతి చెందగా, సాయికుమార్‌తో పాటు రామన్నపేట మండలం తుమ్మలగూడెం గ్రామానికి చెందిన బీమారి శివసాయికుమార్, లారీ డ్రైవర్, క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం సాయికుమార్‌తో పాటు శివకుమార్‌ను సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో సాయికుమార్ మృతి చెందాడు. మృతుల బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రమేష్ తెలిపారు. మృతుడు రామకృష్ణకు భార్య ఇద్దరు కుమార్తెలు, సాయికుమార్‌కు భార్య, కుమార్తె ఉన్నారు.

ధ్వంసమైన షాపులు, బైకులు

లారీ వేగంగా దూసుకురావడంతో రోడ్డు పక్కన ఉన్న టీ స్టాల్, పాన్ షాప్‌లు, అక్కడే ఉన్న మూడు బైకులు ధ్వంసమయ్యాయి. మృతుడు లారీ, గోడ మధ్యన ఇరుక్కుపోవడంతో పోలీసులు క్రేన్ సాయంతో లారీని తొలగించి మృతదేహాన్ని బయటకు తీశారు. జిల్లా కేంద్ర ఆస్పత్రి వద్ద మృతుల కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

క్లుప్తంగా...

వైభవంగా ముత్యాలమ్మ బోనాలు



బోనాల వేడుకల్లో పాల్గొన్న నేతలు

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–7లోని మీ–సేవా సెంటర్ సమీపంలో ఉన్న ముత్యాలమ్మ బోనాల వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. శ్రావణ మాస బోనాల పండుగలో స్థానిక మహిళలు ఊరేగింపుగా బోనమెత్తుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. బంజారాహిల్స్ మాజీ కార్పొరేటర్ బి.భారతీనాయక్ ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజల్లో స్థానిక నేతలు ప్రతాప్‌రెడ్డి, జగన్‌రెడ్డి, చిన్నా, నవీన్, నహీం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెయింట్ ఆల్ఫోన్సస్ చర్చి వార్షికోత్సవం



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.9లోని సెయింట్ ఆల్ఫోన్సస్ చర్చి లిగోరి వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చర్చి ప్రీస్ట్ వీకే స్వామి క్రీస్తు సందేశాన్ని ఇచ్చారు. వందలాది మంది చర్చి విశ్వాసకులు హాజరైన ఈ కార్యక్రమంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం విశ్వాసకులు క్రీస్తు ప్రతిమతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విన్సెంట్ ఆంథోని, సభ్యులు శౌరి రాజు, ఆంథోని, మైఖేల్, రవి, విక్టర్, లారెన్స్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటా

రహమత్‌నగర్: బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటానని ఆ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ నాయకుడు మాగంటి వజ్రనాథ్ అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ కార్యకర్త రహీంను శనివారం ఆయన పరామర్శించారు. ఆర్థిక సాయాన్ని అందజేశారు. అనంతరం ఆయన బీఆర్ఎస్ నాయకులతో జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై చర్చించారు. ఈ సందర్భంగా వజ్రనాథ్ మాట్లాడుతూ... రాబోయే ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీ టిక్కెట్లు ఆశిస్తున్న తన అభ్యర్థిత్వాన్ని బలపర్చాలని కోరారు.

17న వినాయకనగర్ బస్తీ ఎన్నికలు



ఎన్నికల షెడ్యూలు పత్రాలను చూపుతున్న నాయకులు

రహమత్‌నగర్: వినాయకనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధమైంది. స్థానిక కమ్యూనిటీ హాల్ వద్ద ఎన్నికల నిర్వాహకులు మాట్లాడుతూ... ఈ నెల 11, 12వ తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారని తెలిపారు. 12వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ, 17 తేదీన కమ్యూనిటీ హాల్‌లో పోలింగ్ ఉంటుందన్నారు. ఉదయం 7.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందని వారు వివరించారు. అనంతరం ఓట్లను లెక్కించి ఫలితాలను ప్రకటిస్తారని వారు వెల్లడించారు. సొంత నివాసం కలిగిన వారు ఒక కుటుంబం నుంచి రెండు ఓట్లు వేయవచ్చని తెలిపారు. వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు వీరస్వామి యాదవ్, మాణిక్యం, కేశవులు, ఎస్.శ్రీనివాస్, డానియల్, ఆంజనేయులు, బి.శ్రీనివాస్, యాదగిరి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు..

సనత్‌నగర్: కిలో..రూపాయల్లో.. టమాటా.39, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 50, పచ్చిమిర్చి 50, బజ్జీ మిర్చి 55, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 35, పందిరి బీర 45, క్యాబేజీ 15, క్యారెట్ 45, దొండ 28, గుండుబీన్స్ 85, గింజ చిక్కుడు 65, గోకరకాయ 45, కీర 23, దోసకాయ 15, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 23, చామగడ్డ 28, మొరంగడ్డ 28, కందగడ్డ 40, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 5–6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఓ వైపు తొలగింపు..
మరో వైపు డంపింగ్





బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–1లోని తాజ్ బంజారా చెరువులో గుర్రపుడెక్క తొలగిస్తున్న మిషన్లు, తాజ్‌బంజారా చెరువును మట్టితో పూడ్చుతున్న దృశ్యం

- ముమ్మరంగా గుర్రపుడెక్క తొలగింపు ప్రక్రియ
- రూ.26 లక్షల వ్యయంతో పనులు
- చెరువును భవన నిర్మాణ వ్యర్థాలను, మట్టితో పూడ్చుతున్న వైనం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–1లోని శివాలయాన్ని ఆనుకుని ఉన్న తాజ్‌బంజారా చెరువు గేటు నుంచి రాత్రిపూట భవన నిర్మాణ వ్యర్థాలను, మట్టిని కొంత మంది వ్యక్తులు డంపింగ్ చేస్తూ చెరువును అడ్డగోలుగా పూడ్చేస్తున్నారు. 25 రోజుల నుంచి తాజ్‌బంజారా చెరువులో ఒకవైపు లక్షలాది రూపాయలు వెచ్చించి ప్రభుత్వం గుర్రపు డెక్క తొలగిస్తూ నీటిని శుభ్రం చేస్తుండగా, మరోవైపు కొంత మంది డబ్బులు వసూలు చేస్తూ లారీల ద్వారా పెద్ద ఎత్తున చెరువులో మట్టిని డంపింగ్ చేస్తున్నారు. ఈ విషయంపై ది నేషనల్ అంబేడ్కర్ సేన తెలంగాణ స్టేట్ ఉపాధ్యక్షుడు గోకుల్ కల్యాణ్‌రావు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో కూడా చెరువును మట్టితో పూడ్చుతున్నారని, కబ్జాకు గురవుతున్నదని కొంతమంది కాంట్రాక్టర్లు రాత్రిపూట ఒక్కో లారీకి రూ.1000 వసూలు చేస్తూ మట్టి డంపింగ్ చేయిస్తున్నారని వాట్సప్ ద్వారా ఫిర్యాదు కూడా చేశారు. ఒకవైపు గుర్రపు డెక్క తొలగిస్తూనే, ఇంకోవైపు భవన నిర్మాణ సామగ్రి, పెద్ద పెద్ద బండరాళ్లను, మట్టిని డంపింగ్ చేస్తూ పూడ్చుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తే తమకేమీ తెలియదంటూ చేతులెత్తేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇరిగేషన్, జీహెచ్ఎంసీ అధికారులకు మట్టి డంపింగ్ చేస్తున్న ఫొటోలు కూడా పంపించినా వారు ఏమాత్రం స్పందించడం లేదని స్థానికులు దుయ్యబడుతున్నారు. ప్రతిరోజూ రాత్రిపూట బంజారాహిల్స్ రోడ్డునెంబర్–1 వైపు ఉన్న గేట్లను తెరిచి 25 లారీల వరకు మట్టి డంప్ చేస్తున్నారని, ఇప్పటికే 15 ఫీట్ల మేర చెరువు పూడుకుపోయిందని ఫిర్యాదులు అందుతున్నాయి. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడం వల్లనే రోజురోజుకూ చెరువు కబ్జాకు గురవుతుందని స్థానికులు దుయ్యబడుతున్నారు. ఇలాగే వదిలేస్తే చెరువును కబ్జా చేసే అవకాశాలు ఉన్నాయని కూడా స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఈ చెరువు చుట్టూ 12



తొలగించిన గుర్రపు డెక్క



గుర్రపుడెక్క తొలగించిన తర్వాత చెరువు

ఎకరాల మేర చెరువు స్థలం కబ్జాకు గురైంది. బఫర్ జోన్ ఎఫ్‌టీఎల్‌లో అక్రమ నిర్మాణాలు ఏర్పడ్డాయి. అధికారులు పట్టించుకున్న పాపానపోవడం లేదు. దీనికి తోడు తాజాగా మట్టి డంపింగ్ చేస్తున్నారు. గతంలోనే ఇలా మట్టి డంపింగ్ చేస్తున్న లారీల డ్రైవర్లపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. పోలీసులు చర్యలు తీసుకోకపోవడంతో మళ్లీ అక్రమ డంపింగ్‌లు మొదలయ్యాయి. చెరువు చుట్టూ ఉన్న 10 మంది ప్లాట్‌దారులు ఇప్పటికే వెయ్యి గజాల మేర చెరువు స్థలాన్ని కబ్జా చేసి చెట్లు పెంచుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రతిరోజూ 10 లారీలకు పైగా..

బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–1లోని తాజ్‌బంజారా చెరువులో పేరుకున్న గుర్రపుడెక్క, దుర్గంధం, దుర్వాసనలపై 'సాక్షి' పలుమార్లు దుస్థితిని వెలుగులోకి తీసుకువచ్చింది. దీంతో గడిచిన 25 రోజులుగా తాజ్‌బంజారా చెరువులో ప్రత్యేక మిషన్ల ద్వారా గుర్రపుడెక్క తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. సుమారుగా 210 లారీల గుర్రపు డెక్కను తొలగించి ఇక్కడ గుట్టలుగా పోశారు. రూ.26 లక్షల వ్యయంతో చెరువులో గుర్రపుడెక్క తొలగింపు కార్యక్రమం చేపట్టారు. ప్రతిరోజూ 10 లారీలకు పైగా గుర్రపుడెక్కను తొలగిస్తున్నారు. ఈ పనులు గత మూడు వారాల నుంచి ముమ్మరంగా జరుగుతున్నాయి. తొలగించిన గుర్రపు డెక్కను ఎండిపోయిన తర్వాత ఇక్కడి నుంచి డంపింగ్ యార్డుకు తరలించనున్నారు.

బుల్కాపూర్ నాలాలో వ్యర్థాల తొలగింపు



బుల్కాపూర్ నాలాలో సిల్ట్ తొలగించిన తర్వాత సాఫీగా పారుతున్న వరద

బంజారాహిల్స్: మొన్నటివరకు వ్యర్థాలు, బురద, చెత్తాచెదారం, పిచ్చి మొక్కలతో నిండిపోయిన వరదనీటి కాలువ హైడ్రా చొరవతో చెత్తంతా తొలగిపోయి వరదనీరు సాఫీగా పారుతోంది. బుల్కాపూర్ నాలాలో కొన్నేళ్లుగా వ్యర్థాలు, బురద పేరుకుపోయి వరద ముందుకువెళ్లలేక రోడ్లను, ఇళ్లను ముంచెత్తేది. టోలిచౌకి, హకీంపేట కుంట, ఫిలింనగర్‌లోని బసవతారకనగర్, మహాత్మాగాంధీనగర్ ప్రాంతాల్లో నాలా నిండిపోయి వరద ముందుకువెళ్లలేక రోడ్లపై పారేది. ఈ దుస్థితిని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కళ్లారా చూసి అప్పటికప్పుడు వ్యర్థాల తొలగింపుపై నిర్ణయాలు తీసుకుని తగిన ఆదేశాలు జారీ చేశారు. వారం రోజుల పాటు సంబంధిత సిబ్బంది లారీల కొద్ది సిల్ట్‌ను తొలగించడంతో రెండు రోజుల నుంచి నాలా మొత్తం క్లీన్ అయ్యి వరదనీరు ముందుకువెళ్తుంది. దీంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

క్రీడా పోటీల్లో సత్తా చాటిన ట్రాఫిక్ ఏఎస్ఐ శ్యామల

సనత్‌నగర్: జింఖానా గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన ఆఫ్ సీజన్ తెలంగాణ స్టేట్ చాంపియన్‌షిప్–2025 పోటీల్లో బేగంపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న శ్యామల సత్తా చాటారు. డిస్కస్ త్రో పోటీల్లో బంగారు పతకం, షాట్‌పుట్ పోటీల్లో సిల్వర్ పతకాన్ని గెలుచుకున్నారు. ఈ సందర్భంగా నేషనల్ ఇంటిగ్రేటెడ్ మెడికల్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొండా విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సురేందర్‌పటేల్ చేతుల మీదుగా ఆమె పతకాలు అందుకున్నారు.



నేత్ర వైద్య శిబిరానికి స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ ప్రేమ్‌నగర్‌లో లయన్ ఎం.రాజశేఖర్ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి పరిసర ప్రాంతాల ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఎనిమిది మందికి కాటరాక్ట్ ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. సామాజికవేత్త డాక్టర్ కళ్లెం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... త్వరలో 8 మందికి ఉచితంగా ఆపరేషన్స్ నిర్వహిస్తామన్నారు. నేతలు మోసిన్ ఖురేషి, ఎర్ర కృష్ణకుమార్, విద్యుత్ ఉద్యోగులు సర్వేశ్వర్, సుబ్రమణ్యంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



ఉచిత వైద్య శిబిరానికి హాజరై పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్ సబిహా బేగం

సనత్‌నగర్: జెకెకాలనీలోని పార్థివ్ లంగ్‌కేర్ సెంటర్ ఆధ్వర్యంలో మోతీనగర్ సమీపంలోని గాయత్రీనగర్ రాక్‌గార్డెన్ పార్కులో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రముఖ పల్మనాలజిస్ట్, హాస్పటల్ ఎండీ నాగరాజు, కన్సల్టెంట్ ఈఎన్‌టీ సర్జన్ రాధ, జనరల్ ఫిజిషియన్ మౌనికల బృందం హాజరై వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. ముఖ్యంగా పల్మనాలజీ, ఈఎన్‌టీ, జనరల్ మెడిసిన్, డెంటల్ తదితర వైద్య పరీక్షలు జరిపారు. దాదాపు 250 మంది హాజరై వివిధ రకాల పరీక్షలు చేయించుకున్నారు. అల్లాపూర్ కార్పొరేటర్ సబీహాబేగం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో గాయత్రీనగర్ అధ్యక్షుడు కృష్ణారావు, మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ సత్తాచాటాలి

మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్



నారాయణస్వామితో సమావేశమైన అంజన్‌కుమార్‌యాదవ్

శ్రీనగర్‌కాలనీ: కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంఘటితమై జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో త్వరలో జరుగనున్న ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించి పార్టీ సత్తా చాటాలని మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ కోరారు. ఆదివారం ఎర్రగడ్డ డివిజన్‌లో పాదయాత్రతో ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం టీడీపీ సీనియర్ నేత నారాయణస్వామి నివాసంలో ఆయన కుమారుడు రామచంద్రరావుతో కలిసి సమావేశమయ్యారు. ఎమ్మెల్యేగా పోటీ చేసిన నారాయణస్వామి లాంటి సీనియర్ నేతలు కాంగ్రెస్ పార్టీకి అవసరమని అన్నారు. కాంగ్రెస్ పార్టీలోని రావాలని ఆయనను ఆహ్వానించారు. తన అభిమానులు, కుటుంబ సభ్యులతో చర్చించి నిర్ణయం చెబుతానని నారాయణస్వామి ఈ సందర్భంగా వెల్లడించారు. నేతలు మోసిన్ ఖురేషి, ఎర్ర కృష్ణకుమార్, ఆకాష్, సర్దార్, ఖాజా, గణేష్ యాదవ్, షఫీ, శ్రీనివాస్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

విలువలను భావితరాలకు అందించాలి



నాట్స్ అధ్యక్షుడు శ్రీహరిని సన్మానిస్తున్న కమ్మ సంఘం నేతలు

శ్రీనగర్‌కాలనీ: ప్రపంచంలో తెలుగుజాతి ఎక్కడ ఉన్నా మన ఖ్యాతిని నలుదిశలా విస్తరించి మన సంస్కృతి–సంప్రదాయాలు, విలువలను భావితరాలకు అందించాలని నాట్స్ యూఎస్ఏ అధ్యక్షుడు శ్రీహరి మందడి అన్నారు. నాట్స్ తెలుగు సంబరాలు అంగరంగ వైభవంగా విజయవంతం చేసినందుకు శ్రీహరి మందడిని ఆదివారం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, మోతీనగర్ సమాఖ్య కమ్మ సంఘం నేతలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ... తెలుగుజాతిని వన్నె తెచ్చేలా కృషిచేయాలని, మనజాతి గౌరవాన్ని ప్రపంచదేశాలకు తెలియజేయాలని కోరారు. మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, నేతలు ఆంజనేయప్రసాద్, అడుసుమిల్లి వెంకటేశ్వరరావు, బాలయ్య చైదరి, రజిని, ఆర్.బి.చౌదరి తదితరులు పాల్గొన్నారు.

కలగా కమ్యూనిటీహాల్ నిర్మాణం

- గత ప్రభుత్వంలో రూ.40 లక్షలు మంజూరు..
- దాదాపు 10 బస్తీలకు పైగా ఉపయోగం



కమ్యూనిటీ హాల్ నిర్మాణం జరపాలని ప్రణాళికలు రూపొందించిన తాతాచారికాలనీ గ్రౌండ్ ఇదే..

సనత్‌నగర్: దాదాపు 10 బస్తీలు..ఏదైనా శుభకార్యం చేసుకోవాలన్నా.. సమావేశం పెట్టుకోవాలన్నా.. పండుగలు, పబ్బాలు జరుపుకోవాలన్నా..ఒక్కటంటే ఒక్కటి కూడా కమ్యూనిటీ హాల్ లేదు. బేగంపేటలోనిఅంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్ పక్కనే ఆనుకుని ఉన్న ఆ బస్తీల్లోని ఇళ్లల్లో ఏదైనా ఫంక్షన్ జరుపుకోవాలంటే రోడ్డే దిక్కు. ఇదీ బేగంపేట డివిజన్ శ్యాంలాల్‌బిల్డింగ్స్ పరిసర బస్తీల ప్రజల వెతలు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గత ప్రభుత్వ హయాంలో ఇక్కడి బస్తీల ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా కమ్యూనిటీహాల్ నిర్మాణానికి చొరవ తీసుకోవడమే కాకుండా రూ.40 లక్షల నిధులు కూడా మంజూరు చేయించారు. ఇంతవరకు ఆ పనులు పట్టాలెక్కలేదు సరికదా.. మంజూరైన నిధులు ఎటుపోయాయో అధికారులకే ఎరుక.

అన్ని హంగులతో నిర్మించేందుకు ప్రణాళికలు..

శ్యాంలాల్‌బిల్డింగ్స్ పరిసర బస్తీలను కలుపుకుని దాదాపు 30 వేల వరకు జనాభా ఉంటుంది. ఆయా బస్తీలకు సరైన కమ్యూనిటీ హాల్ లేకపోవడంతో ప్రైవేటు ఫంక్షన్‌హాల్స్ నిర్వాహకులను ఆశ్రయించి వేలకు వేల చెల్లించాల్సి వస్తోంది. ముఖ్యంగా తాతాచారికాలనీ, ఎరుకల బస్తీ, గురుమూర్తిలేన్, బొంబే హల్వా కాంపౌండ్, ఇందిరా గాంధీపురం తదితర బస్తీల ప్రజలు ఏదైనా శుభకార్యం చేసుకోవాలంటే దగ్గరలో అందరికీ ఉపయోగపడే రీతిలో సరైన కమ్యూనిటీ హాల్ లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాటిగడ్డలో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ ఉన్నప్పటికీ దూరభారం కావడంతో ఆసక్తి కనబరచడం లేదు. ఈ క్రమంలో తాతాచారి కాలనీ గ్రౌండ్ విశాలంగా ఉండడంతో పాటు చుట్టుపక్కల బస్తీలకు ఎంతో అనువుగా ఉండడంతో ఇక్కడ అన్ని హంగులతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం జరపాలని రూ.40 లక్షల మంజూరు చేశారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో పనులు ప్రారంభించలేకపోయారు. ఎన్నికలు ముగిశాయి, కొత్త ప్రభుత్వం కొలువుదీరి సంవత్సరన్నర దాటినా ఇక్కడి కమ్యూనిటీ హాల్ నిర్మాణం ఊసెత్తడం లేదు.

ఎమ్మెల్యే పట్టుబట్టి నిధులు మంజూరు చేయించారు



కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇక్కడి కమ్యూనిటీ హాల్ నిర్మాణం గురించి అసలు పట్టించుకోవడం లేదు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం మంజూరైన నిధులు ఏమయ్యాయో తెలియదు. నిర్మాణంపై దృష్టిసారించాలి. ఈ కమ్యూనిటీ హాల్ నిర్మాణంతో ఎంతోమందికి ఉపయోగకరంగా ఉంటుంది.

– సురేష్‌యాదవ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు

ఖబరస్థాన్ సమస్య పరిష్కారానికి కృషి



మసీదు కమిటీ నేతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: సనత్‌నగర్‌లోని ముస్లింల ఖబరస్థాన్ సమస్య పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని మాజీ మంత్రి సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. ఆదివారం సనత్‌నగర్‌కు చెందిన పలు మసీదు కమిటీల ప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాయలంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిశారు. తమకు ఖబరస్థాన్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, సుదూర ప్రాంతాల్లోని ఖబరస్థాన్‌లకు తీసుకువెళుతున్నామని పేర్కొన్నారు. తమ ప్రాంతంలో స్థలం లేని కారణంగా బేగంపేటలోని ఓల్డ్ కస్టమ్స్‌బస్తీలోని ఖబరస్థాన్‌లో ఖననం చేసుకునేలా అక్కడి కమిటీని ఒప్పించేందుకు చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ సనత్‌నగర్‌లో ఖబరస్థాన్ ఏర్పాటుచేసేందుకు ప్రయత్నం చేశానని, కానీ అందుకు అవసరమైన స్థలం అందుబాటులో లేదని వివరించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మసీదు కమిటీ అధ్యక్షులు మహ్మద్ నోమాన్, మాజిద్, యాకుబ్, రహీం, జమీర్, షంషేర్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సోమవారం । 4 । ఆగస్టు । 2025

చీటీకి ఏదీ చెల్లుచీటి!

- కార్యకలాపాలకు సాఫ్ట్‌వేర్‌ను ప్రవేశపెట్టని వ్యవసాయ మార్కెట్లు
- రూ.80 వేల కోట్ల టర్నోవర్, రూ.800 కోట్ల ఆదాయం
- రైతుల సరుకుల వివరాలు 70 ఏళ్లుగా చీటీలపైనే రాస్తున్న వ్యాపారులు
- నిరక్షరాస్యులైన రైతులను మోసగిస్తున్న వ్యాపారులు



సాక్షి, సిటీబ్యూరో: రూ.80 వేల కోట్ల టర్నోవర్.. రూ.800 కోట్ల వార్షిక ఆదాయం.. కానీ, ఆధునికతకు ఆమడదూరం.. పాత పద్ధతినే అంటిపెట్టుకున్న వైనం.. చిట్టీలపైనే రైతుల సరుకుల వివరాలు.. వివరాలన్నీ లోపభూయిష్టం.. ఇదీ హైదరాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్ల పరిస్థితి. సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రపంచంలోనే అగ్రగామిగా పేరొందుతున్న హైదరాబాద్‌లో ఇంకా మూస పద్ధతిలోనే చిట్టీలపై రాతలు కొనసాగుతున్నాయి. వ్యాపారులు ఇష్టారాజ్యంగా క్రయవిక్రయాలు సాగిస్తున్నారు. మార్కెట్ యార్డుల్లో తెలుగు రైతులతో హిందీలో మాట్లాడటం, కన్నడ, హిందీ భాష మాట్లాడే వారికి తెలుగులో సమాధానం చెప్పడం నిత్యకృత్యం. కమిషన్ ఏజెంట్ చెప్పింది రాసుకోవడమే సిబ్బంది పనా? ఇచ్చింది తీసుకెళ్లడం రైతు వంతా? ఈ తంతులో రైతుకు న్యాయం జరుగుతోందా? కమిషన్ ఏజెంట్లు, మధ్యవర్తి కలసి రైతును నిండా ముంచుతున్నారా? ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు, సందేహాలకు సమాధానం కరవనే చెప్పాలి. రైతు, మార్కెట్ కమిటీలు రూ.కోట్లలో ఆదాయాన్ని కోల్పోవాల్సి వస్తోంది. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. అధికారులు డిమాండ్ లేని చోట్ల రూ.వందల కోట్లు పెట్టి మార్కెట్లను అభివృద్ధి చేశారు. డిమాండ్ ఉన్న హైదరాబాద్ లాంటి చోట్ల పట్టించుకోవడం లేదు.

అలా మొదలైంది..

వ్యవసాయ మార్కెట్ యార్డులను 1960లో భువనగిరి, వరంగల్‌లో ప్రారంభించారు. సత్ఫలితాలివ్వడంతో రాష్ట్ర వ్యాప్తంగా వాటిని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వీటి సంఖ్య 197కి చేరింది. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లో గడ్డిఅన్నారం, గుడి మల్కాపూర్, బోయిన్‌పల్లి, మలక్‌పేట్ మార్కెట్లను అందుబాటులోకి తెచ్చారు. నగర అవసరాలకు సరిపడా కూరగాయలు, పండ్లు, పూలు, అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి, ఉల్లి, తదితర నిత్యవసరాలు ఆయా మార్కెట్ల నుంచి సరఫరా చేస్తున్నారు. తెలంగాణలోని వివిధ జిల్లాలతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ వంటి రాష్ట్రాలు, ఇతర దేశాల నుంచి పండ్లు, పూలు, ఇతర వస్తువులు దిగుమతి చేసుకుని క్రయవిక్రయాలు సాగిస్తున్నారు. అయితే మార్కెట్లకు వచ్చే వాహనాలపై సరైన నిఘా వ్యవస్థ లేకపోవడంతో రైతులు, మార్కెట్ కమిటీలు తీవ్రంగా నష్టపోతున్నాయి. రైతు తెచ్చిన సరుకులకు తక్‌పట్టీ ఇవ్వాలి. కానీ, చాలా మంది వ్యాపారులు తెల్లచీటీ రాసి ఇస్తున్నారు. తెచ్చిన బస్తాలు, కూరగాయల బరువు, ఎంత ధర పలికిందనే వివరాలు దీనిపై ఉండాలి. అయితే ఈ ప్రక్రియను పర్యవేక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో రైతు తెచ్చిన బస్తాలు, బరువు, ఎంతకు కొన్నారు, ఎంత మొత్తం కమిషన్ రూపంలో మార్కెట్ కమిటీకి చెల్లిస్తున్నారనే సమాచారం లోపభూయిష్టంగా నడుస్తోంది.

రూ.80 వేల కోట్ల టర్నోవర్

తెలంగాణలో 197 మార్కెట్ కమిటీల్లో ఏటా సుమారు రూ.80 వేల కోట్ల టర్నోవర్ జరుగుతోందని అంచనా. ఒక్క శాతం కమిషన్ చొప్పున మార్కెట్ కమిటీలకు ఏటా సుమారు రూ.800 కోట్ల ఆదాయం సమకూరుతోంది. అయితే మార్కెట్ కమిటీల్లో సాంకేతికతను ప్రవేశపెడితే మరింత ఆదాయం పెరుగుతుందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. వ్యాపారుల ఆగడాలకు అడ్డుకట్ట వేయొచ్చని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. వ్యవసాయ ఉత్పత్తులను తీసుకుని వచ్చే రైతులు ప్రవేశ గేటు వద్దే ఎన్ని బస్తాలు ఉన్నాయి.. ఇంకా ఇతర వివరాలు నమోదు చేసుకోవాలి. అనంతరం కమిషన్ ఏజెంట్ ఆ సరుకును ఎంతకు కొనుగోలు చేశారనే వివరాలు చెప్పగానే ఎంత క్వాంటిటీ తెచ్చారు.. రైతుకు చెల్లించాల్సిన సొమ్ము.. మార్కెట్ కమిటీకు రావాల్సిన కమిషన్‌ను వెల్లడించే సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తేవాలని మార్కెట్ వర్గాలు కోరుతున్నాయి.

కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: విశ్వవిద్యాలయాల్లోని కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలను వైస్ చాన్స్‌లర్లు పట్టించుకోవడం లేదని తెలంగాణ వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకుల అసోసియేషన్ జాక్ నాయకులు డాక్టర్ ధర్మతేజ, డా.పరుశురామ్, డా.విజయేందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంట్రాక్టు అధ్యాపకుల సేవలను ఉపయోగించుకొని వారి సమస్యలను మాత్రం పెడచెవిన పెడుతున్నారని ఆరోపించారు. గత ఏప్రిల్‌లో ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని, యూజీసీ పే స్కేల్ అమలు చేయాలని కాంట్రాక్టు అధ్యాపకులు 11 రోజులు సమ్మె చేయగా సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరించాలని వీసీలకు సూచించినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ కాంట్రాక్టు అధ్యాపకుల పట్ల వివక్ష చూపుతున్నారని, ఆయన తన తీరును మార్చుకోవాలని హితవు పలికారు.

కష్టపడే కార్యకర్తలను గుర్తించాలి: అంజన్



మాట్లాడుతున్న అంజన్‌కుమార్ యాదవ్

రహమత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ జెండాను మోసిన నాయకులు, కార్యకర్తలకుగుర్తింపు ఇవ్వాలనే విషయాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ అన్నారు. ఎస్పీఆర్ హిల్స్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన చాయ్‌పే చర్చ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి దశాబ్దాలుగా సేవలందిస్తున్న నాయకులకు పార్టీ, నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఉప ఎన్నికల్లో జూబ్లీహిల్స్ కాంగ్రెస్ టికెట్ ఎవరికి ఇచ్చినా పార్టీ శ్రేణులు సమష్టిగా పని చేసి పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామి, నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భవానీ శంకర్, డివిజన్ ప్రధాన కార్యదర్శి నాగరాజు, సందర్, యాదయ్య, వెంకటేశ్, ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

6, 7 తేదీల్లో మత్స్య కార్మిక సమాఖ్య మహాసభలు

కాచిగూడ: అఖిల భారత మత్స్య కార్మిక సమాఖ్య 4వ జాతీయ మహాసభలు ఈ నెల 6, 7వ తేదీల్లో తమిళనాడులోని రామేశ్వరంలో జరగనున్నాయి. రాష్ట్రం నుంచి 20 మంది ప్రతినిధులు హాజరవుతున్నట్లు సంఘం జాతీయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ తెలిపారు. ఆదివారం కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి నాగర్ కోయిల్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రతినిధులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత్స్యకారుల హక్కులను కాలరాస్తోందని, మత్స్యకారులకు ఉపయోగపడే సంక్షేమ పథకాలను ఎత్తివేస్తోందని ఆరోపించారు. మత్స్యకారుల జాతీయ మహాసభల్లో మత్స్యకారుల స్థితిగతుల గురించి చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గోరెంకల నరసింహ, చనమోని శంకర్, గొడుగు వెంకట్, మునిగల రమేష్, బక్కి బాలమణి, గాండ్ల అమరావతి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో గణేష్ చతుర్థి స్పెషల్ పేరిట ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నేషనల్ సిల్క్ ఎక్స్‌పో అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ కృష్ణా హోటల్‌లో ఆకృతి ఎలైట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరలక్ష్మి, రాఖీ స్పెషల్ ఎగ్జిబిషన్ ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- సిరి ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ల్యాండ్ స్కేప్స్ పెయింటింగ్ ఎగ్జిబిషన్ మాసబ్ ట్యాంక్‌లోని జేఎన్ఏఎఫ్ఏయూ కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో గణేష్ చతుర్థి స్పెషల్ పేరిట నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

అవయవదానమంటే మరో జన్మనివ్వడమే..



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

రాంగోపాల్‌పేట్: అవయవాలు పాడైపోయిన వ్యక్తికి అవయవదానం చేయడమంటే మరో జన్మను అందించడమేనని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా నెక్లెస్ రోడ్‌లోని సంజీవయ్య పార్కు వద్ద మోహన్ ఫౌండేషన్, గ్లోబల్ ఈవెంట్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, నిస్సాన్ ఎక్స్‌ప్రెస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో రన్ ఫర్ ఆర్గాన్ డొనేషన్ 3వ ఎడిషన్ ఉత్సాహభరితంగా సాగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం ఈటల మాట్లాడుతూ అవయవదానంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని, దీని కోసం మోహన్ ఫౌండేషన్ చేస్తున్న కృషి అమోఘమని అన్నారు. అవయవదానం ద్వారా ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నిండాయని ఫౌండేషన్ సీఈవో రఘురాం అన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌత్ జనరల్ మేనేజర్ శ్రీవాత్సవ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మ్యాక్స్ ప్రొటీన్, డాక్టర్ రెడ్డీస్, మోఘావి వెల్నెస్ స్పా తదితర సంస్థలు భాగస్వాములుగా ఉన్నాయి.

ఆర్‌టీఐతో అక్రమాలకు చెక్

పంజగుట్ట: సమాజంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు బయటపెట్టేందుకు సమాచార హక్కు చట్టం ఎంతో ఉపయోగపడుతుందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జస్టిస్ యాక్సెస్ నెట్వర్క్ (జన్) వెబ్‌సైట్‌ను సమాచార హక్కు కమిషనర్ దేశాల భూపాల్, జన్ వ్యవస్థాపకుడు మహేష్ బండతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ప్రకారం ఒక కార్యాలయం బయట కార్యాలయానికి సంబంధించిన మొత్తం సమాచారం, సదరు అధికారి ఫోన్ నెంబర్‌తోసహా బోర్డుపై పొందుపర్చాలన్నారు. ఈ హక్కుపై ప్రజలకు మరింత అవగాహన పెంపొందించాలని సూచించారు. ఆర్‌టీఐ కమిషనర్ భూపాల్ మాట్లాడుతూ సమాచార హక్కు కమిషనర్లు రాష్ట్రంలోని 33 జిల్లాల్లో పర్యటించి అన్ని ప్రభుత్వ శాఖలను పర్యవేక్షిస్తామని తెలిపారు. ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఒక్క పార్లమెంట్ స్థానానికి రూ.150 కోట్లు ఖర్చుచేస్తున్నారని, ఇంత అవినీతి జరుగుతున్నా ఎవరూ బయటపెట్టడం లేదని విచారం వ్యక్తం చేశారు. సమావేశంలో ఆర్‌టీఐ కార్యకర్తలు అశ్రఫ్, రజిత, శంకర్, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జన్ వెబ్‌సైట్ ఆవిష్కరిస్తున్న వెంకటయ్య, దేశాల భూపాల్ తదితరులు

నారాయణరావు నేటి తరానికి ఆదర్శప్రాయుడు



మాజీ డీజీపీ హెచ్‌జే దొరకు పురస్కారాన్ని అందజేస్తున్న రామ్మోహన్‌రావు

గన్‌ఫౌండ్రీ: వృత్తిపై నిబద్ధతతో పదవీ విరమణ వరకు నిజాయితీగా పనిచేసిన ఎంవీ నారాయణరావు నేటి తరానికి ఆదర్శప్రాయుడని తమిళనాడు పూర్వ గవర్నర్ పి.ఎస్.రామ్మోహన్‌రావు అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్, ఎంవీ నారాయణరావు ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నారాయణరావు శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ డీజీపీ హెచ్‌జె.దొరకు ఎంవీ నారాయణరావు స్మారక పురస్కారాన్ని ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హెచ్‌జె.దొర ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వివిధ హోదాల్లో పనిచేసి రాష్ట్రపతి నుంచి ఇండియన్ పోలీస్ మెడల్ అందుకున్నట్లు గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు కేవీ రమణాచారి, మాజీ డీజీపీ ఏకే ఖాన్, పూర్వ అడిషనల్ డీజీపీ ఆర్.సీతారామారావు, కాంటినెంటల్ కేన్సర్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ పి.జగన్నాథ్, నారాయణరావు కుమారులు ఎం.సుధాకర్‌రావు, సాకేత్ రామారావు, కిన్నెర కార్యదర్శి మద్దాలి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మలు రాజకీయ చైతన్యంతో ముందుకెళ్లాలి

బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్ చిరంజీవులు



సమావేశంలో మాట్లాడుతున్న చిరంజీవులు

హిమాయత్‌నగర్: విశ్వకర్మ కులస్తులు రాజకీయంగా చైతన్యవంతమై రాజ్యాధికారం కోసం ముందుకు వెళ్లాలని బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్ టి.చిరంజీవులు పిలుపునిచ్చారు. ప్రపంచీకరణతో కులవృత్తులు నాశనం అవుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఆదివారం విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ అధినేత విశ్వనాథుల పుష్పగిరి 450 కిలోమీటర్ల పాదయాత్ర ముగిసిన సందర్భంగా అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఒకప్పుడు ఎంతో వైభవోపేతంగా ఉన్న విశ్వకర్మలు, ఇతర బీసీ కులాలు యాంత్రీకరణ, గ్లోబలైజేషన్ ఫలితంగా వృత్తుల ఉపాధి కోల్పోయి ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుల వృత్తులను ఆధునీకరించాలని, ఇందుకోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. పుష్పగిరి మాట్లాడుతూ తెలంగాణ, రాయలసీమల్లో విశ్వకర్మల పరిస్థితులు అత్యంత దుర్భరంగా ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా పుష్పగిరిని చిరంజీవితోపాటు సభకు హాజరైన వారందరూ కలిసి ఘనంగా సన్మానించారు. చామకూర రాజు, కె.వి.గౌడ్, బత్తుల సిద్ధేశ్వర్ పటేల్, డా.అవ్వారు వేణు కుమార్, అంబాల నారాయణ గౌడ్, ఐలి వెంకన్న గౌడ్, లక్ష్మణ్, ముత్యాల సదాశివ, రమేష్ యాదవ్, రజిత, పర్వతం వాణి తదితరులు పాల్గొన్నారు.

పొదల్లో మగ శిశువు మృతదేహం

గౌతంనగర్: చెట్ల పొదల్లో మగశిశువు మృతదేహం లభించిన సంఘటన మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మౌలాలి నుంచి ఎస్పీనగర్‌కు వెళ్లే రహదారి సమీపంలోని కల్లు కంపౌండ్ పక్కన పొదల్లో అప్పుడే పుట్టిన మగశిశువును స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఏకలవ్య కార్పొరేషన్‌ను పునరుద్ధరించాలి

వలిగి ప్రభాకర్ డిమాండ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకలవ్య ఫైనాన్స్ కార్పొరేషన్‌ను పునరుద్ధరించి 5 వందల కోట్ల రూపాయలను కేటాయించాలని ఆల్ ఇండియా ఎరుకల హక్కుల పోరాట సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు వలిగి ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎరుకల హక్కుల పోరాట సమితి 29వ ఆవిర్భావ దినోత్సవం మోలుగుత్తుల పోచయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వలిగి ప్రభాకర్ మాట్లాడుతూ... 29 రాష్ట్రాలలో , 7 కేంద్ర పాలిత ప్రాంతాలలో 140 కోట్ల మంది జనాభాలో 12 కోట్ల మంది ఆదివాసీ తెగ ప్రజలు ఉన్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 3 లక్షల మంది ఎరుకల జనాభా ఉందని తెలిపారు. ఈ 29 సంవత్సరాలుగా ఎరుకల హక్కుల సాధన కోసం అనేక ఉద్యమాలు, త్యాగాలు చేశామని గుర్తు చేశారు. ఎరుకల తెగ ప్రజలకు సామాజిక, రాజకీయ చైతన్యం కల్పించామన్నారు. విద్యా, ఉద్యోగ, సంక్షేమ, ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో ఎరుకల కులస్థులకు జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేస్తున్నామని అన్నారు. జీవనోపాధులను కాపాడుకోవడానికి సమాజంలో స్వయం గౌరవాన్ని పెంపొందించడానికి వారిలో ప్రతిభను చాటి చెప్పడానికి అనేక ఉద్యమాలు జరిగాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్, ఎరుకల ఉద్యోగుల హక్కుల జాతీయ కో కన్వీనర్ గరిక శ్రీనివాసులు, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ కమిషన్ సభ్యులు నరహరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఎరుకల హక్కుల పోరాట సమితి సమావేశంలో మాట్లాడుతున్న వలిగి ప్రభాకర్

దేశభక్తి అంటే జీవన విధానం

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు



సైన్యంలో ప్రతిభ చాటిన వారిని సత్కరించిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

రాయదుర్గం: దేశభక్తి అంటే నినాదం కాదని, అది జీవన విధానమై ఉండాలని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా క్యాంపస్‌లో అఖిల భారతీయ రక్షిక మహాసంఘ్ ఆధ్వర్యంలో 'సెల్యూటింగ్ అవర్ హీరోస్– ఆపరేషన్ సింధూర్'పేరిట నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మేజర్ జనరల్ అజయ్ మిశ్రా, డాక్టర్ రాజబాబు, డాక్టర్ జగన్నాథ్ నాయక్, డాక్టర్ జి.చంద్రమౌళి, ప్యాట్రిక్ డి సిల్వా, ఎస్సీ అజిత్ బిచౌదరిలను ఘనంగా సత్కరించారు. అంతకుముందు భారతదేశ సైనికుల త్యాగానికి, ధైర్యానికి, దేశభక్తికి ఘనమైన నివాళి అర్పించారు. అనంతరం వెంకయ్యనాయుడు మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ ఒక కొత్త అధ్యాయాన్ని సూచిస్తోందన్నారు. యుద్ధ చరిత్రలో ఒక చిరస్మరణీయ మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. యువత దేశ సేవ కోసం ప్రేరణ పొందాలని, విద్యారంగం ద్వారా దేశభక్తిని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. భారత సైనికుల త్యాగం మాటల్లో చెప్పలేనిది కాదని, మరువలేనిదని కొనియాడారు. డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌లో చూపిన సాంకేతిక నైపుణ్యం, భారతదేశంలో అభివృద్ధి చేసిన డ్రోన్లు, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్, అడ్వాన్స్‌డ్ ఎయిర్ డిఫెన్స్ టెక్నాలజీ గురించి వివరించారు. కార్యక్రమంలో సంఘ్ జాతీయ సంయుక్త నిర్వాహక కార్యదర్శి గుంత లక్ష్మణ్, 'ఎస్కీ'డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'శౌర్య గీతం–సెల్యూటింగ్ ది సోల్జర్స్– ఏ సాంగ్ ఆఫ్ సాక్రిఫైజ్'అనే థీమ్‌తో రూపొందిన గీతాన్ని విడుదల చేశారు.

దేశ ఆర్థిక విజయానికి సీఏల పాత్ర కీలకం

ఆదాయపు పన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ అనిల్‌కుమార్



అనిల్ కుమార్‌ను సన్మానించిన అసోసియేషన్ నేతలు

హిమాయత్‌నగర్: భారతదేశ ఆర్థిక విజయానికి చార్టర్డ్ అకౌంటెంట్(సీఏ)లు వెన్నుముక లాంటి వారని ఆదాయపు పన్ను ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్(తెలంగాణ, ఏపీ) ఎం.అనిల్ కుమార్ అన్నారు. ఆర్థిక సమగ్రత, వృద్ధిని నిర్ధారించడంలో సీఏలు కీలక పాత్ర పోషించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆదాయపు పన్ను ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన ఎం.అనిల్ కుమార్‌ను తెలంగాణ, ఏపీ ట్యాక్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు సీఏ చంద్రశేఖర్ వేముల నేతృత్వంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు సీఏ పి.వి.నారాయణ రావు, కార్యదర్శి ఆశిష్ జోషి, సలహాదారు రాందేవ్ బుటాడా, మాజీ అధ్యక్షులు అమృత్ కుమార్ కోటా, హితేష్ జైన్, సభ్యుడు ఎ.పి.దహిమా ఆదివారం కలిసి సత్కరించారు. పన్ను న్యాయవాదులు, చార్టర్డ్ అకౌంటెంట్లు, పన్ను నిపుణులు పన్ను చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

సద్భావన మంచ్ ప్రారంభం



మాట్లాడుతున్న సద్భావన మంచ్ కన్వీనర్ ఖలీల్ ఉర్ రెహమాన్

బండ్లగూడ: సామాజిక ఐక్యతే లక్ష్యంగా జమాత్–ఎ–ఇస్లామీ హింద్ సన్‌సిటీ యూనిట్ బండ్లగూడ జాగీర్‌లో సద్భావన మంచ్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా సద్భావన మంచ్ కన్వీనర్ ఖలీల్ ఉర్ రెహమాన్ మాట్లాడుతూ సామాజిక, మతపరమైన చైతన్యాన్ని కలిగించడంలో ముందుడే జమాత్–ఎ–ఇస్లామీ హింద్ ఈ సద్భావన మంచ్‌ను విభిన్న మతాలకు, సామాజిక నేపథ్యాలకు చెందిన పౌరులతో కూడిన వేదికగా రూపొందించినట్లు చెప్పారు. ఇది డ్రగ్ అడిక్షన్, గృహ హింస, పారిశుద్ధ్యం, నిరక్షరాస్యత వంటి సమస్యలపై ప్రజలతో మమేకమై పనిచేస్తుందని పేర్కొన్నారు. కేవలం సంఘటనల తర్వాత స్పందించడం కాకుండా అవగాహన, విద్య, సహకారం ద్వారా సంఘర్షణల నివారణకు ముందస్తుగా పనిచేసే వేదిక అవసరం ఉందన్నారు. సద్భావన మంచ్ ఒక శాంతి నిర్మాణ వేదికగా, సంక్షోభ సమయాల్లో నైతిక దిక్సూచిలా పని చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో జేఐహెచ్ సన్‌సిటీ అధ్యక్షుడు మొహమ్మద్ అక్రమ్, కె.శరత్‌వంశీ, పి.కృష్ణమాచార్యులు, ఎస్.విల్సన్ కుమార్, పాస్టర్ వినోద్ కుమార్, అడ్వకేట్ విజయ్‌గుప్తా, బి.వి.రావు, డాక్టర్ కె.శామ్యూల్, ఎం.దామోదరన్, సయ్యద్ ఫిరాసత్ నదీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు విస్మరించిన కాంగ్రెస్

ధ్వజమెత్తిన ఆప్ అధికార ప్రతినిధి ప్రియాంక కక్కర్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రియాంక కక్కర్

కవాడిగూడ: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు బూటకపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి ప్రియాంక కక్కర్ విమర్శించారు. ఆదివారం లిబర్టీలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్, నాయకులు బుర్ర రాములు గౌడ్, విజయ్ ముల్లంగిలతో కలిసి మీడియాతో మాట్లాడారు. అరవింద్ కేజ్రీవాల్ మాత్రమే ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన సీఎంగా చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. తెలంగాణలో మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణాన్ని కల్పించి విద్యార్థుల నుంచి అధిక బస్ పాస్ చార్జీలు వసూలు చేస్తున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీ చేతిలో రాజ్యాంగం పుస్తకంతో తిరుగుతూ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ఆర్‌ఎస్ఎస్ నేపథ్యం నుంచి వచ్చారని, అందుకే బీజేపీ సిద్ధాంతం అనుసరిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం ఆప్ పోరాడుతుందని తెలిపారు.

వైశ్యుల పోరాటాలకు పూర్తి మద్దతు



సభలో అభివాదం చేస్తున్న మందకృష్ణ, విమలక్క, కాచం సత్యనారాయణ తదితరులు

గన్‌ఫౌండ్రీ: వైశ్యుల పోరాటాలకు తన పూర్తి మద్దతు ఉంటుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ పురస్కార గ్రహీత మందకృష్ణ మాదిగ ప్రకటించారు. ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో వైశ్య వికాస వేదిక ఆధ్వర్యంలో వైశ్య రాజకీయ రణభేరి బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ వైశ్యుల ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసం ఉద్యమించాలని అన్నారు. 2017లో వైశ్యులకు వ్యతిరేకంగా వచ్చిన పుస్తకంపై నాడు జరిగిన పోరాటంలో మద్దతునిచ్చినట్లు గుర్తుచేశారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. వైశ్యుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. వైశ్య వికాస వేదిక అధ్యక్షుడు కాచం సత్యనారాయణ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు వైశ్యులకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. వైశ్య కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను వర్గీకరించాలని కోరారు. కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు దయానంద్ గుప్త, అరుణోదయ సాంస్కృతిక సమైఖ్య అధ్యక్షురాలు విమలక్క, రాష్ట్రీయ లోక్‌దళ్ రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి దిలీప్‌కుమార్, పర్యాటక శాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త పాల్గొన్నారు.

సాక్షి
11
హైదరాబాద్, సోమవారం, 4 ఆగస్టు 2025

సిటీ ప్లస్



వైకుంటపాళి.. అష్టాచెమ్మా.. వామనగుంట.. పులి-మేక.. ఈ పేర్లన్నీ ఇప్పటి తరానికి తెలియక పోవచ్చు. ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడిన నేటితరానికి అప్పటి ఆటల్లో ఉన్న మజా.. అసలే తెలియకపోవచ్చు. అలాంటి ఆటల పట్ల బాలలకు ముచ్చటగొలిపేలా కృషి చేస్తోంది.. 'క్రీడ' సంస్థ. వీరితోపాటు పెద్దలకు సైతం గత స్మృతులను గుర్తుచేసే ప్రయత్నం చేస్తోంది.. ఈ ఆటలు ఆడిన నగరానికి చెందిన కొందరు పెద్దలు చాలా కాలం తర్వాత ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపామని చెబుతున్నారు.

- బంజారాహిల్స్

ఆడేద్దామా.. అష్టాచెమ్మా..

అలనాటి ఆటల పట్ల బాలల ముచ్చట | ఉత్సాహంగా పాలుపంచుకున్న పెద్దలు | గతస్మృతులను గుర్తుచేసుకునేలా కృషి | ఆఫ్‌లైన్ గేమ్స్ అలవాటు చేస్తున్న 'క్రీడ' సంస్థ

నగరీకరణలో భాగంగా మనలో చాలా మంది ఆర్టిఫీషియల్ లైఫ్‌కి అలవాటుపడిపోయారు. ఎంత వరకూ ఉద్యోగాలు, వ్యాపారాలు, సమాజిక మాధ్యమాలు ఇవే తప్ప సహజసిద్ధమైన ఆటలను మర్చిపోతున్నారు. ఒత్తిడిని తగ్గించి మానసిక ఆనందానికి దోహదపడే అచ్చతెలుగు ఆటలైన వైకుంఠపాళి.. అష్టాచెమ్మా.. వామనగుంట.. వంటి పేర్లన్నీ వింటుంటే 1970–80 కాలం నాటి రోజులు తప్పకుండా గుర్తుకొస్తాయి.. మైక్రో ఫ్యామిలీలుగా మారిపోతున్న కల్చర్‌లో నానమ్మలు, తాతయ్యల వద్ద పెరిగే వారే లేరంటే ఆశ్చర్యపోవాల్సిన పని. ఒకవేళ ఉన్నా.. టెక్నాలజీ మోజులో పడి పులిని చూసి నక్క వాతబెట్టుకున్న చందాన ఆన్‌లైన్ గేమ్స్ అలవాటు చేసి.. ఇప్పుడు అవస్థలు పడుతున్నారు. ఉమ్మడి కుటుంబాలకు దూరమైన కొందరు ఒంటరితనాన్ని తగ్గించుకునేందుకు సామాజిక మాధ్యమాల చట్రంలో ఇరుక్కుపోయి వాటికి పూర్తిగా బానిసలవుతున్నారు. నగరంలోని 'క్రీడ' సంస్థ ఈ ఆటలపట్ల అవగాహన కల్పించేందుకు కృషి చేస్తోంది. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12 లోని క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ ఆవరణలో నాటితరం ఆటలను నేటి తరానికి పరిచయం చేస్తోంది. అందుకు తగిన ఏర్పాటను సైతం చేసింది. పిల్లలు పెద్దలు చక్కగా ఆటలోని మజాను ఆస్వాదిస్తున్నారు. క్రీడ సంస్థ ప్రయత్నాన్ని అభినందిస్తున్నారు.

80 ఏళ్లు పైబడిన వారు కూడా..

అలనాటి ఆటలు ఈ తరానికి పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేయగా.. అప్పటి తరంలోని కొందరు.. 80 ఏళ్లకు పైబడిన వారు కూడా ఇందులో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. పులి–మేక, దాడీ, అచ్చంగిల్ల వంటి ఆటలను ఆడించడమే కాదు.. నాటి, నేటి తరానికి చెందిన కొందరికి ఈ ఆటలను ఎలా ఆడాలో నిర్వాహకులే నేర్పిస్తున్నారు.. పిల్లలు, పెద్దలు కూడా ఈ ఆటలను ఎంతో ఆసక్తిగా నేర్చుకుంటున్నారు.







మెదడుకు పదును..

ఈ ఆటలు ఎంతో ఆసక్తికరంగా సాగుతాయని, వీటిని ఆడటం వల్ల మెదడుకు పదును పెరుగుతుందని, పైగా దీనివల్ల దుష్ప్రభావాలు కూడా ఏమీ ఉండవని, ఒత్తిడిని సైతం జయించవచ్చని పలువురు నిపుణులు, సైకాలజిస్టులు చెబుతున్నారు. ఇటువంటి ఆటల వల్ల పిల్లల్లో ఏకాగ్రత పెరుగుతుందని, పైగా క్రీడాస్ఫూర్తి కూడా పెరుగుతుందని, ఓటమిని సైతం తట్టుకునే శక్తి వస్తుందని, పైగా పరిచయాలు బలపడతాయని చెబుతున్నారు. మెల్లమెల్లగా కనుమరుగవుతున్న ఇటువంటి ఆటలను క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ వెలుగులోకి తీసుకురావడం మంచి పరిణామమని చెబుతున్నారు.



ఇదో మంచి ప్రయత్నం..

మా దగ్గర అలనాటి ఆటల ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారని తెలియగానే ఎంతో సంతోషమేసింది. ఈ ఆటల గురించి తెలియని వారికి ఈ ప్రదర్శన ఎంతగానో ఉపయోగపడుతుంది. నేను కూడా సరదాగా ఆడుకున్నా. ఈ ప్రయత్నం అభినందించదగ్గ విషయం. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని ఏర్పాటు చేయిస్తాం. పిల్లలు, పెద్దలు ఇందులో పాల్గొనడం ఆనందంగా ఉంది. కొద్దిసేపు నేను కూడా ఆడుకుని నాటి రోజులను గుర్తుచేసుకున్నా.

- విజయలక్ష్మి, సీసీటీ సభ్యురాలు



నేటి తరం కోసం..

నాకు మా అమ్మమ్మ అష్టాచెమ్మాతో పాటు వామనగుంట, వైకుంఠపాళి, సోలాసీబీ వంటి ఆటలను నేర్పించింది. మా అమ్మకు ఈ ఆటలన్నీ రావు. నాకు నేర్చుకోవాలని ఉన్నా చెప్పేవారు లేరు. పిల్లలకు వీటి గురించి చెప్పేవారే కరువయ్యారు. అందుకే క్రీడ అనే సంస్థ ద్వారా నెలలో 25 రోజుల పాటు వివిధ నగరాల్లో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నాను. ఇది పూర్తిగా ఉచితం. చిన్నా పెద్దా అందరూ వచ్చి ఆడుకోవచ్చు. వీటి గురించి నేర్పించడమే కాకుండా ఆడిస్తాం. ఇక్కడ రోజుకు 200 మంది వరకూ వస్తున్నారు.

- వినీత సిద్ధార్థ, క్రీడ సంస్థ నిర్వాహకులు



రంగురంగుల ఫ్రెండ్‌షిప్ బ్యాండ్స్.. వెరైటీ గ్రీటింగ్ కార్డ్స్.. గ్రూప్ గ్యాథరింగ్స్.. ఇది ఒకప్పటి మాట.. ఫ్రెండ్‌షిప్ డే అంటే వారం ముందు నుంచే హడావుడి మొదలయ్యేది.. ఎవరికి బ్యాండ్ కట్టాలి.. ఏం మెసేజ్ ఉన్న గ్రీటింగ్ ఇవ్వాలి.. ఎలాంటి గిఫ్ట్ ఇవ్వాలి.. అనే మీమాంస కొనసాగేది.. అయితే నేటి ఆధునిక కాలంలో టెక్నాలజీ స్నేహితుల దినోత్సవాన్ని కూడా కొత్తరాగం తీయిస్తోంది.. వర్చువల్ ఫ్రెండ్.. సోషల్ ట్రెండ్ అన్నట్లు గతకాలపు జ్ఞాపకాలతో కూడి రీల్స్, లైక్స్, షేర్స్, వాట్సాప్ స్టేటస్‌ల హోరుతో సెలబ్రేషన్స్ నడిచాయి..

- సాక్షి, సిటీబ్యూరో

వర్చువల్ ఫ్రెండ్.. సోషల్ ట్రెండ్..

- రీల్స్, లైక్స్, షేర్స్, స్టేటస్‌ల హోరు
- ట్రెండ్ మార్చిన ఫ్రెండ్‌షిప్ డే సెలబ్రేషన్స్
- సోషల్‌మీడియాలో స్నేహితుల దినోత్సవ సందడి
- కొత్తరాగం తీయిస్తున్న స్నేహగీతం

మారిన మానవుని లైఫ్‌స్టైల్ స్నేహితుల దినోత్సవాన్నీ ప్రభావితం చేస్తోంది.. భౌతిక మిలాకత్‌లకు దూరంగా.. వర్చువల్ పరామర్శలకే పరిమితమైంది. స్నేహితులతో సరదాగా తాము తిరిగిన ఫేవరెట్ ప్రదేశాల్లో గడపాల్సిన సమయాన్ని స్క్రీన్ టైం మింగేసిందా? అన్నట్లు నడిచింది. మునుపటి మధుర స్మృతులకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను సినిమా పాటలకు మిక్స్ చేస్తూ.. మరోసారి ఆ అనుభవాన్ని గుర్తుచేసుకున్నారు.

ఖండాలను దాటి..

డిజిటల్ కాలంలో స్నేహం.. కొత్తగా చిగురులను తొడుగుతోంది. వేల కిలోమీటర్ల దూరంలో ఉన్నా వీడియో కాల్స్‌తో కనెక్ట్ అవుతున్నారు. అర్రే నా మిత్రులను కలవలేకపోతున్నానే అనే భావనను, బాధను చెరిపేస్తూ..ఫేస్‌బుక్, ఇన్‌స్టా వంటి వేదికలు వేల మంది స్నేహితులతో ప్రత్యక్షంగా మాట్లాడే అవకాశం కల్పిస్తోంది. కొత్త వారిని సైతం పరిచయం చేస్తోంది. నేరుగా కలవకున్నామనే బాధను తొక్కిపెట్టి.. అంతకుమించిన ఆనందాన్ని పంచుతోంది.



దేశ నిర్మాణంలో యువతే కీలకం..



సాక్షి, సిటీ బ్యూరో: తమ వినూత్న ఆలోచనలతో దేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని తెలంగాణ ఉన్నత విద్యా మండలి (టీఎఇఏఉ) గౌరవాధ్యక్షులు ప్రొఫెసర్ వి.బాలకిష్ట రెడ్డి ఆకాంక్షించారు. నగరానికి చెందిన శివ శివాని గ్రూప్ జూబ్లీ వేడుకలు ఆదివారం సందడిగా సాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, నిజాయితీ, ఆవిష్కరణల ప్రాధాన్యతలను విద్యార్థులకు ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కొంపల్లిలోని డిగ్రీ కళాశాలలో నిర్వహించిన 'సమవర్తన' ద్వారా 700 మందికి పైగా విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేశారు. శివ శివాని విద్యాసంస్థల అధ్యక్షురాలు, ముఖ్య కార్యనిర్వాహక అధికారి ఎస్.ఆర్తి, ప్రిన్సిపాల్ మమత తదితరులు పాల్గొని మాట్లాడారు.

ప్రణవి నాట్యం.. రమణీయం..

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు





గన్‌ఫౌండ్రీ/మాదాపూర్ : ప్రముఖ నాట్య శిక్షణాలయం తన్మయ్ ఆర్ట్ స్టూడియో ఆధ్వర్యంలో ప్రముఖ నృత్య గురువు టీ.ప్రీతి శిష్యురాలు చింతలపూడి ప్రణవి కూచిపూడి రంగప్రవేశం రవీంద్రభారతిలో ఆదివారం కన్నుల పండువగా సాగింది. భామ కలాపం, ప్రాణమయం, తరంగం, థిల్లాన వంటి అంశాలపై చక్కటి హావభావాలతో సాగిన నృత్య ప్రదర్శనలు అహూతులను ఆకట్టుకున్నాయి. బిట్స్ పిలానీలో ఉన్నత విద్యను అభ్యసిస్తూ కూచిపూడిపై మక్కువతో నేర్చుకోవడం అభినందనీయమని పలువురు కొనియాడారు. యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ డాక్టర్ జొన్నలగడ్డ అనురాధ, సంగీత గురువు రామవర్మ, తల్లిదండ్రులు చింతలపూడి శ్రీనివాస్, మంజుష పాల్గొన్నారు.

శిల్పారామంలో..

కళాకారులు కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించి సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిశ్చంఖలా డ్యాన్స్ అకాడమీ సంధ్యరాజు శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శనను ఆదివారం ప్రదర్శించారు. రామరామ, ఎలమంచ, డోలయంచాల, భావములోన, మాతే మలయధ్వజ, భాగ్యదా లక్ష్మి, రామచంద్రయ్య, హరివరాసనం, స్వాగతం కృష్ణ, కలియనర్తనం, కాలభైరవాష్టకం, శివశంభో, దశావతారం తదితర అంశాలను కళాకారులు అధ్య, చేతన, భాగ్యలక్ష్మి, హాసిని, నందిని, శ్రీయ, ఖ్యాతి, జోస్న, వాసుకి, నియతి, లక్ష్మివైనికా, గౌతమ్ సర్వాణి, వైనవి తదితరులు ప్రదర్శించారు. కళాకారులు వెంకట్ గంగాధర్, మేఘ, మనీష, లక్ష్మి, ధన పాల్గొన్నారు.

స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో సెంటినరీ సెలబ్రేషన్స్



- చిత్రమయి గ్యాలరీలో చిత్రప్రదర్శన
- ఈ నెల 10 వరకూ సందర్శనకు 80 చిత్రాలు

మాదాపూర్ : చిత్రకళాకారుడు డాక్టర్ కాపు రాజయ్య వేసిన చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయి. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో సెంటినరీ సెలబ్రేషన్స్ పేరిట ఏర్పాటు చేసిన ప్రదర్శనను పర్యాటక శాఖ సెక్రటరీ జయేష్ రంజన్‌తో కలిసి, తెలంగాణ భాషా సాంస్కృతిక డైరెక్టర్ మామిడి హరికృష్ణ ప్రారంభించారు. కాపు రాజయ్య వేసిన చిత్రాలు అద్భుతంగా ఉన్నాయని, ప్రదర్శనలో 80 చిత్రాలు అందుబాటులో ఉంచామని, ఈ నెల 10వ తేదీ వరకూ ప్రదర్శన కొనసాగుతుందని తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7గంటల వరకూ సందర్శకులకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. అనంతరం పుస్తకావిష్కరణ చేశారు. హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్యాట్‌వాక్.. పెట్స్‌రాక్..

నగరంలో ఉత్సాహంగా 'పెట్స్' డే ● క్యాట్ వాక్ చేసిన పెంపుడు జీవాలు

సెల్ఫీలతో యజమానుల సందడి





ప్రపంచ పెట్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలో పెట్స్ డే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఇందులో భాగంగా జూబ్లీ హిల్స్‌లోని జిగ్గీ సెంటర్‌లో పలువురు జంతుప్రేమికులు తమ పెట్స్‌తో ఆనందంగా, సరదాగా గడిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్యాట్ వాక్‌లో పలు రకాల పెట్స్ అలరించాయి. అనంతరం జంతు ప్రేమికులు పెట్స్‌తో సెల్ఫీలు, ఫొటోలు దిగుతూ ఫోజులిచ్చారు. జిగ్గీ వెటర్నరీ కన్సల్టెంట్ డాక్టర్ మానసవాణి రెడ్డి మాట్లాడుతూ పెంపుడు జంతువులు ఎంతో ఒత్తిడిని తగ్గిస్తాయని, యజమానులు వాటి ఆరోగ్య సంరక్షణ విషయంలో కీలక జాగ్రత్తలు తీసుకోవాలని వారికి సూచించారు.

- బంజారాహిల్స్





క్లుప్తంగా...

'స్థానిక' ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాన్ని అందజేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

మొయినాబాద్: రాష్ట్రంలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. 'గ్రామ సౌభాగ్యం బీజేపీతోనే సాధ్యం' పేరుతో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరించే కార్యక్రమాన్ని ఆదివారం ఆయన రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం శ్రీరాంనగర్‌లో ప్రారంభించారు. గ్రామంలోని హను మాన్ దేవాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం గ్రామంలో పర్యటించి మోదీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ 11 ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేయాలన్నారు. జిల్లా పరిషత్, కార్పొరేషన్ చైర్మన్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ పదవుల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుతో ప్రజలెంత సంతోషంగా ఉన్నారో చెబుతూ గడపగడపకూ బీజేపీని తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

బీసీ రిజర్వేషన్ల అమలుకు 5న ధర్నా

సీపీఎం కార్యదర్శి జాన్‌వెస్లీ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే డిమాండ్‌తో ఈనెల 5న ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. తెలంగాణలో జరిపిన కులగణన ఆధారంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు అసెంబ్లీలో బిల్లు ఆమోదించి కేంద్రానికి పంపిస్తే, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను అడ్డుకుంటున్నదని ఆదివారం ఒక ప్రకటనలో ఆయన ఆరోపించారు. బీసీల రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ తీసుకొచ్చి గవర్నర్‌కు పంపిస్తే ఆయన కూడా జాప్యం చేస్తున్నారన్నారు. దీనివల్ల స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యమవుతూ, కేంద్రం నుండి గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులు రాకుండా పోతున్నాయన్నారు. గుజరాత్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, రాజస్తాన్‌లాంటి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముస్లింలకు రిజర్వేషన్లు అమలు చేస్తున్న బీజేపీ, తెలంగాణలో మాత్రం అమలుకు అడ్డుపడుతోందన్నారు. ఈ నేపథ్యంలో బీసీల రిజర్వేషన్ల బిల్లును పార్లమెంటులో ఆమోదించాలని, చట్టం చేయాలని ఆగస్టు 5న ఇందిరాపార్కు దగ్గర మహాధర్నాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఏకపక్షంగా వ్యవహరించకుండా అందరినీ కలుపుకొని బీజేపీపై ఒత్తిడి తెచ్చి బీసీ రిజర్వేషన్లు అమలు చేసేందుకు ఐక్య పోరాటాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు.

భేతాళ కుట్రలో మరో అంకం

ఏసీబీ కోర్టులో అడ్డంగా దొరికిపోయిన సిట్

ఎదురు దెబ్బ తగిలేసరికి సాయంత్రానికి తెరపైకి ఇంకో కట్టుకథ

ఎల్లో మీడియా, ప్రభుత్వ పెద్దలు, సిట్ కలిసి సమష్టి నాటకం



టీడీపీకి చెందిన కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడుతో వెంకటేశ్ నాయుడు (ఫైల్)

సాక్షి, అమరావతి: నయా బేతాళ కుట్రలో చంద్రబాబు, సిట్, ఎల్లో మీడియా కలసికట్టుగా మరో అంకాన్ని సృష్టించారు. రంగారెడ్డి జిల్లాలోని ఓ ఫాంహౌస్‌లో సిట్ జప్తు చేసిన రూ.11 కోట్లు రాజ్ కేసిరెడ్డికి చెందినవేనంటూ నమ్మించడానికి చేసిన యత్నం ఏసీబీ కోర్టు సాక్షిగా శనివారం బెడిసి కొట్టడంతో అప్పటికప్పుడు మరో నాటకానికి తెర లేపారు. బ్యాంకులో డిపాజిట్ చేసిన రూ.11 కోట్లకు సంబంధించి పూర్తి స్థాయిలో పంచనామా నిర్వహించాలని, ప్రతీ నోటుపై ఉన్న సీరియల్ నంబర్‌ను రికార్డ్ చేయాలని సిట్ దర్యాప్తు అధికారిని ఏసీబీ కోర్టు ఆదేశించింది. డిపాజిట్ చేశామని చెబుతున్నందున అందుకు సంబంధించిన రిసీప్ట్ (కౌంటర్ ఫైల్) చూపాలని కోరగా, తమ బండారం బయట పడుతుందని దర్యాప్తు అధికారి పత్తా లేకుండా పోయిన విషయం తెలిసిందే. దీంతో ప్రభుత్వ పెద్దలు, సిట్‌కు దిమ్మతిరిగిపోయింది. వెంటనే ఏదో ఒకటి చేసి.. ఈ విషయంపై నుంచి ప్రజల దృష్టి మళ్లించకపోతే ఇది పూర్తిగా తప్పుడు కేసేనని తెలిసిపోతుందని అప్పటికప్పుడు ఓ వీడియోను ఎల్లో మీడియాకు లీక్ చేశారు. తద్వారా ఆ వీడియోకు విపరీత ప్రచారం కల్పించారు. ఆ వీడియోలో వెంకటేశ్ నాయుడు కరెన్సీ నోట్ల పక్కన ఉన్న ఫొటోను ఎల్లో మీడియాతోపాటు సోషల్ మీడియాలోనూ వైరల్ చేశారు. వీళ్లు చెప్పినట్లు వినేవారిని ముందు పెట్టి సరికొత్త నాటకానికి తెరతీశారు.

చెల్లని నోట్లతో కట్టుకథ

చెవిరెడ్డి అనుచరుడు వెంకటేశ్ నాయుడు పంపిణీ చేస్తున్న డబ్బుగా దానిని చిత్రీకరించారు. ఆ ఫొటోలు, వీడియోల్లో రూ.2 వేల నోట్లు కనిపిస్తున్నాయి. అయితే దేశంలో రూ.2 వేల నోట్ల చలామణి పూర్తిగా ఆగిపోయిందని 2023 మే 19న ఆర్బీఐ చివరి సారిగా ప్రకటించింది. కానీ 2024 ఎన్నికల సమయంలో మద్యం సొమ్ము అక్రమంగా తరలించారని చెవిరెడ్డిని అరెస్టు చేశారు. దీనిని బట్టి అర్థం కావడం లేదూ ఇదంతా కట్టుకథ అని. ఇదే వెంకటేశ్ నాయుడికి టీడీపీ నేతలతోనే సంబంధాలున్నాయని సోషల్ మీడియా సాక్షిగా బైటపడింది. కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని, ఎంపీలు భరత్, పుట్టా మహేశ్‌లతో వెంకటేశ్ నాయుడు ఉన్న ఫొటోలు సోషల్ మీడియాలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ లెక్కన ఈ డబ్బు వారందరిదీ అని కూడా అనుకోవచ్చు కదా. వెంకటేశ్ నాయుడు నోట్ల కట్టలతో ఉన్న ఫొటో పక్కన వీరి ఫొటోలు కూడా పెట్టి.. ఇది వీరి డబ్బే అని చెప్పగలరా? తాము చెప్పినట్లు వినేవాళ్లను రంగంలోకి దించి కట్టుకథ అల్లుతున్నారనేందుకు ఇదే ప్రబల నిదర్శనం. ఇదేవిషయం గతంలోనూ వెల్లడయ్యింది ఇపుడూ నిరూపితమయింది. ఇదంతా ప్రభుత్వ పెద్దలు, సిట్, ఎల్లో మీడియా కూడబలుక్కుని సమష్టిగా ఆడుతున్న నాటకం అని ఇట్టే తెలిసిపోతోంది. ఎలాగైనా సరే మద్యం అక్రమ కేసును సక్రమం అని నిరూపించడమే లక్ష్యంగా సిట్ బరితెగించి వ్యవహరిస్తోంది. శనివారం నాటి ఎపిసోడ్‌లో పరువు పోగొట్టుకున్న సిట్.. మరో సరికొత్త ఎపిసోడ్ ద్వారా బేతాళ కథను రక్తి కట్టించడానికి శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తోంది.

ఉపరితల ఆవర్తనంతో ఏపీలో రెండ్రోజులు వర్షాలు

- దక్షిణ కోస్తా, రాయలసీమకు వర్ష సూచన
- ఉత్తరాంధ్రలో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం

సాక్షి, విశాఖపట్నం: ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఏపీ ప్రజలకు ఉపరితల ఆవర్తనం కాస్త ఉపశమనం కలిగించనుంది. ఉత్తర తమిళనాడు, నైరుతి బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఇది సముద్ర మట్టానికి 1.5 నుంచి 4.5 కి.మీ. ఎత్తులో విస్తరించి ఉంది. దీని ప్రభావం దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాలపై కనిపించనుంది. సోమ, మంగళవారాల్లో దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే సూచనలున్నాయి. ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయి. పలుచోట్ల పిడుగులు పడే ప్రమాదం ఉంది. అదేవిధంగా.. ఉత్తరాంధ్రలో మాత్రం ఒకట్రెండుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలుంటాయి. తీరం వెంబడి 40 నుంచి 50 కి.మీ. వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు.

రాష్ట్రానికి శకునిలా కిషన్‌రెడ్డి

- పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ ధ్వజం
- ఆయనకు భయపడి బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు బీసీ రిజర్వేషన్లపై మాట్లాడట్లేదు
- కేసీఆర్ కుటుంబంలో వాటాల కొట్లాట నడుస్తోందని ఎద్దేవా
- పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షితో కలిసి ఖానాపూర్, ఆర్మూర్‌లలో పాదయాత్ర

నిర్మల్/ఆర్మూర్: రాష్ట్రానికి మేలు చేయాల్సిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శకునిలా అడ్డుపడుతున్నాడని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ దుయ్యబట్టారు. బీసీల ఓట్లతో గెలిచిన బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు కిషన్‌రెడ్డి, అమిత్ షాకు భయపడి నోరుమెదపడం లేదని లేదని విమర్శించారు. బీసీలు అధికంగా ఉన్న సికింద్రాబాద్‌లోనే కిషన్‌రెడ్డి ఓటమి ఖాయమని జోస్యం చెప్పారు. దేశం ఐక్యంగా ఉండాలని రాహుల్ గాంధీ జోడోయాత్ర చేపడితే మోదీ, అమిత్ షా విడగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. రిజర్వేషన్లను అడ్డుకుంటున్న వారికి బీసీలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. జనహిత పాదయాత్రలో భాగంగా నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రంతోపాటు నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్‌తో కలిసి ఆదివారం ఆయన పాదయాత్ర చేశారు. ఖానాపూర్‌లో యాత్ర అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 10.5 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న లక్ష్యాన్ని బీజేపీ, కేంద్రం అడ్డుకుంటున్నాయని మండిపడ్డారు. కేసీఆర్ కుటుంబంలో వాటాల పంపకాల్లో కొట్లాటలు అవుతున్నాయని.. వాటిని పరిష్కరించలేకనే కేసీఆర్ ఫాంహౌస్ నుంచి బయటకు రావట్లేదని మహేశ్‌కుమార్‌గౌడ్ ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్న తాము ఏసీల్లో కూర్చోకుండా ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకే పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. ఈ పాదయాత్రకు వస్తున్న స్పందనను బట్టి తాము వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.

బీసీ రిజర్వేషన్ల సాధనకు ఢిల్లీలో ధర్నా: మీనాక్షి

రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించుకోవడానికి మంగళవారం నుంచి మూడు రోజులపాటు ఢిల్లీలో ధర్నా నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్ తెలిపారు. ఆర్మూర్ నియోజకవర్గ పరిధిలో ఉన్న ఆలూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో కలిసి మీనాక్షి శ్రమదానం చేశారు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో పాదయాత్ర నిర్వహించారు. అనంతరం నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ పరిధిలోని జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ శివారులో ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లాస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి జూపల్లితోపాటు స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.



జనహిత పాదయాత్రలో మీనాక్షి నటరాజన్, మహేశ్‌కుమార్‌గౌడ్, సీతక్క, జూపల్లి కృష్ణారావు తదితరులు

నేడు ఢిల్లీకి కాంగ్రెస్ బీసీ నేతలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ బీసీ నాయకులు ఢిల్లీకి పయనమయ్యారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పన, రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఎత్తివేయాలని కోరుతూ కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈనెల 6న జంతర్‌మంతర్ దగ్గర జరిగే ధర్నాకు వీరు హాజరు కానున్నారు. ప్రతి జిల్లా నుంచి 50 మంది చొప్పున బీసీ ముఖ్య నేతలను ఎంపికచేసిన టీపీసీసీ.. వారిని ప్రత్యేక రైలులో ఢిల్లీ తీసుకెళుతోంది. ఈ రైలు చర్లపల్లి స్టేషన్ నుంచి సోమవారం ఉదయం 9కి బయల్దేరి మంగళవారం ఉదయానికి ఢిల్లీ చేరుకుంటుందని గాంధీభవన్ వర్గాలు తెలిపాయి. ఇదే రైలులో పార్టీ నేతలతో కలిసి మీనాక్షి నటరాజన్, మహేశ్‌కుమార్‌గౌడ్ వెళుతున్నారు.

ఇసుకలో మస్కా!



సీఎం చంద్రబాబు నివాసం పక్కనే భారీ కుంభకోణం

రోజుకు రూ.3,87,75,000.. నెలకు రూ.116 కోట్లకు పైగా జేబులోకి

- ఐదు నెలల్లో ఏకంగా రూ.581 కోట్లు దోపిడీ
- పైకి మాత్రమే పూడిక తీత.. చేసేదంతా ఇసుక మేత
- కృష్ణా నది నావిగేషన్ చానల్ ముసుగులో భారీ అక్రమం
- ఇసుక అక్రమ రవాణా కోసమే బల్లకట్టు దారి పనులు
- అర్హత లేకున్నా చినబాబు అనుయాయుల కంపెనీకి కాంట్రాక్టు
- అనుమతి పొందింది కేవలం 7 లక్షల క్యూబిక్ మీటర్లకే..

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

మాజీమంత్రి వ్యాఖ్యల వెనుక బీఆర్‌ఎస్ పెద్దల హస్తం

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత
- ఆ లిల్లీపుట్ నాయకుడి వల్లే నల్లగొండలో పార్టీ సర్వనాశనం
- సీఎం రమేష్ వ్యాఖ్యలకు, నా లేఖ లీక్ అవ్వడానికి సంబంధం ఉంది
- బీసీ రిజర్వేషన్ల కోసం నేటి నుంచి 72 గంటల నిరాహారదీక్ష



సాక్షి, హైదరాబాద్: 'బీఆర్‌ఎస్ పార్టీలో నల్లగొండకు చెందిన ఓ మాజీ మంత్రి ఉన్నాడు. ఆ లిల్లీపుట్ నాయకుడు నా గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడు. నా గురించి మాట్లాడితే ఊరుకునేది లేదు. ఆయన మాటల వెనుక బీఆర్‌ఎస్ పెద్దలు ఉన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీ సర్వనాశనం కావడానికి ఆయనే కారణం. 11 నియోజకవర్గాల్లో పార్టీ ఓటమికి కారణం ఆయనే. చావు తప్పి కన్నులొట్ట పోయినట్టు ఆయన ఒక్కడే గెలిచిండు. లిల్లీపుట్ నాయకుడి గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది..' అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు.

అందరూ స్పందించినా బీఆర్‌ఎస్ స్పందించలేదు..

'తెలంగాణ ఆడ బిడ్డనైన నాపై కొందరు అనుచిత వ్యాఖ్యలు, వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారు. వాటిపై రాష్ట్ర ప్రజలందరూ స్పందించారు కానీ, బీఆర్‌ఎస్ పార్టీ మాత్రం స్పందించ లేదు. నేను భయపడే వ్యక్తిని కాదు. ఉద్యమకారిణిని. తెలంగాణ కోసం కొట్లాడిన. ఆయన ఎవరు నా గురించి మాట్లాడడానికి? పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పదవులు పొందిన వాళ్లు ఇప్పుడు మాట్లాడుతున్నారు. ఆయనను చూసి నిన్న మొన్న పార్టీలోకి వచ్చిన ఓ జూనియర్ కూడా మాట్లాడుతున్నాడు. ఆయన తన పరిధిలో ఉంటే మంచిది. కేసీఆర్‌కు నేను రాసిన లేఖ ఏ విధంగా బహిర్గతం అయ్యిందో నాకు తెలుసు. సీఎం రమేష్ ఎందుకు మాట్లాడారో నాకు తెలియదు. సీఎం రమేష్ వ్యాఖ్యలకు, నేను కేసీఆర్‌కు రాసిన లేఖ లీక్ అవ్వడానికి సంబంధం ఉంది. నాకు ఎవరి సపోర్ట్ లేదు. మ్యాచ్ ఫిక్సింగ్ వాళ్లకే అలవాటు..' అని కవిత వ్యాఖ్యానించారు.

రిజర్వేషన్లపై కాంగ్రెస్, బీజేపీ నాటకాలు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నుంచి 72 గంటలు నిరాహారదీక్ష చేస్తున్నట్లు కవిత తెలిపారు. గాంధేయ మార్గంలో అన్నం తినకుండా , నీళ్లు తాగకుండా దీక్ష చేయనున్నట్లు చెప్పారు. ఇందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా కాంగ్రెస్, బీజేపీ కలిసి నాటకాలు ఆడుతున్నాయని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లపై బీజేపీ ధర్నా కామెడీ ధర్నాలా ఉందని అన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ కూడా ఈ అంశంపై పార్లమెంట్‌లో మాట్లాడలేదని విమర్శించారు.

అవి రేవంత్‌రెడ్డి, రాధాకృష్ణ మాటలే

- నా ఉద్యమ ప్రస్థానంపై కవితకు ఉన్న జ్ఞానానికి జోహార్లు
- కొందరు ఏదో చేస్తామని ఊహించుకుంటున్నారు
- మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కేసీఆర్‌కు వ్యతిరేకంగా ఉన్న రేవంత్‌రెడ్డి, రాధాకృష్ణ (ఆంధ్రజ్యోతి) ఏం మాట్లాడుతున్నారో కవిత కూడా అదే మాట్లాడుతున్నారని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నేత జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కవిత మాట్లాడిన పదాలను రేవంత్‌రెడ్డి, రాధాకృష్ణ ఉపయోగించారని, వాళ్ళు వాడిన పదాలను కవిత వల్లె వేస్తున్నారని విమర్శించారు. తన ఉద్యమ ప్రస్థానానికి సంబంధించి కవితకు ఉన్న జ్ఞానానికి జోహార్లు అంటూ ఎద్దేవా చేశారు. 'నల్లగొండ జిల్లాలో 25 ఏళ్లల్లో జరిగిన ఉద్యమాలకు, పార్టీ సాధించిన విజయాలకు నాదే బాధ్యత అయితే ఓటమికి కూడా నాదే బాధ్యత..' అని జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కొంతమంది ఏదో చేస్తామని ఊహించుకుంటున్నారని, వ్యక్తులుగా ఏదో చేస్తామనుకుంటే అది వారి భ్రమ అని, అంతిమంగా పార్టీయే ఫైనల్ అని అన్నారు.

నేను గెలిచా..కొంతమంది గెలవలేదుగా..

కేసీఆర్ లేకపోతే ఎవరూ లేమని, అందులో ఎలాంటి సందేహం లేదని అన్నారు. 'నేను పార్టీకి సైనికుడిని..కేసీఆర్‌ను ఈ మధ్య కాలంలో 50 సార్లు కలిసా. బనకచర్ల, వ్యవసాయ రంగానికి సంబంధించిన అంశాలపైనే చర్చించాం. వారి గురించి చర్చ రాలేదు. వారి గురించి మాట్లాడటం వృధా అని చెప్పా అంతే..' అని వివరించారు. 'నేను చావు తప్పి కన్ను లొట్టబోయినట్లు గెలిచిన..కానీ కొంతమంది గెలవలేదు కదా. కవితపై తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలు నా దృష్టికి రాలేదు. నేను చూడలేదు. చూసి ఉంటే స్పందించే వాడిని..' అని జగదీశ్‌రెడ్డి అన్నారు.

'జూబ్లీహిల్స్'లో గెలుపే మాగంటికి నిజమైన నివాళి


ముఖ్య కార్యకర్తల సమావేశంలో కేటీఆర్



శ్రీనగర్‌కాలనీ: మోసపూరిత కుమ్మక్కు పార్టీలైన అధికార కాంగ్రెస్, బీజేపీలకు ఓటర్లు బుద్ధిచెప్పాలని, దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు నివాళిగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగురవేద్దామని నేతలకు, కార్యకర్తలకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. ఆదివారం తెలంగాణాభవన్‌లో ఏర్పాటుచేసిన జూబ్లీహిల్స్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కర్రు కాల్చి వాతపెట్టేలా ఓట్లతో సమాధానం చెప్పాలన్నారు. 20 నెలల కాంగ్రెస్ అసమర్థ, అవినీతి పాలనకు ఓటర్లు బుద్ధిచెప్పాలని, కాంగ్రెస్‌ను ఓడిస్తేనే ప్రజలు గెలిచిన వారవుతారన్నారు. పేదల ఇళ్లే టార్గెట్‌గా హైడ్రా పనిచేస్తోందని, కాంగ్రెస్ మంత్రులు, ప్రజాప్రతినిధులు చెరువుల్లో ఇళ్లు కట్టుకుంటే చర్యలు తీసుకోవట్లేదని ఆరోపించారు. కేసీఆర్ పేదలకు ఎంతో మేలు చేశారని, ఎన్నో సంక్షేమ పథకాలతో బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కృషిచేశారని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వ కుంభకోణాలకు కేంద్రంలోని బీజేపీ వత్తాసు పలుకుతోందని, కేసులు లేకుండా రేవంత్‌రెడ్డిని కాపాడుతోందని కేటీఆర్ విమర్శించారు.

ఏపీ కంటే తెలంగాణలో మీడియా మెరుగు

సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని



పంజగుట్ట (హైదరాబాద్): ఆంధ్రప్రదేశ్‌తో పోలిస్తే తెలంగాణలో మీడియా పరిస్థితి మెరుగ్గా ఉందని సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాస్ రావు అభిప్రాయపడ్డారు. ఏపీలో కనీసం కెమెరాలు పెట్టుకునే పరిస్థితి కూడా లేదని.. ఏమైనా అంటే రెడ్‌బుక్ పాలన అంటున్నారని విమర్శించారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆద్యా టీవీ ఆధ్వర్యంలో ఆదివారం జర్నలిస్టు సరిత అధ్యక్షతన 'ఏది జర్నలిజం.. ఎవరు జర్నలిస్టులు.. జర్నలిస్టులను రాజకీయ నాయకులు నిర్ణయిస్తారా?' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కొమ్మినేని శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. జర్నలిస్టుల గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధాకరమన్నారు. కాలుమీద కాలు వేసుకుని కూర్చున్నారు.. చెంప పగలగొడతాం.. అన్న వ్యాఖ్యలు సీఎం చేయాల్సినవి కావని అభిప్రాయపడ్డారు. మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, సీనియర్ జర్నలిస్టులు శైలేష్ రెడ్డి, మారుతీ సాగర్, బుచ్చన్న, మేడ మధు మాట్లాడుతూ.. డిజిటల్ మీడియా నియంత్రణకు చట్టం తీసుకొస్తామంటున్నారని.. దాన్ని రాజకీయ నాయకులు రూపొందిస్తే తమకు అనుకూలంగా తెచ్చుకుంటారని స్పష్టం చేశారు. ఆ చట్టాన్ని నిష్ణాతులు, న్యాయ కోవిదులు రూపొందించాలన్నారు. ఒక ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి.. వ్యవస్థలో తప్పు ఉంటే చక్కదిద్దాలి తప్ప చెంప పగలగొడతాననడం సరికాదన్నారు.

కాసుల కోసం వక్రమార్గం

- సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తున్న జమ్మూకశ్మీర్ యువత
- ఫాలోయర్ల సంఖ్య పెంచుకొనేందుకు ఉగ్రవాదులకు వత్తాసు

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో కొత్త ట్రెండ్ నడుస్తున్నట్లు భద్రతా సంస్థల అధికారులు గుర్తించారు. ఆదాయం కోసం జమ్మూకశ్మీర్ యువత వక్రమార్గంలో పయనిస్తోంది. సోషల్ మీడియాలో ఫాలొయర్ల సంఖ్య పెంచుకోవడమే లక్ష్యంగా ఉగ్రవాదులకు, వేర్పాటువాదులను హీరోలుగా చిత్రీకరిస్తోంది. ఫాలోయర్ల సంఖ్య పెరిగితే ప్రకటన ఆదాయం పెరుగుతుండడమే ఇందుకు కారణం. సిద్ధాంతాలు రాద్ధాంతాలతో పనిలేదు. లైక్‌లు, షేర్‌లు, సబ్‌స్క్రిప్షన్లు పెరగడమే కావాల్సింది. ఉగ్రవాదానికి మద్దతుగా యువత పెడుతున్న పోస్టులకు చాలామంది ఆకర్షితులవుతున్నారు. వాటికి లైక్‌లు కొడుతూ కామెంట్లు చేస్తున్నారు. ఇటీవల ఊపందుకున్న ఈ ధోరణిని పోలీసు అధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఇది దేశ భద్రతకు సంబంధించిన అంశం కావడంతో నిందితులపై చర్యలు తీసుకొనేందుకు సిద్ధమవుతున్నారు. చట్టవిరుద్ధమైన కంటెంట్ పోస్టు చేస్తున్న కొన్ని ఖాతాలను ఇప్పటికే గుర్తించారు. కొందరిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా, కీలక అంశాలు బయటపడ్డాయి. 2016లో ఎన్‌కౌంటర్‌లో మరణించిన నిషేధిత హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాది బుర్హాన్ వనీతోపాటు మరికొందరు ఉగ్రవాదుల ఫొటోలను పోస్టు చేస్తూ ఫాలోయర్ల సంఖ్య పెంచుకుంటున్నట్లు అంగీకరించారు. దేశ విదేశాల్లో వీటిని ఆదరణ లభిస్తోందని వెల్లడించారు. ఆశించిన లక్ష్యం మేరకు ఫాలోయర్లు, ఆదాయం పెరిగిన తర్వాత ఉగ్రవాదులు ఫొటోలు తొలగించి, కాశ్మీర్‌లోని సుందర దృశ్యాలు, పర్వతాలు, చినార్ చెట్ల చిత్రాలను పోస్టు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏదేమైనా ఈ ధోరణికి పూర్తిగా అడ్డుకట్ట వేయాలని అధికారులు నిర్ణయించారు. అందుకోసం సోషల్ మీడియాపై ప్రత్యేకంగా నిఘా పెట్టారు.

యూరియా కోత.. రైతన్న వెత

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర అధికారులు అంటున్నారు.

చర్చనీయాంశమైన కేంద్రమంత్రి ప్రకటన

రాష్ట్రంలో యూరియా కొరత తీవ్ర రూపం దాల్చే పరిస్థితి ఉందని ప్రభుత్వం ఆందోళన చెందుతున్న నేపథ్యంలో, లోక్‌సభలో కేంద్ర సహాయ మంత్రి అనుప్రియా పటేల్ చేసిన ప్రకటన చర్చనీయాంశమైంది. తెలంగాణకు ఈ ఖరీఫ్ (వానాకాలం) సీజన్‌లో అవసరమైన 20.30 ఎల్‌ఎంటీల కన్నా అధికంగా 22.15 ఎల్‌ఎంటీలు సరఫరా చేసినట్లు కేంద్రమంత్రి వెల్లడించారు. దీంతో బిత్తరపోవడం రాష్ట్ర ప్రభుత్వం, అధికారుల వంతయ్యింది. వాస్తవానికి ఈ వానాకాలం సీజన్‌కు సంబంధించి.. యూరియాతో పాటు డీఏపీ, ఎంఓపీ, కాంప్లెక్స్, ఎస్ఎస్‌పీ ఎరువులు కలిపి 22.15 ఎల్‌ఎంటీలు ఇచ్చినట్లు చెప్పాల్సిన కేంద్ర మంత్రి.. కేవలం యూరియానే 22.15 ఎల్‌ఎంటీలు సరఫరా చేసినట్లుగా చెప్పారని ఓ అధికారి వివరించారు. నిజానికి ఇప్పటివరకు ఇచ్చిన యూరియా 4.50 ఎల్‌ఎంటీలు మాత్రమేనని చెప్పారు.

అసలు లెక్కలేంటి?

రాష్ట్రంలో పంటల విస్తీర్ణం భారీగా పెరిగింది. ఈ వానాకాలంలో ఏకంగా 134 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈ నేపథ్యంలో 10.48 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. కానీ కేంద్రం ఈ సీజన్‌కు గాను నెలవారీగా 9.80 ఎల్‌ఎంటీలు మాత్రమే కేటాయించింది. అదేమంటే యాసంగి సీజన్‌లో మిగిలిన యూరియా 1.92 ఎల్ఎంటీ గోదాముల్లో ఉందని, దాన్ని వినియోగించుకోవాలని సూచించింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ సమాచారం మేరకు.. ఏప్రిల్ నుంచి జూలై వరకు కేంద్రం 6.60 ఎల్‌ఎంటీల యూరియా సరఫరా చేయాల్సి ఉండగా 4.50 ఎల్‌ఎంటీలే వచ్చింది. అంటే 2.10 ఎల్‌ఎంటీలు(32 శాతం) తక్కువగా వచ్చిందన్న మాట. దీనికి రాష్ట్రం వద్ద ప్రారంభ నిల్వ కింద ఉన్న యూరియా 1.92 ఎల్‌ఎంటీలు కలిపితే మొత్తం 6.42 ఎల్‌ఎంటీలు అందుబాటులోకి వచ్చినట్టయ్యింది. ఇందులో సుమారు 5.20 ఎల్‌ఎంటీలు ఇప్పటికే రైతులకు విక్రయించగా.. 1.20 ఎల్‌ఎంటీల పైచిలుకు నిల్వలు ఉన్నట్లు తెలుస్తోంది.

2 ఎల్‌ఎంటీలైనా వస్తేనే..

ఈ సీజన్‌లో రాష్ట్రానికి కేటాయించిన 9.80 ఎల్‌ఎంటీలకు గాను జూలై వరకు 4.50 ఎల్‌ఎంటీలు సరఫరా చేసిన నేపథ్యంలో ఇంకా 5.30 ఎల్‌ఎంటీల యూరియా రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో నాలుగు నెలల్లో కోత విధించిన 2.10 ఎల్‌ఎంటీలతో పాటు ఆగస్టు కోటా 1.70 ఎల్‌ఎంటీలు కలిపి ఈ నెలలో సరఫరా చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఇప్పటికే కేంద్రాన్ని కోరారు.

వానాకాలం సీజన్‌లో రాష్ట్రానికి యూరియా కేటాయింపులు - సరఫరా వివరాలు (లక్షల మెట్రిక్ టన్నుల్లో)

నెల	కేంద్రం	కేటాయింపు	సరఫరా లోటు
ఏప్రిల్	1.70	1.21	0.49
మే	1.60	0.88	0.72
జూన్	1.70	0.98	0.72
జూలై	1.60	1.43	0.17
ఆగస్టు	1.70	-	--
సెప్టెంబర్	1.50	-	--
మొత్తం	9.80	4.50	2.10

కాగా ఇటీవల కేంద్ర మంత్రి ప్రకటన నేపథ్యంలో అధికారులు సమావేశమై యూరియా కొరత పరిస్థితిని సమీక్షించారు. ఆగస్టులో కనీసం 2 ఎల్‌ఎంటీల యూరియా అయినా వస్తేనే ప్రస్తుతానికి గట్టెక్కే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. మరోవైపు మంత్రి తుమ్మల కూడా తాజాగా కేంద్ర మంత్రి అనుప్రియా పటేల్‌కు లేఖ రాశారు. రాష్ట్రానికి యూరియా కేటాయింపులు, ఇప్పటి వరకు కేంద్రం నుంచి వాస్తవంగా వచ్చిన యూరియా వివరాలు తెలియజేశారు. రాష్ట్రంలో కొరతను దృష్టిలో పెట్టుకుని తక్షణమే అవసరమైన యూరియాను పంపించాలని విజ్ఞప్తి చేశారు.

పెండింగ్.. పరిష్కారమయ్యేనా?

▶ మొదటి పేజీ తరువాయి

పరిశీలన పూర్తయింది. ఇందుకు సంబంధించి ఇప్పటికే 32,788 దరఖాస్తులకు డిమాండ్ నోటీసులు కూడా జారీ చేశారు. వీరిలో 13,726 మంది డిమాండ్ మేరకు ప్రభుత్వానికి చెల్లింపులు చేశారు. దీంతో 10,553 మంది కన్వేయన్స్ డీడ్‌లు కూడా మంజూరు చేశారు. మిగిలిన దరఖాస్తుల్లో 828 దరఖాస్తులు అధిక విలువ ఉన్న భూములకు సంబంధించినవని, సాధారణ విలువ ఉన్న పెండింగ్ దరఖాస్తుల ద్వారా దాదాపు రూ.1,000 కోట్లు ప్రభుత్వానికి సమకూరుతుందని, అధిక విలువ గల భూములను కూడా క్రమబద్ధీకరిస్తే మరో రూ.5 వేల కోట్ల వరకు ఆదాయం వస్తుందని ఆ నివేదికలో పేర్కొన్నారు. అయితే కన్వేయన్స్ డీడ్స్ వచ్చినప్పటికీ సంగారెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో జీవో 59 క్రమబద్ధీకరణ భూములపై లావాదేవీలు నిర్వహించవద్దని ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో పరిశీలన పూర్తయిన దరఖాస్తులు, మార్కెట్ విలువ చెల్లించినవి, డీడ్స్ జారీ అయి కూడా పెండింగ్‌లో ఉన్నవి, అధిక విలువ కలిగిన భూములు... ఇలా పలు దశల్లో ఉన్న దరఖాస్తులన్నింటినీ పరిష్కరించే దిశలో త్వరలోనే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలుస్తోంది.



మంచిమాట

మత్తు వదిలితేనే మహత్తు

విశాల విశ్వంలోని జనులెంద రినో పట్టి పీడించే దుర్గుణం, ప్రగతిపథంలో వారు ముందుకు సాగకుండా ఆపివేసే దుర్లక్షణం మత్తు. మత్తు అంటే నిద్ర అన్న నిఘంటువు అర్థం లోనే మనం తీసుకోరాదు. ఇది ఒక్కో వ్యక్తిని అల్లుకునే ఒక విధమైన జడత్వం. మనిషి పురోగమించాలంటే ముందుగా వదలవలసింది జడత్వంతో కూడిన యోచన లను మాత్రమే. కార్యాచరణకు సంసిద్ధుడై సాగే సమ యాన ప్రతి విషయాన్ని సందేహించడం, అనుభ వజ్ఞులు చెప్పిన మాటలను విభేదిస్తూ అక్కడే చతికి లబడడం వంటి వాటినీ ప్రగతి నిరోధకాలుగా మనం చెప్పకోవచ్చు.

చదువుకునే సమయంలో, ఉద్యోగ నిర్వహణలో కొందరు తమతో పనిచేసే మిగిలినవారి కంటే ఉత్తమ ఫలితాలను సాధిస్తూ మహత్తరంగా ముందుకు సాగిపోతూ ఉంటారు. వారి విజయాలకు కారణం వారి జీవనశైలి. కొంత మంది మాత్రం ఎక్కడ మొదలు పెట్టారో అక్కడే ఉన్నామన్న ట్లుగా చతికిలబడిపోతారు.

ప్రగతికి అడ్డుకట్టు వేసే ప్రధానమైన విషయాలు సోమరి తనం, మనిషిలో ఆత్మ విశ్వాసం లోపించడం, అనుక్షణం సందిగ్ధా వస్థలోనే కొట్టు మిట్టాడడం వంటివి. అయితే, వీటిలో సోమరి తనం అనేది ప్రధానమైన సమస్య. ఒక సినీకవి చెప్పినట్లుగా '' మత్తు వదలరా.. ఆ మత్తులోన బడితే గమ్మత్తుగా చిత్త వుదువురా..'' అంటూనే ''జీవితమున సగభాగమ్ము నిద్దురకే సరిపోవును..మిగిలిన ఆ సగభాగమ్ము చిత్తశుద్ధి లేకపోవును..'' అని కూడా లిఖించాడు. ఆ కవి చెప్పిన మాటలు అక్షర సత్యం. మత్తుగా ఉండడం అంటే మొద్దు నిద్రే కాదు, మనిషి జాగ్ర దావస్థలోనే ఉన్నా ఒకింత బద్ధకంగా ఉండడం, చైత న్యరహితంగా ఉండడం, చేయవల సిన కార్యవిధి గురించి అస్సలు ఆలోచించకపోవడం వంటివి కూడా మత్తులో ఉన్నట్టుగానే మనం భావించాలి.

మనిషి కార్యసాధనకు ఉపక్రమించే సందర్భంలో కలిగే సందిగ్ధావస్థ పురోగతికి గొప్ప ప్రతిబంధకం. ఈ అవస్థ ఏదో ఒకటి రెండు సార్లయితే సరి పెట్టుకోవచ్చు. ఆరంభంలో ఎవరికైనా ఇటువంటివి తప్పవు. కానీ, ఇదే సమస్య, ప్రతిసారీ ఎదు రైతే, ఆ మనిషి మానసిక స్థితి మీద సందేహ పడవలసిందే..

ప్రతి కదలికకూ భయపడుతూ, ముందుకు సాగితే తనకు ఏమవుతుందో, చేపట్టిన పనిలో ఉత్తమ ఫలితాలు వస్తాయో రావో అని మీమాంసకు గురి కావడమే ఈ రకమైన మానసిక స్థితికి కారణం. ఇటువంటి వారు తప్పకుండా, తమ ఆలోచనా ధోరణిలో మార్పు తెచ్చుకోవాలి. సానుకూల దృక్పథంతో ముందుకు సాగడం అత్యంత ఆవశ్యకమని గుర్తెరగాలి. ఏదన్నా సాధించాలి అని అనుకున్నప్పుడు, అన్నివేళలా, విజయం మన సొంతం కాదు, ఒక్కొక్కసారి పరాజయమూ చవి చూడవలసి వస్తుంది. తప్పనిసరిగా విజయం సాధిస్తామని తలచినప్పుడు కూడా ఒక్కోసారి మనకు అనూహ్యంగా అపజయం కలుగుతుంది. అటువంటి క్షణాల్లోనే క్రుంగిపోకుండా, నీరస పడకుండా, ఎటువంటి మానసిక ఒత్తిడికీ తలొగ్గక ముందుకు సాగాలి.ఇటువంటి సందర్భాల్లో ఓడిపోయామని తలచకూడదు. మృగరాజైన సింహం తనకు కావలసిన ఆహారం లభించకపోతే ఏ మాత్రం నిరాశ చెందదు. అలసిపోయినా, డస్సిపోయినా, కీళ్ళు సడలిపోయినా, కష్ట స్థితిని పొందినా, ఏనుగు కుంభస్థలాన్నే కొట్టడానికి సంసిద్ధురాలవుతుంది. అందుకే మానవుడు జడత్వంతో కూడిన మత్తులో ఏమాత్రం కూరుకుపోకూడదు. మత్తులో పడితేఎంతటి యోధుడైనా అవుతాడు చిత్తు..!! మత్తును వదిలి చైతన్య మూర్తిగా మెలిగేవ్యక్తిని తప్పక వరిస్తుంది విజయమనే మహత్తు..!!

ప్రతిరోజూ ఉదయం మనం రోజును ఎలా ప్రారంభిస్తామనే విషయం ఆ రోజంతా మన శక్తి స్థాయిని, మానసిక స్థితిని ప్రభావితం చేస్తుంది. అందుకే, జీవితంలో ఏదైనా సాధిద్దామని అనుకునే వారు, ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలనుకునేవారు ఉదయం పూట కొన్ని అలవాట్లను తప్పక పాటించాలి. ఉదయం 20-30 నిమిషాల పాటు వ్యాయామం చేయడం వల్ల రక్త ప్రసరణ పెరుగుతుంది. ఒత్తిడిని పెంచే హార్మోన్ల స్థాయిలు తగ్గు తాయి. శరీరంలో కావలసినంతగా వత్తిడిని తగ్గించే రసాయనాలు విడుదలవుతాయి. ఇవి మనిషి లోని శక్తి స్థాయిలను పెంచడమే కాకుండా, రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి.

– అన్నమయ్య తత్త్వ ప్రవచన సుధాకర వెంకట్ గరికపాటి

తాత్త్వికథ

లోక సహజం

కష్టాలు, నష్టాలు, ఆవేశకావేశాలు, ఆగ్రహాలు, ఆనందాలు, సుఖాలు, దుఃఖాలు వంటివి సహజం. సంతోషం, సంపదలు వచ్చినప్పుడు మిడిసిపడుతూ... వ్యాధులు, కష్టాలు, నష్టాలు వచ్చినప్పుడు కుంగిపోతూ వాటిని తొలగించమని ప్రార్థించడానికి బదులు వాటిని భరించగలిగే శక్తిని ఇమ్మని భగవంతుణ్ణి ప్రార్థించడం ఉత్తముల లక్షణం.



అతనో అనాథ. కష్టాలు, దుఃఖాలు, తిట్లు, ఈసడింపులే బంధుమిత్రులుగా ఎలాగో పెరిగి పెద్దవాడయ్యాడు. వాళ్లనీ వీళ్లనీ ఆశ్రయించి నాలుగు అక్షరం ముక్కలు నేర్చుకున్నాడు. లోకాన్ని అర్థం చేసుకోవడం ఆరంభించాడు. గోముఖ వ్యాఘ్రాలు, పైకి అమృతంలా కనిపించే విషపు కుండల లాంటి వాళ్లంతా సమాజంలో పెద్ద మనుషులుగా చెలామణీ కావడం గ్రహించాడు.

ఎవరిని చూసినా వారిలో నీతి నిజాయితీలు కనిపించడం లేదు. అతని మనసు వికలమయింది. అంతకుముందు అతనికి గురువులు బోధించిన అనేక ధర్మసూక్ష్మాలకు, తాను ప్రత్యక్షంగా చూస్తున్న దానికి పొంతన ఏమాత్రం కనిపించడం లేదు. సమాజంలో జరుగుతున్న ఈ అన్యాయాలు, అక్రమాలకు తనవంతుగా ఏమైనా అడ్డుకట్ట ఏమైనా వేయగలనా అని ఆలోచించాడు. తనకు అలా ఆలోచించగలిగే జ్ఞానాన్నిచ్చిన గురువుల వద్దకెళ్లి అడిగాడు మనం ఈ లోకాన్ని మార్చగలమా అని -అయ్యో! నాయనా! నువ్వు, నేను కాదు, ఆ దేవుడు కూడా ఏమీ మార్చలేడు- అని వాళ్లు వేదాంతికంగా నవ్వారు. యువకునిలో ఆవేశం పాలలా పొంగుకొచ్చింది. ఛీ! ఇలాంటి జనాల మధ్య జీవించడం కన్నా అడవులలోకెళ్లి జంతువుల నడుమ బతకడం మేలనుకున్నాడు. అనుకున్నదే తడవుగా అడవికి వెళ్లాడు. అక్కడ ఒక బోధివృక్షం కింద కళ్లు మూసుకుని తపోదీక్షలో కూచున్నాడు. ఎండలు, వానల మధ్య అలాగే నిశ్చలంగా కూర్చునే ఉన్నాడు. ఆకలి దప్పికలు మర్చిపోయాడు. తనకూ ఆకలి అనేది ఉందని గుర్తొచ్చినప్పుడు రాలిపడిన పండ్లు, పండుటాకులతో పొట్ట నింపుకున్నాడు. మంచుబిందువులు, వానచుక్కలతో గొంతు తడుపుకున్నాడు. దీక్ష మాత్రం మానలేదు. చివరికతని పట్టుదల చూసి దేవుడికి ముచ్చటేసి, దిగి వచ్చాడు. వరం కోరుకోమన్నాడు. నాకు ఎల్లప్పుడూ మనశ్శాంతి ఉండేలా వరం ప్రసాదించమన్నాడు. సరేనన్నాడు దేవుడు. కళ్లు తెరిచేటప్పటికి అంతర్ధానమయ్యాడు.

ఎవరికైనా కష్టమొచ్చినా, నష్టమొచ్చినా, వానలొచ్చినా, వరదలొచ్చినా సరే, ఇతనికి మనశ్శాంతి కరువయ్యేది. ఇతని కోరిక మేరకు దేవుడు వాటన్నింటినీ తీర్చేసేవాడు. ఎవరికైనా రోగాలొచ్చినా, ఎక్కడైనా పంటలు పండకపోయినా దేవుడికి యువకుడి నుంచి విజ్ఞప్తుల వరద ప్రవహించేది. చివరికి ఇతను కోరే వరాల మూలంగా లోకంలో పరిస్థితులు తారుమారయ్యాయి. పర్యావరణం దెబ్బతిన్నది. అష్టదిక్పాలకులు హాహాకారాలు చేశారు. యముడు తన సమస్యను దేవుడికి నివేదించాడు. దేవుడు ఓ ఉపాయం ఆలోచించాడు. పర్యవసానంగా యువకుడు దేవుడి దగ్గరకొచ్చాడు. అక్కడి వైభవాలు చూసి కొంతకాలం మనశ్శాంతిగానే ఉన్నాడు కానీ, ఈ సుఖం వల్ల కూడా నాకు మనశ్శాంతి లేకుండా పోయింది దేవుడా అని మొరపెట్టుకున్నాడు. కథ మళ్లీ మొదటికొచ్చింది.

– డి.వి.ఆర్.

ఆత్మదర్శిని

ఆలోచనాలోచనాలు



అహం నుంచి విడివడి స్వేచ్ఛ పొందడమే ముక్తి, మోక్షం, ఆత్మసాక్షాత్కారం. ఆ స్థితిలో నీవు ఆత్మగా ఉంటావు కానీ మనసుగా కాదు. సంపూర్ణ ఆనందంలో ఉంటావు. ఆలోచనలు నిన్ను అడ్డుకోలేవు. ఎందుకంటే ఆలోచనలకు స్వతహాగా శక్తి లేదు. నీవు వాటిని నమ్మిన క్షణమే వాటికి శక్తి వస్తుంది. ఈ ఆలోచన నాది అనుకోగానే దానికి శక్తి వస్తుంది. మనస్సు చంద్రుడైతే నీవు సూర్యునివన్నమాట. చంద్రుడు సూర్యుని మీద ఆధారపడినట్టు ఆలోచనలు నీ మీద ఆధారపడతాయి. అవి స్వతంత్రంగా ఉండలేవు. నీవు మనస్సును నమ్మకపోతే అది నిన్ను ఏమీ చేయలేదు. నీవు ఆలోచనలకు సాక్షిగా ఉన్నంతవరకు అవి వచ్చినా నీకు హాని చేయలేవు. నీ శక్తిని వాటికి ఇవ్వకు. వచ్చే ఆలోచనలన్నింటినీ గమనిస్తూ ఉండు. అవే క్రమంగా తగ్గిపోతాయి. నీవు సమభావనతో ఉండు, అప్పుడు నీ చుట్టూ చెడు జరిగినా అది నీకు అంటదు. చుట్టూ ఉన్న అలజడి, ఆ చూసేవాడిని ఏమీ చేయలేదు.

ఆలోచనలకు మనం నీడ ఇవ్వకూడదు. జీవితానికి సంబంధించిన విషయాల్లో కూరుకుపోకూడదు. అలాగని వాటిని వదిలేయకూడదు. అన్నింటిలోనూ పాల్గొంటూ వేటికీ అంటకుండా తామరాకుపై నీటి బొట్టులా ఉండాలి. ఒకసారి వశిష్ఠుడు రామునితో అంటాడు 'ఆకాశం నీలిరంగు ఎంత అసత్యమో ఈ ప్రపంచమంతా అంతే అసత్యం' అని. అప్పుడు రాముడు 'ప్రపంచం అసత్యమైనపుడు ఎందుకు జీవించాలి?' అని వశిష్ఠుని అడుగుతాడు. అందుకు వశిష్ఠుడు 'జీవించడం అనేది కూడా అసత్యం కాబట్టి జీవించు' అని రామునితో అంటాడు.



అలాగే మనం కూడా ఈ విషయ ప్రపంచంలో పాతుకుపోకూడదు. నీ నిజస్థితిలో నీవు ఉండాలి. నీ ఆత్మతో ఉండాలి. కానీ మనం శాంతిని, ఆనందాన్ని అవి లేనిచోట వెదుకుతున్నాం. నీ ఆత్మతత్వంలోనే అనంతశక్తి, అనంత జ్ఞానం ఉన్నాయి. ఆ స్థితిలో ఉన్నప్పుడు ఏ బాహ్యవిషయాలూ నిన్ను బాధపెట్టలేవు. మనస్సు మనల్ని చిన్న చిన్న విషయాలకు అంటుకునేలా చేసి ఒక పరిమితి గల వ్యక్తివి అనే భ్రమలోకి నిన్ను నెట్టేస్తుంది. అహం మీద ఆధారపడడం కన్నా ఆత్మలో ఉన్న దైవం మీద ఆధారపడడం మంచిది కదా!

– స్వామి మైత్రేయ, ఆధ్యాత్మిక బోధకులు

సాక్షి సినిమా

ఇన్ని ఫోన్ కాల్స్ నాకెప్పుడూ రాలేదు!

– సత్యదేవ్



''గౌతమ్ 'కింగ్‌డమ్' కథ చెప్పగానే ఎలాంటి లెక్కలు వేసుకోకుండా వెంటనే ఓకే చెప్పాను. ఈ కథ నాకు అంత నచ్చింది. కథ మీద నాకున్న నమ్మకం నిజమైంది. సినిమాకి ఇంత ఆదరణ లభిస్తుండటం సంతోషంగా ఉంది'' అని నటుడు సత్యదేవ్ చెప్పారు. విజయ్ దేవరకొండ, భాగ్యశ్రీ బోర్సే జోడీగా నటించిన చిత్రం 'కింగ్‌డమ్'. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా జూలై 31న విడుదలైంది. ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ సోదరుడిగా శివ పాత్రలో నటించిన సత్యదేవ్ ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ– ''నేను హీరోగా నటించిన 'బ్లఫ్ మాస్టర్' సినిమాకి నాకు పేరొచ్చింది. కానీ, అది జనాల్లోకి వెళ్లడానికి సమయం తీసుకుంది. భారీతనం, విజయ్ ఫ్యాన్ ఫాలోయింగ్ వంటి అంశాలతో 'కింగ్‌డమ్' సినిమా తక్కువ సమయంలోనే ఎక్కువమందికి చేరువైంది. ఇప్పటిదాకా ఈ సినిమాకి వచ్చినన్ని ఫోన్ కాల్స్ నాకెప్పుడూ రాలేదు. మొదటి షో నుంచి అందరూ ఫోన్లు చేసి, శివ పాత్ర బాగుందని అభినందించడం చాలా సంతోషంగా ఉంది. ఈ సినిమాకి వచ్చినంత పేరు నాకు ఎప్పుడూ రాలేదు. బలమైన ఎమోషన్ ఉంటే యాక్షన్ సీన్ ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుంది. ఈ చిత్రంలో మంచి భావోద్వేగాలుండటం వల్లే యాక్షన్ సీన్స్‌కి అంత మంచి స్పందన వస్తోంది. ఈ చిత్రంలో ఫిజికల్‌గా నాకు సవాల్ అనిపించిన సీన్ మాత్రం ప్రీ క్లయిమాక్స్ ఎపిసోడ్. ప్రేక్షకుల స్పందన చూశాక ఆ కష్టమంతా మరిచిపోయాను. బాగా ప్రాక్టీస్ చేసిన తర్వాతే బోట్‌ని నడిపాను. ఈ సినిమాలో విజయ్‌కి, నాకు ఎంత పేరు వచ్చిందో విలన్ పాత్ర చేసిన వెంకటేశ్‌కీ అంత పేరు వచ్చింది. విజయ్ గొప్ప నటుడు... తను నటించే తీరు నన్ను ఆశ్చర్యపరిచింది. నాగవంశీగారు ధైర్యం ఉన్న ప్రొడ్యూసర్. ప్రస్తుతం నేను నటించిన 'అరేబియన్ కడలి' వెబ్ సిరీస్ అమెజాన్ ప్రైమ్‌లో ఈ నెల 8 నుంచి స్ట్రీమింగ్ కానుంది. నేను హీరోగా నటించిన 'ఫుల్ బాటిల్' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. అలాగే వెంకటేశ్ మహా దర్శకత్వంలో ఓ సినిమా, 'ఆరంభం' ఫేమ్ అజయ్ నాగ్‌తో ఓ చిత్రం చేస్తున్నాను. వీటితో పాటు మరో రెండు చిత్రాలున్నాయి'' అని తెలిపారు.

గమ్యం ఎటు వైపు!



● శ్రీరామ్

శ్రీరామ్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'మాత్రు'. జాన్ జిక్కి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సుగీ విజయ్, రూపాలీ భూషణ్ జంటగా నటించారు. బూర్లె శివప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 8న విడుదల కానుంది. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ – ''ఓ వినూత్న కథాంశంతో రూపొందించిన ఈ సైంటిఫిక్ థ్రిల్లర్ మూవీ ప్రేక్షకులకు కొత్త అనుభూతినిస్తుంది. శేఖర్ చంద్ర మ్యూజిక్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. వీలైనన్ని ఎక్కువ థియేటర్స్‌లో గ్రాండ్‌గా విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు.

మహావతార్ నరసింహ రిలీజ్ చేయడం నా అదృష్టం

– అల్లు అరవింద్



● అల్లు అరవింద్, శిల్పా ధవాన్, అశ్విన్ కుమార్

''హోంబలే ఫిలింస్ సంస్థ విజయ్‌గారు ఫోన్ చేసి, 'మహావతార్ నరసింహ' సినిమాని తెలుగులో విడుదల చేయాలని కోరగా, వెంటనే ఓకే అన్నాను. విడుదలైన రోజు నుంచి అద్భుతమైన స్పందన రావడంతో మరిన్ని స్క్రీన్స్ పెంచుకుంటూ వెళుతున్నాం. ఈ సినిమాని విడుదల చేసేలా నరసింహ స్వామి అనుగ్రహించడం నా అదృష్టం'' అని అల్లు అరవింద్ తెలిపారు. అశ్విన్ కుమార్ దర్శకత్వంలో హోంబలే ఫిల్మ్స్ సమర్పణలో శిల్పా ధవాన్, కుశల్ దేశాయ్, చైతన్య దేశాయ్ నిర్మించిన చిత్రం 'మహావతార్ నరసింహ'. ఈ సినిమా జూలై 25న విడుదలైంది. తెలుగులో గీత ఫిల్మ్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా రిలీజైంది. హైదరాబాద్‌లో నిర్వహించిన సక్సెస్ మీట్‌లో అల్లు అరవింద్ మాట్లాడుతూ– ''ఎప్పుడూ థియేటర్స్‌కి రాని ప్రేక్షకులు ఈ సినిమాని వీక్షిస్తున్నారు'' అన్నారు. ''ప్రస్తుత సమాజానికి ఏం కావాలో అది ఈ చిత్రంలో ఉంది. కుటుంబంతో కలిసి వెళ్లి ఈ సినిమాని చూడండి'' అని పేర్కొన్నారు జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు. ''ఈ చిత్రాన్ని నా కుటుంబంతో కలిసి చూశాను. సినిమా మొదలైన మూడో నిమిషం నుంచే మేము ఒక గుడిలో ఉన్నామనే భావన కలిగింది'' అని తెలిపారు తనికెళ్ల భరణి. ''మా సినిమాకు వచ్చిన ప్రతి ప్రశంస నరసింహ స్వామికే చెందుతుంది'' అన్నారు అశ్విన్ కుమార్. ''ఇది యావత్ భారత్ సినిమా. ఈ చిత్రం నిర్మించడం నరసింహ స్వామి కృపగా భావిస్తున్నాం'' అని శిల్పా ధవాన్ చెప్పారు.

నేటి నుంచి షూటింగ్స్ బంద్

తెలుగు చిత్ర పరిశ్రమలో పని చేస్తున్న కార్మికుల వేతనాలు 30 శాతం పెంచాలంటూ 'తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్' నాయకులు డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. వేతనాల పెంపు కో– ఆర్డినేషన్ కమిటీ చైర్మన్‌లుగా వీరశంకర్, సయ్యద్ హుమాయూన్ లను నియమించారు. వేతనాల పెంపు విషయంపై ఆదివారం ఫిల్మ్ ఫెడరేషన్ – ఫిల్మ్ ఛాంబర్ మధ్య జరిగిన చర్చలు విఫలం అయ్యాయి. దీంతో నేటి నుంచి టాలీవుడ్‌లో షూటింగ్స్ బంద్ చేస్తున్నట్లు 'తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్' పేర్కొంది. ఈ మేరకు అధ్యక్షుడు అనిల్ కుమార్ వల్లభనేని, ప్రధాన కార్యదర్శి అమ్మిరాజు కానుమిల్లి, కోశాధికారి టీవీ అలెగ్జాండర్ (అలెక్స్) ఓ లేఖను విడుదల చేశారు. ''నేటి నుంచి 30 శాతం వేతనం పెంచి ఇస్తామంటూ లేఖ ఇవ్వాలి. ఆ లేఖని ఫెడరేషన్ ద్వారా యూనియన్‌లకు అందజేసిన తర్వాతే చిత్రీకరణలకు హాజరవుతాం. అప్పటి వరకూ సినిమాలు, వెబ్ సిరీస్ షూటింగ్స్‌కి కార్మికులు ఎవరూ హాజరు కాకూడదు. ఈ రూల్స్ తెలుగు సినిమా షూటింగ్స్ ఎక్కడ జరిగినా వర్తిస్తాయి'' అని ఆ లేఖలో పేర్కొన్నారు.

మనమంతా ఐక్యతతో ఉండాలి: ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్

'తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్' తీసుకున్న షూటింగ్స్ బంద్ నిర్ణయంపై 'తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్' ఓ ప్రకటన విడుదల చేసింది. ఆ లేఖ సారాంశం ఏంటంటే... 'ప్రియమైన నిర్మాతలకు.. 'తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్' పక్షపాతంగా 30శాతం వేతనాల పెంపును డిమాండ్ చేస్తోంది. ప్రస్తుత చట్టాల ప్రకారం నైపుణ్యం ఉన్నవారికి, లేని వర్కర్లకు మనం ఇప్పటికే కనీస వేతనాల కంటే ఎంతో ఎక్కువ చెల్లిస్తున్నాం. ఈ అంతరాయం నిర్మాణంలో ఉన్న చిత్రాలకు నష్టాన్ని కలిగిస్తుంది. చాలా దశాబ్దాలుగా ఫెడరేషన్ సభ్యులతో కలిసి పనిచేస్తున్న మనం ఈ నిర్ణయాన్ని ఖండిస్తున్నాం. ఈ సమస్యకు స్థిరమైన పరిష్కారం సాధించేందుకు సంబంధిత అధికారులతో ఛాంబర్ చర్చలు జరుపుతుంది. ఈ విషయంలో నిర్మాతలు ఎలాంటి స్వతంత్ర చర్చలు లేక సంఘాలతో ప్రత్యేక ఒప్పందాలు చేసుకోకుండా, ఛాంబర్ జారీ చేసే మార్గనిర్దేశకాలను కచ్చితంగా అనుసరించాలని తెలియజేస్తున్నాం. శాశ్వత పరిష్కారం కోసం, మెరుగైన భవిష్యత్ కోసం మనమంతా ఐక్యతతో ఉండాలి. పూర్తి వివరాలు త్వరలో తెలియజేస్తాం' అంటూ 'తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్' గౌరవ కార్యదర్శి కేఎల్ దామోదర్ ప్రసాద్ పేరుతో ఆ లేఖ విడుదలైంది.

తండ్రిగా చాలా గర్వపడుతున్నాను

– సుకుమార్



● సుకృతి, సుకుమార్

''ఇది ప్రారంభం మాత్రమే. నీ కోసం (సుకృతి) ఇంకా ఎన్నో కలలు వేచి ఉన్నాయి. నేను ఎప్పుడూ నీ పక్కనే ఉండి, నిన్ను ఉత్సాహపరుస్తూ, ప్రోత్సహిస్తుంటాను. ఇవాళ్టి నీ చిరునవ్వు నాకు ఎప్పటికీ గుర్తుండిపోయే అవార్డు'' అంటూ కుమార్తె సుకృతీ వేణిని ఉద్దేశించి దర్శకుడు సుకుమార్ ఓ ఎమోషనల్ పోస్టుని ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఇటీవల ప్రకటించిన 71వ జాతీయ చలన చిత్ర అవార్డుల్లో ఉత్తమ బాల నటి అవార్డుకి 'గాంధీ తాత చెట్టు' చిత్రానికి గాను సుకృతి వేణి ఎంపికైన విషయం తెలిసిందే. పద్మావతి మల్లాది దర్శకత్వంలో తబితా సుకుమార్ సమర్పణలో నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్, శేష సింధూరావు నిర్మించిన ఈ సినిమా జనవరి 24న విడుదలైంది. ఇక కూతురికి జాతీయ అవార్డు దక్కిన సందర్భంగా సుకుమార్ షేర్ చేసిన పోస్టులో... ''నువ్వు ఉత్తమ బాలనటిగా జాతీయ అవార్డుకి ఎంపికయ్యావని విన్నప్పుడు నాకు నోట మాట రాలేదు. నా ప్రయాణంలో కొన్ని అవార్డులు దక్కడం నా అదృష్టం. కానీ ఈ అవార్డు నా హృదయాన్ని తాకింది. 'గాంధీ తాత చెట్టు' సినిమాలో నా సొంత కూతురిని చూస్తున్నాననే విషయం మర్చిపోయాను. నువ్వు ఆ పాత్రలోని అమ్మాయిలా మారిపోయావు. నీ తండ్రిగా నేను గర్వపడుతున్నాను'' అని పేర్కొన్నారు.

ఈసారీ గ్రాండ్‌గా...



● సురేష్, మురళీమోహన్, కేఎస్ రామారావు

'సంతోషం సౌత్ ఇండియన్ ఫిలిం అవార్డ్స్, సంతోషం ఓటీటీ అవార్డ్స్ 2025' కార్యక్రమాన్ని ఈ నెల 16న హైదరాబాద్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్‌లో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఈ వేడుక డేట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మురళీమోహన్, కేఎస్ రామారావు మాట్లాడుతూ– ''తెలంగాణలో పదేళ్ల తర్వాత గద్దర్ అవార్డ్స్ ఇచ్చారు. ఏపీలో త్వరలో ఫిలిం అవార్డ్స్ ఇవ్వబోతున్నారు. ఈ సంతోషం అవార్డ్స్‌ని ఘనంగా చేయడానికి సపోర్ట్ చేస్తాం'' అని చెప్పారు. ''ఇప్పటివరకూ సంతోషం అవార్డ్స్ ఈవెంట్‌ని గ్రాండ్‌గా చేశాం. అందరి సపోర్ట్‌తో ఈ 24వ అవార్డు ఈవెంట్‌ని కూడా ఘనంగా చేయబోతున్నాం'' అన్నారు సంతోషం మేగజీన్ అధినేత, నిర్మాత సురేష్ కొండేటి.

ఓటీటీ ఇది చూడొచ్చు

ద్వేషం రంగు నలుపు

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో తమిళ చిత్రం మార్గన్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



సాధారణంగా నిజ జీవితంలో మనుష ల్లోని అసలైన భావోద్వేగాలు గుర్తించడం కష్టం, కానీ అదే వెండి తెరపై అయితే మాత్రం సినిమాలోని పాత్రధారులు కృత్రిమంగా అయినా సరే స్పష్టంగా తమ భావావేశాలను ప్రకటిస్తారు. వారిని చూసే ప్రేక్షకులు మళ్ళీ అసలు సిసలైన ఎమోషన్స్‌కి గురవుతారు. ఇదంతా ఒక సైకిల్ లాంటిది. నవరసాలతో నిండినదే జీవితం. తమకు నచ్చని వారి క్షేమం కోరుకోకపోవడం అనేది వారి వారి వ్యక్తిత్వాన్ని బట్టి ఉంటుంది. ఈ నేపథ్యంలో అల్లుకున్న కథే 'మార్గన్'. ఇది ఓ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్. ఈ సినిమాని పిల్లలు, వృద్ధులు అస్సలు చూడకూడదు. సస్పెన్స్ థ్రిల్లర్స్‌ని ఇష్టపడే వాళ్ళకి ఇదో సూపర్ సినిమా. విలక్షణ కథలతో అలరించే తమిళ నటుడు విజయ్ ఆంటోని నిర్మించి, హీరోగా నటించిన ఈ సినిమాకి లియో జాన్ పాల్ దర్శక–రచయిత. వాస్తవ ఘటనలను పోలి ఉన్న ఈ సినిమా కథ రమ్య హత్యతో ప్రారంభమవుతుంది. ఎవరో ఆవిడ మెడ మీద సిరంజితో గుచ్చగా శరీరమంతా నల్లగా మారి చనిపోతుంది. ఇంతకు ముందు ఇదే తరహా ఘటనలో బాధితుడైన ముంబై డీజీపీ ధృవ్ స్పెషల్‌గా రమ్య కేసు టేకప్ చేస్తాడు. ఆ తరువాత నగరంలో మరో మూడు హత్యలు ఇదే పంథాలో జరుగుతుండడంతో ధృవ్ తన ఇన్వెస్టిగేషన్ వేగం పెంచుతాడు. తన విచారణలో తమిళరివు అనే డ్రగ్ స్మగ్లర్‌ని అనుమానితుడిగా అరెస్ట్ చేసినా తరువాత అతను ఆ హత్య చేయలేదన్న విషయం తెలుస్తుంది. కానీ ఈ హత్యకు, అతనికి కనెక్షనైతే ఉంది అని తెలుస్తాడు ధృవ్. ఇక ఆఖర్లో ఈ హత్యల వెనకున్న నిందితుడిని ధృవ్ ఎలా పట్టుకున్నాడనేది మాత్రం 'మార్గన్' సినిమాలోనే చూడాలి. ఎన్నో ట్విస్ట్‌లతో ఊహకందని క్లైమాక్స్‌తో ఈ సినిమా ప్రేక్షకుడిని కట్టి పడేస్తుంది. ఈ తమిళ చిత్రం తెలుగు డబ్బింగ్ వెర్షన్ కూడా లభ్యమవుతోంది. విజయ్ ఆంటోని తనదైన శైలిలో ధృవ్ పాత్రకి ప్రాణం పోశారు. ఆ తరువాత చెప్పుకోవాల్సింది తమిళరివు పాత్రధారి అయిన అజయ్ దిశాన్. ఇతను ఆ పాత్రలో నటించాడనే కన్నా జీవించాడని చెప్పవచ్చు. ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమ్ అవుతున్న ఈ చిత్రం వర్త్‌బుల్ వాచ్ ఓన్లీ ఫర్ అడల్ట్స్.

– హరికృష్ణ ఇంటూరు



అనిరుధ్-రామ్‌కుమార్ జోడీకి టైటిల్

లెక్సింగ్టన్: భారత టెన్నిస్ ప్లేయర్, హైదరాబాద్‌కు చెందిన అనిరుధ్ చంద్రశేఖర్ ఈ ఏడాది మూడో ఏటీపీ చాలెంజర్ డబుల్స్ టైటిల్‌ను సాధించాడు. అమెరికాలోని కెంటకీ రాష్ట్రంలో జరిగిన లెక్సింగ్టన్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్-75 టోర్నీలో భారత్‌కే చెందిన రామ్‌కుమార్ రామనాథన్‌తో కలిసి అనిరుధ్ టైటిల్‌ను దక్కించుకున్నాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో అనిరుధ్-రామ్‌కుమార్ ద్వయం 6-4, 6-4తో యు సియో సు-సుంగ్ హావో హువాంగ్ (చైనీస్ తైపీ) జంటపై విజయం సాధించింది. 68 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో భారత ద్వయం ఐదు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తమ సర్వీస్‌ను ఒక్కసారి కూడా కోల్పోని అనిరుధ్-రామ్ ప్రత్యర్థుల సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశారు. విజేతగా నిలిచిన అనిరుధ్-రామ్‌లకు 4,980 డాలర్ల (రూ. 4 లక్షల 34 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 75 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. 27 ఏళ్ల అనిరుధ్ ఈ ఏడాది మార్చిలో డేవిడ్ వేగా హెర్నాండెజ్ (స్పెయిన్)తో కలిసి జిరోనా ఓపెన్ ఏటీపీ చాలెంజర్-100 టోర్నీలో... రే హో (చైనీస్ తైపీ)తో కలిసి ఫిబ్రవరిలో బెంగళూరు ఓపెన్ ఏటీపీ చాలెంజర్-125 టోర్నీలో డబుల్స్ టైటిల్ గెలిచాడు.

పురుషుల డబుల్స్ రన్నరప్ మనుశ్-మానవ్ ద్వయం

'మిక్స్‌డ్' ఫైనల్లోనూ పరాజయం



రియో డి జనీరో: వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) ఫోజ్ డు ఇగుఆకు కంటెండర్ టోర్నమెంట్ పురుషుల డబుల్స్ విభాగంలో మనుశ్ షా-మానవ్ ఠక్కర్ (భారత్) జోడీ రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో మనుశ్-మానవ్ ద్వయం 3-11, 11-7, 7-11, 15-13, 5-11తో బెనెడిక్ట్ డుడా-డాంగ్ కియు (జర్మనీ) జోడీ చేతిలో పోరాడి ఓడిపోయింది. 42 నిమిషాలపాటు జరిగిన ఈ తుది పోరులో మనుశ్-మానవ్ తమ సొంత సర్వీస్‌లో 20 పాయింట్లు, ప్రత్యర్థి సర్వీస్‌లో 21 పాయింట్లు గెలిచారు. రన్నరప్‌గా నిలిచిన మనుశ్-మానవ్‌లకు 3,567 డాలర్ల (రూ. 3 లక్షల 11 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 420 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. మరోవైపు మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలోనూ మనుశ్ షా-దియా చిటాలె (భారత్) జోడీ రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకుంది. ఫైనల్లో మనుశ్-దియా జంట 4-11, 11-8, 11-5, 5-11, 2-11తో సతోషి ఐడా-హొనోకా హషిమోటో (జపాన్) ద్వయం చేతిలో ఓటమి పాలైంది. మనుశ్-దియా చిటాలెలకు 3,567 డాలర్ల (రూ. 3 లక్షల 11 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 420 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. మహిళల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ మనిక బత్రా పోరాటం క్వార్టర్ ఫైనల్లో ముగిసింది. క్వార్టర్ ఫైనల్లో మనిక 7-11, 6-11, 7-11తో హొనోకా హషిమోటో (జపాన్) చేతిలో పరాజయం పాలైంది. క్వార్టర్ ఫైనల్లో ఓడిన మనిక బత్రాకు 2,250 డాలర్ల (రూ. 1 లక్ష 96 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 105 ర్యాంకింగ్ పాయింట్లు దక్కాయి.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

ఇంకా ఉంది!

వానతో ఐదో టెస్టు ఫలితం నేటికి వాయిదా

ఆఖరి టెస్టుకు, ఐదు మ్యాచ్‌ల సిరీస్‌కు నాలుగో రోజే తెరపడాలి. కానీ వెలుతురు మందగించడంతో ఆగిన ఆట... తర్వాత జోరు వాన కురవడంతో ఎంతకీ కొనసాగలేదు. నాటకీయ ముగింపునకు తెరలేచిన ఈ పోరు తుది ఫలితం నేటికి వాయిదా పడింది. ఆతిథ్య ఇంగ్లండ్ 3-1 ఆధిక్యంతో సిరీస్ గెలుచుకునేందుకు మరో 35 పరుగుల దూరంతో దగ్గరైంది. అలాగే భారత్ కూడా 2-2తో సమం చేసేందుకు అంతే దగ్గరగా ఉంది. ప్రధాన బ్యాటర్లంతా అవుట్‌కాగా 35 పరుగులు చేసేలోపు 4 వికెట్లు తీస్తే టీమిండియా సమం చేసుకొని సగర్వంగా తిరిగొస్తుంది.

- నాటకీయ ముగింపునకు రంగం సిద్ధం
- సిరీస్ విజయానికి ఇంగ్లండ్ 35 పరుగులు చేయాలి
- సిరీస్ సమం చేసేందుకు భారత్ 4 వికెట్లు తీయాలి
- 'శత'క్కొట్టిన బ్రూక్, రూట్

లండన్: నాటకీయత మొదలవగానే... ఉత్కంఠ అంతకంతకు పెరగకముందే... ప్రతికూల వాతావరణం ఆటకు 'రెడ్ సిగ్నల్' ఇవ్వడంతో 'టెండూల్కర్-అండర్సన్ ట్రోఫీ' సిరీస్ ఫలితం నాలుగో రోజు తేలలేదు. ఇన్నాళ్లు జరిగిన నాలుగు టెస్టుల అసలు మజా కంటే చివరి ఐదో టెస్టు 'కొసరే' ఇరు జట్లను ఊరిస్తోంది. ఇంగ్లండ్ 374 పరుగులు ఛేదన కాస్తా 35 పరుగుల దూరంలో నిలిచింది. వర్షంతో ఆట నిలిచే సమయానికి ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 76.2 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 339 పరుగులు చేసింది. హ్యారీ బ్రూక్ (98 బంతుల్లో 111; 14 ఫోర్లు, 2 సిక్స్‌లు), జో రూట్ (152 బంతుల్లో 105; 12 ఫోర్లు) శతక్కొట్టారు. జేమీ స్మిత్ (2 బ్యాటింగ్), ఓవర్టన్ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. భారత బౌలర్లలో ప్రసిధ్ కృష్ణ 3, సిరాజ్ 2 వికెట్లు తీశారు. ఆకాశ్‌దీప్‌కు ఒక వికెట్ దక్కింది.

'టాప్' లేపడంతో ఉత్సాహం

తొలి సెషన్ భారత శిబిరంలో ఉత్సాహం నింపింది. లక్ష్యఛేదన జట్టులోని ఇద్దరు టాపార్డర్ బ్యాటర్లు పెవిలియన్ చేరారు. ఓవర్‌నైట్ స్కోరు 50/1తో నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన డకెట్ (54, 6 ఫోర్లు), కెప్టెన్ ఒలీ పోప్ (34 బంతుల్లో 27; 5 ఫోర్లు) నిలకడను ప్రదర్శించారు. ఓవర్‌నైట్ బ్యాటర్ డకెట్ 76 బంతుల్లో తన అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న కాసేపటికే ప్రసిధ్ కృష్ణ బౌలింగ్‌లో స్లిప్‌లో ఉన్న రాహుల్‌కు క్యాచ్ ఇచ్చి నిష్క్రమించాడు. మళ్లీ ఐదు ఓవర్ల లోపలే సిరాజ్ చక్కని డెలివరీతో కెప్టెన్ పోప్‌ను ఎల్బీగా అవుట్ చేశాడు. అప్పటికి ఇంగ్లండ్ 106/3 స్కోరే చేసింది. తర్వాత రూట్, బ్రూక్ పరుగుల బాధ్యతను తమ భుజాలపై వేసుకున్నారు. తొలి సెషన్‌లోనే బ్రూక్ అవుటయ్యే ప్రమాదం నుంచి బయటపడి భారత బౌలర్లకు మింగుడుపడని ఇన్నింగ్స్‌కు శ్రీకారం చుట్టేశాడు. ఇంగ్లండ్ 164/3 వద్ద లంచ్ బ్రేక్‌కు వెళ్లింది.

బ్రూక్, రూట్ శతకాలు

నాలుగో ఇన్నింగ్స్‌లో తొలి సెషన్‌లోనే రెండు కీలక వికెట్లు పడిపోవడం బౌలింగ్ జట్టు ఆత్మవిశ్వాసాన్ని అమాంతం పెంచుతుంది. అయితే క్రీజులో పాతుకుపోయిన రూట్‌తో అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న బ్రూక్ సాఫీగా పరుగులు సాధిస్తుండటంతో భారత శిబిరంలోని ఆత్మవిశ్వాసం కాస్తా సన్నగిల్లింది. ఇదే అదనుగా ఇద్దరు లక్ష్యాన్ని కరిగించే పనినిలో ముందడుగు వేశారు. ఈ సెషన్ భారత్ ఆశల్ని చిదిమింది. వన్డేను తలపించే ఆటతీరుతో బ్రూక్ 91 బంతుల్లోనే శతకం సాధించాడు. అతను నిష్క్రమించాక... ఆఖరి సెషన్‌లో రూట్ 137 బంతుల్లో సెంచరీ చేశాడు. లక్ష్యానికి చేరువైన దశలో బెథెల్ (5), రూట్ అవుటవడంతోనే డ్రామా మొదలైంది.







స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 224; **ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్:** 247; **భారత్ రెండో ఇన్నింగ్స్:** 396; **ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్:** క్రాలీ (బి) సిరాజ్ 14; డకెట్ (సి) రాహుల్ (బి) ప్రసిధ్‌కృష్ణ 54; పోప్ (ఎల్బీడబ్ల్యూ) (బి) సిరాజ్ 27; రూట్ (సి) జురేల్ (బి) ప్రసిధ్ 105; బ్రూక్ (సి) సిరాజ్ (బి) ఆకాశ్‌దీప్ 111; బెథెల్ (బి) ప్రసిధ్‌కృష్ణ 5; స్మిత్ బ్యాటింగ్ 2; ఓవర్టన్ బ్యాటింగ్ 0; ఎక్స్‌ట్రాలు 21; **మొత్తం (76.2 ఓవర్లలో 6 వికెట్లకు) 339. వికెట్ల పతనం:** 1-50, 2-82, 3-106, 4-301, 5-332, 6-337. **బౌలింగ్:** ఆకాశ్‌దీప్ 20-4-85-1, ప్రసిధ్‌కృష్ణ 22.2-3-109-3, సిరాజ్ 26-5-95-2, సుందర్ 4-0-19-0, జడేజా 4-0-22-0.

క్యాచ్ పట్టి... బౌండరీ లైన్ తొక్కి!



బ్రూక్ 19 పరుగుల వద్దే అవుటవ్వాలి. కానీ సిరాజ్ పొరపాటు ఇంగ్లండ్ శిబిరానికి బాగా కలిసొచ్చింది. 35వ ఓవర్ వేసిన ప్రసిధ్ కృష్ణ తొలి బంతికి బ్రూక్ భారీ షాట్‌కు ప్రయత్నించగా... ఫైన్ లెగ్‌లో ఉన్న సిరాజ్ చక్కగా క్యాచ్‌ను ఒడిసిపట్టాడు. కానీ బంతి పట్టిన తర్వాత కుడికాలు కదిపి బౌండరీ లైన్ తొక్కేశాడు. దీంతో అది అనూహ్యంగా సిక్సర్ అయ్యింది. క్యాచ్ పట్టడంతోనే బౌలర్ ప్రసిధ్ సంబరం మొదలుపెడితే... సిక్సర్ కావడంతో బ్రూక్ పండగ చేసుకున్నాడు. అప్పటికి జట్టు స్కోరు 137/3 మాత్రమే! ఇంగ్లండ్ ఇంకా లక్ష్యానికి 237 పరుగుల బహుదూరంలో ఉంది. ఇక్కడ బ్రూక్ ఒకవేళ నిష్క్రమించి ఉంటే... నాలుగో వికెట్ పడేది. ఇప్పటికే వోక్స్ అందుబాటులో లేకపోవడంతో చేతిలో ఉన్న 5 వికెట్లతో ఇంగ్లండ్ లక్ష్యఛేదన క్లిష్టమయ్యేది! అయితే ఇంగ్లండ్ విజయానికి చేరువకావడంతో అవసరం పడితే ఈరోజు వోక్స్ క్రీజులోకి దిగే అవకాశం ఉంది.

4 టెస్టుల్లో అత్యధిక సెంచరీలు చేసిన క్రికెటర్ల జాబితాలో జో రూట్ (39 సెంచరీలు) నాలుగో స్థానానికి చేరుకున్నాడు. టాప్-3లో వరుసగా సచిన్ టెండూల్కర్ (51), కలిస్ (45), రికీ పాంటింగ్ (41) ఉన్నారు.

21 ప్రస్తుత భారత్, ఇంగ్లండ్ సిరీస్‌లో నమోదైన సెంచరీల సంఖ్య. 1955లో వెస్టిండీస్-ఆస్ట్రేలియా మధ్య సిరీస్‌లోనూ అత్యధికంగా 21 సెంచరీలు నమోదయ్యాయి.

13 భారత జట్టుపై రూట్ చేసిన సెంచరీలు. ఒకే జట్టుపై అత్యధిక సెంచరీలు చేసిన క్రికెటర్ల జాబితాలో రెండో స్థానంలో ఉన్న సునీల్ గావస్కర్ (వెస్టిండీస్‌పై 13 సెంచరీలు) సరసన రూట్ చేరాడు. ఆస్ట్రేలియా దిగ్గజం డాన్ బ్రాడ్‌మన్ (19 సెంచరీలు; ఇంగ్లండ్‌పై) ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్నాడు.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం-జాగ్రఫీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జనరల్ స్టడీస్-బయాలజీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- జనరల్ ఇంగ్లిష్

ఐఐఎంల్లో ప్రవేశాలకు క్యాట్

- 21 ఐఐఎంల్లో పీజీ ప్రవేశాలకు క్యాట్ స్కోర్ కీలకం
- నవంబర్ 30న మూడు సెషన్స్‌లో సీబీటీ విధానంలో పరీక్ష
- తదుపరి దశలో జీడీ, ఇంటర్వ్యూ, రిటెన్ ఎబిలిటీ టెస్ట్

దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు.. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)ల్లో ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష క్యాట్ (కామన్ అడ్మిషన్ టెస్ట్).వచ్చే విద్యాసంవత్సరంలో ఐఐఎంల్లో మేనేజ్‌మెంట్ పీజీ ప్రోగ్రామ్స్‌తోపాటు ఫెలో/డాక్టరేట్ ప్రోగ్రామ్‌ల్లో ప్రవేశాలకు క్యాట్ 2025 నోటిఫికేషన్ విడుదలైంది. క్యాట్ స్కోర్‌ను పలు ఇతర ప్రముఖ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్స్ సైతం తమ ప్రవేశాల్లో పరిగణనలోకి తీసుకుంటున్నాయి. ఆగస్టు 1వ తేదీ నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. క్యాట్ 2025 సమాచారం, ఐఐఎంల ఎంపిక ప్రక్రియ, దరఖాస్తుకు అర్హతలు, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు తదితర వివరాలు..

క్యాట్ 2025 స్కోర్‌తో దేశవ్యాప్తంగా ఉన్న 21 ఐఐఎంల్లో మేనేజ్‌మెంట్ పీజీ కోర్సుల్లో ప్రవేశానికి పోటీ పడొచ్చు. ఈ పరీక్ష స్కోర్‌తో ఐఐఎంలతోపాటు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్, ఢిల్లీ యూనివర్సిటీ, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ వంటి అనేక ప్రముఖ విద్యాసంస్థల్లోనూ మేనేజ్‌మెంట్ పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందే అవకాశం ఉంది.

ఐఐఎంల్లో విభిన్న కోర్సులు

మేనేజ్‌మెంట్ విద్యను అందించడంలో అంతర్జాతీయంగా పేరున్న విద్యాసంస్థలు ఐఐఎంలు. ఇవి అందించే రెండేళ్ల పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్‌కు కార్పొరేట్ ప్రపంచంలో ఎంతో గుర్తింపు ఉంది. ఈ కోర్సును పూర్తిగా రెసిడెన్షియల్ విధానంలో అందిస్తున్నారు. దీంతోపాటు ద ఫెలో/డాక్టోరల్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్(ఎఫ్‌పీఎం)ల్లోనూ ప్రవేశం కల్పిస్తున్నారు. ఇది మేనేజ్‌మెంట్ విభాగంలో పూర్తిస్థాయి డాక్టోరల్ ప్రోగ్రామ్. ఇది పూర్తి చేసుకున్న వారికి పీహెచ్‌డీ పట్టా లభిస్తుంది. వీటితోపాటు వృత్తి నిపుణుల కోసం ఐఐఎంలు ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌లను సైతం అందిస్తున్నాయి.

పీజీ ప్రోగ్రామ్‌కు ఎంపిక ప్రక్రియ


ఐఐఎంలు అందించే రెండేళ్ల పీజీ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్‌కు ప్రతి ఏటా రెండు లక్షల మంది వరకూ పోటీ పడుతున్నారు. ఈ కోర్సుల్లో ప్రవేశానికి ఐఐఎంలు తొలుత క్యాట్ స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తాయి. తదుపరి దశలో పర్సనల్ ఇంటర్వ్యూ, గ్రూప్ డిస్కషన్, రైటింగ్ ఎబిలిటీ టెస్ట్(ఆర్‌ఏటీ) నిర్వహిస్తాయి. వీటిల్లో ప్రతిభతోపాటు అకడెమిక్ స్కోర్‌లను, పని అనుభవాన్ని, ప్రభుత్వ రిజర్వేషన్ విధానాన్ని పరిగణనలోకి తీసుకొని ప్రవేశం కల్పిస్తాయి.

అర్హతలు

క్యాట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ లేదా తత్సమాన కోర్సులో కనీసం 50 శాతం మార్కులు పొందాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు కనీసం 45 శాతం మార్కులు సాధించాలి. అర్హత కోర్సు ఫైనల్ ఇయర్ అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎలాంటి గరిష్ఠ వయోపరిమితి నిబంధన లేదు.

పరీక్ష విధానం

- క్యాట్ 2025 పరీక్షలో మూడు విభాగాలు ఉంటాయి. సెక్షన్1లో వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రెహెన్షన్, సెక్షన్ 2లో డేటా ఇంటర్ ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్, సెక్షన్3లో క్వాంటిటేటివ్ ఎబిలిటీ ఉంటాయి.
- వీటిల్లో మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు(ఎంసీక్యూస్), నాన్ మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు అడుగుతారు. అన్ని ప్రశ్నలకు సమాన మార్కులు ఉంటాయి. ప్రతి సరైన సమాధానానికి మూడు మార్కులు లభిస్తాయి. ఎంసీక్యూస్‌కు నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు. నాన్ ఎంసీక్యూలకు ఎలాంటి నెగిటివ్ మార్కులు ఉండవు.
- క్యాట్‌లో ప్రశ్నల సంఖ్య ప్రతి ఏటా మారుతూ ఉంటుంది. ఈ పరీక్షలో సెక్షన్ల వారీగా నిర్దేశిత వరుస క్రమంలో సమాధానాలు గుర్తించాలి. అభ్యర్థులందరికీ ఇదే వరుస క్రమం ఉంటుంది.
- క్యాట్ పరీక్షకు ప్రత్యేకంగా నిర్దేశిత సిలబస్ అంటూ ఏమీ లేదు. అయితే క్యాట్ అధికారిక వెబ్‌సైట్‌లోని మాక్ టెస్టును రాయడం ద్వారా పరీక్ష ప్యాట్రన్‌తోపాటు ప్రశ్నలు అడిగే తీరుపైనా అవగాహన పెంచుకోవచ్చు.



క్యాట్ 2025

ప్రిపరేషన్ ఇలా

- వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్ విభాగం కోసం ప్రతి రోజూ ఇంగ్లిష్ ప్యాసేజ్‌లను ప్రాక్టీస్ చేయాలి. దీంతోపాటు ఇంగ్లిష్ వొక్యాబులరీ, గ్రామర్‌పైనా అవగాహన పెంచుకోవాలి. ఇందుకోసం ప్రతి రోజు ప్రామాణిక దినపత్రికలను, మ్యాగజీన్‌లను చదవడం, విభిన్న సబ్జెక్టులపై వివిధ ఆంగ్ల దినపత్రిల్లో వచ్చే ఎడిటోరియల్‌ను చదవడం లాభిస్తుంది. ముఖ్యంగా గత క్యాట్ ప్రశ్న పత్రాలను ప్రాక్టీస్ చేయడం మేలు చేస్తుంది.
- డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్‌లో రాణించేందుకు గత ప్రశ్న పత్రాలు, మాక్ టెస్టులు, మోడల్ టెస్టులతో ప్రిపరేషన్ ప్రారంభించాలి. లాజికల్ రీజనింగ్ కోసం సీటింగ్ అరేంజ్‌మెంట్స్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, కోడింగ్- డికోడింగ్, పజిల్స్‌పై పట్టు పెంచుకోవాలి. అలాగే డేటా ఇంటర్‌ప్రిటేషన్ కోసం బార్ గ్రాఫ్‌లు, పై చార్టులు, లైన్ గ్రాఫ్‌లు, టేబుల్స్‌ను అవగాహన చేసుకోవడంతోపాటు సాధ్యమైనన్ని ప్రశ్నలు ప్రాక్టీస్ చేయాలి.
- క్వాంటిటేటివ్ ఎబిలిటీ సెక్షన్‌లో స్కోర్ కోసం అర్థిమెటిక్, అల్జీబ్రాపై పట్టు సాధించాలి. తొలుత స్కూల్ స్థాయి ఎన్‌సీఈఆర్‌టీ మ్యాథ్స్ బేసిక్స్‌పై అవగాహన తోపాటు మోడల్ కొశ్చన్స్ బాగా ప్రాక్టీస్ చేయాలి. తర్వాతి దశలో మాక్ టెస్టులు, మోడల్ పేపర్స్‌పై దృష్టిపెట్టాలి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం: 01.08.2025
- ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లకు చివరి తేది:13.09.2025
- క్యాట్ అడ్మిట్‌కార్డ్ డౌన్‌లోడ్ ప్రారంభం: నవంబర్ 05 నుంచి 20 వరకు
- క్యాట్ 2025 పరీక్ష తేది: 30.11.1015
- ఫలితాల వెల్లడి: 2026 జనవరి మొదటి వారం
- వెబ్‌సైట్: https://iimcat.ac.in

విద్య, ఉద్యోగ సమాచారం

ఏఎంసీ, విశాఖపట్నంలో 71 పోస్టులు

విశాఖపట్నంలోని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాలేజ్ (ఏఎంసీ).. ఒప్పంద-ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 71.
- **పోస్టుల వివరాలు:** రేడియేషన్ సేఫ్టీ ఆఫీసర్-01, మెడికల్ ఫిజిసిస్ట్-02, రేడియో థెరపీ టెక్నీషియన్-02, మౌల్డ్ రూమ్ టెక్నీషియన్-01, అనెస్తీషియా టెక్నీషియన్ -06, జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్-03, రిసెప్షనిస్ట్-01, జనరల్ డ్యూటీ అటెండెంట్-21, ఆఫీస్ సబార్డినేట్స్-04, టైపిస్ట్/డీఈవో/కంప్యూటర్ ఆపరేటర్-01, వార్డెన్స్(ఫిమేల్)-03, లైబ్రరీ అటెండెంట్-02, క్లాస్ రూమ్ అటెండెంట్-01, ప్రొస్థెటిక్-ఆర్థో టెక్నీషియన్-05, కుక్స్-04, అంబులెన్స్ డ్రైవర్స్-03, హాస్టల్ అటెండెంట్(ఫీమేల్)-03, సీ-ఆర్మ్ టెక్నీషియన్-01, ఈఈజీ టెక్నీషియన్-01, స్పీచ్ థెరపిస్ట్-02, ఓటీ టెక్నీషియన్-02, ఓటీ అసిస్టెంట్-02.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(బీఎస్సీ), డిప్లొమా, ఇంటర్, పదో తరగతి, పీజీ, ఎంఎస్/ఎండీ, పీజీడీఎంలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** పోస్టును అనుసరించి జనరల్, ఈడబ్ల్యూఎస్, బీసీ, ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులకు 42 ఏళ్ల నుంచి 52 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు రేడియేషన్ సేఫ్టీ ఆఫీసర్, మెడికల్ ఫిజిసిస్ట్‌కు రూ.61,960, టెక్నీషియన్ పోస్టులకు రూ.32,670, జూనియర్ అసిస్టెంట్, రిసెప్షనిస్ట్, టైపిస్ట్/డీఈవో/కంప్యూటర్ ఆపరేటర్, వార్డెన్స్‌కు రూ.18,500, జనరల్ డ్యూటీ అటెండెంట్, ఆఫీస్ సబార్డినేట్స్, లైబ్రరీ అటెండెంట్,క్లాస్ రూమ్ అటెండెంట్‌కు రూ.15,000, ప్రొస్థెటిక్-ఆర్థో టెక్నీషియన్స్‌కు రూ.21,500.
- **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును అడిషనల్ డీఎంఈ/ప్రిన్సిపల్, ప్రభుత్వ మెడికల్ కళాశాల, పుట్లంపల్లి, కడప, వైఎస్సార్ కడప జిల్లా చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 03.08.2025.
- **వెబ్‌సైట్:** http://amc.edu.in

డీఐసీ, న్యూఢిల్లీలో 10 పోస్టులు



న్యూఢిల్లీలోని డిజిటల్ ఇండియా కార్పొరేషన్(డీఐసీ)..ఒప్పంద ప్రాతిపదికన పీహెచ్‌పీ లారావెల్ డెవలపర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 10.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(కంప్యూటర్ సైన్స్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 55 ఏళ్లు ఉండాలి.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.08.2025.
- **వెబ్‌సైట్:** https://dic.gov.in

నిమ్స్ హైదరాబాద్‌లో 41 టెక్నీషియన్ పోస్టులు

హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్).. ఒప్పంద ప్రాతిపదికన టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 41.
- **పోస్టుల వివరాలు:** అనెస్తీషియాలజీ-07, బయోకెమిస్ట్రీ-05, మైక్రోబయాలజీ-04, కార్డియాలజీ-06, నెఫ్రాలజీ-04, పల్మనాలజీ-05, పాథాలజీ-02, ఈఎండీ-01, వాస్కులర్ సర్జరీ-01, బీఎంఈ-01, న్యూక్లియర్ మెడిసిన్-03, న్యూరోసర్జరీ(ఐవోఎన్ఎం)-01, మెడికల్ జెనెటిక్స్-01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత టెక్నాలజీ కోర్సుల్లో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 09.08.2025 నాటికి 35 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు రూ.32,500.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్, నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్), పంజాగుట్ట, హైదరాబాద్ చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 09.08.2025.
- **వెబ్‌సైట్:** https://nims.edu.in

సుప్రీంకోర్టులో కోర్టు మాస్టర్ (షార్ట్ హ్యాండ్) 30 పోస్టులు

సుప్రీంకోర్టు.. కోర్టు మాస్టర్(షార్ట్ హ్యాండ్) గెజిటెడ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 30.
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. ఇంగ్లిష్ షార్ట్‌హ్యాండ్‌లో నిమిషానికి 120 పదాల వేగం, కంప్యూటర్ ఆపరేషన్స్ పరిజ్ఞానం, నిమిషానికి 40 పదాల టైపింగ్ వేగం, ప్రభుత్వ/పబ్లిక్ సెక్టార్/స్టాట్యుటరీ బాడీలలో కనీసం ఐదేళ్ల సీనియర్‌పీఏ/పీఏ/సీనియర్ స్టెనోగ్రాఫర్ అనుభవం ఉండాలి.
- **వయసు:** 30 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి.
- **వేతనం:** ప్రాథమిక వేతనం రూ.67,700+ఇతర అలవెన్సులు.
- **ఎంపిక విధానం:** షార్ట్‌హ్యాండ్ టైపింగ్, ఆబ్జెక్టివ్ రాతపరీక్ష, కంప్యూటర్ టైపింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది, చివరి తేదీలు త్వరలో సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో ప్రకటిస్తారు.
- **వెబ్‌సైట్:** http://www.sci.gov.in

ఎఫ్ఎస్ఎన్ఎల్, బిలాయ్‌లో వివిధ ఉద్యోగాలు

బిలాయ్‌లోని ఫెర్రో స్క్రాప్ నిగమ్ లిమిటెడ్(ఎఫ్ఎస్ఎన్ఎల్).. సేఫ్టీ ఆఫీసర్, సీనియర్ మేనేజర్ పోస్టుల భర్తీకిదరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 04.
- **పోస్టుల వివరాలు:** సేఫ్టీ ఆఫీసర్-03, సీనియర్ మేనేజర్(సేఫ్టీ)/అసిస్టెంట్ జనరల్ మేనేజర్(సేఫ్టీ)-01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్(మెకానికల్, ఎలక్ట్రికల్, మెటలర్జికల్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** సేఫ్టీ ఆఫీసర్‌కు 34 ఏళ్లు, సీనియర్ మేనేజర్‌కు 52 ఏళ్లు ఉండాలి.
- **వేతనం:** నెలకు సేఫ్టీ ఆఫీసర్‌కు రూ.50,000 నుంచి రూ.1,60,000, సీనియర్ మేనేజర్‌కు రూ.90,000 నుంచి రూ.2,40,000.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.08.2025.
- **వెబ్‌సైట్:** http://fsnl.co.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽ 586	నిఫ్టీ ▽ 203
80,600	24,565

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	20,650	▽	472
డోజోన్స్	43,588	▽	542
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,068	▽	64
డాక్స్	23,426	▽	639
షాంఘై	3,560	▽	13
నికాయ్	40,800	▽	270

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	86.95	87.97
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	115.00	117.99
€	యూరో	ఎస్‌బీఐ	98.49	101.24
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	57.34	58.79
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.18	57.42
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.40	68.79
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.47	23.96
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.94	24.19
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.26	13.09

రూ.10 లక్షలున్నా ప్రాపర్టీ కింగ్..!



సహ యజమాని అయ్యే చాన్స్.. • ఇళ్లు, వాణిజ్య భవనాలు, గోదాములు • ఇలా నచ్చిన ప్రాపర్టీపై పెట్టుబడికి వీలు

ఫ్రాక్షనల్ రియల్‌ఎస్టేట్ సాధనం • వివిధ రీట్‌లు కూడా ఉన్నాయ్

ఓ ఇల్లు లేదా వాణిజ్య భవనానికి యజమాని అయితే ఆ దర్జాయే వేరు! స్థిరమైన ఆదాయంతో ఆర్థికంగా అండగా నిలిచే ప్రాపర్టీ ఉంటే చెప్పలేనంత నిశ్చింత. ప్రాపర్టీపై పెట్టుబడి ఎన్నో తరాలను ధనవంతులను చేసిందనడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ, నేడు ఇళ్లు, వాణిజ్య స్థలాల ధరలు అందుబాటులో లేనంతగా పెరిగిపోయాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా స్థలాల లభ్యత పెరగదన్నది వాస్తవం. కనుక ప్రాపర్టీ ఇక ముందూ పెట్టుబడుల పరంగా మెరుగైన సాధనమే అవుతుంది. భారీ పెట్టుబడి పెట్టలేని వారు సైతం ప్రాపర్టీకి సహ యజమాని అయ్యే అవకాశం కల్పిస్తున్నవే 'ఫ్రాక్షనల్ రియల్ ఎస్టేట్ ఓనర్‌షిప్ ప్లాట్‌ఫామ్'లు.

'ఫ్రాక్షనల్ రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్'కు క్రమంగా ఆదరణ పెరుగుతోంది. తక్కువ బడ్జెట్‌తోనే ప్రాపర్టీపై పెట్టుబడికి లభిస్తున్న అవకాశాన్ని సొంతం చేసుకునేందుకు ఎక్కువ మంది (గతంతో పోల్చితే) ముందుకు వస్తున్నారు. తక్కువ పెట్టుబడికి వీలు కల్పించడం ఇందులో ఉన్న సౌలభ్యం. ఇదే ఎక్కువ మందిని ఆకర్షిస్తోంది. అసలు ఈ సాధనం ఎలా పని చేస్తుంది? ప్రయోజనాలు, పన్ను తదితర అంశాల గురించి తెలుసుకుందాం.

– సాక్షి, బిజినెస్ డెస్క్

రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడికి ఇదొక వినూత్న సాధనం. అధిక విలువ కలిగిన ప్రాపర్టీకి ఏ ఒక్కరో యజమానిగా కాకుండా.. ఎక్కువ మంది ఇన్వెస్టర్లు ఉమ్మడిగా వాటా కలిగి ఉండడం. దీనివల్ల ప్రయోజనం ఏంటి? అంటే.. తమ వాటా మేరకు రాబడి అందుకోవచ్చు. ఇల్లు కొనుగోలుకు రూ.50 లక్షలు, ఇంకా ఎక్కువే పెట్టుబడి అవసరం. ఇక్కడ మాత్రం రూ.10 లక్షలు ఉన్నా సరే ఆ మేరకు వాటా లభిస్తుంది. ముఖ్యంగా ధరలు భారీగా పెరిగిపోయిన ప్రాంతాల్లో పెట్టుబడికి ఎంతో అనుకూలం.

రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్స్ నిబంధనలు (సవరణ), 2014కు మార్పులు చేయడం ద్వారా సెబీ కొత్తగా స్మాల్ అండ్ మీడియం రీట్ (ఎస్ఎం రీట్) విభాగాన్ని ప్రవేశపెట్టింది. ఫ్రాక్షనల్ రియల్ ఎస్టేట్‌ను నియంత్రణల పరిధిలో మరింత మందికి చేరువ చేసేందుకు, పారదర్శకత, సౌలభ్యం కోసం తీసుకొచ్చింది. ఫ్రాక్షనల్ ఓనర్‌షిప్ (పాక్షిక యాజమాన్యం)ను ఆఫర్ చేసే ప్రతి ప్లాట్‌ఫామ్ కూడా స్మాల్ అండ్ మీడియం రీట్ (ఎస్ఎం రీట్)గా సెబీ వద్ద నమోదు చేసుకోవాలి. ఇవి ఇన్వెస్టర్ల నుంచి వచ్చిన నిధులను స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పీవీ)కు బదిలీ చేస్తాయి. ఆఫీస్ వసతులు, గోదాములు, డేటా సెంటర్లు తదితర వాటిపై ఎస్‌పీవీ పెట్టుబడులు పెడతాయి. ప్రతి పెట్టుబడిదారుడికి వారి వాటా మేరకు డిజిటల్ సర్టిఫికెట్ జారీ అవుతుంది. రాబడులను వారి వాటాకు అనుగుణంగా పంపిణీ చేస్తారు.

సెబీ నియంత్రణ

ఎస్ఎం రీట్ సాధనాలు సెబీ పర్యవేక్షణ కింద పనిచేస్తుంటాయి కనుక రక్షణ ఉంటుంది. "ఈ ప్లాట్‌ఫామ్‌లు తమ నిర్వహణలోని ఆస్తుల విలువను రెండేళ్లకోసారి స్వతంత్రంగా మదింపు వేయించి, ఆ వివరాలను బహిరంగంగా ప్రకటించాలి. పనితీరు, ఆస్తుల వివరాలు, రిస్కులు, ప్రయోజన వైరుధ్యం తదితర సమాచారాన్ని వెల్లడించాలి" అని ట్రైలీగల్‌కు చెందిన కునాల్‌షా తెలిపారు.

వీటిలో రకాలు..

నివాస భవనాలు: ఇందులో పెట్టుబడిపై అద్దె ఆదాయం మోస్తరుగా ఉంటుంది. దీర్ఘకాలంలో పెట్టుబడి విలువ సైతం వృద్ధి చెందుతుంది.

వాణిజ్య ప్రాపర్టీలు: అధిక అద్దె ఆదాయం లభిస్తుంది. పెట్టుబడి విలువ వేగంగా వృద్ధి చెందుతుంది. ప్రాపర్టీ కొంత కాలం పాటు ఖాళీగా ఉండడం వంటి కొన్ని రిస్కులు ఇందులో ఉంటాయి.

ఎమర్జింగ్ అస్సెట్ క్లాసెస్: గోదాములు, డేటా సెంటర్లు, కో–వర్కింగ్ స్పేస్‌లకు ఇవి వేదికగా ఉంటాయి. వీటిల్లో పెట్టుబడిపై అద్దె రాబడి స్థిరంగా ఉంటుంది. డిమాండ్ ఎక్కువ. కనుక వసతులు ఖాళీగా ఉండకుండా అద్దె ఆదాయం స్థిరంగా లభిస్తుంది.

పెట్టుబడులకు వైవిధ్యం

రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడుల పరంగా వైవిధ్యం ఫ్రాక్షనల్ రియల్ ఎస్టేట్‌తో సాధ్యపడుతుంది. భారీ పెట్టుబడి ఒకే ప్రాపర్టీకి పరిమితం కాకుండా చూసుకోవచ్చు. ఒకటికి మించిన ప్రాపర్టీలపై ఇన్వెస్ట్ చేసుకోవడం ద్వారా ఆదాయంలో వైవిధ్యాన్ని ఏర్పాటు చేసుకోవచ్చు. ఒకే ప్రాంతం కాకుండా భిన్న ప్రాంతాల్లోని, భిన్న రకాల ప్రాపర్టీలపై (ఆఫీసులు, గోదాములు, ఇళ్లు) పెట్టుబడి పెట్టుకోవడం ఇందులో ఉన్న సౌలభ్యం. అయితే అన్ని ఫ్రాక్షనల్ ఓనర్‌షిప్ ప్లాట్‌ఫామ్‌లు ఎస్ఎం రీట్‌లుగా నమోదై లేవు.

పెట్టుబడి వృద్ధితోపాటు రాబడి

స్థిరమైన ఆదాయానికితోడు పెట్టుబడి విలువ కూడా నిర్ణీత కాలంలో ఎంతో కొంత వృద్ధి చెందుతుంది. ఆస్తులను నిపుణులైన మేనేజర్లు నిర్వహిస్తుంటారు. ప్రాపర్టీల నిర్వహణ, కిరాయిదారుల నుంచి అద్దెలు వసూలు, చట్టపరమైన ప్రక్రియలను అనుసరించడం తదితర బాధ్యతలన్నింటినీ వారు చూసుకుంటారు. కనుక పెట్టుబడిదారులకు ఈ తలనొప్పులేవీ ఉండవు. ఫ్రాక్షనల్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ప్రస్తుతం 500–600 మిలియన్ డాలర్లుగా (దాదాపు రూ.5,160 కోట్లు) ఉంటుందని ఖైతాన్ అండ్ కో పార్ట్‌నర్ హర్ష్ పారిఖ్ తెలిపారు. వచ్చే 8–10 ఏళ్లలో 5 నుంచి 5.5 బిలియన్ డాలర్ల స్థాయికి (రూ.47,300 కోట్లు) చేరుకుంటుందని అంచనా వేశారు.

ఎస్ఎం రీట్ - రీట్

- రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్) అన్నది ఒక కంపెనీ. ఆదాయాన్నిచ్చే వాణిజ్య ఆస్తులను నిర్వహిస్తుంటుంది. షేర్ల మాదిరే స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో లిస్ట్ అయిన రీట్‌లను ఒక్క యూనిట్ నుంచి కొనుగోలు చేసుకోవచ్చు. సిప్ మాదిరే ప్రతి నెలా కొద్ది మొత్తం పెట్టుబడులకు లిస్టెడ్ రీట్‌లకు అనుకూలమైన సాధనం. ఇవి పెద్ద స్థాయి ఆస్తులపై పెట్టుబడులు పెడుతుంటాయి. నేరుగా కాకుండా పరోక్షంగా అన్ని ప్రాపర్టీల కలయికతో పెట్టుబడి ఉంటుంది.
- ఎస్ఎం రీట్‌లు మధ్య, చిన్నస్థాయి ఆస్తులపై పెట్టుబడులు పెడుతుంటాయి. వీటిల్లో ఇన్వెస్టర్ ఎంపిక మేరకు ఒక ప్రాపర్టీ లేదా ఒకటికి మించిన ప్రాపర్టీల్లో పెట్టుబడులకు వీలుంటుంది. ఒక విధంగా ఇది ప్రత్యక్ష పెట్టుబడి. ఒకటికి మించిన ప్రాపర్టీల కలయికతో పెట్టుబడి ఉండదు. ప్రతీ ప్రాపర్టీకి విడిగా సర్టిఫికెట్ జారీ చేయాల్సిందే.
- ఎస్ఎం రీట్‌లు రూ.50 కోట్ల నుంచి రూ.500 కోట్ల వరకు ఆస్తులపై పెట్టుబడులు పెడుతుంటాయి. రెగ్యులర్ రీట్‌లు రూ.500 కోట్లకు పైగా విలువైన వాటిపై ఇన్వెస్ట్ చేస్తుంటాయి.
- ఎస్ఎం రీట్‌లలో తమకు ఇష్టమైన ప్రాపర్టీని ఎంపిక చేసుకోవచ్చు. పెట్టుబడి ప్రాపర్టీ వారీగా విడివిడిగా ఉంటుంది. రీట్‌లో ఇందుకు అవకాశం లేదు.
- ఎస్ఎం రీట్‌లలో కనీస పెట్టుబడి రూ.10 లక్షలు. రెగ్యులర్ రీట్‌లలో కనీసం ఒక యూనిట్‌ను కొనుగోలు చేసుకోవాల్సి ఉంటుంది.
- ఎస్ఎం రీట్‌లు కనీసం 5–6 ఏళ్లు, అదే రెగ్యులర్ రీట్‌లు అయితే మరింత దీర్ఘకాలం కోసం ఎంపిక చేసుకోవచ్చు.



పెట్టుబడికి ముందు చూడాల్సినవి..

- ఫ్రాక్షనల్ ఓనర్‌షిప్ ప్లాట్‌ఫామ్‌లు సెబీ వద్ద నమోదయ్యాయా? లేవా అన్నది తప్పకుండా చూడాలి. అంతేకాదు ప్రాపర్టీ సైతం రెరా రిజిస్టర్డ్ అయి ఉండాలి. లీజు డాక్యుమెంట్లు, యాజమాన్యం వివరాలను సరి చూసుకోవాలి.
- కొన్ని ప్లాట్‌ఫామ్‌లపై పెట్టుబడికి లాకిన్ పీరియడ్ ఉంటోంది. దీన్ని తప్పకుండా పరిగణనలోకి తీసుకోవాలి.
- సొంతంగా ప్రాపర్టీ కొనుగోలుకు భారీ పెట్టుబడి అవసరం. కావాలనుకున్నప్పుడు వేగంగా విక్రయించడం అన్ని వేళలా సాధ్యపడదు. ఫ్రాక్షనల్ రియల్ ఎస్టేట్ అయినా లేదా ఎస్ఎం రీట్‌లు అయినా కొంచెం వేగంగా విక్రయించుకోవచ్చు.
- కొన్ని ఫ్రాక్షనల్ ఓనర్‌షిప్ ప్లాట్‌ఫామ్‌లు (సెబీ వద్ద నమోదు కాని) రూ.5 లక్షల నుంచి పెట్టుబడికి వీలు కల్పిస్తున్నాయి. వీటి రిజిస్ట్రేషన్, వాస్తవికత తెలుసుకున్న తర్వాతే పెట్టుబడిపై నిర్ణయం తీసుకోవాలి. సెబీ రిజిస్టర్డ్ ఎస్ఎం రీట్ లేదా రీట్‌ల్లో ఈ తరహా రిస్క్ ఉండదు. కానీ సెబీ రిజిస్టర్డ్ ఎస్ఎం రీట్‌లు పెద్ద సంఖ్యలో అందుబాటులో లేవు. అదే ఫ్రాక్షనల్ ఓనర్‌షిప్ ప్లాట్‌ఫామ్‌లు చాలా ఉన్నాయి.
- కనీస పెట్టుబడి అన్నది ప్లాట్‌ఫామ్ ఆధారంగా వేర్వేరుగా ఉంటుంది. ప్రతీ ప్లాట్‌ఫామ్‌లోనూ రూ.10 లక్షలే ఉండాలని లేదు.
- ఎంపిక చేసుకునే ప్రాపర్టీ ఏ ప్రాంతంలో ఉంది? అక్కడ లీజుకు ఉన్న డిమాండ్ ఏ పాటిది? భవిష్యత్తులో బలమైన వృద్ధికి అవకాశం ఉన్న ప్రాంతమేనా? తదితర అంశాలను పరిశీలించాలి.



ఎవరికి అనుకూలం?

స్థిరమైన ఆదాయం కోరుకునే విశ్రాంత జీవులు, ఇతరులు ఎవరికైనా ఫ్రాక్షనల్ రియల్ ఎస్టేట్ లేదా ఎస్ఎం రీట్‌లు అనుకూలమే. సంప్రదాయ ఈక్విటీలు, డెట్ సాధనాలకు అదనంగా వైవిధ్యం కోసం అనుకూలిస్తాయి. "అద్దె రూపంలో 8–9 శాతం రాబడులు ఎంతో మెరుగైనవి. పైగా ఈ రాబడి ద్రవ్యోల్బణంతో ముడిపడి ఉంటుంది. ఏటా 5 శాతం మేర పెరుగుతూ ఉంటుంది" అని 'ప్రాపర్టీ షేర్' సహ వ్యవస్థాపకుడు కునాల్ మోక్తాన్ వివరించారు. ఏడాది మించిన పెట్టుబడి దీర్ఘకాల మూలధన లాభం కిందకు వస్తుంది. లాభంపై 12.5 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఎస్ఎం రీట్‌లు పంపిణీ చేసే డివిడెండ్లపై పన్ను లేదు. వడ్డీ ఆదాయం మాత్రం వార్షిక ఆదాయానికి కలిపి చూపించి పన్ను చెల్లించాలి.



పెట్టుబడి ఎందుకు?

అసలు ప్రాపర్టీపై ఎందుకు పెట్టుబడి పెడుతున్నారు? రాబడి కోసమా, సంపద సృష్టి కోసమా అన్నది తేల్చుకోవాలి. ఎందుకంటే రాబడి, పెట్టుబడి విలువ వృద్ధి కోరుకునే వారికి ఈ తరహా డిజిటల్ రియల్ ఎస్టేట్ సాధనాలే అనుకూలం. ఒకవేళ సొంత వినియోగం కోసం అయితే నేరుగా ప్రాపర్టీని కొనుగోలు చేసుకోవడం మంచి నిర్ణయం అవుతుంది. ఒక ప్రాపర్టీని సొంతంగా కొనుగోలు చేసుకోవడానికి పెద్ద మొత్తం పెట్టుబడి కావాలి. అంత స్తోమత లేని వారికి ఈ తరహా సాధనాలు అనుకూలం. పైగా పెట్టుబడులు అన్నీ ఒకే విభాగంలో ఉండరాదు. ఈక్విటీ, డెట్, బంగారం, రియల్ ఎస్టేట్ సాధనాల మధ్య వైవిధ్యం చేసుకోవడం చక్కని సమతూకంతో, రిస్క్ పరంగా మెరుగైన ప్రణాళిక అవుతుంది. రియల్ ఎస్టేట్‌పై పెట్టుబడికి ఫ్రాక్షనల్ ఓనర్‌షిప్ లేదా రీట్‌లను తప్పకుండా పరిగణనలోకి తీసుకోవచ్చు. దీనికంటే ముందు రిస్కులు, సానుకూలతలు, ప్రతికూలతలను సమగ్రంగా తెలుసుకోవాలి.

శోభా లిమిటెడ్	హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,584 టార్గెట్: రూ. 2,459

ఎందుకంటే: రియల్టీ రంగ దిగ్గజం శోభా లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో ప్రీసేల్స్ రీత్యా పటిష్ట పనితీరు ప్రదర్శించింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో ప్రీసేల్స్ వార్షికంగా 11% వృద్ధితో రూ. 2,080 కోట్లను తాకాయి. ఇందుకు ప్రధానంగా గురుగ్రామ్, బెంగళూరు తదితర మార్కెట్ల నుంచి రూ. 1,000 కోట్లు సాధించింది. ఈ బాటలో రూ. 1,500 కోట్ల స్థూల డెవలప్‌మెంట్ విలువతో కొత్తగా ప్రవేశపెట్టిన ప్రాజెక్టుల ద్వారా మరో రూ. 1,080 కోట్లు ఆర్జించింది. అంతేకాకుండా కీలక ప్రాజెక్టుల నుంచి 1.07 మిలియన్ చదరపు అడుగుల(ఎంఎస్ఎఫ్)ను డెలివరీ చేసింది. తద్వారా పటిష్ట ఎగ్జిక్యూషన్‌సహా.. సొంత డెవలప్‌మెంట్ సామర్థ్యాలను ప్రదర్శించింది. ఈ ఏడాది ద్వితీయార్ధం(అక్టోబర్–మార్చి)లోనూ మరింత పురోగతి సాధించనున్నట్లు భావిస్తున్నాం. ఇందుకు గురుగ్రామ్ సెక్టార్ 63ఏ, పుణే, ముంబై, బెంగళూరు ప్రాజెక్టుల విడుదల దోహదపడే వీలుంది. వీటి ద్వారా ద్వితీయార్ధంలో రూ. 6,000 కోట్ల ప్రీసేల్స్ సాధించే అవకాశముంది. వెరసి పూర్తి ఏడాదికి రూ. 10,000 కోట్ల ప్రీసేల్స్‌ను అందుకునే బాటలో సాగుతోంది. ప్రస్తుతం సాధిస్తున్న పురోగతి భవిష్యత్‌లోనూ అమ్మకాలలో వృద్ధిని కొనసాగించగలదన్న విశ్వాసాన్ని బలపరుస్తోంది. వ్యూహాత్మక మార్కెట్లలో కార్యకలాపాలకుతోడు.. అధిక డిమాండ్‌గల ప్రాజెక్టులను చేపట్టడం ఇందుకు సహకరించనుంది. ఎన్‌సీఆర్, బెంగళూరు తదితర కీలక మార్కెట్లలో నియంత్రణ సంస్థల అనుమతుల బాటలో సాగుతోంది. ఇవి రానున్న రెండు, మూడు త్రైమాసికాలలో చేపట్టనున్న ప్రాజెక్టులకు మద్దతివ్వనున్నాయి. పటిష్టస్థాయిలో నికర నగదు – ఈక్విటీ నిష్పత్తి(0.13 రెట్లు), రూ. 700 కోట్ల లిక్విడిటీ ద్వారా పటిష్ట బ్యాలన్స్ షీట్‌ను కలిగి ఉంది.

స్టాక్స్ వ్యూ



బెక్టార్స్ ఫుడ్	అసిట్ సి.మెహతా	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,460 టార్గెట్: రూ. 1,695

ఎందుకంటే: ప్రధానంగా బేకరీ ప్రొడక్టులు రూపొందించే మిసెస్ బెక్టార్స్ ఫుడ్ స్పెషాలిటీస్ ఉత్తరాదిన పటిష్ట కార్యకలాపాలు కలిగి ఉంది. ఇటీవల మహారాష్ట్ర, కర్ణాటక తదితర కీలక మార్కెట్లపైనా దృష్టి సారించింది. ముంబై, బెంగళూరు తదితర మెట్రో నగరాలలో బేకరీ ప్రొడక్టుల వినియోగం భారీగా పెరుగుతున్న నేపథ్యంలో కంపెనీ దక్షిణాదిన విస్తరించే ప్రణాళికలు అమలు చేస్తోంది. వెరసి కొత్త ప్రాంతాలలో తయారీ యూనిట్లను ఏర్పాటు చేయడంతోపాటు, ప్రస్తుత యూనిట్లలో సామర్థ్య విస్తరణను చేపడుతోంది. దీనిలో భాగంగా అధిక వృద్ధికి వీలున్న ప్రాంతాలలో కార్యకలాపాల విస్తరణకు తెరతీస్తోంది. అంతగా ప్రాచుర్యంలోలేని మార్కెట్లలో అమ్మకాలను పెంచుకునే బాటలో సాగుతోంది. దీంతో ఆయా ప్రాంతాల యూనిట్ల సామర్థ్య వినియోగం గరిష్టానికి చేరితే రానున్న ఐదేళ్లలో రూ. 3,400 కోట్ల ఆదాయ సాధనకు వీలున్నట్లు భావిస్తున్నాం. దీనికితోడు పెట్టుబడి వ్యయాల్లో అధిక శాతం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) చివరికల్లా పూర్తికానున్నాయి. దీంతో రానున్న రెండు, మూడేళ్లలో పెట్టుబడి అవసరాలు భారీగా తగ్గనున్నాయి. వీటి వృద్ధి ఫలితంగా ఆర్థికంగా కీలకమైన రిటర్న్ రేషియోలు మెరుగుపడనున్నాయి. ఇందుకు అనుగుణంగా ప్రస్తుత 70,000 ఔట్‌లెట్లను లక్షకు పెంచే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఈ బాటలో క్రెమికా బ్రాండ్ ఔట్‌లెట్ల సంఖ్యను ప్రస్తుత 7,000 నుంచి ఈ ఏడాది 30 శాతంమేర పెంచే సన్నాహాల్లో ఉంది. ఫ్రోజెన్ ఫుడ్స్, డిజర్ట్‌ల విభాగంలోకి ప్రవేశించడం ద్వారా క్యూఎస్ఆర్ బిజినెస్ మరింత పురోగతి సాధించనుంది. క్యూఎస్ఆర్ దిగ్గజాల నుంచి వాలెట్ షేర్‌ను పెంచుకోనుంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

న్యూ ఫండ్ ఆఫర్

కోటక్ యాక్టివ్ మొమెంటమ్ ఫండ్



కోటక్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా కోటక్ యాక్టివ్ మొమెంటమ్ ఫండ్‌ను ప్రారంభించింది. ఈ నెల 12వ తేదీ వరకు పెట్టుబడులకు అందుబాటులో ఉంటుంది. ఇది ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. మొమెంటమ్ థీమ్‌ను పెట్టుబడులకు అనుసరిస్తుంది . ఉదాహరణకు ఆదాయాలు, లాభాలను సమీప కాలంలో బలంగా పెంచుకునే అవకాశాలున్నాయని గుర్తించినట్టయితే ఆయా కంపెనీల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. బలమైన ఆర్థిక పనితీరుతో ఆయా స్టాక్స్ ర్యాలీ చేస్తాయి. అనంతరం లాభాల స్వీకరణతో ఇన్వెస్టర్లకు అధిక రాబడులు ఇచ్చే విధంగా ఈ పథకం పనిచేస్తుంటుంది. రంగాల వారీ విధానపరమైన మార్పులు, డిమాండ్ కారణంగా స్టాక్స్ ర్యాలీ చేస్తాయని గుర్తించిన సందర్భాల్లోనూ అవకాశాలను సొంతం చేసుకునే విధంగా పెట్టుబడులు పెడుతుంది. అనలిస్టుల నుంచి అప్‌గ్రేడ్ పొందినవి, షేరువారీ ఆర్జనను పెంచుకుంటున్న వాటిని గుర్తించి ఇన్వెస్ట్ చేస్తుంది. నిఫ్టీ 500 ఇండెక్స్ టీఆర్ఐ ఈ పథకం పనితీరుకు ప్రామాణికంగా ఉంటుంది. రోహిత్ టాండన్ ఫండ్‌మేనేజర్‌గా వ్యవహరించనున్నారు. టాప్–250 కంపెనీల (మార్కెట్ విలువ పరంగా)ను జల్లెడ పడుతూ నాణ్యమైన 40–50 స్టాక్స్‌ను ఎంపిక చేసుకుని పెట్టుబడులు పెడుతుంది. ఒకే విడత పెట్టుబడి అయితే కనీసం రూ.5,000, నెలవారీ సిప్ అయితే రూ.500 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.


బజాజ్ ఫిన్‌సర్వ్ ఈక్విటీ సేవింగ్స్ ఫండ్

బజాజ్ ఫిన్‌సర్వ్ ఏఎంసీ 'బజాజ్ ఫిన్‌సర్వ్ ఈక్విటీ సేవింగ్స్ ఫండ్' పేరుతో న్యూ ఫండ్ ఆఫర్‌ను ప్రకటించింది. ఇది ఈ నెల 11 వరకు పెట్టుబడులను అనుమతించనుంది. ఈక్విటీలతోపాటు ఆర్బిట్రేజ్ అవకాశాల్లోనూ పెట్టుబడులు పెడుతుంటుంది. అలాగే డెట్ సాధనాలకు సైతం (ప్రభుత్వ సెక్యూరిటీలు, మనీ మార్కెట్ ఇన్‌స్ట్రుమెంట్లు) పెట్టుబడులు కేటాయిస్తుంటుంది. పెట్టుబడుల వృద్ధికి ఈక్విటీలు, అదే సమయంలో స్థిరమైన రాబడులకు డెట్, ఆర్బిట్రేజ్‌లలో ఇన్వెస్ట్ చేయడం ద్వారా అస్థిరతలను తగ్గించే విధంగా ఈ పథకం పని చేస్తుంది. ముఖ్యంగా ఈక్విటీలు, ఈక్విటీ ఆర్బిట్రేజ్ అవకాశాలకు గరిష్టంగా 65 శాతం వరకు కేటాయింపులు చేస్తూ, మిగిలిన మేర డెట్ సాధనాల్లో పెట్టుబడులు పెడుతుంది. తక్కువ రిస్క్, మెరుగైన రాబడి కోరుకునే వారికి ఈ పథకం అనుకూలం. కనీసం రూ.500 నుంచి ఈ పథకంలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.



'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..	
ఆర్‌బీఐ వైపు మార్కెట్ చూపు	ఐటీ రంగంలో స్తంభించిన నియామకాలు

రిటైర్మెంట్ ఫండ్ కోసం మార్గం ఏది?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నా వయసు 42 ఏళ్లు. రిటైర్మెంట్ తర్వాతి అవసరాల కోసం ఇప్పటి నుంచి ప్రతి నెలా రూ.50,000 చొప్పున ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటున్నాను. ఏ సాధనాల్లో ఇన్వెస్ట్ చేసుకోవాలి?

– వినోద్‌రావు అథవాలే

రిటైర్మెంట్ కోసం ఎంత మొత్తం అవసరమవుతుందన్నది ముందుగా నిర్ణయించుకోవాలి. అంత మొత్తాన్ని ఎలా సమకూర్చుకోవాలన్న స్పష్టత కలిగి ఉండాలి. విశ్రాంత జీవన అవసరాలకు కావాల్సినంత సమకూర్చుకునే ప్రణాళికలను రూపొందించుకోవాలి. రెండు నుంచి మూడు వరకు మంచి ఫ్లెక్సీక్యాప్ పథకాలను ఎంపిక చేసుకుని ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) ద్వారా మీరు ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్న రూ.50వేలలో 60 శాతాన్ని అంటూ రూ.30వేలను రెండు మూడు పథకాల్లో పెట్టుబడి పెట్టుకోవాలి. రిటైర్మెంట్‌కు 16 ఏళ్ల సమయం మిగిలి ఉంది. కనుక మీ పెట్టుబడి అప్పటికి గణనీయంగా వృద్ధి చెందుతుంది. ఈక్విటీ పథకాల్లో రిస్కుల పట్ల పెద్దగా అవగాహన లేకపోతే, అప్పుడు అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఇవి అచ్చమైన ఈక్విటీ పథకాలతో పోలిస్తే కొంచెం తక్కువ అస్థిరతలతో ఉంటాయి. అలాగే రూ.20వేలను ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ పథకాలకు కేటాయించుకోవాలి. దీనివల్ల రిటైర్మెంట్ అనంతరం.. ఈక్విటీ పెట్టుబడులను ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ పథకాల్లోకి మార్చాల్సిన అవసరం ఏర్పడదు. ఎందుకంటే సగం పెట్టుబడులు ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ (డెట్ ఫండ్స్) సాధనాల్లోనే ఉంటాయి. ఈక్విటీ, డెట్ మధ్య పెట్టుబడుల కేటాయింపు జాగ్రత్తగా ఉండాలి. ద్రవ్యోల్బణ ప్రభావాన్ని అధిగమించేలా, వడ్డీ రేట్లు తగ్గినప్పుడు ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాలపై పడే ప్రభావాన్ని అధిగమించేలా ఈ సమతూకం ఉండాలి.



నా పెట్టుబడుల్లో అధిక భాగంగా ఈక్విటీల్లోనే ఉన్నాయి. మార్కెట్లలో అస్థిరతలు, ఆటుపోట్లను అధిగమించడం ఎలా?

– బ్రదర్ జోసెఫ్

ఈక్విటీల్లో అస్థిరతలు సహజం. ఆర్థిక పరిస్థితులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలకు అనుగుణంగా ఇవి చలిస్తుంటాయి. వీటిని ఎదుర్కోవడం ఎలా అన్నది ఇన్వెస్టర్లకు తెలిసి ఉండాలి. ప్రతీ ఇన్వెస్టర్ లైఫ్ ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్లను తీసుకుని తమకు, తమ కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించుకోవడం అన్నింటికంటే ముందు చేయాల్సి నపని. అత్యవసర సందర్భాల్లో, తాత్కాలిక అవసరాలకు ఈక్విటీ పెట్టుబడులను కదలించకుండా.. విడిగా అత్యవసర నిధిని (ఈఎఫ్) ఏర్పాటు చేసుకోవాలి. ఈక్విటీల్లో పెట్టుబడులను కనీసం ఐదు నుంచి ఏడేళ్ల పాటు కదపకుండా ఉండాలా ఏర్పాట్లు చేసుకోవాలి. ఈక్విటీ అస్థిరతలను అధిగమించేందుకు ఈ చర్యలు అవసరం. అలాగే, సిప్ వంటి సాధనాల ద్వారా ఇన్వెస్ట్ చేయడం వల్ల మార్కెట్ దిద్దుబాట్ల నుంచి అదనపు రాబడుల ప్రయోజనాన్ని పొందొచ్చు. సిప్ రూపంలో క్రమం తప్పకుండా ఇన్వెస్ట్ చేసే వారికి మార్కెట్లలో కరెక్షన్‌లు నిజంగా మంచి అవకాశాలను తెస్తాయి. ఎందుకంటే ఆ సమయాల్లో ఎక్కువ ఫండ్ యూనిట్లను తక్కువ ధరకే సమకూర్చుకోవచ్చు. మార్కెట్లు దిద్దుబాటుకు గురైతే చౌకగా కొనుగోలు చేయడానికి అవకాశం ఉంటుంది. అనవసరపు ఆందోళనతో సిప్ నిలిపివేయడం, ఈక్విటీ పెట్టుబడులను విక్రయించడం చేయరాదు. పైగా ఆ సమయంలో తప్పకుండా సిప్‌ను కొనసాగించాలి. వీలైతే సిప్ మొత్తాన్ని పెంచుకుని అదనంగా ఇన్వెస్ట్ చేయాలి. దీనివల్ల దీర్ఘకాలంలో రాబడులను గణనీయంగా పెంచుకోవచ్చు.

క్లుప్తంగా...

రేపటి నుంచి శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 5 నుంచి 7వ తేదీ వరకు పవిత్రోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఆగస్టు 4న అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనలు, ఉత్సవాల్లో యాత్రికులు లేదా సిబ్బంది వల్ల తెలియక కొన్ని దోషాలు జరుగుతుంటాయి. వీటివల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం కలుగకుండా ఆగమ శాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. కొన్ని ముఖ్యాంశాలు...

- ఉత్సవాల్లో భాగంగా మూడు రోజుల పాటు ఆలయంలోని సంపంగి ప్రాకారంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు.
- సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన ఆభరణాలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు.
- 5న పవిత్రాల ప్రతిష్ట, 6న పవిత్ర సమర్పణ, 7న పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తారు.
- పవిత్రోత్సవాల్లో భాగంగా సోమవారం అంకురార్పణ కారణంగా సహస్రదీపాలంకార సేవను టీటీడీ రద్దు చేసింది.
- అదేవిధంగా 5వతేదీన అష్టదళ పాద పద్మారాధన సేవ, 7న తిరుప్పావడ సేవతో పాటు 5 నుండి 7వ తేదీ వరకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలు రద్దయ్యాయి.

టీఎస్‌ఈఈయూ-327 ట్రాన్స్‌కో రాష్ట్ర కార్యవర్గం



హనుమకొండ: తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌ఈఈయూ)-327 ట్రాన్స్‌కో విభాగం రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హనుమకొండలోని యూనియన్ కార్యాలయం పల్లా రవీందర్‌రెడ్డి భవన్‌లో ట్రాన్స్‌కో విభాగం రాష్ట్రస్థాయి సమావేశం ఆదివారం జరిగింది. టీఎస్‌ఈఈయూ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ పర్యవేక్షణలో జరిగిన ఈ ఎన్నికకు.. ఆ యూనియన్ రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం ఐలేశ్, ఎన్పీడీసీఎల్ శాఖ అధ్యక్షుడు పి.మహేందర్‌రెడ్డి ఎన్నికల అధికారులుగా, రాష్ట్ర చీఫ్ వైస్‌ప్రెసిడెంట్ పి.రమేశ్ సహాయ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అధ్యక్షునిగా డీఎం శ్రీనివాస్, సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విజయమారియా, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కల్యాణ్ మురళి, ఎం.శ్రీనివాస్ యాదవ్, వైస్ ప్రెసిడెంట్లుగా ఇ.మధుకర్, టి.అశోక్, కె.శ్రీధర్, పి.మల్లేశ్, ఇ.రాఘవేంద్ర, ఎ.రాజు, కార్యదర్శిగా ఆర్.శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీలుగా టి.శ్రీనివాస్, డి.శ్రీనివాస్‌రెడ్డి, మైస రాజు, శివ, ఇమ్మాన్యుయేల్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా జి.రజిత, ఎం.రాజు, జె.శ్రీనివాస్, నీల రవికుమార్, షర్మిల, కోశాధికారిగా సంగోజ్ రామకృష్ణ, కార్యాలయ కార్యదర్శిగా కవిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని టీఎస్‌ఈఈయూ -327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ సన్మానించారు.

సర్కారు బడిలో 'మిషన్ తేజస్'

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపుదలకు సరికొత్త కార్యక్రమం
- మిషన్ తేజస్ పేరుతో రూపొందించిన ఇంటర్ విద్యార్థి గుండు అనిరుధ్
- వరంగల్ జిల్లాలోని 10 స్కూళ్లలో పైలట్ ప్రాజెక్టు కింద అమలుకు ప్రభుత్వం అనుమతి

TEJAS
తెలంగాణ జ్ఞాన ఆవిష్కరణ సంకల్పం
तेलंगाना ज्ञान आविष्कार संकल्प

విద్యారణ్యపురి: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను ఇన్నోవేషన్ హబ్‌లుగా తీర్చిదిద్దడంతోపాటు విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు పెంపొందించి నూతన సాంకేతిక నైపుణ్యాలను వారు అందిపుచ్చుకునేలా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏర్పాటైన మిషన్ తేజస్ (తెలంగాణ జ్ఞాన ఆవిష్కరణ సంకల్పం) కార్యక్రమం అమలుకు తొలి అడుగులు పడ్డాయి. తేజస్ ప్రోగ్రాం రూపకర్త అయిన 15 ఏళ్ల ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి గుండు అనిరుధ్ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లాలోని 10 ప్రభుత్వ పాఠశాలల్లో పైలట్ ప్రాజెక్టుగా మిషన్ తేజస్ అమలుకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్, సమగ్ర శిక్ష రాష్ట్ర డైరెక్టర్ నవీన్ నికోలస్ అనుమతిచ్చారు. త్వరలో పాఠశాలలను ఎంపిక చేయనున్నారు. గ్రామీణ పాఠశాలల్లో స్థానిక సమస్యలపై విద్యార్థులు సొంతంగా నవీన పరిష్కార మార్గాలు రూపొందించేందుకు ప్రేరణ కల్పించడం, వారిని రేపటి సామాజిక నాయకులుగా, పరిశోధకులుగా, వాస్తవ సమస్యలకు పరిష్కారాలను రూపొందించే ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దడమే తేజస్ ఉన్నత లక్ష్యాలని ఈ సందర్భంగా అనిరుధ్ పేర్కొన్నాడు. మిషన్ తేజస్ పోర్టల్ పనితీరును వివరించాడు.

చిన్న ఆవిష్కరణ సైతం రాష్ట్రస్థాయి దాకా..

తేజస్ పోర్టల్‌లోకి 'యూడీఐఎస్‌ఈ కోడ్' ద్వారా సంబంధిత పాఠశాల లాగిన్ అవుతుంది. అక్కడి నుంచి ఆ పాఠశాల విద్యార్థుల యాక్టివిటీ ప్రొఫైల్‌తో లింక్ అవుతుంది. ఇందుకోసం విద్యార్థులకు యూనిక్ స్టూడెంట్ ఐడీ ఇస్తారు. వారు చేసే ఆవిష్కరణలన్నీ ఇన్నోవేటర్ పాస్‌పోర్టులో నమోదవుతాయి. ఇవన్నీ స్కూల్ స్థాయిలో ప్రారంభమై మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలకు కూడా ఒకే డ్యాష్‌బోర్డు ద్వారా ప్రదర్శితమవుతాయి. ఒక పాఠశాలలో ఒక విద్యార్థి చేసిన చిన్న ఆవిష్కరణ కూడా రాష్ట్రస్థాయి వరకు ట్రాక్ అవుతుంది. ఆ విద్యార్థి ప్రగతిని అన్ని స్థాయిల్లోనూ చూడవచ్చు. ఈ డ్యాష్ బోర్డు ద్వారా సంబంధిత అధికారులు, ప్రధానోపాధ్యాయులు, జిల్లా అధికారులు, రాష్ట్ర నోడల్ టీం, విద్యాశాఖ అధికారులు ఒకే వేదిక ద్వారా విద్యార్థి పనితీరు, ప్రాజెక్టు స్టేటస్, మెంటర్ అనుసంధానం వంటి అంశాలను సమగ్రంగా విశ్లేషించగలుగుతారు.

ఎంటర్‌ప్రెన్యూర్ కావాలనేది లక్ష్యం..



ప్రస్తుతం ఇంటర్ ఎంపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్నా. ఇంజనీరింగ్‌లో మెకట్రానిక్స్ కోర్సు చేయాలని ఉంది. ఆ తర్వాత ఎంటర్‌ప్రెన్యూర్ కావాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నా. - అనిరుధ్

మెంటార్స్ సహకారం..

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 'తేజస్'లో ఎదురయ్యే సమస్యలు, సందేహాల నివృత్తి కోసం మెంటార్స్‌గా కొందరు విద్యార్థులను తమకు అందుబాటులో ఉంచాలని వరంగల్ కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్) ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌ను తాను కలిసి కోరినట్లు అనిరుధ్ తెలిపాడు. తమకు 30 మంది మెంటార్స్ సేవలందించేలా సహకరించాలని కోరగా ప్రస్తుతానికి 15 మందిని కేటాయించినట్లు చెప్పాడు.

అంకురార్పణ ఇలా..

వరంగల్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు గుండు రమేశ్, స్రవంతి దంపతుల కుమారుడు అనిరుధ్ తన ప్రతిభతో రూపొందించిన మిషన్ తేజస్ ప్రోగ్రాంను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. తొలుత విద్యాశాఖ రాష్ట్ర కార్యదర్శి యోగితా రాణా, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి వద్దకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి ద్వారా వెళ్లి మిషన్ తేజస్ గురించి వివరించాడు. అనంతరం నవీన్ నికోలస్‌ను కలిసి దీని పనితీరును వివరించాడు.

మీనమేషాలేనా..!

- చేప పిల్లల ఉచిత పంపిణీ పథకం ఉండేనా.. ఊడేనా..?.. బడ్జెట్‌లో రూ.20 కోట్లు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం
- గత కాంట్రాక్టర్ల బకాయిలే రూ.100 కోట్లు
- ఈ ఏడాది దాదాపు రూ.100 కోట్లు కావాలంటున్న మత్స్య శాఖ

సాక్షి, హైదరాబాద్: ఉచితంగా చేప పిల్లల పంపిణీపై అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. అసలు ఈ ఏడాది మీనాల పంపిణీ ఉంటుందా? ఉండదా అనే సందేహం నెలకొంది. బడ్జెట్‌లోనూ చాలీచాలని నిధులే కేటాయించారు. ఇంకా టెండర్లపై అతీగతీలేదు. గత ఏడాది మాదిరిగా చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు, ప్రాజెక్టుల్లోకి పూర్తిగా నీరు చేరిన తర్వాత...అధికారులు నిద్రలేచేలా ఉన్నారని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం చేప పిల్లల ఉచిత పంపిణీకి నిధులు ఇచ్చి టెండర్లు ఆహ్వానిస్తుందా లేదా నిధులిస్తుందా.. లేకపోతే ఉచితానికే మంగళం పాడుతుందా, లేదా మత్స్యసహకార సంఘాలకు నిధులు ఇస్తుందా స్పష్టత లేదు.

రూ. 20 కోట్లతో చేప పిల్లల పంపిణీ సాధ్యమేనా?

ఈ ఏడాది బడ్జెట్‌లో ఉచితంగా చేప పిల్లల పంపిణీకి ప్రభుత్వం రూ.20 కోట్లు మాత్రమే కేటాయించింది. మీనాల పంపిణీకి కేంద్ర ప్రభుత్వం రూ.19 కోట్లు ఇస్తానని సూచనప్రాయంగా తెలిపింది. వాస్తవానికి ఈ పంపిణీ పూర్తిగా విజయవంతం కావాలంటే దాదాపు 250 కోట్లు అవసరం. ఈ ఏడాది మీనాలను పూర్తి స్థాయిలో వదలాలంటే రూ. 100 కోట్లు కావాలి. మరో వైపు గత ఏడాది కాంట్రాక్టర్ల బకాయిలు రూ.100 కోట్ల వరకు ఉన్నాయి. ఇవన్నీ పూర్తిగా చెల్లించాలంటే రూ.200 కోట్లు కావాలి. ఈ నిధుల కోసం ఇప్పటికే మత్స్యశాఖ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు తెలిసింది. అయితే దీనిపై ఏ సమాచారం లేదు.

టెండర్లపై ఆలస్యం ఎందుకో ?

చేప పిల్లల కోసం ఇప్పటి వరకు టెండర్లు ఆహ్వానించలేదు. టెండర్లు ముందుగా పిలిస్తే జలాశయాల్లోకి నీరు వచ్చిన వెంటనే చేప పిల్లలను వదలొచ్చు. కానీ ఆ పరిస్థితి కనిపించడం లేదు. గత ఏడాది కూడా కాంట్రాక్టర్లు ఆలస్యంగా టెండర్ల కోట్ చేశారు. 2023 కంటే ముందు ఉన్న బకాయిలు చెల్లించాలని మొండికేశారు. అధికారులు రంగంలోకి దిగి వారితో చర్చలు జరిపి కొంత మేర చెల్లించారు. 2024లో మాత్రం ఎన్ని నిధులు ఇస్తే అంత మేరకే చేప పిల్లలను వదిలారు. దీంతో చేప పిల్లల పంపిణీ ఏడాది చివరి వరకు సా..గింది. ఈ ఏడాది కూడా ఆలస్యంగా టెండర్లు ఆహ్వానిస్తే నాసిరకంగా చేప పిల్లలు వదిలే అవకాశం లేకపోలేదు.


మత్స్యకారులకు ఎలాంటి లబ్ధి చేకూరలేదు

ఉచితంగా చేప పిల్లల పంపిణీతో మత్స్యకారులకు ఎలాంటి లబ్ధి చేకూరలేదు. ఇప్పటి వరకు టెండర్లు కాలేదు. ఈ ఏడాది అయినా ఆయా మత్స్య సహకార సొసైటీల అకౌంట్లలో నిధులు జమ చేయాలి. అనేకసార్లు మత్స్యశాఖ కమిషనర్, మంత్రికి కలిసి వినతిపత్రం కూడా ఇచ్చాం.

- మంగలిపల్లి శంకర్, గంగపుత్ర చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు

6 నెలల్లో 13% తగ్గిన సైబర్ నేరాలు

తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో గణాంకాల్లో వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సైబర్ నేరాల నమోదులో స్వల్ప తగ్గుదల నమోదవుతోంది. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు రాష్ట్రవ్యాప్తంగా సైబర్ నేరాలు 13 శాతం తగ్గినట్టు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2024 జనవరి నుంచి జూన్ వరకు మొత్తం 47,198 కేసులు నమోదవగా ఈ ఏడాది అదే కాలానికి 41,172 కేసులు నమోదయ్యాయి. అలాగే ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో సుమారు రూ. 92 కోట్లు కొల్లగొట్టిన 228 మంది సైబర్ నేరగాళ్లను టీజీసీఎస్‌బీ అరెస్టు చేసింది. నిందితులకు తెలంగాణలో 189, దేశవ్యాప్తంగా 1,313 సైబర్ నేరాలతో సంబంధాలు ఉన్నాయి. నిందితుల్లో విద్యార్థులు మొదలు సాఫ్ట్‌వేర్ నిపుణులు, బ్యాంక్ ఉద్యోగులు కూడా ఉన్నారు. నిందితుల్లో ఎక్కువ మంది 18 నుంచి 30 ఏళ్ల వయసు వారే కావడం గమనార్హం.

నమోదైన ప్రధాన సైబర్ నేరాలు..

సైబర్ నేరాల్లో ఎక్కువగా ఆన్‌లైన్ జాబ్ మోసాలు, పెట్టుబడుల మోసాలకు సంబంధించి 77 కేసులు నమోదయ్యాయి. అలాగే నకిలీ కాల్ సెంటర్లకు సంబంధించి 66 కేసులు, చైల్డ్ సెక్సువల్ ఎక్స్‌ప్లోయ్‌టేటివ్ అండ్ అబ్యూస్ మెటీరియల్‌కు సంబంధించి 15 కేసులు, 18 సైబర్ బానిసత్వ మాడ్యూల్స్, 13 ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసాల కేసులు నమోదయ్యాయి. ఇవి కాకుండా అక్రమ సిమ్ బాక్స్ ఆపరేటర్లు, డిజిటల్ అరెస్ట్, ఐడెంటిటీ థెఫ్ట్ కేసులు ప్రధానంగా ఉన్నాయి.

2025లో నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్లు

- **నకిలీ కాల్ సెంటర్ బట్టబయలు:** ఎన్‌ఆర్‌ఐలు, అమెరికా పౌరులే లక్ష్యంగా నకిలీ కాల్ సెంటర్ నిర్వహిస్తున్న ఓ ముఠాను టీజీసీఎస్‌బీ అధికారులు హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలోని పత్రికా నగర్‌లో గుర్తించారు. మొత్తం 63 మందిని ఫిబ్రవరిలో అరెస్టు చేశారు. నిందితుల్లో ఎక్కువ మంది గుజరాత్‌వాసులు.
- **అంతర్రాష్ట్ర సైబర్ మోసాల నివారణ చర్యలు:** మే ఒకటి నుంచి 10 వరకు సూరత్‌లో టీజీసీఎస్‌బీ స్పెషల్ ఆపరేషన్ నిర్వహించి తెలంగాణలో 60కిపైగా కేసులు సహా దేశవ్యాప్తంగా 515 కేసులతో సంబంధం ఉన్న 20 మంది సైబర్ మోసగాళ్లను అరెస్టు చేసింది.
- **ఆన్‌లైన్ పిల్లల లైంగిక వేధింపులపై రాష్ట్రవ్యాప్త చర్య:** రాష్ట్రవ్యాప్తంగా పిల్లల లైంగిక దోపిడీ, దుర్వినియోగ మెటీరియల్‌తో సంబంధం ఉన్న 15 మంది నేరస్తులను టీజీసీఎస్‌బీ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ జూన్‌లో అరెస్టు చేసింది.

అనుమానం వస్తే ఫిర్యాదు చేయండి..



సైబర్ నేరస్తులపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. సైబర్ మోసాల సమాచారం ఉన్నా లేక అనుమానాస్పద ఆన్‌లైన్ కార్యకలాపాలను గుర్తించినా వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు లేదా సైబర్ క్రైం పోర్టల్ cybercrime.gov.inకు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచిస్తున్నాం.

- శిఖాగోయల్, డైరెక్టర్, టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో



పవిత్రోత్సవాలకు 'గుట్ట' సిద్ధం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం నుంచి బుధవారం వరకు మూడ్రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆలయ అర్చకులు, అధికారులు పూర్తిచేశారు. సోమవారం సాయంత్రం ఆలయ ముఖ మండపంలో స్వామి పవిత్రోత్సవాలకు అర్చకులు శ్రీకారం చుడతారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నవకలశ అభిషేకాలు, మూలమంత్ర హవనం జరిపిస్తారు. అదేరోజు రాత్రికి విమాన గోపుర శ్రీసుదర్శన చక్రానికి పవిత్రమాలలను సమర్పించి పూజలు చేస్తారు. చివరి రోజు బుధవారం నిత్యా పూర్ణాహుతిని నిర్వహించి, ఆలయంలో స్వామికి పవిత్ర మాలలను సమర్పించి, ఉత్సవాలను పరిసమాప్తం చేస్తారు. పవిత్రోత్సవాల సందర్భంగా మంగళ, బుధవారాల్లో నిర్వహించే నిత్య, శాశ్వత సుదర్శన నారసింహ హోమం, కల్యాణం, బ్రహ్మోత్సవం, లక్ష పుష్పార్చన పూజలను ఆలయ అధికారులు రద్దు చేశారు.



హైకోర్టులో బోనాలు

హైకోర్టు ఆవరణలో జరిగిన బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మాధవి దేవి, జస్టిస్ సూరేపల్లి నందా, జస్టిస్ నందికొండ నర్సింగ్ రావు, హెచ్‌సీఏఏ అధ్యక్షుడు జగన్, కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి తదితరులు



తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ ఇ.వి.వేణుగోపాల్



తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ కె.లక్ష్మణ్

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని ఆదివారం ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో తెలంగాణ హైకోర్టు జడ్జిలు జస్టిస్ ఇ.వి. వేణుగోపాల్, జస్టిస్ కె.లక్ష్మణ్, రాజస్థాన్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి శంభాజీ ఎస్ షిండే ఉన్నారు. దర్శనం అనంతరం వేదపండితులు ఆశీర్వదించగా, అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు. - తిరుమల



సార్ వెళ్లొద్దు..

జనగామ రూరల్: జనగామ గిరిజన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడు పోరిక రతన్‌సింగ్ శనివారం ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు. ఆయన సైతం విద్యార్థులతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ కంట తడి పెట్టుకున్నారు. వెళ్లొద్దు సార్.. అంటూ విద్యార్థులు ఏడుస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

వర్ణశోభిత సంధ్యవేళ





ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ భానుడు తన తాపంతో భూమిని దహించగా, సంధ్య వేళకు కోపం వదిలేసి కాంతుల కళలను ఆవిష్కృతం చేశారు. ఎర్రని పువ్వులెరుపుతో నింగిని రంగుల హరివిల్లు చేసి, ప్రకృతి అందాలతో మనసులు మురిపించాడు. నెల్లూరు బారాషహీద్ దర్గా సమీపంలోని స్వర్ణాల చెరువు వద్ద వినీలాకాశం తనవైపు చూసే ప్రతి చూపును మంత్రముగ్ధుల్ని చేసింది. నీలిగగనంలో కుంకుమ పువ్వుల వర్ణం చిమ్మినట్టుగా, నీటిపై ప్రతిబింబించిన ఆ కాంతులు స్వర్ణ శోభితంగా ఆవిర్భవించాయి. ప్రకృతి మాధుర్యాన్ని పెయింటింగ్ వేసినట్టుగా, రంగుల తోరణంగా శనివారం సాయంత్రం వర్ణశోభితంగా మారింది స్వర్ణాల చెరువు. - సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

సర్వదర్శనానికి 15 గంటలు




తిరుమల: శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటల సమయం పట్టనున్నట్లు అధికారులు తెలిపారు. 20 కంపార్ట్‌మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. శ్రీవారిని 82,367 మంది భక్తులు దర్శించుకోగా 31,420 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. హుండీ ద్వారా భక్తులు రూ.4.28కోట్లు కానుకలు చెల్లించారు.

రత్నగిరి కిటకిట



అన్నవరం: వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలోని సత్యదేవుని ఆదివారం కిటకిటలాడింది. రత్నగిరి పైన, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోను శనివారం రాత్రి, ఆదివారం వేకువజాము ముహూర్తాల్లో పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. దీంతో, అధిక సంఖ్యలో నవదంపతులు సత్యదేవుని వ్రతాలాచరించి, స్వామివారిని దర్శించారు. వారికి వారి బంధుమిత్రులు, ఇతర భక్తులు కూడా తోడవడంతో ఆలయ ప్రాంగణం రద్దీగా మారిపోయింది. సత్యదేవుని వ్రతాలు 2,500 నిర్వహించారు. స్వామివారిని దర్శించిన భక్తులు శ్రీగోకులంలో సప్త గోవులకు ప్రదక్షిణ చేసి శ్రీకృష్ణుడిని దర్శించారు. అనంతరం రావిచెట్టుకు ప్రదక్షిణ చేసి, జ్యోతులు వెలిగించారు. సుమారు 40 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించుకున్నారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. నిత్యాన్నదాన పథకంలో 5 వేల మంది సత్యదేవుని అన్నప్రసాదం స్వీకరించారు. సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని టేకు రథంపై ఆలయ ప్రాకారంలో ఘనంగా ఊరేగించారు.

చిరుత పల్లె కరింపు



కర్నూలు జిల్లా కౌతాళం మండలం తిప్పలదొడ్డి గ్రామ శివారులో ఒక చిరుత కొబ్బరి చెట్టు ఎక్కడం ఇటీవల సంచలనం రేపింది. తాను వేటాడిన ఆహారాన్ని దాచుకునేందుకు చిరుతలు చెట్లు ఎక్కుతుంటాయి. అలాగే ఇతర జంతువుల నుంచి ప్రాణ భయం ఉన్నప్పుడు కూడా చెట్లు ఎక్కుతుంటాయి. అయితే తిప్పలదొడ్డి వద్ద ప్రజల సందడికి భయపడి రక్షణ కోసం చిరుత కొబ్బరి చెట్టు ఎక్కింది.



కూనలతో చిరుత సంచారం

రైతులకు ఎంతో మేలు

చిరుత పులులు అడవి పందులను తిని రైతులకు ఎంతో మేలు చేస్తాయి. అడవి పందులు తమ సంతతిని విపరీతంగా పెంచుకుని మైదాన ప్రాంతాలకు విస్తరించిన సంగతి తెలిసిందే. ఇవి రైతుల పంటలను సర్వ నాశనం చేస్తూ తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. అయితే అడవి పంది పిల్లలను అమిత ఇష్టంగా వేటాడి తినడం చిరుత ప్రత్యేకత. అందుకే చిరుత పులులు రైతుల పొలాల వెంట సంచరిస్తూ పంది పిల్లల కోసం మాటు వేస్తుంటాయి. అలా పందులసంఖ్యను నియంత్రించడం ద్వారా చిరుతలు రైతులకు మేలు చేస్తుంటాయి. కాగా.. చిరుత పులి తన ఆహార జంతువుల జాబితాలో మనిషిని ఎంచుకోలేదు. రెండు కాళ్ల జంతువులు పులుల ఆహారపు మెనూలోనే లేవు.

- అడవిలో ఆహారపు కొరత
- ఆఫ్రికన్ స్వైన్‌ఫ్లూతో పందులు మృతి
- కుక్కల కోసం గ్రామాలకు వస్తున్న చిరుతపులులు



నల్లమల అడవిలో చిరుత పులి

ఆత్మకూరురూరల్: చిరుత పులి ఎలాంటి ప్రాంతంలోనైనా ఉండగలదు. దట్టమైన నల్లమలలలోను, చిట్టడవులు మాత్రమే ఉన్న ఎర్రమలలోను, కంప చెట్లు, రాతి కొండలు ఉండే ఉమ్మడి కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంలో హాయిగా బతికేస్తున్నాయి. అలాగే హైదరాబాదు, బెంగళూరు, ముంబయ్ లాంటి నగరాల శివార్లలోనూ జీవించ గలుగుతున్నాయి. ఇక గ్రామాల సంగతి చెప్పనవసరం లేదు. ఇటీవల ఉమ్మడి కర్నూలు జిల్లాలో పలు చోట్ల చిరుతల సంచారం కనిపించడం, ప్రజల్లో కొంత ఆందోళన కలగడం జరుగుతోంది

ఆహారం కోసమే..

గ్రామాల పరిసరాల్లో చిరుతలు సంచరించడం సహజమైనదే. చిన్న పాటి దాక్కునే ప్రదేశం ఉన్నా చిరుతలు తమనుతాము దాచుకుని ఎవరికి కనిపించకుండా మనుగడ సాగించగలవు. పంట పొలాల్లో ఉండే కుందేళ్ళు, అడవి పందుల పిల్లల వంటి వన్యప్రాణులతో పాటు గ్రామాల్లోని కుక్కలను ఆహారంగా తీసుకుంటాయి. ఇటీవలి కాలంలో రాళ్ల కొండల్లో, పొదల్లో చిరుతల ఆహారం తగ్గి పోవడంతో అనివార్యంగా గ్రామాల వైపు చిరుతలు వస్తూ జనం కంట పడుతున్నాయి. గొర్ల మందల వద్ద ఉన్న కుక్కలను, ఆవుల మందల్లో ఉండే దూడలను లక్ష్యంగా చేసుకుని చిరుతలు ఆహార సేకరణ చేస్తుంటాయి.

ఇదీ కారణం..

శ్రీశైలం మహాక్షేత్రంలో ఇటీవల చిరుత పులులు కాలనీల్లోని ఇళ్లలోకి కూడా వచ్చాయి. దీన్ని సునిశితంగా పరిశీలించిన అటవీ శాఖ అధికారులకు దీనికి ఆఫ్రికన్ స్వైన్ ఫ్లూ అనే వైరస్ సంబంధిత వ్యాధి కారణమని తేల్చారు. ఆఫ్రికన్ స్వైన్ ఫ్లూ వైరస్ పందులలో సంక్రమిస్తుంది. సున్నిపెంటలో కొందరు నడుపుతున్న పందుల ఫాంలోకి బెంగళూరు నుంచి తెచ్చిన పందుల వల్ల ఆఫ్రికన్ స్వైన్ ఫ్లూ చేరింది. ఈ పందుల నుంచి ఆ వైరస్ అడవి పందులపై ప్రభావం చూపడంతో పెద్ద సంఖ్యలో అడవి పందులు మరణించాయి. పంది పిల్లలే ముఖ్య ఆహారంగా తీసుకునే చిరుతలకు దీనివల్ల ఆహారం కొరత ఏర్పడింది. దీంతో చిరుతలు అనివార్యంగా కుక్కలను ప్రత్యామ్నాయంగా ఎంచుకుని శ్రీశైలంలోకి తరుచూ వచ్చేవి. శ్రీశైలం దేవస్థానం వారు చిరుత ఆహారపు కొరతను గమనించకుండా పుణ్యక్షేత్రంలో సంచరించే కుక్కలను పట్టి వేరే ప్రాంతంలో వదిలారు. దీంతో చిరుతలు సున్నిపెంటల్లో ఇళ్లలో పెంచుకునే పెట్ డాగ్స్, ఇతర పెంపుడు జంతువులకోసం ఏకంగా ఇళ్ళలో ప్రవేశించ సాగాయి.

కోసిగి ప్రాంతంలో ఇటీవల ఒక చిరుత పంట పొలాల్లో మత్తుగా పడి ఉండడం స్థానికులు గమనించారు. దాన్ని వెంటాడి బంధించే ప్రయత్నం చేశారు. ఆ చిరుత పులి ఆ తరువాత మరణించింది. దాన్ని పోస్ట్‌మార్టం చేసిన వైద్యులు తేల్చిన సత్యం ఏమిటంటే అది ఏదో జంతువును వేటాడినపుడు ఎముక ఒకటి దాని పేగులకు పొడుచుకుని ఇన్‌ఫెక్షన్‌కు గురైంది. అది పడుకుని ఉండగా బంధించే యత్నం చేయడంతో ఆ జంతువు ఆందోళనకు గురై హృదయ స్పందన ఆగి మృతిచెందింది.

ఇటీవల ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కొన్ని గ్రామాల్లో చిరుతలు సంచరిస్తున్నాయి. అడవిలో ఆహారపు కొరతతోనే అవి గ్రామాలవైపు వస్తున్నాయి.





తాటిచెట్టు ప్రకృతి ప్రసాదించిన కల్పతరువు. ఈ వృక్షంలోని ప్రతి భాగం వృథా కాకుండా బహుళ ప్రయోజనకారిగా ఉపయోగపడుతోంది. అలాంటి తాటిచెట్లు కొందరి స్వార్థ ప్రయోజనాలకు నేలకొరుగుతున్నాయి. ఈ పరిణామాలతో తాటిచెట్లు కాలక్రమేణా అంతరించి పోతున్న నేపథ్యంలో వీటి పరిరక్షణకు పందిరిమామిడి డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన పరిశోధన స్థానం సంకల్పించింది. వీటి ద్వారా అనుబంధ ఆహార ఉత్పత్తులు తయారుచేస్తూ గిరిజనుల ఆర్థికాభివృద్ధికి చేస్తున్న కృషికి మంచి ఫలితాలు వస్తున్నాయి.



ఏకతాటిగా సిరులు

- ఆంధ్రా కల్పవృక్షానికి మంచి రోజులు
- తాటి నీరాతో ఉత్పత్తుల తయారీపై విస్తృత పరిశోధనలు
- ఇప్పటికే పలు ఆహార ఉత్పత్తులు పరిచయం
- తాజాగా పండు గుజ్జుతో పానీయం

రంపచోడవరం: అంతరించిపోతున్న తాటి చెట్ల పరిరక్షణకు అల్లూరి జిల్లా పందిరిమామిడి డా.వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానం (హెచ్‌ఆర్‌ఎస్) శాస్త్రవేత్తలు విశేష కృషి చేస్తున్నారు. అఖిల భారత తాటి సమన్వయ పరిశోధన పథకంలో భాగంగా 1993 నుంచి ఇక్కడ పరిశోధనలు జరుగుతున్నాయి. తాటి చెట్ల నుంచి సేకరించిన నీరాపై జరిపిన పరిశోధనలు అనేక ఆహార ఉత్పత్తుల తయారీకి దోహద పడ్డాయి. తాటి పండ్ల నుంచి వచ్చే గుజ్జుతో మజా తరహాలో తయారుచేసిన పానీయం సోమవారం నుంచి వినియోగదారులకు అందుబాటులోకి రానుంది. ఈ మేరకు స్థానిక పరిశోధన స్థానంలో విక్రయించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

- దేశంలో దాదాపుగా 15 కోట్ల తాటి చెట్లు ఉండగా ఒక్క మన రాష్ట్రంలో మూడున్నర కోట్లకు పైగా ఉన్నాయి. ఇక్కడ పరిశోధనల నిమిత్తం 272 రకాల చెట్లు ఉన్నాయి. వీటి నుంచి సేకరించిన నీరాతో తాటి బెల్లం, తేగల నుంచి నూక, బిస్కెట్లు, జెల్లీ వంటి సుమారు 20 రకాల ఆహార పదార్థాలను విజయవంతంగా తయారుచేశారు. తాజాగా తాటి పండు గుజ్జు నుంచి పానీయం (డ్రింక్)ను హెచ్‌ఆర్‌ఎస్ సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి డా. పీసీ వెంగయ్య అభివృద్ధి చేశారు. తాటి గుజ్జులో సమపాళ్లలో నీటిని కలిపి మిక్స్ చేయడం ద్వారా ఎనర్జీ డ్రింక్‌ను రూపొందించారు. తాటి చెట్టు నుంచి పండు పడిన



ఉత్పత్తుల తయారీలో నిమగ్నమైన గిరి మహిళలు

మూడు గంటల్లో సేకరించడం ద్వారా ఆరోగ్యవంతమైన గుజ్జును పొందవచ్చని శాస్త్రవేత్త వెంగయ్య తెలిపారు. పానీయం తయారు విషయంలో కొన్ని జాగ్రత్తలు పాటించాలి. సేకరించిన పండ్లను వేడి నీటితో శుభ్రం చేయడం వల్ల పానీయానికి అవసరమైన మంచి గుజ్జును సేకరించవచ్చు.

- ఎక్కువ మొత్తంలో లభించే తాటి గుజ్జును నిల్వ చేయడంపై హెచ్‌ఆర్‌ఎస్‌లో జరుగుతున్న పరిశోధనలు తుది దశకు చేరుకున్నాయి. ఇక్కడి తాటి వనం నుంచి సేకరించిన తాటిపండ్ల గుజ్జును నిల్వ చేసి అధ్యయనం చేస్తున్నారు. రోజురోజుకు మార్కెట్లో తాటి ఆహార ఉత్పత్తులకు డిమాండ్ ఏర్పడడంతో గిరిజనులకు మంచి ఆదాయం వస్తుందని శాస్త్రవేత్తలు తెలిపారు. తాటిగుజ్జులో పోషక విలువలు ఉన్నాయి. ఐరన్, అధికంగా పోటాషియం, పాస్పరస్, మినరల్స్, విటమిన్ -సీ ఉన్నాయని వారు పేర్కొన్నారు.



అందుబాటులోకి రానున్న తాటిగుజ్జుతో తయారు చేసిన పానీయం

అందుబాటులోకి పానీయం



తాటి పండు గుజ్జు మంచి పోషకం. దీని ద్వారా తయారు చేసే ఆహార ఉత్పత్తులకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని విస్తృత పరిశోధనలు చేస్తున్నాం. ఇప్పటికే చాలా రకాల ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చాం. తాజాగా పానీయం (డ్రింక్) కూడా తెస్తున్నాం. తాటి ఆహార ఉత్పత్తుల తయారీపై గిరిజనులకు శిక్షణ ఇచ్చి మంచి ఆదాయం పొందేలా తీర్చిదిద్దుతాం.

-డా. పీసీ వెంగయ్య, ప్రధాన శాస్త్రవేత్త, పందిరిమామిడి ఉద్యానవన పరిశోధన స్థానం


పీజీ విద్య..ఇక మిథ్య

- కడప ప్రభుత్వ హోమియోపతి కాలేజీపై శీతకన్ను
- పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్లు కేటాయించని కౌన్సిల్
- పట్టించుకోని పాలకులు



కడపలోని ప్రభుత్వ హోమియోపతి కాలేజీ

కడప రూరల్: ప్రభుత్వ హోమియోపతి కాలేజీలు కడపతోపాటు గుడివాడ, రాజమండ్రిలో మాత్రమే ఉన్నాయి. పాలకుల నుంచి ఆలన..పాలన లేకపోవడంతో ఈ కాలేజీల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ప్రధానంగా ఈ వైద్య రంగంలో విద్యను అభ్యసించే వారికి కష్టతరంగా మారింది.



'యూజీ'లకు తీవ్ర నష్టం

డాక్టర్‌గా సేవలు అందించాలనేది బైపీసీ విద్యార్థుల కల. నీట్ పరీక్షలు రాశాక, ర్యాంకులు, ఇతర నిబంధనల మేరకు ప్రాధాన్యత ప్రకారం వరస క్రమంలో మొదటగా ఎంబీబీఎస్ తరువాత బీడీఎస్ (డెంటల్), ఆయుర్వేదం, హోమియెపతి, యూనానిలో సీట్లను కేటాయిస్తారు. కాగా హోమియోపతికి సంబంధించి ప్రభుత్వ కాలేజీలో సీటు వచ్చిన వారు నాలుగున్నరేళ్లపాటు యూజీ (అండర్ గ్రాడ్యుయేట్), ఒక ఏడాది హౌస్ సర్జన్‌గా చేయాలి. అనంతరం కీలకమైన పీజీ (పోస్టు గ్రాడ్యుయేట్) పూర్తి చేయాలి. ఇది మూడేళ్ల కోర్స్. ఈ కోర్స్‌ను పూర్తి చేసిన వారు మెడికల్ కాలేజీల్లో ఫ్యాకల్టీగా లేదా డిస్పెన్సరీల్లో మెడికల్ ఆఫీసర్‌గా చేయడానికి ఆస్కారం ఉంటుంది. పీజీకి అర్హత సాధించాలంటే ఇంకా కష్టపడి చదవాలి. కాగా కడప ప్రభుత్వ హోమియోపతి కాలేజీలో ఏటా 38 మంది విద్యార్థులు యూజీ చేయడానికి అవకాశం ఉంది. అయితే ఈ ఏడాది నేషనల్ కౌన్సిల్ ఆఫ్ హోమియోపతి వారు కడప ప్రభుత్వ హోమియోపతి కాలేజీకి ఒక్క పీజీ సీటును కూడా కేటాయించకపోవడం దారుణం. గుడివాడ కాలేజీకి మాత్రమే సీట్లను కేటాయించడం గమనార్హం. ఇప్పుడు కడప కాలేజీకి పీజీ సీట్లను కేటాయించకపోవడం వల్ల.. ఇకపై పీజీ సీట్లను కేటాయించరనే వాదన వినిపిస్తోంది. అదే గనుక జరిగితే యూజీ విద్యార్థులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని.. ఈ రంగానికి చెందిన ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

పాలకుల నిర్లక్ష్య వైఖరే కారణం

కూటమి ప్రభుత్వం వచ్చాక వైద్య రంగం కకావికలమైంది. ఆ రంగానికి చెందిన అన్ని వ్యవస్థలు దెబ్బతిన్నాయి. పులివెందుల వంటి మెడికల్ కాలేజీ కనుమరుగైంది. కేటాయించిన సీట్లు వెనక్కి వెళ్లిపోయాయి. దీంతో ప్రతిభ గల విద్యార్థులకు అన్యాయం జరిగింది. ఇప్పుడు అదే ఒరవడిలో హోమియోపతి వైద్య రంగం కూడా సమస్యలతో సతమతం అవుతోంది. పాలకపక్షం నుంచి కేంద్రంను 'మాకు మెడికల్ కాలేజీలు.. మెడికల్ సీట్లు కావాలి' అని అడిగే వారే కరువయ్యారు. దీంతో వైద్య రంగం పతనావస్థకు చేరిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వ హోమియోపతి కాలేజీలకు పీజీ సీట్ల కేటాయింపుల వివరాలు

సంవత్సరం	2024		2025	
	యూజీ	పీజీ	యూజీ	పీజీ
కడప	38	08	38	-
గుడివాడ	50	24	50	12
రాజమండ్రి	60	24	50	-

కేటాయింపుల కోసం ప్రయత్నాలు

కడప ప్రభుత్వ హోమియోపతి కాలేజీకి పీజీ సీట్ల కేటాయింపుల అంశానికి సంబంధించి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆయుష్ కమిషనర్ దినేష్‌కుమార్ చర్యలు చేపడుతున్నారు.

– డాక్టర్ శోభారాణి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, ప్రభుత్వ హోమియోపతి కాలేజీ, కడప



అరకు విహారం
ఘుమఘుమల కాఫీ సేవనం



**అరకు టూర్ అంటే అరకొరగా ఉండదు.
జీఐ ట్యాగ్ సొంతమైన కాఫీ రుచిలా ఉంటుంది.
చక్కటి పచ్చదనం మధ్య కాఫీ తోటల్లో విహారం.
చిక్కటి కాఫీ ఘుమఘుమల మధ్య ప్రకృతి వీక్షణం.
గాలికొండ నుంచి నేలమ్మకు వందనం చేయడం.
బొర్రా గుహల రాతి శిలల శిల్పచాతుర్యం.
ఆదివాసీ మ్యూజియం చెప్తున్న నాటి జీవనశైలి...
అందుకే దీనిని తూర్పు కనుమల రత్నం అన్నారు.
వీటన్నింటినీ చూపిస్తుంది అరకులోయ పర్యటన.**

విశాఖపట్నం నుంచి అరకుకు సాగే ప్రయాణమే ఓ అద్భుతం. కేరళలోని వయనాడు ప్రయాణం పశ్చిమ కనుమల సౌందర్యానికి అద్దం పడుతుంది. తూర్పు కనుమల లాలిత్యానికి అరకు ప్రయాణం దర్పణమవుతుంది. ఈ కాఫీ రుచి కొలమానం ప్రపంచస్థాయి అవార్డే. జీఐ ట్యాగ్ అందుకున్న కాఫీ ఇది. కాఫీ గింజలు ఓ రకమైన కమ్మదనాన్ని గాల్లో మోసుకొస్తుంటాయి. తోటల్లో విహరిస్తున్నప్పుడు చెట్ల ఆకులు ఒంటిని తాకుతూ కలిగించే గిలిగింతను మాటల్లో వర్ణించలేం. కాఫీ చెట్ల లేత ఆకులు ముదరు కాఫీ గింజ రంగులో ఉంటాయి. లేత కాఫీ గింజలు పచ్చగా ఉంటుంది. ముదిరే కొద్దీ చిక్కటి ఎరుపుదనం సంతరించుకుంటాయి. ఎండిన తర్వాత నల్లగా మారుతాయి. కాఫీ తోటల విహారం తర్వాత ముందుకు సాగే కొద్దీ ఒక్కొక్క ప్రదేశమూ మినిమమ్ గ్యారంటీ ఆహ్లాదాన్నిస్తాయి.

ట్రైబల్ మ్యూజియం

అరకు బస్ స్టేషన్ నుంచి కేవలం పావుకిలోమీటరు లోపే ఉంటుంది మ్యూజియం. తూర్పు కనుమల ప్రకృతి సౌందర్యం ఈ విజిట్‌లో ప్రత్యేక ఆకర్షణ. అరకు, విశాఖపట్నం పరిసరాల్లో 19 రకాల ఆదివాసీ జాతుల వాళ్లు నివసించేవారు. ట్రైబల్ కల్చర్, అందులోని వైవిధ్యతను పరిరక్షించే ఉద్దేశంతో దీనిని 1996లో ఏర్పాటు చేసింది రాష్ట్ర ప్రభుత్వం. ఇందులో ఆదివాసీలు ప్రాచీన కాలం నుంచి ఉపయోగించిన వస్తువులు, ధరించిన ఆభరణాలు, దుస్తులు, వేటాడే సాధనాలు, వంట సామగ్రి, వారి పెళ్లి వేడుక ఫొటోలు ఉన్నాయి. ఆదివాసీలు రూపొందించిన చిత్రలేఖనాలు, కళారూపాలను కూడా చూడవచ్చు. వారి మయూర నృత్యం, ధింసా నృత్యం శిల్పాలు ఆకర్షణీయంగా ఉంటాయి. ఎర్రమట్టితో నిర్మించి తెల్లటి అంచులతో ఈ భవనం ఆర్కిటెక్చర్ బాగుంటుంది. ఈ మ్యూజియం ఉదయం పది గంల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు తెరిచి ఉంటుంది. ప్రభుత్వం నిర్వహిస్తున్న మ్యూజియం కావడంతో టికెట్ నామమాత్రమే. పెద్దవాళ్లకు పది రూపాయలు, పిల్లలకు ఐదు రూపాయలు.

పద్మపురం గార్డెన్స్

ఇది అరకు బస్ స్టేషన్ నుంచి రెండున్నర కిలోమీటర్ల దూరాన ఉంది. చాలా ప్రసిద్ధి చెందిన గార్డెన్ ఇది. పాతిక ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన ఈ గార్డెన్‌ని స్వాతంత్య్రానికి ముందు బ్రిటిష్ పాలన కాలంలో 1942లో ఏర్పాటు చేశారు. ఇక్కడ పండిన కూరగాయలు రెండవ ప్రపంచ యుద్ధంలో పోరాడిన సైనికుల కోసం వెళ్లేవని చెబుతారు. యుద్ధం ముగిసిన తర్వాత ఈ గార్డెన్‌ని హార్టికల్చర్ నర్సరీ, మొక్కల పెంపకంలో శిక్షణ కేంద్రంగా మార్చారు. ఇక్కడి వృక్ష శిల్పాలు కనువిందు చేస్తాయి. చెట్టుని శిల్పం ఆకారంలో మలిచి పెంచడానికి కొన్నింటికి దశాబ్దాలు పడుతుంది. ఈ గార్డెన్ మొత్తం తిరిగి చూడడానికి టాయ్ ట్రెన్ ఎక్కాలి. ఈ గార్డెన్‌లో ట్రీ టాప్ హట్స్ ఉన్నాయి. అంటే చెట్టు మీద గూడిసెలన్నమాట. టూరిస్టులు రాత్రి బస కోసం బుక్ చేసుకోవచ్చు. వీటిని హ్యాంగింగ్ కాటేజ్ అంటారు. ఈ గార్డెన్స్‌లో రోజ్ గార్డెన్ ఉంది. పద్మపురం గార్డెన్స్‌కి ఎంట్రీ టికెట్ పది రూపాయలు, ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు అనుమతి.

కుర్సురా మ్యూజియం

ఇది దేశ భద్రత కోసం 31 సంవత్సరాలపాటు నిర్విరామంగా సేవలందించి విశ్రాంతి తీసుకుంటున్న సబ్ మెరైన్. ఇండో- పాక్ యుద్ధంలో ఈ సబ్‌మెరైన్ అరేబియా సముద్రంలో గస్తీ కాసింది. ఆ తర్వాత అండమాన్ దీవులలో సేవలందించి తన సర్వీస్ కాలంలో 73,500 నాటికల్ మైళ్లు ప్రయాణించిన ఈ సబ్‌మెరైన్ 2001 నుంచి విశ్రాంతిలో ఉంది. ఇంతటి సమగ్రమైన సబ్‌మెరైన్‌ను ప్రభుత్వం 2002 లో ప్రదర్శనశాలగా మార్చింది. ఇది పిల్లలకు, పెద్దవాళ్లకు కూడా వినోదభరితంగా జ్ఞానాన్ని పంచే అధ్యయన కేంద్రం. దీని నిర్వహణకు ప్రభుత్వానికి సుమారుగా ఎనభై లక్షల రూపాలయలు ఖర్చవుతున్నాయి. అయితే ఈ సబ్‌మెరైన్ వీక్షణానికి వచ్చే పర్యాటకుల ఎంట్రీ టికెట్‌ల మీద ఏడాదికి కోటి రూపాయలను సంపాదిస్తోందీ సబ్‌మెరైన్. రోజుకు ఐదారు వందల మంది పర్యాటకులు వస్తుంటారు. సెలవు రోజుల్లో ఈ సంఖ్య రెట్టింపవుతుంటుంది. విశాఖపట్నానికి వచ్చిన వాళ్ల రామకృష్ణ బీచ్‌ని, అందులో ఉన్న సబ్‌మెరైన్ మ్యూజియాన్ని చూడకుండా రారంటే అతిశయోక్తి కాదు.

కైలాసగిరి

ఇది విశాఖపట్నం నగరానికి సమీపంలో ఆరువందల అడుగుల ఎత్తున్న కొండ. సుమారు నాలుగు వందల ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఎకోపార్కు ఇది. రోప్‌వేలో కొండమీదకు వెళ్లడం పిల్లలకే కాదు పెద్దవాళ్లకు కూడా జాయ్‌ఫుల్‌గా ఉంటుంది. బెస్ట్ టూరిస్ట్ స్పాట్ అవార్డు అందుకున్న పర్యాటక ప్రదేశం ఇది. స్థానికులు, బయటి వాళ్లు అంతా కలిసి కైలాసగిరిని రోజుకు మూడు వేల మందికి పైగా సందర్శిస్తారు.

గాలికొండ వ్యూ పాయింట్

ఈ టూర్‌లో తూర్పు కనుమల ప్రకృతి సౌందర్యాన్ని అనంతంగా ఆస్వాదించవచ్చు. విశాఖపట్నం- అరకు రీజియన్‌లో ఎత్తైన ప్రదేశం గాలికొండ. 4,320 అడుగుల ఎత్తు ఉంటుంది. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. పచ్చదనంలో షేడ్స్‌ను లెక్కపెట్టాలంటే ఈ రోడ్డు వెంట ప్రయాణిస్తున్నంత సేపూ కనురెప్ప వేయకుండా చూడాలి. ఇక బొర్రా గుహలు ఓ ప్రకృతి అద్భుతం. గుహల పై కప్పు నుంచి స్టాలగ్‌మైట్ ధారలు ధారలుగా కారుతూ వాతావరణంలో మార్పులతో గడ్డకట్టిపోయి ఉంటుంది. అమరనాథ్ లో మంచు శివలింగం రూపం సంతరించుకున్నట్లు ఇక్కడ స్టాలగ్‌మైట్‌తో ఏర్పడిన శివలింగం రూపానికి పూజలు చేస్తారు. అమర్‌నాథ్ మంచులింగం ఏటా కరిగిపోతూ కొత్తగా రూపుదిద్దుకుంటుంది. బొర్రా గుహల్లోని స్టాలగ్‌మైట్ శివలింగం స్థిరంగా ఉంటూ ఉంటుంది.

చందనోత్సవ సింహాచలం

శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి ఏడాదంతా చందనలేపనంతో ఉంటాడు. ఏడాదికోసారి చందనోత్సవం జరుగుతుంది. ఈసందర్భంగా పాత చందన లేపనాన్ని తొలగించి కొత్తగా చందనలేపనం చేస్తారు. స్వామి దేహం నుంచి తీసిన చందనాన్ని భక్తులకు ప్రసాదంగా పంచుతారు. ఈ ఆలయంలో కప్పస్తంభం అని ఉంటుంది. అది కప్పం అనే పదం నుంచి వచ్చింది. రాజుకు కప్పం కట్టని ఉద్యోగులను ఆ స్తంభానికి కట్టేసి శిక్షించేవారని స్థానిక కథనం. ఇప్పుడు భక్తులను ఆ స్తంభానికి కట్టేసి, తాడుతో సున్నితంగా రెండు దెబ్బలు వేస్తారు. ఆ స్తంభాన్ని కౌగలించుకుని కోరికలు కోరుకుంటే అవి తీరుతాయని ఒక విశ్వాసం. సంతానాన్ని కోరుకునే వారు. పుట్టిన సంతానాన్ని దేవుని దర్శనానికి తీసుకువచ్చి మొక్కు తీర్చుకునే వారు. దాంతో కప్పస్తంభాన్ని కౌగలించుకుని కోరుకుంటే సంతానం కలుగుతుందనే అభిప్రాయం వాడుకలోకి వచ్చింది. సింహాచలంలో సంపెంగ పూలు ప్రసిద్ధి. చందనం రంగులో పొడవుగా ఉండే ఈ పూలను అటవీ ప్రదేశం నుంచి ఆదివాసీలు సేకరించి తెస్తారు. వాటిని మాలలుగా కట్టి అమ్ముతారు. ఈ టూర్ గుర్తుగా ఓ దండ కొనుక్కుని తలకు అలంకరించుకోవచ్చు లేదా మెడలో మాలగా వేసుకుని పరిమళాన్ని ఆస్వాదించవచ్చు.

అన్నవరం

శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి ఆలయం ఎంతటి ప్రసిద్ధి అంటే తిరుమల తిరుపతి దేవస్థానం తర్వాత అంతటి ప్రాశస్త్యం కలిగిన ఆలయం. పురాణాల్లో ఉదహరించిన రత్నాచలం అనే ప్రదేశం ఇదేనని చెబుతారు. ఈ ఆలయం ఉన్న కొండ పేరు రత్నగిరి. ఈ ఆలయంలో సత్యనారాయణ వ్రతం చేసుకోవడానికి భక్తులు ఆసక్తి చూపుతుంటారు.

అరకు టూర్‌లో రైలు, రోడ్డు రవాణా సంస్థలు నిర్వహిస్తున్న ఈ రెండు ప్యాకేజ్‌లలో ఉన్న ప్రధానమైన తేడా అన్నవరం, సింహాచలం ఆలయాల విషయంలోనే. తెలంగాణ టూరిజమ్ బస్సు టూర్‌లో అన్నవరం సత్యనారాయణ స్వామి దర్శనం చేసుకోవచ్చు. ఐఆర్‌సీటీసీ టూర్‌లో వెళ్తే సింహాచలం వరాహ లక్ష్మీనరసింహస్వామి స్వామి దర్శనం చేసుకోవచ్చు. మిగిలిన పర్యాటక ప్రదేశాలు రెండు టూర్‌లలోనూ ఒకే విధంగా ఉంటాయి. బస్ టూర్‌లో ధింసా నృత్యం అదనం.


ట్రైబల్ మ్యూజియం


సింహాచలం దేవాలయం


బొర్రా గుహలు


పద్మపురం గార్డెన్స్


గిరిజన నృత్యం

జ్యూవెల్ ఆఫ్ ఈస్ట్‌కోస్ట్ ఐదు రోజుల టూర్‌లో విశాఖపట్నం, అరకు కవర్ అవుతాయి. అరకులో పర్యటించడానికి సెప్టెంబర్ నుంచి అనువైన సమయం. దసరా సెలవులకు ప్లాన్ చేసుకుంటే కాఫీ తోటల సౌందర్యాన్ని ఆస్వాదించడంతోపాటు పిల్లలకు సబ్ మెరైన్ నేవీ యుద్ధ నౌకను చూపించవచ్చు.

ఐఆర్‌సీటీసీ టూర్ ఇలా ఉంది!

మొదటి రోజు: గురువారం సాయంత్రం ఐదు గంటల ఐదు నిమిషాలకు 12728 నంబర్ గోదావరి ఎక్స్‌ప్రెస్ హైదరాబాద్ రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరుతుంది.

రెండవ రోజు: శుక్రవారం ఉదయం 5.55 గంటలకు విశాఖపట్నం చేరుతుంది. ఐఆర్‌సీటీసీ టూర్ నిర్వాహకులు పర్యాటకులను రిసీవ్ చేసుకుని హోటల్‌కు తీసుకెళ్తారు. చెక్ ఇన్, రిఫ్రెష్‌మెంట్, బ్రేక్‌ఫాస్ట్ తర్వాత సిటీ టూర్. కాళీమాత ఆలయం, సబ్‌మెరైన్ మ్యూజియం వీక్షణం తర్వాత హోటల్‌కు వచ్చి లంచ్ చేయడం. మధ్యాహ్నం తర్వాత కైలాసగిరి సందర్శనం, రిషికొండ బీచ్ విహారం. రాత్రి బస విశాఖపట్నం హోటల్‌లో.

మూడవ రోజు: బ్రేక్‌ఫాస్ట్ తర్వాత రోడ్డు మార్గాన అరకుకు ప్రయాణం. టైడా జంగిల్ బెల్స్ ఎకో టూరిజమ్ రిసార్ట్‌లో సేదదీరడం, పద్మపురం గార్డెన్స్, ట్రైబల్ మ్యూజియం విజిట్ తర్వాత లంచ్ విరామం. మధ్యాహ్నం తర్వాత గాలికొండ వ్యూ పాయింట్, బొర్రా గుహల విహారం తర్వాత సాయంత్రానికి తిరిగి విశాఖపట్నంలోని హోటల్‌కు చేరడం, రాత్రి బస.

నాలుగవ రోజు: బ్రేక్‌ఫాస్ట్ తరవాత హోటల్ గది చెక్ అవుట్ చేసి బయలుదేరాలి. దారిలో సింహాచలం దేవస్థానం, రామకృష్ణ బీచ్‌లో విహారం తర్వాత నాలుగు గంటలకు విశాఖపట్నంలో స్టేషన్‌లో డ్రాప్ చేస్తారు. సాయంత్రం ఐదు గంటల ఇరవై నిమిషాలకు ట్రైన్ నంబర్ 12727 గోదావరి ఎక్స్‌ప్రెస్ బయలుదేరుతుంది. రాత్రంతా ప్రయాణం.

ఐదవ రోజు: ఉదయం ఆరు గంటల పదిహేను నిమిషాలకు హైదరాబాద్‌కు చేరడంతో టూర్ పూర్తవుతుంది.

ఐఆర్‌సీటీసీ ప్యాకేజ్ ధరలివి:

- కంఫర్ట్ కేటగిరీ (థర్డ్ ఏసీ), సింగిల్ షేరింగ్‌లో ఒక్కొక్కరికి దాదాపుగా 28 వేల రూపాయలవుతాయి. ట్విన్ షేరింగ్‌లో ఒక్కొక్కరికి 17 వేలవుతాయి. ట్రిపుల్ షేరింగ్‌లో 13 వేలకు పైగా ఉంటుంది.
- స్టాండర్డ్ కేటగిరీ (స్లీపర్) సింగిల్ షేరింగ్‌లో 26 వేలకు పైగా అవుతుంది. ట్విన్ షేరింగ్‌లో 15 వేలకు పైగా, ట్రిపుల్ షేరింగ్‌లో 11 వేలకు పైగా అవుతుంది.
- ప్యాకేజ్‌లో మూడు బ్రేక్‌ఫాస్ట్‌లు, ఒక లంచ్, రెండు డిన్నర్లుంటాయి.
- ఇది వీక్లీ టూర్. గురువారం మాత్రమే ఉంటుంది.
- ఇవి వర్తించవు: ప్యాకేజ్‌లో సూచించిన భోజనాలు తప్ప ఇతర భోజనాలు పర్యాటకులు సొంతంగా భరించాలి. రైల్లో కొనుక్కున్న తినుబండారాలు, పర్యాటక ప్రదేశాల ఎంట్రీ టికెట్‌లు, బోటింగ్, హార్స్‌రైడింగ్ వంటి ఇతర టికెట్‌లు వగైరాలు ప్యాకేజ్‌లో వర్తించవు.

టూర్ కోడ్: https://www.irctctourism.com/pacakage_description?packageCode=SHR027

తెలంగాణ టూరిజమ్ నిర్వహిస్తున్న రోడ్ ప్యాకేజ్ ఇలా ఉంది!



మొదటి రోజు: సాయంత్రం ఆరు గంటలకు హైదరాబాద్‌లోని పర్యాటక భవన్ (బేగంపేట, గ్రీన్‌ల్యాండ్స్) నుంచి తెలంగాణ టూరిజమ్ బస్ బయలుదేరుతుంది. అదే బస్సు ఆరున్నరకు బషీర్‌బాగ్ సీఆర్‌వో ఆఫీసు చేరుతుంది. ఆ స్టాప్‌కు సమీపంలో ఉన్న వాళ్లు అక్కడే ఎక్కవచ్చు. రాత్రంతా ప్రయాణం కొనసాగుతుంది.

రెండవ రోజు: ఉదయం ఆరు గంటలకు బస్సు విశాఖపట్నం చేరుతుంది. హోటల్ గదిలో చెక్ ఇన్, రిఫ్రెష్‌మెంట్, బ్రేక్‌ఫాస్ట్ తర్వాత సిటీటూర్. కైలాసగిరి, సింహాచలం, రుషికొండ, సబ్‌మెరైన్ మ్యూజియం విజిట్, బీచ్ విహారం తర్వాత హోటల్‌కు చేరడం, రాత్రి బస.

మూడవ రోజు: ఉదయం ఆరు గంటలకు అరకుకు ప్రయాణం. ట్రైబల్ మ్యూజియం విజిట్, అనంతగిరి కాఫీ ప్లాంటేషన్‌లో విహారం, బొర్రా గుహల వీక్షణం, ధింసా నాట్యాన్ని ఆస్వాదించడం ఆ రాత్రికి అరకులో బస.

నాలుగవ రోజు: అరకు నుంచి అన్నవరానికి ప్రయాణం. అన్నవరం సత్యనారాయణ స్వామిని దర్శించుకున్న తర్వాత బస్సు ప్రయాణం హైదరాబాద్‌కు సాగుతుంది.

ఐదవ రోజు: ఉదయం ఏడు గంటలకు బస్సు హైదరాబాద్‌కు చేరడంతో టూర్ పూర్తవుతుంది.

బస్ ప్యాకేజ్ ఇలా...

- తెలంగాణ టూరిజమ్ నిర్వహిస్తున్న అరకు టూర్ ప్యాకేజ్‌లో పెద్దవాళ్లకు ఒక్కొక్కరికి 6,999 రూపాయలు, పిల్లలకు 5,599 రూపాయలు.
- ప్యాకేజ్‌లో నాన్ ఏసీ బస్సు ప్రయాణం, వైజాగ్‌లో ఏసీ బస, అరకులో నాన్ ఏసీ బస ఉంటాయి.
- ఆహారం, పర్యాటక ప్రదేశాల్లో ఎంట్రీ టికెట్‌లు, దర్శనం టికెట్‌లు, బోటింగ్ వంటివేవీ వర్తించవు.


కుర్సురా మ్యూజియం


అన్నవరం దేవాలయం


కైలాసగిరి, వైజాగ్

- వాకా మంజులారెడ్డి,
సాక్షి, ఫీచర్స్ ప్రతినిధి

ఆర్‌బీఐ వైపు మార్కెట్ చూపు



ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లు ప్రధానంగా రిజర్వ్ బ్యాంక్ పరపతి నిర్ణయాలవైపు దృష్టి సారించనున్నాయి. అంతేకాకుండా ఇప్పటికే జోరందుకున్న ఏప్రిల్–జూన్(క్యూ1) ఫలితాలు సైతం సెంటిమెంటును ప్రభావితం చేయనున్నాయి. వీటికితోడు అంతర్జాతీయ అంశాలు, ఆర్థిక గణాంకాలు సైతం కీలకంకానున్నట్లు మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

- సాక్షి, బిజినెస్ డెస్క్

- బుధవారం మానిటరీ పాలసీ సమీక్ష
- ఎస్‌బీఐ, ఎల్ఐసీ.. క్యూ1 ఫలితాలు
- జాబితాలో ఎయిర్‌టెల్, టాటా మోటార్స్ బజాజ్ ఆటో, హీరో మోటో, అదానీ పోర్ట్స్

గత వారాంతాన ఫెడరల్ బ్యాంక్, ఏబీబీ ఇండియా, జేకే లక్ష్మీ సిమెంట్ తదితరాలు ఈ ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసిక ఫలితాలు ప్రకటించాయి. వీటికితోడు మరిన్ని దిగ్గజాలు ఈ వారం ఏప్రిల్–జూన్(క్యూ1) పనితీరును వెల్లడించనున్నాయి. ఈ జాబితాలో బాష్, శ్రీసిమెంట్స్, మారికో, ఏబీ క్యాపిటల్, భారతీ ఎయిర్‌టెల్, అదానీ పోర్ట్స్, బ్రిటానియా, బజాజ్ ఆటో, ట్రెంట్, పిడిలైట్ ఇండస్ట్రీస్, పీఎఫ్‌సీ, హీరో మోటోకార్ప్, బీహెచ్ఈఎల్, ఎల్ఐసీ, టైటన్ కంపెనీ, హెచ్‌పీసీఎల్, స్టేట్‌బ్యాంక్, టాటా మోటార్స్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్ తదితరాలున్నాయి. నేడు(సోమవారం) ఫెడరల్ బ్యాంక్, ఏబీబీ, జేకే లక్ష్మీ సిమెంట్ కౌంటర్లలో యాక్టివిటీ కనిపించనున్నట్లు రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా పేర్కొన్నారు.

గత పాలసీలో స్పీడ్

రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన సమావేశమైన మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) గత సమీక్షలో అనూహ్యంగా కీలక వడ్డీ రేటు రెపోలో 0.5 శాతం కోత పెట్టింది. దీంతో మే నెలలో రెపో రేటు 5.5 శాతానికి దిగివచ్చింది. ఆర్థికవేత్తలు 0.25 శాతం తగ్గింపు అంచనా వేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి చూస్తే రెపో రేటు 1 శాతం తగ్గింది. ఫలితంగా 2022 ఆగస్ట్ తదుపరి వడ్డీ రేట్లు కనిష్టానికి చేరాయి. నేడు ప్రారంభంకానున్న ఆర్‌బీఐ పాలసీ సమీక్షా సమావేశాలు బుధవారం(6న) ముగియనున్నాయి. యూఎస్ టారిఫ్‌ల విధింపు, 3 శాతానికంటే దిగువకు చేరిన ద్రవ్యోల్బణం, ఈ ఏడాది ద్వితీయార్థంలో జీడీపీ నెమ్మదించవచ్చన్న అంచనాలు మరో 0.25 శాతం రేట్ల కోతకు వీలున్నట్లు ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. అయితే గత రేట్ల కోత, ఈ ఏడాది తొలి 3 నెలల్లో జీడీపీ 7.4 శాతం వృద్ధి అంచనాల నేపథ్యంలో యథాతథ రేట్ల అమలుకే కట్టుబడవచ్చని మరికొంతమంది నిపుణులు అభిప్రాయపడ్డారు. దీంతో ఇన్వెస్టర్లు పాలసీ నిర్ణయాలపై దృష్టి పెట్టనున్నట్లు స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ సీనియర్ టెక్నికల్ అనలిస్ట్ ప్రవేష్ గౌర్ తెలియజేశారు.

గత వారం డీలా..

శుక్రవారం(ఆగస్ట్ 1)తో ముగిసిన గత వారం స్టాక్ మార్కెట్లు వరుసగా ఐదో వారం నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్(బీఎస్ఈ) 863 పాయింట్లు(1.1 శాతం) క్షీణించి 80,560 వద్ద నిలిచింది. నిఫ్టీ(ఎన్ఎస్ఈ) 272 పాయింట్లు(1.1 శాతం) నీరసించి 24,565 వద్ద స్థిరపడింది. ఈ బాటలో బీఎస్ఈ మిడ్ క్యాప్ 1.8 శాతం, స్మాల్ క్యాప్ 2.5 శాతం చొప్పున పతనమయ్యాయి.

సాంకేతికంగా చూస్తే..

యూఎస్ టారిఫ్‌ల విధింపు, ఎఫ్‌పీఐల అమ్మకాలకుతోడు గత వారాంతాన ప్రపంచ మార్కెట్లు డీలా పడటంతో దేశీయంగా సెంటిమెంటు బలహీనపడినట్లు సాంకేతిక నిపుణులు పేర్కొన్నారు. దీంతో మార్కెట్లు మరింత బలహీనపడవచ్చని అభిప్రాయపడ్డారు. వీటి ప్రకారం సాంకేతికంగా ఎన్ఎస్ఈ ప్రధాన ఇండెక్స్ నిఫ్టీ 24,900 స్థాయిలో నిలదొక్కుకోలేకపోయింది. ఒక దశలో 24,550 దిగువకు చేరింది. దీంతో ఈ వారం 24,450 వద్ద తొలి మద్దతు లభించవచ్చు. ఇక్కడినుంచి పుంజుకుంటే 24,900–25,000కు తిరిగి చేరవచ్చు. ఇలాకాకుండా మరింత నీరసిస్తే 24,300కు, ఆపై 24,000 పాయింట్లస్థాయికి క్షీణించే వీలుంది.

విదేశీ గణాంకాలు

జులై నెలకు చైనా సర్వీసుల రంగ గణాంకాలు మంగళవారం(5న) వెలువడనున్నాయి. గురువారం (7న) వాణిజ్య గణాంకాలు వెల్లడికానున్నాయి. జూన్‌లోనే చైనా వాణిజ్య మిగులు దాదాపు 115 బిలియన్ డాలర్లకు చేరింది. అంతక్రితం 99 బిలియన్ డాలర్లుగా నమోదైంది. కాగా.. జులై నెలకు యూఎస్ తయారీ, సర్వీసుల రంగ గణాంకాలు సైతం సోమ, మంగళవారాల్లో వెలువడనున్నాయి. ఇక ఈ వారం బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్(బీవోఈ) వడ్డీ రేట్ల సమీక్షను చేపట్టనుంది.

ఇతర అంశాలు..

యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ తాజాగా భారత్‌పై 25 శాతం టారిఫ్‌లను విధించడంతో 48 బిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడనున్నట్లు అంచనాలు వెలువడ్డాయి. ప్రధానంగా టెక్స్‌టైల్స్, ఫార్మా, రత్నాభరణాలు, ఆక్వా, ఫుట్‌వేర్, కెమికల్స్ తదితర పలు రంగాలకు సవాళ్లు ఎదురుకానున్నట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. ఇవి మార్కెట్ సెంటిమెంటును దెబ్బతీసినట్లు మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా, జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ పెట్టుబడుల ప్రధాన వ్యూహకర్త వీకే విజయకుమార్ తెలియజేశారు. మరోపక్క గత నెలలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) దేశీ స్టాక్స్‌లో అమ్మకాలకే అధిక ప్రాధాన్యమిస్తూ వచ్చినట్లు వివరించారు. జూలైలో నికరంగా రూ.17,741 కోట్ల విలువైన షేర్లను నికరరంగా విక్రయించారు.

డీసీబీ లాభం 20% జంప్



న్యూఢిల్లీ: ప్రైవేటు రంగ డీసీబీ బ్యాంక్ జూన్ త్రైమాసికంలో రూ.157 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.131 కోట్లతో పోల్చి చూస్తే 20 శాతం పెరిగింది. ఆదాయం రూ.1,632 కోట్ల నుంచి రూ.2,050 కోట్లకు వృద్ధి చెందింది. రుణ ఆస్తులను గమనిస్తే.. వసూలు కాని స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏలు) 2.98 శాతంగా ఉన్నాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో ఇవి 3.33 శాతంగా ఉన్నాయి.

ఇమామీ లాభం రూ.164 కోట్లు



కోల్‌కతా: ఎఫ్ఎంసీజీ సంస్థ ఇమామీ లిమిటెడ్ జూన్ క్వార్టర్‌లో స్థిరమైన పనితీరు చూపించింది. రూ.904 కోట్ల ఆదాయంపై రూ.164 కోట్ల లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలోని పనితీరుతో పోల్చితే లాభం 9 శాతం పెరగ్గా.. ఆదాయం ఎలాంటి మార్పు లేకుండా ఫ్లాట్‌గా నమోదైంది. ఆదాయం పెరగకపోయినా.. వ్యయాలను నియంత్రించుకోవడం, నిర్వహణ సామర్థ్యాలు పెంచుకోవడం లాభాల వృద్ధికి దారితీసినట్టు కంపెనీ తెలిపింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి రూ.142 కోట్ల ఆదాయం సమకూరింది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఈ మొత్తం రూ.138 కోట్లుగా ఉంది. క్విక్ కామర్స్ ఛానళ్ల ద్వారా అమ్మకాలు క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే మూడు రెట్లు పెరిగినట్టు కంపెనీ వైస్ చైర్మన్ మోహన్ గోయెంకా తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

4-8-2025

విశాఖ	470–00
చిత్తూరు	513–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	470–00
విజయవాడ	475–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	435–00
వరంగల్	437–00
రిటైల్ ధర	4.95

‘అఫర్డబుల్’ జీవిత బీమాకు ప్రాధాన్యత

అతుల్ శ్రీవాస్తవ



చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్, ఏజియాస్ ఫెడరల్ లైఫ్ ఇన్సూరెన్స్

అనిశ్చితి నుంచి రక్షణ కల్పించే సంప్రదాయ సాధనంగా నిలుస్తున్న జీవిత బీమా కొన్నాళ్లుగా గణనీయ మార్పులకు లోనైంది. ఒకప్పుడు రియాక్టివ్ రక్షణ కవచంగా వ్యవహరించేది కాస్తా ఇప్పుడు ఆర్థిక సాధికారత కల్పించే క్రియాశీల ప్రోయాక్టివ్ సాధనంగా మారింది. మారుతున్న జీవన విధానాలు, డిజిటల్ వినియోగానికి అనుగుణంగా బీమా పరిశ్రమ తనను తాను మల్చుకునే కొద్దీ, జీవిత బీమా అసలు అవసరమా అనే ప్రశ్న కన్నా వినియోగదారులకు సంస్థలు ఆఫర్ చేసే పథకాలు నిజంగా వారి అవసరాలకు తగ్గట్టుగానే ఉన్నాయా లేదా అనేది ప్రధాన ప్రశ్నగా ఉంటోంది.

ప్రతి దశలో ఆర్థిక భాగస్వామి..

డిజిటల్ మౌలిక సదుపాయాలు, డేటా అనలిటిక్స్ మొదలైన అంశాల దన్నుతో బీమా పథకాలు మరింత సరళతరంగా, వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా మారాయి. సంపద సృష్టి, ఆదాయార్జన, కుటుంబానికి ఆర్థిక సంరక్షణ తదితర లక్ష్యాల సాధనకు తోడ్పడేవిగా ఉంటున్నాయి. భవిష్యత్ అవసరాల కోసం పొదుపు చేసుకోవడంలో కెరియర్ ప్రారంభిస్తున్న యువ ప్రొఫెషనల్స్‌కి, పిల్లల చదువులు కోసం పొదుపు చేయడంలో కుటుంబాలకు, స్థిరమైన ఆదాయాన్ని కోరుకునే రిటైరీల నిర్దిష్ట ఆర్థిక లక్ష్యాల సాధనకు ఉపయోగపడేదిగా జీవిత బీమా ఉంటోంది. 2024 సెప్టెంబర్ నాటికి దేశీయంగా మొత్తం సమ్ అష్యూర్డ్ వార్షిక ప్రాతిపదికన 15% పెరిగి రూ. 36.37 లక్షల కోట్లకు చేరడమనేది ఈ ట్రెండ్‌నే సూచిస్తోంది. జీవిత బీమాపై పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనం.

ఖరీదైనదనే అపోహ..

జీవిత బీమా పాలసీలతో అనేక ప్రయోజనాలు ఉన్నప్పటికీ, చాలా మంది వీటిని తీసుకోవడం లేదు. ఇవి చాలా ఖరీదైనవనే అపోహే ఇందుకు కారణం. సాధారణంగా వీలైనంత తక్కువ వయస్సులోనే తీసుకుంటే పాలసీలు చాలా తక్కువ ప్రీమియంలతో, అత్యధిక కవరేజీని పొందవచ్చు. కానీ ఖరీదైనవనే అపోహల వల్ల యువత కూడా సాధ్యమైనంత ముందుగా బీమాను తీసుకోవడం తక్కువగా ఉంటోంది. ఐఆర్‌డీఏఐ నివేదిక ప్రకారం, 2024 ఆర్థిక సంవత్సరంలో భారత్‌లో జీవిత బీమా కవరేజీ అనేది స్థూల దేశీయోత్పత్తిలో 2.8 శాతంగానే ఉంది. అంతర్జాతీయ సగటు అయిన 7 శాతంతో పోలిస్తే ఇది చాలా తక్కువ కావడం గమనార్హం. ఈ రెండింటి మధ్య భారీ వ్యత్యాసం ఉన్నప్పటికీ, బీమాను విస్తరించేందుకు (ముఖ్యంగా యువతలో, అంతగా సేవలు అందని వర్గాల్లో) గణనీయంగా అవకాశాలు ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో జీవిత బీమా అనేది ఎంత అఫోర్డబుల్‌గా, ఎంత ఉపయోగకరంగా ఉంటుందనే విషయాలపై అవగాహన పెంపొందించడంపై, అలాగే తమ ఆర్థిక భవిష్యత్తు గురించి ప్రణాళికలు వేసుకోవడంలో ప్రజలకు తోడ్పాటు అందించడంపై బీమా పరిశ్రమ మరింతగా దృష్టి సారించాల్సి ఉంటుంది. ప్రస్తుతం జీవిత బీమా అంటే రక్షణకు మాత్రమే పరిమితం కాకుండా, ప్రజలు తమ ఆర్థిక లక్ష్యాలను ప్లాన్ చేసుకునేందుకు, సాధించుకునేందుకు కూడా సహాయపడుతోంది. ఉదాహరణకు యులిప్‌లు (యూనిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్లు) ఒకవైపు కవరేజీ అందిస్తూనే మరోవైపు ఫైనాన్షియల్ మార్కెట్లలో ఇన్వెస్ట్ చేసేందుకు కూడా ఉపయోగపడతాయి. మీ వయస్సు, అవసరాలు, రిస్కు సామర్థ్యాలను బట్టి ఇన్వెస్ట్‌మెంట్ స్టయిల్‌ను మార్చుకునేలా ఇవి సరళతరంగా కూడా ఉంటాయి. మరోవైపు, ఎండోమెంట్ లేదా గ్యారంటీడ్ రిటర్న్ పాలసీలు, స్థిరంగా నిర్దిష్ట రాబడులు అందిస్తాయి. భద్రత, అంచనా వేయతగిన విధంగా రాబడులు ఉండాలని కోరుకునే వారికి ఇవి అనువైనవిగా ఉంటాయి. ఇలాంటి ప్లాన్లన్నీ, పిల్లల చదువులు లేదా రిటైర్మెంట్ నిధి రూపొందించుకోవడం లాంటి దీర్ఘకాల అవసరాలకు ఉపయోగపడతాయి.



సరళమైన, పర్సనలైజ్డ్ కవరేజీ..

జీవిత బీమా మరింత పర్సనలైజ్డ్ సాధనంగా మారుతోంది. డిటల్ సాధనాలు, కస్టమర్ డేటాను ఉపయోగించి బీమా కంపెనీలు నేడు పాలసీదారుల విశిష్టమైన లైఫ్‌స్టయిల్, జీవిత దశలకు అనుగుణమైన పథకాలను అందిస్తున్నాయి. క్రిటికల్ ఇల్‌నెస్ కవరేజీ, ప్రీమియం చెల్లింపుల్లో అంతరాయాల నుంచి రక్షణ, అదనపు ప్రయోజనాలు కల్పించే ఫీచర్ల కారణంగా జీవిత బీమా పాలసీలు మరింత సరళంగా, అధునాతనంగా మారాయి. జీవన విధానాల్లో మార్పులు, నిధుల సంక్షోభాలు, వ్యక్తిగతంగా కొత్త లక్ష్యాల సాధన వంటి సందర్భాల్లో బీమా పాలసీలు దన్నుగా ఉంటాయి.

రిటైర్మెంట్ వేళ.. భద్రత..

జీవన ప్రమాణాలు, ధరలు పెరుగుతున్న నేపథ్యంలో రిటైర్మెంట్ తర్వాత ఆర్థికంగా స్వతంత్రంగా ఉండటమనేది చాలా కష్టంగా మారుతోంది. యాన్యుటీ ప్లాన్ల ద్వారా జీవిత బీమా ఇలాంటి సమస్యను అధిగమించడంలో తోడ్పాటు అందిస్తుంది. ఈ ప్లాన్లు మీ అవసరాలను బట్టి తక్షణం కావచ్చు లేదా భవిష్యత్‌లో కావచ్చు మీ పొదుపు మొత్తాన్ని క్రమానుగత ఆదాయంగా అందిస్తాయి. వయస్సు మీద పడిన తర్వాత ఆర్థిక పరిస్థితి ఎలా ఉంటుందోనన్న ఆందోళన పెరుగుతున్న నేపథ్యంలో ఆర్థికంగా ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఇవి సహాయపడతాయి. అలాగే, పదవీ విరమణ పొందినవారు ఆత్మగౌరవం, ఆర్థిక స్వాతంత్ర్యంతో జీవించేందుకు ఉపయోగపడతాయి.

ఆర్థిక భద్రత

దీర్ఘకాలంలో ఎలాంటి సవాలునైనా ధీమాగా ఎదుర్కొనే సామర్థ్యాలను పెంపొందించుకోవడానికి అఫర్డబుల్, వినూత్నమైన జీవిత బీమా అవసరం ఎంతో ఉంది. చౌకగా, సరళతరంగా, రోజువారీ అవసరాలకు అనుగుణంగా ఉండేలా బీమా సంస్థలు తమ పాలసీలను సరళతరం చేస్తున్నాయి. ఆధునీకరిస్తున్నాయి. నేటి ఒడిదుడుకుల ప్రపంచంలో జీవిత బీమాను ఒక రక్షణాత్మక కవచంగానే కాకుండా భవిష్యత్తుకు భద్రత కల్పించే పురోగామి ఆర్థిక సాధనంగా చూడాలి. బీమాను స్మార్ట్, వ్యూహాత్మక ఆర్థిక సాధనంగా పరిశ్రమ కూడా ప్రమోట్ చేయాలి.


ఐటీ రంగంలో స్తంభించిన నియామకాలు

- 6–7 త్రైమాసికాలుగా ఇదే పరిస్థితి
- క్వెస్‌కార్ప్ ఈడీ, సీఈవో గురుప్రసాద్



న్యూఢిల్లీ: ఒకప్పుడు ఉపాధి అడ్డాగా ఒక వెలుగు వెలిగిన ఐటీ రంగంలో స్తబ్దత నెలకొంది. ఏఐ తదితర అత్యాధునిక టెక్నాలజీలు రావడంతో కంపెనీలు నియామకాల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. గత ఆరేడు త్రైమాసికాలుగా ఐటీ సేవల రంగంలో నియామకాలు నిలిచిపోయినట్టు, జూలై–సెప్టెంబర్ త్రైమాసికంలోనూ నియామకాలు పుంజుకోకపోవచ్చని హైరింగ్ సేవలు అందించే క్వెస్‌కార్ప్ కంపెనీ ఈడీ, సీఈవో గురుప్రసాద్ పేర్కొన్నారు. గ్లోబల్ కేపబులిటీ సెంటర్లు (జీసీసీలు), నాన్ ఐటీ కంపెనీల నుంచి నియామకాలకు డిమాండ్ కనిపిస్తున్నట్టు చెప్పారు. ‘‘కృత్రిమ మేధ (ఏఐ), క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ నిపుణులకు ఎక్కువ డిమాండ్ ఉంది. వేతనం సగటున రూ.1.25 లక్షలుగా ఉంది’’ అని చెప్పారు. సాధారణ ఉద్యోగుల నియామకాల పరంగా పురోగతి సంకేతాలు కనిపిస్తున్నాయని, జూన్‌లో చురుకైన వాతావరణం నెలకొన్నట్టు తెలిపారు. నిపుణుల నియామకాల పరంగా మెరుగైన వృద్ధి కనిపించినట్టు శ్రీనివాసన్ వెల్లడించారు. జూన్ త్రైమాసికంలో తయారీ, బ్యాంకింగ్, ఫైనాన్షియల్, కన్జ్యూమర్ రిటైల్, టెలికం రంగాల నుంచి నియామకాలు ఎక్కువగా జరిగినట్టు తెలిపారు. లిస్టెడ్ కంపెనీ అయిన క్వెస్ కార్ప్ జూన్ త్రైమాసికానికి 4 శాతం వృద్ధితో రూ.51 కోట్ల నికర లాభాన్ని ప్రకటించడం గమనార్హం.

ఫారం 26ఏఎస్ - ఏఐఎస్-టీఐఎస్ తప్పొప్పులు



ఫారం 26ఏఎస్ ఒక సమగ్రమైన సమాచార పట్టిక. మీరు వెబ్‌సైట్‌లో లాగిన్ అయితే, ఈ స్టేట్‌మెంట్ ఉంటుంది. ఇందులో ఏయే సమాచారం పొందుపరుస్తారంటే..

- టీడీఎస్
- టీసీఎస్
- మీరు చెల్లించిన అడ్వాన్స్ ట్యాక్స్, సెల్ఫ్ అసెస్‌మెంట్ ట్యాక్స్
- ఈ ఆర్థిక సంవత్సరంలో మీకు వచ్చిన రిఫండ్ వివరాలు
- నిర్దేశిత ఆర్థిక వ్యవహారాలు
- స్థిరాస్తి విక్రయ సందర్భంలో జరిగిన టీడీఎస్
- టీడీఎస్‌లో జరిగిన పొరపాట్లు
- మీరు చెల్లించాల్సిన డిమాండ్లు.. అంటే గత సంవత్సరపు బకాయిలు
- అలాగే రిఫండ్ వివరాలు
- మీ కేసులో పెండింగ్‌లో ఉన్న ప్రొసీడింగ్స్. అలాగే పూర్తయిన వివరాలు

డిపార్టుమెంట్ వారు జారీ చేసిన ‘తరచుగా అడిగే ప్రశ్నలు–జవాబులు’, అంటే,ఎఫ్ఏక్యూ శీర్షికలో కేవలం ట్యాక్స్ సమాచారానికి సంబంధించిన ‘మిస్–మ్యాచ్’ల విషయమే ప్రస్తావించారు. సలహా ఏమిటంటే.. పాన్ వెరిఫై చేయండి. సంవత్సరం వెరిఫై చేయిండి. చలాన్ నంబర్ చెక్ చేయండి.బ్యాంకు పేరు, బ్రాంచ్ పేరు, బ్రాంచ్ కోడ్, తేదీ ఇలాంటివన్నీ కూడా వెరిఫై చేయమంటున్నారు. ఇలాంటి విషయాల్లో తప్పులు జరగడం సహజం. ఒక్క అక్షరం తప్పయినా లేక ఒక్క అంకె తప్పయినా, ఎంట్రీలు జమ అవ్వవు. అప్పుడప్పుడు ఆదాయ పన్ను శాఖ ట్రెజరీ అకౌంటులో కొన్ని కోట్ల మొత్తం.. సమన్వయం కాకపోవడం వల్ల పేరుకుపోయి ఉంటుంది. అందుకని సమాచారం రాసినప్పుడు తగిన జాగ్రత్త వహించాలి. ఇదంతా పన్నుకి సంబంధించినది.

ఇంకో క్షోభ. ఫ్యామిలీ పెన్షనర్ కృష్ణవేణమ్మగారి కేసులో మూడు నెలల పెన్షన్ మాత్రమే ఫారం 26 ఏఎస్ కనిపిస్తోంది. ఇంతే మొత్తం ఇతర ఫారాల్లో కూడా పడింది. ఫ్యామిలీ పెన్షన్ మీద టీడీఎస్ ఉండదు. మూడు నెలల్లో రూ. 3,00,000 దాటలేదు. నిజానికి పన్నెండు నెలల పెన్షన్, మేడమ్ గారి బ్యాంకు అకౌంటులో జమయ్యింది. ఆవిడగారికి పక్కింటి పరంధామయ్య గారు చెప్పిన రూలు.. ఈ మూడు ఫారాలు, వెబ్‌సైట్, ఇన్‌కం ట్యాక్స్ పోర్టల్‌లోని వివరాలకు మించి వెళ్లకూడదు. అధిగమించకూడదు. అతిక్రమించకూడదు అని. మేడంగారిని ఒప్పించడానికి తలప్రాణం తోకకి వచ్చింది. 26ఏఎస్‌లో తప్పులు దొర్లితే సర్దుబాటుకి వెసులుబాటు లేదు. ఏఐఎస్‌లో తప్పు దొర్లితే తప్పుని సరి చేయమని వేడుకోవచ్చు.

ఇక్కడ బేసిక్ విషయం ఏమిటంటే, ఇప్పటికీ కొన్ని గవర్నమెంటు కార్యాలయాల నుంచి సమాచారం అరకొరగా వస్తోంది. పూర్తిగా రావడం లేదు. దాన్నే 26ఏఎస్‌లో చూపిస్తున్నారు. అటు, రెడ్డిగారి కేసులో టీఐఎస్ ఫారంలోనే బ్యాంకు వడ్డీ, రికరింగ్ డిపాజిట్, వడ్డీ వేయడంతో.. ఒక కాలమ్‌లోని మొత్తానికి, మరో కాలమ్‌లోని మొత్తానికి తేడాలున్నాయి. దేన్ని తీసుకోవాలనేది ప్రశ్న.

ఇక మోహన్‌గారి విషయంలో ఏఐఎస్‌లో బ్యాంకు వడ్డీ రెండు సార్లు రిపీట్ అయ్యింది. దానివల్ల డబుల్ ట్యాక్సేషన్ జరిగినట్లు నిర్ధారించవచ్చు. అసలే అమెరికా నుంచి అర్ధరాత్రి నిద్రమానుకుని లెక్కలు చూసుకుంటున్న మోహన్‌గారికి భయం, నిద్రలేమి, కోపం, బీపీ, టెన్షన్ పెరిగిపోయాయి. కామేశ్వరమ్మగారి కేసులో ఫారం 26ఏఎస్ బ్యాంకు వడ్డీ, ఏఐఎస్‌లోని వడ్డీ .. ఒకేగా లేదు. తేడా వేలల్లో ఉంది.

ఈ మూడింటిలోని అంశాలు ఒకదానితో ఒకటి పెర్ఫెక్టుగా ట్యాలీ అయ్యిందంటే, మీరు అదృష్టవంతులనుకోవాలి. దేవుడికి కొబ్బరికాయ కొట్టి, ఫైలింగ్ ప్రక్రియ మొదలెట్టండి.

ఇక మ్యుచువల్ ఫండ్స్ ద్వారా వచ్చే క్యాపిటల్ గెయిన్స్ విషయం తీసుకుంటే ఇదివరకు చాలా మంది క్లయింట్లు ఈ సమాచారాన్ని చెప్పకుండా దాచేసి, మతలబు చేసేవారు. ఇప్పుడది కాస్తా బట్టబయలవుతోంది. అయితే, దురదృష్టవశాత్తూ, ఈ విషయంలోనూ రెండు పెద్ద సంస్థలు, ఒకటి నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్, మరొకటి సెంట్రలైజ్డ్ ప్రాసెసింగ్ అండ్ రీకన్సిలియేషన్ సెంటర్ ఇస్తున్న సమాచారంలో తేడాలు ఉంటున్నాయి. అగ్నికి ఆజ్యం పోసినట్లు. ట్యాక్స్ కంప్యూటేషన్ సాఫ్ట్‌వేర్‌లో సమస్యలు తలెత్తడం వల్ల క్లయింట్లు కలవరపడుతున్నారు.


ఈ పొరపాట్లు తాత్కాలికమే కావచ్చు.. టెక్నికల్ గ్లిచెస్ కావచ్చని తీసిపడేయకండి. స్నీ డిక్లేర్ చేసి ఆదాయ పన్ను కడదామనుకునే వారికి అడ్డుపడుతూ, ఏదైనా అవకాశం దొరికితే ఎగవేసేందుకు ఎదురుచూసే వారికి ఇవి అవకాశాలు కలిగించేలా ఉన్నాయి.

మీరు జాగ్రత్త వహించండి.

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

మిడ్‌క్యాప్‌లో మెరుగైన పనితీరు

ఫ్రాంక్లిన్ ఇండియా మిడ్‌క్యాప్ ఫండ్



మిడ్‌క్యాప్ విభాగంలో ఇన్వెస్ట్ చేసుకోవాలని భావించే వారి ముందున్న ఎంపికల్లో ఫ్రాంక్లిన్ ఇండియా మిడ్‌క్యాప్ ఫండ్ ఒకటి. ఇది ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ పథకం. మిడ్‌క్యాప్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా దీర్ఘకాలంలో పెట్టుబడులను వృద్ధి చేసేందుకు కృషి చేస్తుంది. అధిక రాబడుల కోసం అధిక రిస్క్ తీసుకునే వారికి ఇది అనుకూలం. కనీసం 7–8 ఏళ్లకు మించి పెట్టుబడులు పెట్టే వారికే మిడ్‌క్యాప్ విభాగం సూచనీయం.

రాబడులు

ఈ పథకంలో ఏ కాలంలో చూసినా రాబడులు మెరుగ్గా కనిపిస్తాయి. గత పదేళ్లలో ఏటా 16 శాతం చొప్పున పెట్టుబడులపై రాబడులు అందించింది. ఏడేళ్లలో రాబడి ఏటా 17 శాతం చొప్పున ఉంది. ఐదేళ్లలోనూ ఏటా 27 శాతానికి పైనే ప్రతిఫలాన్ని తెచ్చిపెట్టింది. ఇక ఏడాది కాలంలో మాత్రం రాబడి కేవలం 2.41 శాతంగా ఉంది. గత ఏడాది కాలంలో మార్కెట్ల పనితీరు స్తబ్దుగా ఉండడం వల్ల రాబడులు తక్కువగా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ పథకం 1993లో ప్రారంభమైంది. నాటి నుంచి చూసుకున్నా రాబడి ఏటా 19.41 శాతంగా ఉండడం గమనించొచ్చు. అధిక రిస్క్ కేటగిరీ కిందకు ఈ పథకం వస్తుంది.

పెట్టుబడుల విధానం

ఈ పథకం పోర్ట్‌ఫోలియో పరంగా మంచి వైవిధ్యాన్ని పాటిస్తుంటుంది. బలమైన వృద్ధి అవకాశాలున్న కంపెనీలను ఎంపిక చేసిన పెట్టుబడులు పెడుతుంటుంది. వివిధ వ్యాపార సైకిల్స్‌ను గమనిస్తూ.. ఆరంభంలోనే అవకాశాలను సొంతం చేసుకునే మార్గంలో పనిచేస్తుంది. వ్యాల్యూ అదే సమయంలో గ్రోత్.. ఈ రెండు పెట్టుబడుల విధానాలకు ప్రాధాన్యం ఇస్తుంటుంది. వాస్తవ అంతర్గత విలువ కంటే తక్కువలో ట్రేడవుతున్న కంపెనీలను గుర్తించి పెట్టుబడులు పెట్టడాన్ని వ్యాల్యూ ఇన్వెస్టింగ్‌గా చెబుతారు. ఆయా రంగాల్లో స్వల్పకాల ప్రతికూలతలు, ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న పరిస్థితుల కారణంగా కొన్ని సందర్భాల్లో కంపెనీల విలువలు మరింత ఆకర్షణీయమైన స్థాయికి దిగొస్తుంటాయి. అలాంటి సందర్భాలను ఫండ్ మేనేజర్ గుర్తించి ఇన్వెస్ట్ చేస్తుంటారు. పెట్టుబడులకు రంగాల వారీ కాకుండా స్టాక్స్ వారీగా పరిశీలన (బోటమ్ అప్) చేస్తుంది. రుణ భారం లేని, తక్కువగా ఉన్న కంపెనీలకే ప్రాధాన్యం ఇస్తుంది. ఈ పథకం పేరు జూలై 11 ముందు వరకు ఫ్రాంక్లిన్ ఇండియా ప్రైమా ఫండ్‌గా కొనసాగడం గమనార్హం.

పోర్ట్‌ఫోలియో

ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో రూ.12,785 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఎక్స్‌పెన్స్ రేషియో డైరెక్ట్ ప్లాన్‌లో 0.94 శాతంగా ఉంటే, రెగ్యులర్ ప్లాన్‌లో 1.76 శాతం చొప్పున ఉంది. రెగ్యులర్ ప్లాన్ అంటే మధ్యవర్తులకు కమీషన్ చెల్లించేది. దీంతో ఇన్వెస్టర్ల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తుంటారు. దీర్ఘకాలంలో అధిక రాబడి కోసం డైరెక్ట్ ప్లాన్ ఎంపికే మెరుగైనది అవుతుంది. మొత్తం పెట్టుబడుల్లో 97.4 శాతాన్ని స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేయగా, 2.4 శాతం నగదు నిల్వలు కలిగి ఉంది. పెట్టుబడులను గమనిస్తే 20 శాతం బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ కంపెనీల్లో ఉన్నాయి. కన్జ్యూమర్ డిస్క్రీషనరీ కంపెనీల్లో 18.6 శాతం, ఇండస్ట్రియల్స్ కంపెనీల్లో 13.8 శాతం, మెటీరియల్స్ కంపెనీల్లో 13.3 శాతం, హెల్త్‌కేర్ కంపెనీల్లో 10.6 శాతం చొప్పున ఇన్వెస్ట్ చేసింది.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్


కంపెనీ	పెట్టుబడుల శాతం
ఫెడరల్ బ్యాంక్	3.41
మ్యాక్స్ ఫైనాన్షియల్	2.18
ప్రెస్టీజ్ ఎస్టేట్	2.12
ఏపీఎల్ అపోలో	2.04
ఎంఫసిస్	2.01
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	1.91
కమిన్స్ ఇండియా	1.91
జేకే సిమెంట్	1.89
పీబీ ఫిన్‌టెక్	1.86
కోఫోర్జ్	1.83

నోరిస్ 'పాంచ్ పటాకా'

- ఈ సీజన్‌లో ఐదో టైటిల్ గెలిచిన మెక్‌లారెన్ డ్రైవర్
- హంగేరి గ్రాండ్‌ప్రిలో అగ్రస్థానం సొంతం




బుడాపెస్ట్ (హంగేరి): ఫార్ములావన్ తాజా సీజన్‌లో మెక్‌లారెన్ డ్రైవర్ల జోరు సాగుతోంది. ఆస్కార్ పియాస్ట్రి, లాండో నోరిస్ మధ్య ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన హంగేరి గ్రాండ్‌ప్రి ప్రధాన రేసులో నోరిస్ విజయం సాధించాడు. ఈ సీజన్‌లో నోరిస్‌కిది ఐదో విజయం కాగా... మెక్‌లారెన్ జట్టుకిది 200వ ఎఫ్1 గెలుపు కావడం విశేషం. ఆదివారం జరిగిన ఈ రేసులో నోరిస్ నిర్ణీత 70 ల్యాప్‌లను అందరికంటే వేగంగా, అందరికంటే ముందుగా 1 గంట 35 నిమిషాల 21.231 సెకన్లలో ముగించి విజేతగా నిలిచాడు. మెక్‌లారెన్ జట్టుకే చెందిన పియాస్ట్రి 1 గంట 35 నిమిషాల 21.929 సెకన్లలో లక్ష్యాన్ని చేరి రెండో స్థానంలో నిలిచాడు. 0.698 సెకన్ల తేడాతో పియాస్ట్రి రెండో స్థానానికి పరిమితమయ్యాడు. తొలి ల్యాప్ ముగిసే సమయానికి ఐదో స్థానానికి పరిమితమైన నోరిస్ ఆ తర్వాత వాయువేగంతో దూసుకెళ్లాడు. 'ఇది చాలా కష్టమైంది. ప్రాణం పోయినంత పనైంది. చివరి క్షణాల్లో పియాస్ట్రిని దాటేసేందుకు ఎంతగానో ప్రయత్నించా' అని రేసు అనంతరం నోరిస్ అన్నాడు. గత వారం జరిగిన బెల్జియం గ్రాండ్‌ప్రిలో పియాస్ట్రి విజయం సాధించగా... నోరిస్ రెండో స్థానంలో నిలిచాడు. మెర్సిడెస్ డ్రైవర్ జార్జ్ రసెల్ (1 గంట 35 నిమిషాల 43.147 సెకన్లు) మూడో స్థానం దక్కించుకున్నాడు. ఇక ఈ ఏడాది తొలిసారి పోల్ పొజిషన్ దక్కించుకొని అగ్రస్థానంతో రేసును ప్రారంభించిన ఫెరారీ డ్రైవర్ చార్లెస్ లెక్‌లెర్క్ (1 గంట 36 నిమిషాల 3.791 సెకన్లు) నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నాడు.



నాలుగుసార్లు ప్రపంచ చాంపియన్ వెర్‌స్టాపెన్ (1 గంట 36 నిమిషాల 33.876 సెకన్లు; రెడ్‌బుల్) తొమ్మిదో స్థానంలో నిలవగా... ఏడుసార్లు ప్రపంచ చాంపియన్ లూయిస్ హామిల్టన్ (1 గంట 35 నిమిషాల 31.092 సెకన్లలో 69 ల్యాప్‌లు; ఫెరారీ) పన్నెండో స్థానానికి పరిమితమయ్యాడు. 24 రేసుల తాజా సీజన్‌లో ఇప్పటి వరకు 14 రేసులు ముగియగా... డ్రైవర్స్ చాంపియన్‌షిప్‌లో పియాస్ట్రి 284 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా... నోరిస్ 275 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. వీరిద్దరి మధ్య పాయింట్ల అంతరం 9కి తగ్గగా... డిఫెండింగ్ చాంపియన్ వెర్‌స్టాపెన్ 187 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్నాడు. తదుపరి రేసు ఈ నెల 31న డచ్ గ్రాండ్‌ప్రి జరుగుతుంది.

హంగేరి గ్రాండ్‌ప్రి రేసు ఫలితాలు (టాప్-10)

స్థానం	డ్రైవర్	జట్టు	ల్యాప్‌లు	సమయం	వ్యత్యాసం	పాయింట్లు
1	నోరిస్	మెక్‌లారెన్	70	1:35:21.231 సెకన్లు	-	25
2	పియాస్ట్రి	మెక్‌లారెన్	70	1:35:21.929 సెకన్లు	0.698 సెకన్లు	18
3	రసెల్	మెర్సిడెస్	70	1:35:43.147 సెకన్లు	21.218 సెకన్లు	15
4	లెక్‌లెర్క్	ఫెరారీ	70	1:36:03.791 సెకన్లు	42.560 సెకన్లు	12
5	అలోన్సో	ఆస్టన్ మార్టిన్	70	1:36:20.271 సెకన్లు	59.040 సెకన్లు	10
6	గాబ్రియల్	కిక్ సాబెర్	70	1:36:27.400 సెకన్లు	66.169 సెకన్లు	8
7	లాన్స్ స్ట్రోల్	ఆస్టన్ మార్టిన్	70	1:36:29.405 సెకన్లు	68.174 సెకన్లు	6
8	లాసన్	రేసింగ్‌బుల్స్	70	1:36:30.682 సెకన్లు	69.451 సెకన్లు	4
9	వెర్‌స్టాపెన్	రెడ్‌బుల్	70	1:36:33.876 సెకన్లు	72.645 సెకన్లు	2
10	అంటొనెల్లి	మెర్సిడెస్	70	1:35:28.880	1 ల్యాప్	1



ఫ్రాన్స్ స్టార్ లియోన్ మర్చండ్

ఈత కొలను అమెరికన్‌లదే...

ప్రపంచ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో 29 పతకాలతో అగ్రస్థానం

- చివరి రోజు మహిళల 4X100 మీటర్ల మెడ్లీ రిలేలో అమెరికా బృందం కొత్త ప్రపంచ రికార్డు
- 'బెస్ట్ స్విమ్మర్స్'గా సమ్మర్ మెకింటోష్, లియోన్ మర్చండ్

సింగపూర్: ప్రపంచ స్విమ్మింగ్ పోటీల్లో తమకు తిరుగులేదని అమెరికా మరోసారి నిరూపించుకుంది. ఆదివారం ముగిసిన ప్రపంచ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో అమెరికా 29 పతకాలతో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఇందులో 9 స్వర్ణాలు, 11 రజతాలు, 9 కాంస్యాలు ఉన్నాయి. చివరిరోజు మహిళల 4X100 మీటర్ల మెడ్లీ రిలేలో రేగన్ స్మిత్, కేట్ డగ్లస్, గ్రెట్‌చెన్ వాల్ష్, టోరీ హుస్కేలతో కూడిన అమెరికా బృందం కొత్త ప్రపంచ రికార్డు సృష్టించడంతోపాటు పసిడి పతకాన్ని హస్తగతం చేసుకుంది. అమెరికా బృందం 3 నిమిషాల 49.34 సెకన్లలో రేసును ముగించింది. ఈ క్రమంలో గత ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో 3 నిమిషాల 49.63 సెకన్లతో అమెరికా బృందమే నెలకొల్పిన ప్రపంచ రికార్డును అమెరికా జట్టే బద్దలు కొట్టింది. 'ప్రపంచ చాంపియన్‌షిప్‌ను ప్రపంచ రికార్డుతో, పసిడి పతకంతో ముగించడం చాలా ఆనందంగా ఉంది. ఈత కొలనులో దూకితే మా అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తాం. సింగపూర్ నుంచి నవ్వుతూ తిరిగి వెళ్తున్నందుకు సంతోషంగా ఉంది' అని ప్రపంచ రికార్డు నెలకొల్పిన అమెరికా మెడ్లీ రిలే బృందం సభ్యురాలు గ్రెట్‌చెన్ వాల్ష్ వ్యాఖ్యానించింది. ఆస్ట్రేలియా 8 స్వర్ణాలు, 6 రజతాలు, 6 కాంస్యాలతో కలిపి 20 పతకాలు సాధించి రెండో స్థానంలో... ఫ్రాన్స్ 4 స్వర్ణాలు, 1 రజతం, 3 కాంస్యాలతో కలిపి 8 పతకాలతో మూడో స్థానంలో నిలిచాయి. మహిళల విభాగంలో కెనడా టీనేజ్ స్టార్ సమ్మర్ మెకింటోష్... పురుషుల విభాగంలో ఫ్రాన్స్ స్టార్ లియోన్ మర్చండ్ 'ఉత్తమ స్విమ్మర్లు' పురస్కారాలు గెల్చుకున్నారు.

ఆఖరి రోజు ఆదివారం ఎనిమిది ఈవెంట్స్‌లో ఫైనల్స్ జరిగాయి. పురుషుల 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో రష్యాకు చెందిన క్లిమెంట్ కొలెస్నికోవ్ (23.68 సెకన్లు) స్వర్ణ పతకాన్ని సాధించాడు. ఉక్రెయిన్–రష్యా యుద్ధం నేపథ్యంలో రష్యా క్రీడాకారులపై నిషేధం ఉన్న నేపథ్యంలో క్లిమెంట్ తటస్థ స్విమ్మర్‌గా ఈ పోటీల్లో బరిలోకి దిగాడు. మహిళల 50 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్ ఈవెంట్‌లో రుటా మెలుటైట్ (లిథువేనియా; 29.55 సెకన్లు) బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. మహిళల 50 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో మెగ్ హారిస్ (ఆస్ట్రేలియా; 24.02 సెకన్లు) విజేతగా నిలిచింది. పురుషుల 1500 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో అహ్మద్ జవోది (ట్యూనీషియా; 14 నిమిషాల 34.41 సెకన్లు) పసిడి పతకాన్ని దక్కించుకున్నాడు. పురుషుల 4X100 మీటర్ల మెడ్లీ రిలే ఈవెంట్‌లో తటస్థ స్విమ్మర్లుగా బరిలోకి దిగిన రష్యా బృందం బంగారు పతకాన్ని గెలిచింది. మిరోన్ లిఫింత్‌సెవ్, కిరిల్ ప్రిగోడా, ఆంద్రీ మినాకోవ్, ఇగోర్ కొర్నెవ్‌లతో కూడిన తటస్థ బృందం 3 నిమిషాల 26.93 సెకన్లలో రేసును ముగించి విజేతగా నిలిచింది.

మర్చండ్ 'హ్యాట్రిక్'...

పురుషుల 400 మీటర్ల మెడ్లీ విభాగంలో లియోన్ మర్చండ్ (ఫ్రాన్స్; 4 నిమిషాల 04.73 సెకన్లు) చాంపియన్‌గా నిలిచి 'హ్యాట్రిక్' సాధించాడు. 2022, 2023 ప్రపంచ చాంపియన్‌షిప్‌ల్లోనూ ఈ విభాగంలో మర్చండ్ స్వర్ణ పతకాలు నెగ్గడం విశేషం. ఓవరాల్‌గా ఈ మెగా ఈవెంట్ చరిత్ర లో మర్చండ్‌కిది ఏడో పసిడి పతకం కావడం గమనార్హం.

ఐదు పతకాలతో....

మహిళల 400 మీటర్ల మెడ్లీ ఈవెంట్‌లో సమ్మర్ మెకింటోష్ (కెనడా; 4 నిమిషాల 25.78 సెకన్లు) విజేతగా నిలిచి ఈ మెగా ఈవెంట్‌ను నాలుగో స్వర్ణ పతకంతో, ఓవరాల్‌గా ఐదో పతకంతో ముగించింది. 400 మీటర్ల ఫ్రీస్టయిల్, మెడ్లీ, 200 మీటర్ల మెడ్లీ, 200 మీటర్ల బటర్‌ఫ్లయ్ విభాగాల్లో స్వర్ణాలు నెగ్గిన 18 ఏళ్ల మెకింటోష్ 800 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. ఈ మెగా ఈవెంట్‌లో కెనడా గెల్చుకున్న మొత్తం ఎనిమిది పతకాల్లో ఐదు మెకింటోష్‌వే కావడం విశేషం.



'బెస్ట్ స్విమ్మర్స్' ట్రోఫీలతో సమ్మర్ మెకింటోష్ (కెనడా), మర్చండ్ (ఫ్రాన్స్)



స్వర్ణ పతకాలతో అమెరికా మహిళల 4X100 మీటర్ల మెడ్లీ బృందం

బ్రె'జిల్...జిల్...జిల్'

తొమ్మిదోసారి కోపా అమెరికా మహిళల ఫుట్‌బాల్ టోర్నీ టైటిల్ సొంతం

- 'షూటౌట్'లో 5–4 గోల్స్‌తో కొలంబియాపై విజయం
- రెండు గోల్స్‌తో మెరిసిన మార్టా

క్విటో (ఈక్వెడార్): ఆరుసార్లు ప్రపంచ 'ప్లేయర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు నెగ్గిన మార్టా రెండు గోల్స్‌తో విజృంభించడంతో... బ్రెజిల్ జట్టు తొమ్మిదోసారి కోపా అమెరికా మహిళల ఫుట్‌బాల్ టోర్నీ టైటిల్ కైవసం చేసుకుంది. ఆదివారం అత్యంత హోరాహోరీగా సాగిన ఫైనల్లో బ్రెజిల్ 'షూటౌట్'లో 5–4 గోల్స్ తేడాతో కొలంబియాపై విజయం సాధించింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు 4–4 గోల్స్‌తో నిలవడంతో... విజేతను తేల్చేందుకు షూటౌట్ అనివార్యమైంది. ఇందులో బ్రెజిల్ ఆధిక్యం కనబర్చింది. అంతకుముందు మ్యాచ్‌లో బ్రెజిల్ తరఫున మార్టా (90+6వ, 105వ నిమిషాల్లో) డబుల్ గోల్స్‌తో మెరవగా... ఏంజెలీనా (45+9వ నిమిషంలో), అమండా గుటెరెస్ (80వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. కొలంబియా తరఫున లిండా కైసెడో (25వ నిమిషంలో), టర్సియానె (69వ నిమిషంలో), మైరా రమిరెజ్ (88వ నిమిషంలో), లైసీ సంటోస్ (115వ నిమిషంలో) తలా ఒక గోల్ సాధించారు. 39 ఏళ్ల మార్టా 82వ నిమిషంలో మైదానంలో అడుగుపెట్టి బ్రెజిల్ స్కోరును 3–3తో సమం చేసింది. అనంతరం అదనపు సమయంలో మార్టా మరో గోల్ సాధించడంతో బ్రెజిల్ 4–3తో ఆధిక్యంలోకి వెళ్లినా... చివర్లో లైసీ గోల్‌తో కొలంబియా స్కోరు సమం చేసింది. దీంతో విజేతను నిర్ణయించేందుకు షూటౌట్ నిర్వహించాల్సి వచ్చింది. ఇందులో గోల్ కీపర్ లొరెనా డా సిల్వా రెండు పెనాల్టీ కిక్‌లను సమర్థవంతంగా అడ్డుకోవడంతో... బ్రెజిల్ వరుసగా ఐదోసారి కోపా అమెరికా కప్ కైవసం చేసుకుంది. గత ఐదు ఫైనల్స్‌లో బ్రెజిల్ జట్టు నాలుగుసార్లు కొలంబియాపైనే విజయం సాధించడం విశేషం.

బ్రెజిల్ తరఫున 6 ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లు, 6 ఒలింపిక్స్‌లో బరిలోకి దిగిన మార్టా... కెరీర్‌లో 206 మ్యాచ్‌లాడి 122 గోల్స్ సాధించింది. 2024 పారిస్ ఒలింపిక్స్ ఫైనల్లో అమెరికా చేతిలో ఓడిన బ్రెజిల్ జట్టు రజత పతకం సాధించిన విషయం తెలిసిందే. ఈ టోర్నీలో అమండా గుటెరెస్ ఆరు గోల్స్‌తో అత్యధిక స్కోరర్‌గా నిలిచింది.



చివరి బంతికి ఫోర్ కొట్టి...

- వెస్టిండీస్‌ను గెలిపించిన హోల్డర్
- రెండో టి20లో పాకిస్తాన్ పరాజయం
- 1–1తో సిరీస్ సమం



ఫ్లోరిడా: చివరి బంతి వరకు హోరాహోరీగా సాగిన పోరులో పాకిస్తాన్‌పై వెస్టిండీస్ ఉత్కంఠ విజయం సాధించింది. చివరి బంతికి మూడు పరుగులు చేస్తే విజయం సాధించాల్సిన తీవ్ర ఉత్కంఠ పరిస్థితుల్లో పేస్ ఆల్‌రౌండర్ జేసన్ హోల్డర్ ఫోర్ కొట్టి విండీస్‌ను గెలిపించాడు. ఆదివారం ఇరు జట్ల మధ్య జరిగిన స్వల్ప స్కోర్ల మ్యాచ్‌లో వెస్టిండీస్ 2 వికెట్ల తేడాతో పాకిస్తాన్‌పై గెలుపొందింది. తద్వారా మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 1–1తో సమం చేసింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 133 పరుగులు చేసింది. హసన్ నవాజ్ (23 బంతుల్లో 40; 1 ఫోర్, 4 సిక్స్‌లు), కెప్టెన్ సల్మాన్ ఆఘా (33 బంతుల్లో 38; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. సయీమ్ అయూబ్ (7), సాహిబ్‌జాదా ఫర్హాన్ (3), మొహమ్మద్ హారిస్ (4), మొహమ్మద్ నవాజ్ (2), ఫహీమ్ అష్రఫ్ (0) విఫలమయ్యారు. విండీస్ బౌలర్లలో హోల్డర్ 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనలో విండీస్ సరిగ్గా 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 135 పరుగులు చేసి విజయం సాధించింది. ఇటీవల సొంతగడ్డపై ఆస్ట్రేలియా చేతిలో వరుసగా ఎనిమిది మ్యాచ్‌లు ఓడిన కరీబియన్లు... ఈ సిరీస్‌లో సైతం తొలి మ్యాచ్‌లో పరాజయం పాలైన విషయం తెలిసిందే. గుడకేశ్ మోతీ (20 బంతుల్లో 28; 1 ఫోర్, 2 సిక్స్‌లు), కెప్టెన్ షై హోప్ (30 బంతుల్లో 21; 2 ఫోర్లు) కాస్త పోరాడారు. విండీస్ విజయానికి 18 బంతుల్లో 36 పరుగులు అవసరమైన దశలో రొమారియో షెఫర్డ్ (11 బంతుల్లో 15; 2 ఫోర్లు, 1 సిక్స్), హోల్డర్ (10 బంతుల్లో 16 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. పాకిస్తాన్ బౌలర్లలో మొహమ్మద్ నవాజ్ 3 వికెట్లు పడగొట్టాడు. బౌలింగ్‌లో నాలుగు వికెట్లు తీయడంతోపాటు విన్నింగ్ రన్స్ చేసిన హోల్డర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య నిర్ణయాత్మక మూడో మ్యాచ్ ఈరోజు తెల్లవారుజామున జరుగుతుంది.



ఆదివారం ఆటవిడుపు. రొమేనియా రాజధాని బుఖారెస్ట్‌లోని కిస్సిగియూ పార్కులో తేలియాడే బెలూన్ల లోపలి నుంచి ఆడుకుంటున్న చిన్నారులు



కాలిఫోర్నియాలోని పసిఫికాలో వరల్డ్ డాగ్ సర్ఫింగ్ చాంపియన్ షిప్ జరుగుతోంది. ఈ పోటీల్లో పాల్గొన్న కోకోనట్ అనే శునకం సముద్ర జలాల్లో సర్ఫింగ్ చేస్తోందిలా

'ధర్మస్థల' దారుణాలపై సాక్ష్యాధారాలు ధ్వంసం

అసహజ మరణాల రిజిస్టర్‌లోని ఎంట్రీలు మాయం

- 2000 నుంచి 2015 దాకా నమోదైన వివరాలు లేవన్న పోలీసులు
- నిజాలు బయటకు రావాలన్న ఆర్టీఐ కార్యకర్త జయంత్

బెంగళూరు: కర్ణాటకలోని ధర్మస్థలలో సామూహిక ఖననాల వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనాత్మకంగా మారింది. మహిళలపై అత్యాచారానికి పాల్పడి, హత్య చేసి, మృతదేహాలను సామూహికంగా ఖననం చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేసింది. ధర్మస్థలలో వందకు పైగా మహిళల మృతదేహాలను స్వయంగా ఖననం చేశానని ఓ పారిశుధ్య కార్మికుడు ప్రకటించడంతో సంచలనం రేగిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా, ధర్మస్థలలో 2000 సంవత్సరం నుంచి 2015 వరకు.. 15 ఏళ్లలో అసహజ మరణాల రికార్డులు కనిపించకుండాపోయాయి. దక్షిణ కన్నడ జిల్లాలోని బెళ్తంగడి పోలీసులు వాటిని ఉద్దేశపూర్వకంగా నాశనం చేసినట్లు తెలుస్తోంది. సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) కార్యకర్త జయంత్ ఈ విషయం బహిర్గతం చేశారు. 2000 నుంచి 2015 దాకా అసహజ మరణాల రిజిస్టర్ (యూడీఆర్)లో నమోదైన అన్ని ఎంట్రీలను పోలీసులు ఒక పద్ధతి ప్రకారం డిలీట్ చేసినట్లు వెల్లడయ్యింది. ధర్మస్థలలో అదే సమయంలో పెద్ద సంఖ్యలో అనుమానాస్పద, నమోదు కాని మరణాలు చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి.

అధికారుల సమక్షంలోనే ఖననం

ఒక యువతి మృతదేహాన్ని చట్టవిరుద్ధంగా, రహస్యంగా ఖననం చేస్తుండగా అనుకోకుండా తాను చూశానని ఆర్టీఐ కార్యకర్త జయంత్ చెప్పారు. దీనిపై ఈ నెల 2వ తేదీన సిట్‌కు ఫిర్యాదు చేశారనని వివరించారు. ఆ ఖననం జరుగుతున్న సమయంలో పలువురు అధికారులు అక్కడే ఉన్నారని, చట్టబద్ధమైన ప్రక్రియ పాటించలేదని చెప్పారు. జయంత్ ఫిర్యాదుపై సిట్ అధికారులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించబోతున్నట్లు తెలిసింది. పోలీసుల పనితీరును తెలుసుకోవడానికి జయంత్ చాలాకాలంగా సమాచార హక్కు చట్టాన్ని ఉపయోగించుకుంటున్నారు. ధర్మస్థలలో అదృశ్యమైన మహిళలు, యువతుల పూర్తి వివరాలు, ఫోటోలు ఇవ్వాలని సమాచార హక్కు చట్టం కింద బెళ్తంగడి పోలీసులను కోరగా, వారు అందుకు నిరాకరించారని జయంత్ చెప్పారు. సంబంధిత డాక్యుమెంట్లు, పోస్ట్‌మార్టం రిపోర్టులు, వాల్ పోస్టర్లు, నోటీసులు, ఫోటోలను నాశనం చేసినట్లు వారు బదులిచ్చారని పేర్కొన్నారు. గుర్తించని మృతదేహాలకు సంబంధించిన ఆధారాలేవీ లేవని, రొటీన్ ప్రక్రియలో భాగంగానే వాటిని నాశనం చేశామంటూ చెప్పారని స్పష్టంచేశారు.

ఇప్పుడు ఆ సమయం వచ్చింది

అధికారుల సమక్షంలోనే యువతి మృతదేహాన్ని చనిపోయిన శునకాన్ని ఖననం చేసినట్టుగా చేశారని, ఆ సంఘటన చాలాకాలం తనను వెంటాడిందని జయంత్ తెలియజేశారు. ఆ అధికారుల పేర్లు కూడా చెప్పగలనని అన్నారు. ధర్మస్థలలో మరణాలపై దర్యాప్తు బాధ్యతను నిజాయతీ గల అధికారులకు అప్పగించకపోతే తనకు నిజాలు బయటపెడతానని రెండేళ్ల క్రితం హెచ్చరించానని గుర్తుచేసుకున్నారు. ఇప్పుడు ఆ సమయం వచ్చిందన్నారు. అందుకే సిట్‌కు ఫిర్యాదు చేశానని వెల్లడించారు. తన వెనుక ఎవరూ లేరని, తనను ఎవరూ ప్రభావితం చేయడం లేదని తేల్చిచెప్పారు. నేటి టెక్నాలజీ యుగంలో సాక్ష్యాధారాలు ధ్వంసం చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. తవ్వకాల్లో అస్థిపంజరం బయటపడితే అది ఎవరిదో ఎలా గుర్తిస్తారని అన్నారు. సంబంధిత డాక్యుమెంట్లు, ఆధారాలు లేకపోతే అది ఎలా సాధ్యమవుతుందని నిలదీశారు. ధర్మస్థలలో జరిగిన దారుణాల వెనుక ఉన్న అసలు వ్యక్తులు ఎవరన్నది బయటపడాలని స్పష్టం చేశారు. దర్యాప్తును ప్రభావితం చేస్తున్న వ్యక్తులెవరో ప్రభుత్వం తేల్చాలని అన్నారు. సాక్ష్యాధారాల ధ్వంసం వెనుక ఉన్న కుట్రను ఛేదించాలని చెప్పారు.



కర్ణాటకలోని ధర్మస్థలలో తవ్వకాలు జరుగుతున్న ప్రాంతం ఇది

కరోలిన్‌పై ట్రంప్ 'వంకర పొగడ్తలు'

అభ్యంతరకరమంటూ నెటిజన్ల విమర్శలు

వాషింగ్టన్: మహిళలపై తరచూ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చూపు ఇప్పుడు వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవిట్(27)పై పడింది. ఆమె అందరికంటే ఉత్తమ సెక్రటరీ అంటూ కితాబివ్వడంతోపాటు పలు విపరీత పొగడ్తలు కురిపించారు. న్యూస్‌మ్యాక్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్.. లెవిట్‌ను ఒక్కసారిగా ఆకాశానికి ఎత్తేశారు. అధికార పగ్గాలు చేపట్టిన ఆరు నెలల్లోనే ట్రంప్ ఆరు ప్రాంతాలకు సంబంధించిన కాల్పుల విరమణ ఒప్పందాలను కుదిర్చారంటూ శుక్రవారం మీడియా సమావేశం సందర్భంగా ట్రంప్‌పై లెవిట్ ప్రశంసలు కురిపించారు. 'లెవిట్ పెద్ద స్టారైపోయారు. ఆ ఫేస్..ఆ బ్రెయిన్ అద్భుతం. ఆమె పెదాలు అబ్బో..అవి కదులుతుంటే అచ్చు మెషీన్ గన్ లాగే ఉంటాయి'అంటూ పేర్కొన్నారు. ఆమె చాలా గొప్పవ్యక్తి. కరోలిన్ కంటే ఉత్తమ ప్రెస్ సెక్రటరీ ఇప్పటి వరకు ఎవరూ లేరనే అనుకుంటున్నా అని చెప్పుకొచ్చారు. ట్రంప్ వ్యాఖ్యలు ఏమాత్రం సరికాదంటూ నెటిజన్లు తప్పుబట్టారు. ఆయన పొగడ్తలు అసౌకర్యం, భయంకరం, అనవసరం అంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. జెఫ్రీ ఎప్‌స్టీన్ బెస్ట్‌ఫ్రెండ్ మాట్లాడినట్లే ఉందంటూ ఎద్దేవా చేశారు. గతంలో ట్రంప్, ఎప్‌స్టీన్ మధ్య కొనసాగిన మైత్రి వివాదాస్పదంగా మారడం తెల్సిందే. 'అదే ఒక వ్యక్తి తన మహిళా కొలీగ్‌పై ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే అతడిని వెంటనే ఉద్యోగం నుంచి తొలగించి, కోర్టు బోనెక్కించేవారు అంటూ మరొకరు వ్యాఖ్యానించారు. వృత్తిపరమైన ప్రవర్తనలో ద్వంద ప్రమాణాలకు ఇదే ఉదాహరణ అంటూ ఆ యూజర్ పేర్కొన్నారు. ట్రంప్ వ్యాఖ్యలకు సంబంధించి మీడియా ఏమాత్రం బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదంటూ విమర్శకులు ఆరోపిస్తున్నారు. ప్రధాన మీడియా సంస్థలు గానీ, వైట్ హౌస్ గానీ ఈ విపరీత వ్యాఖ్యలపై ట్రంప్‌ను ప్రశ్నిస్తాయా అంటూ నిలదీస్తున్నారు.

కారు ప్రమాదంలో నలుగురు భారత సంతతి వృద్ధులు మృతి

న్యూయార్క్: భారత సంతతికి చెందిన నలుగురు వృద్ధులు అమెరికాలో కారు ప్రమాదంలో మరణించారు. పశ్చిమ వర్జీనియాలో జరిగిన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతులను కిషోర్ దివాన్, ఆశా దివాన్, శైలేష్ దివాన్, గీతా దివాన్‌గా గుర్తించారు. వారంతా రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు మార్షల్ కౌంటీ షెరీఫ్ మైక్ డౌగెర్టీ ఒక ప్రకటనలో తెలిపారు. న్యూయార్క్‌లోని బఫెలో నుంచి నలుగురు వ్యక్తులు తప్పిపోయినట్లు నాలుగు రోజుల కిందట ఫిర్యాదు అందింది. ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు అన్వేషణ ప్రారంభించారు. రోడ్డు మార్గాలతోపాటు.. వెదకడానికి హెలికాప్టర్లను కూడా ఉపయోగించారు. నాలుగు రోజులైనా ఆచూకీ దొరకలేదు. వారు మంగళవారం పిట్స్‌బర్గ్‌లోని ఒక ఆలయాన్ని సందర్శించి, పశ్చిమ వర్జీనియాలోని మౌండ్స్‌విల్లేలోని ప్యాలెస్ లాడ్జ్ హోటల్‌కు చివరిసారిగా వెళ్లినట్లు సీసీటీవీ వీడియో ఫుటేజీల్లో కనిపించింది. దాంతో ఆ మార్గంలో వెదుక్కుంటూ వెళ్లగా... పశ్చిమ వర్జీనియాలో ఉన్న మార్షల్ కౌంటీలోని ఒక రహదారి వెంబడి ఆగస్టు 2న రాత్రి 9:30 గంటలకు వారు ప్రయాణించిన లేత ఆకుపచ్చ రంగు కారు కనిపించింది. అందులో నలుగురి మృతదేహాలు దొరికాయి.

త్వరలో ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు సేవలు

రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్

భావ్ నగర్: దేశంలోని తొలి బుల్లెట్ రైలు సేవలు త్వరలో ప్రారంభం అవుతాయని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. దీంతో అహ్మదాబాద్ నుంచి ముంబైకి కేవలం రెండు గంటల ఏడు నిమిషాల్లో చేరుకోవచ్చని ఆయన తెలిపారు. అయోధ్య ఎక్స్‌ప్రెస్, రేవా-పుణే ఎక్స్‌ప్రెస్, జబల్‌పూర్-రాయ్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఆదివారం భావ్‌నగర్ టెర్మినస్‌లో వర్చువల్‌గా జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. ముంబై-అహ్మదాబాద్ తొలి బుల్లెట్ రైలు ప్రాజెక్టు పనులు వేగంగా కొనసాగుతున్నాయన్నారు. దేశంలోనే మొట్టమొదటి బుల్లెట్ రైలు ముంబై-అహ్మదాబాద్ మధ్య 508 కిలోమీటర్ల దూరం ప్రయాణించనుంది. ఇది ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్ నుంచి ప్రారంభమై, గుజరాత్‌లోని వాపి, సూరత్, ఆనంద్, వడోదర గుండా అహ్మదాబాద్‌కు వెళ్తుంది. గంటకు 320 కి.మీ. వేగంతో నడవనుంది. ఈ సందర్భంగా మంత్రి పలు రాష్ట్రాల్లోని రైల్వే ప్రాజక్టుల గురించి పంచుకున్నారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో కూడా అనేక కొత్త ప్రాజెక్టులు చేపట్టనున్నట్లు తెలిపారు. రెండు రాష్ట్రాల్లోని డబుల్ ఇంజన్ ప్రభుత్వాలు ప్రాజెక్టులను వేగంగా అభివృద్ధి చేస్తున్నాయన్నారు. నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం 11 ఏళ్లలో 34వేల కి.మీ.ల కొత్త రైల్వే ట్రాక్‌లను వేసింది, దేశంలో రోజుకు దాదాపు 12 కి.మీ కొత్త ట్రాక్‌లను నిర్మించిందని చెప్పారు. దేశంలో 1,300 రైల్వే స్టేషన్లను పునరుద్ధరిస్తున్నామని, ఇది ఇంతకుముందెప్పుడూ చేయని పనని ఆయన కొనియాడారు. ఈ క్రమంలో వస్తున్న సవాళ్లన్నింటినీ పరిగణనలోకి తీసుకుని దార్శనికతతో ప్రధాని మోదీ స్టేషన్ల పునరుద్ధరణ చేయిస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు ఎనిమిది అమృత్ భారత్ రైళ్లు ప్రారంభించామని, వాటిలోనూ వందే భారత్‌వంటి సౌకర్యాలు కల్పించామని, అయినా ఛార్జీలు మాత్రమే తక్కువగానే ఉన్నాయని మంత్రి గుర్తు చేశారు. ఈ రైళ్లను కొత్త తరం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిర్మించారని, వీటిలో ప్రయాణిస్తున్న వారు గొప్ప భావోద్వేగాలకు గురవుతున్నారని వ్యాఖ్యానించారు.

7న 'ఇండియా' కూటమి విందు భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల ముందు చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్) విషయంలో విపక్ష 'ఇండియా'కూటమి నేతలు కేంద్ర ప్రభుత్వంతోపాటు ఎన్నికల సంఘంపై తీవ్రమైన ఆరోపణలు చేస్తున్నారు. ఈ అంశంపై వెంటనే చర్చించాలని డిమాండ్ చేస్తూ పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను సైతం స్తంభింపజేస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజా పరిణామాలపై చర్చించేందుకు సమావేశం కావాలని విపక్ష కూటమి నేతలు నిర్ణయించారు. ఈ నెల 7వ తేదీన ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నివాసంలో ఈ విందు భేటీ జరుగనుంది. ఎస్ఐఆర్ సహా పలు కీలక అంశాలపై చర్చించి, భవిష్యత్తు కార్యాచరణను ఖరారు చేస్తారని సమాచారం. గత ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో దాదాపు 70–80 సీట్లు రిగ్గింగ్‌కు గురయ్యాయని రాహుల్ గాంధీ శనివారం ఆరోపించారు. నరేంద్ర మోదీ అత్యంత తక్కువ మెజార్టీతో ఈసారి ప్రధానమంత్రి అయ్యారని, రిగ్గింగ్ జరగకపోయి ఉంటే ఆయన ఆ పదవిలో ఉండేవారే కాదని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ అంశంతోపాటు ఆపరేషన్ సిందూర్, భారత్‌పై అమెరికా సుంకాలు, వాణిజ్య ఒప్పందం తదితర అంశాలు విందు భేటీ అజెండాలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో కాంగ్రెస్ ముఖ్య నేతలతోపాటు శరద్ పవార్, తేజస్వీ యాదవ్, ఫరూక్ అబ్దుల్లా తదితరులు హాజరు కానున్నారు. 'ఇండియా'కూటమి నేతలు చివరి సమావేశం జూలై 19న వర్చువల్‌గా జరిగింది.

దవడ పగిలింది.. వెన్నెముక విరిగింది..!

- ఫీజు అడిగిన స్పైస్‌జెట్ ఉద్యోగులపై ఆర్మీ అధికారి దాడి
- ఆస్పత్రి పాలైన నలుగురు బాధితులు

న్యూఢిల్లీ: పరిమితికి మించిన లగేజీతో వచ్చినందుకు అదనంగా ఫీజు చెల్లించాలని కోరిన స్పైస్‌జెట్ సిబ్బందిపై ఆర్మీ సీనియర్ అధికారి ఒకరు చెలరేగిపోయారు. నలుగురు ఉద్యోగులను చితకబాదడంతో వెన్నెముక విరగడం, దవడ పగలడం వంటి తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. శ్రీనగర్ ఎయిర్‌పోర్టులో జూలై 26వ తేదీన చోటు చేసుకున్న ఈ ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. లెఫ్టినెంట్ కల్నల్ రితేశ్ కుమార్ సింగ్ గుల్మార్గ్‌లోని హై ఆల్టిట్యూడ్ వార్‌ఫేర్ స్కూల్ పనిచేస్తున్నారు. ఆయన జూలై 26వ తేదీన ఢిల్లీ వెళ్లే స్పైస్‌జెట్ విమానంలో ప్రయాణించాల్సి ఉంది. క్యాబిన్‌లోకి ప్రయాణికులు కేవలం 7 కిలోల బరువైన లగేజీని మాత్రమే తీసుకెళ్లేందుకు అనుమతిస్తారు. కల్నల్ సింగ్ మాత్రం 16 కిలోల బరువున్న రెండు బ్యాగులతో వచ్చారు. అదనపు బరువుకు నిబంధనల ప్రకారం అదనంగా చార్జీ ఉంటుందని సిబ్బంది చెప్పగా చెల్లించేందుకు నిరాకరించిన సింగ్ ఆగ్రహంతో దుర్భాషలాడుతూ ఊగిపోయారు. వారిని నెట్టేసుకుంటూ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అడ్డుకోబోయిన సిబ్బందిపై సైన్ బోర్డు స్టీల్ స్టాండుతో దాడికి దిగారు. ఒక ఉద్యోగి స్పృహ తప్పి పడిపోగా, ఆయన్ను కాలితో తన్నారు. ముఖంపై పంచ్ ఇవ్వడంతో మరో ఉద్యోగి దవడ ఎముక విరిగింది. ముక్కు నుంచి రక్తం వచ్చింది. మరో ఉద్యోగి వెన్నెముక చిట్లింది. సీఐఎస్ఎఫ్ అధికారి కలుగ జేసుకుని ఆయన్ను తిరిగి గేట్ వద్దకు తీసుకెళ్లారు. బాధిత నలుగురు ఉద్యోగులను వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన తమ దృష్టికి వచ్చిందని, దర్యాప్తు చేపట్టామని ఆర్మీ ఒక ప్రకటనలో తెలిపింది. క్రమశిక్షణకు పెద్దపీట వేస్తామని పేర్కొంది. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. నిబంధనల ప్రకారం..ఆ అధికారి పేరును నో ఫ్లై జాబితాలో చేరుస్తామని స్పైస్ జెట్ తెలిపింది. ఆ ప్రయాణికుడిపై తగు చర్యలు తీసుకోవాలని పౌరవిమానయాన శాఖకు లేఖ రాసింది.



బాధితుల్లో ఒకరు

'పహల్గాం' ఉగ్రవాది అంత్యక్రియలు పీఓకేలో..

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రవాద దాడి వెనుక పాకిస్తాన్ ప్రమేయం ఉన్నట్లు మరోసారి తేలిపోయింది. ఏప్రిల్ 22న పర్యాటకులపై కాల్పులు జరిపి, 26 మందిని పొట్టనపెట్టుకున్న ఉగ్రవాదుల్లో ఒకడైన హబీబ్ తహీర్ అంత్యక్రియలు పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్(పీఓకే)లోని అతడి స్వగ్రామం కుయాన్‌లో జూలై 30న జరిగాయి. జమ్మూకశ్మీర్‌లో ఆపరేషన్ మహాదేవ్‌లో భాగంగా జూలై 28న జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమైన సంగతి తెలిసిందే. ఈ ముగ్గురూ పహల్గాంలో దాడికి పాల్పడిన వారేనని తేలింది. వీరిలో హబీబ్ తహీర్ కూడా ఉన్నాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించగా, వారు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌కు తరలించి అంత్యక్రియలు పూర్తిచేశారు.

పదవీచ్యుత బంగ్లా ప్రధాని హసీనాపై విచారణ ప్రారంభం

ఢాకా: పదవీచ్యుత ప్రధానమంత్రి షేక్ హసీనాపై 2024లో విద్యార్థుల సారథ్యంలో మొదలైన ఆందోళనలను హింసాత్మకంగా అణచివేశారన్న ఆరోపణలపై బంగ్లాదేశ్ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్(ఐసీటీ)ఆదివారం విచారణను ప్రారంభించింది. ఈ కేసులో సహ నిందితులుగా మాజీ హోం మంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కమాల్‌ను, మాజీ ఐజీపీ అబ్దుల్లా అల్ మమూన్‌లను చేర్చింది. ఆపద్ధర్మ ప్రభుత్వం చీఫ్ ప్రాసిక్యూటర్‌గా తాజుల్ ఇస్లాంను నియమించింది. అన్ని నేరాలకు హసీనాయే కేంద్రమని, ఆమెకు గరిష్ట శిక్ష విధించాలని కోర్టును తాజుల్ ఇస్లాం కోరారు.గతేడాది మొదలైన విద్యార్థి ఉద్యమాన్ని అణచివేసేందుకు హత్యలు, చిత్రహింసలకు పాల్పడ్డారంటూ ఐసీటీ హసీనాపై ఆరోపణలు మోపింది.

గాజాలో ఆహార కేంద్రాలపై ఇజ్రాయెల్ దాడులు

29 మంది పాలస్తీనియన్లు మృతి

డెయిర్ అల్-బలాహ్: గాజా సహాయ కేంద్రాల సమీపంలో ఇజ్రాయెల్ దళాలు కాల్పులు కొనసాగుతున్నాయి. సహాయ పంపిణీ కేంద్రాల వద్ద తాజాగా జరిగిన దాడుల్లో 29 మంది ప్రాణాలు కోల్పోయారు. గాజా హ్యూమానిటేరియన్ ఫౌండేషన్ (జీహెచ్ఎఫ్) నిర్వహిస్తున్న సహాయ పంపిణీ కేంద్రాల్లో నెట్‌జారిమ్ కారిడార్ సమీపంలో జరిపిన కాల్పుల్లో 8 మంది, రఫా గనరంలోని షకాష్ ప్రాంతంలో జరిపిన దాడుల్లో ఇద్దరు... మొత్తం 10 మంది మరణించారు. సహాయం కోసం జికిమ్ క్రాసింగ్ వద్ద ఎదురు చూస్తున్న 19 మందిని ఇజ్రాయెల్ దళాలు కాల్చి చంపాయి. తమ కార్యాలయంపై ఇజ్రాయెల్ దళాల దాడుల వల్ల సిబ్బందిలో ఒకరు మరణించారని పాలస్తీనియన్ రెడ్ క్రెసెంట్ సొసైటీ తెలిపింది. గత 24 గంటల్లో పోషకాహార లోపం కారణాల వల్ల ఏడుగురు పాలస్తీనియన్లు మరణించారని పేర్కొంది.

బెంగాలీ భాషను అవమానించొద్దు

ఢిల్లీ పోలీసులపై బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆగ్రహం

కోల్‌కతా: బెంగాలీ భాషను బంగ్లాదేశీ జాతీయ భాషగా ఢిల్లీ పోలీసులు ఓ లేఖలో పేర్కొనడంపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత మమతా బెనర్జీ ఆగ్రహం వ్యక్తంచేశారు. కేంద్ర ప్రభుత్వం బెంగాలీ భాషను వ్యతిరేకిస్తోందని మండిపడ్డారు. బెంగాలీ భాష మాట్లాడే ప్రజలను కించపర్చడం దారుణమని పేర్కొన్నారు. రాజ్యాంగ భాషకు వ్యతిరేకిగా మారిన కేంద్రం తీరు పట్ల ప్రతి ఒక్కరూ నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. కేంద్ర హోం శాఖ పరిధిలోని ఢిల్లీ పోలీసులు బెంగాలీని బంగ్లాదేశీ జాతీయ భాషగా ప్రస్తావించి, పశ్చిమ బెంగాల్ ప్రజలను, తమ భాషను అవమానించారని ధ్వజమెత్తారు. సదరు లేఖను ఆదివారం సోషల్ మీడియాలో మమతా బెనర్జీ పోస్టు చేశారు. బెంగాలీ తమ మాతృభాష అని, రవీంద్రనాథ్ ఠాగూర్, స్వామి వివేకానందకు కూడా మాతృభాష అని గుర్తుచేశారు. జాతీయ గీతం, జాతీయ గేయాన్ని బెంగాలీ భాషలోనే రచించారని ఉద్ఘాటించారు. కోట్లాది మంది భారతీయులు మాట్లాడే భాషను మరో దేశానికి చెందిన జాతీయ భాషగా పేర్కొనడం సరైంది కాదన్నారు. బెంగాల్ ప్రజలను అవమానించడం మానుకోవాలని సూచించారు. ఢిల్లీ పోలీసులు ఇటీవల ఓ కేసుకు సంబంధించి ఢిల్లీలోని బంగ భవన్ అధికారికి లేఖ రాశారు. బెంగాలీ భాషను బంగ్లాదేశీ జాతీయ భాషగా పేర్కొన్నారు. ఈ వ్యవహారం వివాదాస్పదంగా మారింది.

ప్రత్యేక కోర్టు తీర్పు హిందుత్వ విజయం

- కాషాయ ఉగ్రవాదం అన్నవారికి చెంపపెట్టు
- మాలేగావ్ పేలుళ్ల కేసులో ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ వ్యాఖ్యలు

భోపాల్: 2008 నాటి మాలేగావ్ బాంబు పేలుళ్ల అంశంపై ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పు హిందుత్వ విజయమని ఇదే కేసులో నిర్దోషిగా తేలిన బీజేపీ మాజీ ఎంపీ ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ అన్నారు. కాషాయ ఉగ్రవాదం అంటూ అనుచిత వ్యాఖ్యలు చేసినవారికి ఈ తీర్పు చెంపపెట్టు అని స్పష్టంచేశారు. మాలేగావ్ పేలుళ్ల కేసులో గత నెల 31న ప్రత్యేక కోర్టు తీర్పు ప్రకటించింది. ప్రజ్ఞాసింగ్ ఠాకూర్, కల్నల్ ప్రసాద్ పురోహిత్‌తోపాటు మరో ఐదుగురిని నిర్దోషులుగా తేల్చింది. ప్రత్యేక కోర్టు తీర్పును ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ స్వాగతించారు. ఇది హిందుత్వకు, మతానికి, కాషాయానికి దక్కిన విజయమని అభివర్ణించారు. ఆమె ఆదివారం మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో మీడియాతో మాట్లాడారు. సత్యమేవ జయతే అని మన ధర్మశాస్త్రాలు బోధిస్తున్నాయని, అది ఇప్పుడు నిరూపితమైందని వ్యాఖ్యానించారు. కాషాయంపై నోరుపారేసుకున్న వ్యక్తులు సిగ్గుతో తలదించుకోవాలని అన్నారు. కాషాయ ఉగ్రవాదం అనే మాట పుట్టించిన వారికి మన సమాజం, కోర్టు దిమ్మతిరిగే సమాధానం ఇచ్చాయని ఉద్ఘాటించారు. కోర్టు తీర్పు తర్వాత భోపాల్‌లోని తన ఇంటికి చేరుకున్న ప్రజ్ఞాసింగ్ ఠాకూర్‌కు అభిమానులు, స్థానికులు ఘన స్వాగతం పలికారు.

కుక్క కలుషితం చేసిన భోజనం తిన్నారని.. 78 మంది విద్యార్థులకు రేబిస్ టీకా

బలోదాబజార్: మధ్యాహ్న భోజనాన్ని కుక్క కలుషితం చేసిందని తెలిసినా విద్యార్థులకు వడ్డించేశారు. ఆ తర్వాత అందరికీ రేబిస్ టీకాలు వేయించారు. ఛత్తీస్‌గఢ్‌లోని బలోదాబజార్ జిల్లా లచ్చన్‌పూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో జూలై 29వ తేదీన ఈ ఘటన చోటుచేసుకుంది. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా 29న తేదీన స్కూల్‌లో పిల్లల కోసం అన్నం, కూరలు సిద్ధం చేశారు. కూరను వీధి కుక్క వచ్చి తింటుండగా గమనించిన కొందరు విద్యార్థులు టీచర్లకు విషయం తెలిపారు. విద్యార్థులు ఆ కలుషిత ఆహారం వడ్డించవద్దని టీచర్లు భోజనం వండి వడ్డించే స్వయం సహాయ బృందానికి సూచించారు. అయితే, ఆ భోజనం బాగానే ఉందంటూ వారు విద్యార్థులకు ఆహారం సర్వ్ చేశారు. మొత్తం 84 మంది విద్యార్థులు ఆ భోజనం తిన్నారు. విద్యార్థులు ఇళ్లకు వెళ్లాక తమ తల్లిదండ్రులకు ఈ విషయం చెప్పారు. దీంతో, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సహా గ్రామస్తులంతా స్కూలుకు వెళ్లి హెడ్మాస్టర్‌ను నిలదీశారు. అనంతరం తల్లిదండ్రులు తమ పిల్లల్ని తీసుకుని స్థానిక పీహెచ్‌సీలో కుక్క కాటు విరుగుడు ఇంజెక్షన్లు ఇప్పించారు. కేవలం ముందు జాగ్రత్తగానే తమ వద్దకు వచ్చిన 78 మంది విద్యార్థులకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ ఇచ్చామే తప్ప, ఇన్ఫెక్షన్ నిర్ధారణయిందని మాత్రం కాదని పీహెచ్‌సీ వైద్యులు తెలిపారు. ఈ మొత్తం వ్యవహారం తెలిసిన జిల్లా అధికారులు పాఠశాలకు చేరుకుని దర్యాప్తు చేపట్టారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.

గడ్కరీ ఇంటికి బాంబు బెదిరింపు

నాగ్‌పూర్: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఇంటిని పేల్చేస్తామని ఫోన్ చేసి బెదిరించిన వ్యక్తిని.. నాగ్‌పూర్ పోలీసులు అరెస్టు చేశారు. మంత్రి ఇంటి దగ్గర భద్రతను కట్టుదిట్టం చేశారు. నాగ్‌పూర్‌లోని వార్ధా రోడ్‌లో ఉన్న గడ్కరీ మహల్‌ను కొద్ది సేపట్లో పేల్చేస్తామని ఆదివారం ఉదయం నగరంలోని కంట్రోల్ రూమ్‌కు బెదిరింపు కాల్ వచ్చింది. వెంటనే బాంబ్ స్క్వాడ్‌ను అప్రమత్తం చేసిన పోలీసులు.. గడ్కరీ నివాసానికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. అయితే పోలీసులకు ఎలాంటి అనుమానాస్పద వస్తువులు దొరకలేదు. మరోవైపు.. ఫోన్ కాల్ వచ్చిన నంబర్‌ను ట్రేస్ చేశారు. కాల్ చేసిన వ్యక్తిని నగరంలోని తులసి బాగ్ రోడ్‌లో నివసిస్తున్న ఉమేష్ విష్ణు రౌత్‌గా గుర్తించారు. అతను మద్యం దుకాణంలో పనిచేస్తున్నాడు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. బెదిరింపు కాల్ వెనుక ఉద్దేశాన్ని తెలుసుకునేందుకు విచారణ జరుపుతున్నారు. రౌత్‌కు గతంలో ఎలాంటి నేర చరిత్ర లేదని, కేసులు కూడా లేవని పోలీసులు వెల్లడించారు.

మిజోరంలో రూ. 350 కోట్ల విలువైన మాదకద్రవ్యాలు స్వాధీనం

ఐజ్వాల్: డ్రగ్స్ స్మగ్లింగ్ అణచివేతలో భాగంగా మిజోరం పోలీసులు భారీ మాదక ద్రవ్యాల రవాణాను అడ్డుకున్నారు. దాదాపు రూ. 350 కోట్ల విలువైన క్రిస్టల్ మెథాంఫెటమైన్, హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఒకరిని అరెస్టు చేశారు. సీనియర్ అధికారి ఆదివారం వెల్లడించిన వివరాల ప్రకారం.. పక్కా సమాచారం మేరకు, క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (స్పెషల్ బ్రాంచ్), ఐజ్వాల్‌లోని స్పెషల్ నార్కోటిక్ పోలీస్ సిబ్బంది ఆగస్టు 1న సంయుక్తంగా రాష్ట్ర రాజధాని సమీపంలో ఒక ఆపరేషన్ నిర్వహించాయి. ఐజ్వాల్ వైపు భారీ స్థాయిలో డ్రగ్స్‌ను తీసుకెళ్తున్న ట్రక్కును జెమాబాక్, సెలింగ్ ప్రాంతాల మధ్య పోలీసులు అడ్డగించారు. వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయగా, దాదాపు 350 కోట్ల విలువైన డ్రగ్స్ దొరికాయి. అందులో రూ.300 కోట్ల విలువైన 20.304 కిలోల క్రిస్టల్‌మెత్, రూ.49.56 లక్షల విలువైన 1.652 కిలోల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్‌ను రవాణా చేస్తున్న వాహనం డ్రైవర్ బి.లాల్తాజువాలా (45)ను అరెస్టు చేశారు.

ప్రశాంతంగా నీట్-పీజీ పరీక్ష

- దేశవ్యాప్తంగా 301 నగరాల్లో 1,052 పరీక్షా కేంద్రాలు
- హాజరైన 2లక్షల 42వేల మంది అభ్యర్థులు

న్యూఢిల్లీ: వైద్య విద్య పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే నీట్-పీజీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. దేశవ్యాప్తంగా 2లక్షల 42వేల మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారని మెడికల్ సైన్సెస్ పరీక్షల నేషనల్ బోర్డు (ఎన్‌బీఈఎమ్ఎస్) తెలిపింది. దేశంలోని 301 నగరాల్లో 1,052 సెంటర్లలో ఒకే షిఫ్టులో నిర్వహించిన ఈ కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహించినట్లు వెల్లడించింది. ఒకే షిఫ్టులో నిర్వహించే అతి పెద్ద కంప్యూటర్ ఆధారిత ప్రవేశ పరీక్ష ఇదే. వివిధ మెడికల్ కాలేజీలు, గుర్తింపు ఉన్న హాస్పిటల్స్ నుంచి 2,200 మంది సిబ్బంది పరీక్ష నిర్వహణలో పాలుపంచుకున్నారని ఎన్‌బీఈఎమ్ఎస్ తెలిపింది. పరీక్షల నిర్వహణ కోసం ఎన్‌బీఈఎమ్ఎస్ అన్ని పరీక్షా కేంద్రాలలో తగినంత శాంతిభద్రతలు నెలకొల్పేందుకు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, డీజీపీలకు లేఖలు రాసింది. జిల్లా యంత్రాంగం, పోలీసుల సహాయం కూడా కోరింది. సైబర్ మోసాలను నివారించడానికి హోం శాఖలోని ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్(ఐ4సీ) సహాయం కూడా తీసుకుంది. అన్ని పరీక్షా కేంద్రాల ప్రత్యక్ష సీసీటీవీ ఫుటేజ్‌ను నిరంతరం పర్యవేక్షిస్తూ విజయవంతంగా పరీక్షను ముగించినట్లు ఎన్‌బీఈఎమ్ఎస్ ఒక ప్రకటనలో తెలిపింది.

ఆదేశిక సూత్రాలు ఎక్కడ ఆవిర్భవించాయి?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ

ఆదేశిక సూత్రాలు

భారత రాజ్యాంగంలో ఆదేశిక సూత్రాలను 4వ భాగంలో చేర్చారు. వీటి గురించి ఆర్టికల్ 36 నుంచి 51 వరకు తెలియజేస్తాయి. ఇవి మధ్యయుగ కాలంలో రోమ్‌లో ఆవిర్భవించాయి. రోమ్ నుంచి స్పెయిన్ అక్కడి నుంచి ఐర్లాండ్, అక్కడి నుంచి ఇండియా, ఇండియా నుంచి చైనా గ్రహించాయి. ఆదేశిక సూత్రాలను అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలను రాజ్యాంగం ఆదేశిస్తుంది. వీటి అమలు ద్వారా సంక్షేమ రాజ్యాన్ని నిర్మించడంతోపాటు ఆర్థిక న్యాయాన్ని, ఆర్థిక సమానత్వాన్ని సాధించొచ్చు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఆ పార్టీ సిద్ధాంతాలకు అతీతంగా వీటిని అమలు చేయాలి.

ఆదేశిక సూత్రాలను రూపొందించడంలో 1928 నెహ్రూ కమిటీ రిపోర్టు, 1931 కరాచీ కాంగ్రెస్ తీర్మానం, 1945 సప్రూ కమిటీ రిపోర్టు బాగా తోడ్పడ్డాయి. అధికంగా కరాచీ తీర్మానం తోడ్పడింది. కానీ సప్రూ కమిటీ నివేదిక ఆధారంగా వీటిని చేర్చారు.

ఆదేశిక సూత్రాలు - లక్షణాలు

- ఆదేశిక సూత్రాలకు న్యాయస్థానాల ద్వారా రక్షణ లేదు. వీటిని అమలు చేయాలని ప్రభుత్వాలను న్యాయస్థానాలు ఆజ్ఞాపించే అవకాశం లేదు.
- ఇవి శ్రేయోరాజ్య స్థాపనకు తోడ్పడతాయి.
- వీటి అమలు ద్వారా ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని సాధించొచ్చు.
- ఇవి ప్రభుత్వ విధులు, బాధ్యతలను తెలుపుతాయి. కాబట్టి సకారాత్మకమైనవి.
- రాజ్య కార్యకలాపాల పరిధిని విస్తృతం చేస్తాయి.

రాజ్యాంగంలో ఆదేశిక సూత్రాలకు సంబంధించిన ప్రకరణలు

ప్రకరణ-36- రాజ్య నిర్వచనం: రాజ్యం అంటే కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు, వివిధ సంస్థలు.
ప్రకరణ-37-ఆదేశిక సూత్రాల అమలు: వీటిని అమలు చేసే బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. అమలులో వైఫల్యం చెందితే న్యాయస్థానాలను ఆశ్రయించే అవకాశం లేదు. కానీ అమలు కోసం న్యాయస్థానాలు సూచనలు, సలహాలు మాత్రం ఇవ్వగలవు. వీటి అమలు.. ఆర్థిక వనరుల లభ్యత, ప్రభుత్వ అంకితభావం, సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది.
ఆదేశిక సూత్రాల స్వభావాన్ని బట్టి ప్రముఖ పరిపాలనా శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఎంపీ శర్మ వాటిని మూడు రకాలుగా విభజించారు. అవి..
1) సామ్యవాద 2) గాంధేయ
3) ఉదారవాద సూత్రాలు

సామ్యవాద సూత్రాలు

ఆర్టికల్ 38, 39, 41, 42, 43(ఎ).
ఆర్టికల్ 38: భారతదేశం ఒక సంక్షేమ రాజ్యం కాబట్టి ప్రజలందరికీ ఆర్థిక, సాంఘిక, రాజకీయ న్యాయాన్ని అందించాలి.
ఆర్టికల్ 39: ప్రభుత్వ విధాన రూపకల్పనలో ఆదేశిక సూత్రాలను దృష్టిలో ఉంచుకోవాలి.
39(ఎ): స్త్రీ, పురుషులకు సమాన జీవనోపాధి కల్పించాలి.
39(బి): భౌతిక సంపదను అందరికీ సమానంగా పంపిణీ చేయాలి.
39(సి): సంపదను వికేంద్రీకరించాలి.
39(డి): స్త్రీ, పురుషులకు సమాన జీత భత్యాలను చెల్లించాలి.
39(ఇ): శ్రామికులకు పనికి తగిన వేతనాన్ని చెల్లించాలి. శ్రమ దోపిడీకి గురి చేయకూడదు.
39(ఎఫ్): బాలబాలికల అభివృద్ధికి కృషి చేయాలి.
స్త్రీ, పురుషుల సమానత్వానికి 1955లో హిందూ వివాహ చట్టం, 1961లో వరకట్న నిషేధ చట్టం రూపొందించారు. సంపద వికేంద్రీకరణకు 1950లో ప్రణాళికా సంఘం ఏర్పాటు, 1951లో భూ సంస్కరణల చట్టం, 1969లో బ్యాంకుల జాతీయీకరణ మొదలైనవి చేపట్టారు.
ఆర్టికల్ 41: పనిహక్కు. అందరికీ ఉపాధి కల్పించాలి. ఉపాధి లేనివారికి నిరుద్యోగ భృతి చెల్లించాలి. యువతను దుర్వ్యసనాలకు లోను కాకుండా నియంత్రించాలి. వృద్ధులకు, అనాథలకు చేయూత నివ్వాలి. వికలాంగుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి.
ఇందులో భాగంగా 2006లో గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టారు.
ఆర్టికల్ 42: కార్మికులు పనిచేసేందుకు మానవీయ పరిస్థితులు, స్త్రీలకు ప్రసూతి సౌకర్యాలు కల్పించాలి.
1961లో మాతృత్వ ప్రయోజన చట్టం, 2007లో పితృత్వ ప్రయోజన చట్టాన్ని రూపొందించారు.
ఆర్టికల్ 43(ఎ): పారిశ్రామిక యాజమాన్యంలో కార్మికులకు భాగస్వామ్యం కల్పించాలి.

గాంధేయ సూత్రాలు

ఆర్టికల్ 40, 43, 43(బి), 46, 47, 48, 48(ఎ), 49.
ఆర్టికల్ 40: రామరాజ్య ఏర్పాటుకు, గ్రామ స్వరాజ్యానికి స్థానిక ప్రభుత్వాలను స్థాపించాలి. 1952 అక్టోబర్ 2న సమాజ అభివృద్ధి పథకాన్ని, 1953 అక్టోబర్ 2న జాతీయ విస్తరణ పథకాన్ని ప్రవేశపెట్టారు. బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ సిఫార్సు మేరకు స్థానిక ప్రభుత్వాలను ఏర్పాటు చేశారు. ఎల్ఎం సింఘ్వీ కమిటీ సిఫార్సు మేరకు 73, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా వీటికి రాజ్యాంగ ప్రతిపత్తిని కల్పించారు.
ఆర్టికల్ 43: గ్రామీణ ప్రాంతాల్లో కుటీర పరిశ్రమలను అభివృద్ధి చేయాలి. వీటి అభివృద్ధికి అఖిల భారత హ్యాండ్లూమ్ బోర్డు, అఖిల భారత ఖాదీ కమిషన్, అఖిల భారత సిల్క్ బోర్డ్ మొదలైనవి ఏర్పాటయ్యాయి.
ఆర్టికల్ 43(బి): సహకార సంఘాలకు రాజ్యాంగ హోదా కల్పించాలి. దీన్ని 2011లో 97వ సవరణ ద్వారా చేర్చి, 12 జనవరి 2012న అమల్లోకి తీసుకొచ్చారు.
ఆర్టికల్ 46: బీసీ, ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి. వీరికోసం ఉద్యోగాలు, చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలి.
ఆర్టికల్ 47: ప్రజారోగ్యాన్ని సంరక్షించాలి. మద్యపానం, ధూమపానం, మత్తు పదార్థాలను నిషేధించాలి. మద్య నిషేధాన్ని గుజరాత్, బిహార్‌లు అమలు చేస్తున్నాయి. ఆంధ్ర రాష్ట్రంలో 1954లో, ఆంధ్రప్రదేశ్‌లో 1994లో మద్యపాన నిషేధం విధించారు.



ఆర్టికల్ 48: వ్యవసాయ అభివృద్ధికి తోడ్పడాలి. పశుపోషణను పెంపొందించాలి. గోవధను నిషేధించాలి. ఉత్పాదకతను పెంచేందుకు రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలి. ఎరువులు, విత్తనాలను పంపిణీ చేయాలి.
ఆర్టికల్ 48(ఎ): వన్యమృగాలను, అడవులను సంరక్షించి పర్యావరణాన్ని పరిరక్షించాలి. 1974లో కాలుష్య నియంత్రణ చట్టాన్ని, 1980లో అడవుల పరిరక్షణ చట్టాన్ని రూపొందించారు.
ఆర్టికల్ 49: భారతదేశ ఉన్నత సంస్కృతిని, వారసత్వాన్ని, చారిత్రక ప్రదేశాలను సంరక్షించాలి. చారిత్రక ప్రదేశాల పరిరక్షణ చట్టాన్ని 1958లో రూపొందించారు. కేంద్ర సంగీత, సాహిత్య అకాడమీలను ఏర్పాటు చేశారు.

ఉదారవాద సూత్రాలు

ఆర్టికల్ 44, 45, 50, 51
ఆర్టికల్ 44: భారతదేశంలో హిందూ, ముస్లిం, క్రైస్తవులందరికీ ఒకే రకమైన.. అంటే ఉమ్మడి పౌరస్మృతిని ఏర్పాటు చేయాలి. దీన్ని అమలు చేయాలని 1952, 1985, 1995, 1997, 2004లో సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆజ్ఞాపించింది. కానీ అమలు జరగలేదు. దీన్ని అమలు పరుస్తున్న ఏకైక రాష్ట్రం గోవా. సరళాముద్గల్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా (1995) కేసులో ఉమ్మడి పౌరస్మృతి అమలుకు తీసుకున్న చర్యలకు సంబంధించి 'అఫిడవిట్' దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆజ్ఞాపించింది.
ఆర్టికల్ 45: ఆరేళ్లలోపు బాలబాలికలకు పౌష్టికాహారం అందించాలి. శిశు, పూర్వ శిశు కేంద్రాలను ఏర్పాటు చేయాలి. దీన్ని 2002లో 86వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు.
ఆర్టికల్ 50: న్యాయశాఖ ప్రతిపత్తిని కాపాడేందుకు కార్యనిర్వాహక శాఖ నుంచి న్యాయశాఖను వేరు చేయాలి.
ఆర్టికల్ 51: అంతర్జాతీయ శాంతి సంరక్షణకు కృషి చేయాలి.
51(ఎ): అంతర్జాతీయ శాంతి భద్రతలను పెంపొందించాలి.
51(బి): ఇతర దేశాలతో గౌరవప్రదమైన సత్సంబంధాలను కొనసాగించాలి.
51(సి): అంతర్జాతీయ న్యాయసూత్రాలను, అంతర్జాతీయ ఒప్పందాలను గౌరవించేలా చూడాలి.
51(డి): అంతర్జాతీయ వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించేందుకు కృషి చేయాలి.
ప్రపంచ శాంతి స్థాపనకు 30-10-1945న ఐక్య రాజ్య సమితిలో 52వ సభ్యదేశంగా, 1949లో కామన్వెల్త్‌లో భారత్ చేరింది. ప్రచ్ఛన్న యుద్ధం నుంచి ప్రపంచాన్ని విముక్తం చేసేందుకు 1961 అలీన విధానంలో కీలకపాత్ర పోషించింది. దక్షిణ మధ్య ఆసియా దేశాల మధ్య సహకారాన్ని పెంపొందించేందుకు 1985లో సార్క్ ఏర్పాటుకు చొరవ చూపింది.

ఆదేశిక సూత్రాల్లో చేర్చిన అదనపు అంశాలు

1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్టికల్ 39(ఎ), 43(ఎ), 48(ఎ) చేర్చారు.
2002లో 86వ రాజ్యాంగ సవరణ ద్వారా ఉచిత నిర్బంధ విద్యను తొలగించి, ఆర్టికల్ 45లో ఆరేళ్లలోపు బాల బాలికలకు పౌష్టికాహారాన్ని అందించాలి అనే అంశాన్ని చేర్చారు. 2011లో 97వ రాజ్యాంగ సవరణ ద్వారా 43(బి) చేర్చి సహకార సంఘాలకు రాజ్యాంగ హోదా కల్పించారు.

రాజ్యాంగంలోని ఇతర భాగాల్లో గల ఆదేశిక సూత్రాలు

4వ భాగంలోనే కాకుండా ఇతర భాగాల్లో మరికొన్ని ఆదేశిక సూత్రాలను చేర్చారు. 16వ భాగంలోని ఆర్టికల్ 335 ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీలకు సముచిత స్థానం కల్పించాలి. 17వ భాగంలోని ఆర్టికల్ 350(ఎ) ప్రకారం మాతృభాషలోనే ప్రాథమిక విద్యను అందించాలి. 17వ భాగంలోని ఆర్టికల్ 351 ప్రకారం హిందీని జాతీయభాషగా గుర్తించి అమలు చేయాలి.
గమనిక: ఆదేశిక సూత్రాలు జమ్మూకాశ్మీర్‌కు వర్తించవు.

ఆదేశిక సూత్రాలపై ప్రముఖుల వ్యాఖ్యలు

- ఆదేశిక సూత్రాలు సక్రమంగా అమలైతే భారత దేశం అనతి కాలంలోనే భూతలస్వర్గం అవుతుంది. - ఎంసీ చాగ్లా
- ఆదేశిక సూత్రాలు ఒక బ్యాంకు తనకు అనుగుణంగా చెల్లించే చెక్కు వంటివి. - ప్రొ. కేటీ షా
- అజ్ఞానం, దౌర్జన్యాల నుంచి భారత ప్రజల్ని విముక్తి చేయడమే ఆదేశిక సూత్రాల అంతిమ లక్ష్యం. - పీబీ గజేంద్ర గడ్కర్
- ఆదేశిక సూత్రాలు వైవిధ్య సెంటిమెంట్లతో కూడిన ఒక చెత్తబుట్ట వంటివి. - టీటీ కృష్ణమాచారి
- ఆదేశిక సూత్రాలు ఆర్థిక ప్రజాస్వామ్యానికి మంచి మార్గం. - డాక్టర్ బీఆర్ అంబేద్కర్
- నిర్దేశిక నియమాలు ప్రతి కొత్త సంవత్సరం ప్రారంభం రోజున చేసుకునే తీర్మానాల వంటివి. అవి జనవరి 2వ తేదీనే భంగమవుతాయి. - నసీరుద్దీన్ షా
- నిర్దేశిక నియమాలు నైతిక ప్రవచనాలు. అధికారులు, ప్రభుత్వం వీటిని గౌరవించాలి. - బీఎన్ రావు

ఇతర గ్రహాలకు భిన్నంగా భ్రమణం చెందే గ్రహం?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
జాగ్రఫీ

1. కోపర్నికస్ ప్రతిపాదించిన సిద్ధాంతం ఏది?
ఎ) నెబ్యులార్ పరికల్పన
బి) హీలియో సెంట్రిక్ సిద్ధాంతం (సూర్య కేంద్రక)
సి) నక్షత్ర ద్వయ సిద్ధాంతం
డి) వాయు సిద్ధాంతం
2. భూమికి దగ్గరగా ఉన్న మరో గెలాక్సీ ఏది?
ఎ) ఆండ్రమెడా బి) ఆర్క్‌మెడిస్
సి) బెటల్ రక్స్ డి) పైవన్నీ
3. బిగ్ బ్యాంగ్ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన శాస్త్రవేత్త ఎవరు?
ఎ) ఇ.పి.హబుల్ బి) జార్జ్ లామిట్రీ
సి) హెర్షల్ డి) అరిస్టాటిల్
4. సూర్యుని ఉష్ణోగ్రతను కొలవడానికి ఉపయోగించే కొలమానం ఏది?
ఎ) అనిమోమీటర్ బి) పైరోమీటర్
సి) ఆల్టోమీటర్ డి) పైవన్నీ
5. సూర్యుని నుంచి కాంతి భూమిని చేరడానికి పట్టే కాలం?
ఎ) 4 నిమిషాలు బి) 6 నిమిషాలు
సి) 8 నిమిషాలు డి) 10 నిమిషాలు
6. భూమి తన చుట్టూ తాను తిరగడానికి పట్టే కాలం?
ఎ) 23గం. 56ని. 4.04సె.
బి) 23గం. 50ని. 14 సె.
సి) 24గం. 10ని. 70సె.
డి) 24గం. 56ని. 4.04సె.
7. భూమ్యాకర్షణ శక్తిని విభేదిస్తూ వాతావరణంలోకి వెళ్లడానికి రాకెట్‌కు కావాల్సిన వేగం ఎంత?
ఎ) 4 km/sec బి) 6 km/sec
సి) 8 km/sec డి) 10 km/sec
8. భూమ్యాకర్షణ శక్తి నుంచి తప్పించుకుని బయటకు పోవడానికి రాకెట్‌కు ఎంత వేగం కావాలి?
ఎ) 11 km/sec బి) 14 km/sec
సి) 16 km/sec డి) 18 km/sec
9. భూమిపై కిలో బరువున్న పదార్థం చంద్రునిపై ఎంత బరువును సూచిస్తుంది?
ఎ) 1.64 కేజీలు
బి) తొలి బరువులో ఆరో వంతు
సి) తొలి బరువుకు ఆరు రెట్లు
డి) మార్పు ఉండదు
10. భూమిపై ఎక్కడినుంచైనా చంద్రుని ఒక భాగం మాత్రమే చూడగలగడానికి కారణం?
ఎ) చంద్రుని భ్రమణ కాలం, భూభ్రమణ కాలంతో సమానంగా ఉండడం
బి) చంద్రుని భ్రమణ, పరిభ్రమణ కాలాలు సమానంగా ఉండడం
సి) చంద్రుని పరిభ్రమణ కాలం, భూపరిభ్రమణ కాలంతో సమానంగా ఉండటం
డి) పైవన్నీ
11. 'సీ ఆఫ్ ట్రాంక్విలిటీ' అంటే?
ఎ) చంద్రునిపై తొలిసారిగా మానవుడు కాలుమోపిన ప్రదేశం
బి) చంద్రునిపై ఉండే నీటి గుర్తులు
సి) చంద్రుని కాంతి వల్ల ఉత్తర ధ్రువ సముద్ర ప్రాంతాల్లో ఏర్పడే దృగ్విషయం
డి) అంటార్కిటికా ప్రాంతంలో చంద్రునిపై పరిశోధనల కోసం ఏర్పాటు చేసిన పరిశోధనాలయం
12. రెడ్ ప్లానెట్ అని ఏ గ్రహాన్ని పిలుస్తారు?
ఎ) బుధుడు బి) శుక్రుడు
సి) అంగారకుడు డి) బృహస్పతి
13. అత్యధిక ఉపగ్రహాలు ఉన్న గ్రహం?
ఎ) శని బి) వరుణుడు
సి) బృహస్పతి డి) నెప్ట్యూన్
14. ఏ గ్రహం తూర్పు నుంచి పడమరకు తిరుగుతుంది?
ఎ) బుధుడు బి) శుక్రుడు
సి) వరుణుడు డి) శని
15. ఇతర గ్రహాలకు భిన్నంగా భ్రమణం చెందే గ్రహం?
ఎ) శుక్రుడు బి) అంగారకుడు
సి) బృహస్పతి డి) శని
16. భూమికి సంబంధించి కిందివాటిలో సరైనది?
ఎ) సూర్యకిరణాలు భూమిపై సగభాగంపై మాత్రమే పడతాయి
బి) సూర్యకిరణాలు పడని మిగతా సగ భాగాన్ని అంబ్రా అంటారు
సి) నీడ చుట్టూ ఉన్న పాక్షిక భాగంలో సూర్య కాంతి కొద్దిగా కనిపించే భాగాన్ని పెనంబ్రా అంటారు
డి) పైవన్నీ
17. భూమికి సూర్యుడు దగ్గరగా రావడాన్ని ఏమంటారు?
ఎ) పరిహేళి బి) అపహేళి
సి) అభినతి డి) అపనతి
18. భూమికి, సూర్యుడు దూరంగా వెళ్లే రోజును ఏమంటారు?
ఎ) అపహేళి బి) పరిహేళి
సి) అపనతి డి) అభినతి
19. భూమధ్యరేఖపై సూర్యకిరణాలు లంబంగా పడే రోజు?
ఎ) మార్చి 21, సెప్టెంబరు 23
బి) ఏప్రిల్ 18, అక్టోబరు 22
సి) మే 14, నవంబరు 16
డి) జూన్ 21, డిసెంబరు 22
20. కింది వాటిలో సరికాని జత ఏది?
ఎ) విషవత్తులు- భూమధ్యరేఖపై సూర్యకిరణాలు లంబంగా పడటం
బి) ఆయనాంతాలు- కర్కట, మకర రేఖలపై సూర్యకిరణాలు లంబంగా పడటం
సి) చంద్రగ్రహణం-సూర్యుడికి,భూమికి మధ్యలో చంద్రుడు వచ్చినపుడు ఏర్పడుతుంది
డి) సూర్యగ్రహణం- చంద్రుడు... భూమి, సూర్యుడికి మధ్యలో వచ్చినప్పుడు ఏర్పడుతుంది.
21. ప్రపంచంలో ఏ దేశంలో ముందుగా సూర్యోదయం అవుతుంది?
ఎ) మలేషియా బి) సింగపూర్
సి) జపాన్ డి) అమెరికా
22. సూర్యుడు ఒక రేఖాంశం నుంచి మరో రేఖాంశాన్ని దాటడానికి పట్టే కాలం?
ఎ) 4 నిమిషాలు బి) 8 నిమిషాలు
సి) 12 నిమిషాలు డి) 16 నిమిషాలు
23. కింది వాటిలో సరికాని జత ఏది?
ఎ) 180-మొత్తం భూగోళంపై గీసిన అక్షాంశాలు
బి) 360 - మొత్తం భూగోళంపై గీసిన రేఖాంశాలు
సి) 180°W/E - అంతర్జాతీయ దినరేఖ
డి) 90°N - ఉత్తర ధ్రువం
24. పశ్చిమ రేఖాంశాల నుంచి అంతర్జాతీయ దినరేఖను దాటి తూర్పు రేఖాంశాల్లోకి ప్రవేశించినప్పుడు..?
ఎ) ఒక రోజును కలుపుకోవాలి
బి) ఒక రోజును తీసివేయాలి
సి) ప్రయాణించిన రోజే ఉంటుంది
డి) పైవేవీ కావు
25. ఖండచలన సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన శాస్త్రవేత్త ఎవరు?
ఎ) డబ్ల్యు.జె. మోర్గాన్
బి) వెజ్‌నర్ సి) గిల్‌బర్ట్
డి) పై అందరూ
26. ఘన, ద్రవ, వాయు పదార్థాల ద్వారా ప్రయాణించే తరంగాలేవి?
ఎ) P & S బి) P& L
సి) L & S డి) పైవన్నీ
27. భూమి లోపలికి పోయే కొద్దీ ఉష్ణోగ్రత..?
ఎ) ప్రతి 30 మీటర్లకు 1°C చొప్పున పెరుగుతుంది.
బి) ప్రతి 30 మీటర్లకు 1°C చొప్పున తగ్గుతుంది
సి) ప్రతి 30 కిలోమీటర్లకు 1°C చొప్పున పెరుగుతుంది
డి) ప్రతి 30 కిలోమీటర్లకు1°C చొప్పున తగ్గుతుంది.
28. భూపటలంలో అత్యధికంగా ఉండే మూలకం ఏది?
ఎ) సిలికాన్ బి) అల్యూమినియం
సి) ఐరన్ డి) ఆక్సిజన్
29. ప్రపంచ పైకప్పు అని ఏ పీఠభూమికి పేరు?
ఎ) అనటోలియా పీఠభూమి
బి) పామీర్ పీఠభూమి
సి) కొలంబియా పీఠభూమి
డి) దక్కన్ పీఠభూమి
30. భూకంపాల గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఏమంటారు?
ఎ) సిస్మాలజీ బి) హోలోగ్రఫీ
సి) హేగ్రఫీ డి) పైవన్నీ
31. 1898లో భూకంపాలను నమోదు చేసే కేంద్రాన్ని దేశంలో ఎక్కడ స్థాపించారు?
ఎ) కోల్‌కతా బి) ముంబై
సి) కొడైకెనాల్ డి) హైదరాబాద్
32. భూకంపాలను తట్టుకునే విధంగా ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన పరిశోధనా కేంద్రం ఎక్కడ ఉంది?
ఎ) కోల్‌కతా బి) రూర్కీ
సి) భోపాల్ డి) బెంగళూరు
33. జతపరచండి

ఎడారి	ప్రాంతం
A) కలహారి	1) బోట్స్‌వానా
B) థార్	2) ఇండియా
C) అటకామా	3) చిలీ
D) మొజావే	4) అమెరికా

	A	B	C	D
ఎ)	1	2	3	4
బి)	2	3	4	1
సి)	3	4	1	2
డి)	4	1	2	3

34. మెక్సికో, అమెరికా దేశాల సరిహద్దుగా ఉండే నది?
ఎ) అమూర్ బి) లింపోపో
సి) రియొగ్రేడ్ డి) మెకాంగ్
35. ఉత్తర, దక్షిణ కొరియాలను విడదీసే సరిహద్దు రేఖ ఏది?
ఎ) 28వ సమాంతర రేఖ
బి) 38వ సమాంతర రేఖ
సి) 48వ సమాంతర రేఖ
డి) 58వ సమాంతర రేఖ
36. 49వ సమాంతర రేఖ ఏయే దేశాలను విడదీస్తుంది?
ఎ) నమీబియా- అంగోలా
బి) ఉత్తర- దక్షిణ వియత్నాం
సి) అమెరికా- కెనడా
డి) పైవేవీ కాదు
37. కింది వాటిలో సరైనది ఏది?
ఎ) నమీబియా,అంగోలా-16వ సమాంతర రేఖ
బి) ఉత్తర, దక్షిణ వియత్నాం - 17వ సమాంతర రేఖ
సి) LAC - ఇండియా - చైనా
డి) పైవన్నీ
38. ట్రోపో ఆవరణం గురించి సరికానిది ఏది?
ఎ) దీనిలో పైకి పోయేకొద్దీ ప్రతి 1000 మీటర్లకు 6.4°C ఉష్ణోగ్రత తగ్గుతుంది.
బి) అన్ని రకాల వాతావరణ మార్పులు దీనిలోనే జరుగుతాయి
సి) జెట్ విమానాలు ఎగరడానికి అనుకూలంగా ఉండే పొర
డి) భూమధ్యరేఖ వద్ద 18 కి.మీ., ధ్రువాల వద్ద 8 కి.మీ. ఎత్తులో ఉంటుంది.
39. వాతావరణంలో అత్యధికంగా ఉండే వాయువు ఏది?
ఎ) ఆక్సిజన్ బి) కార్బన్‌డైఆక్సైడ్
సి) నైట్రోజన్ డి) ఓజోన్
40. వాతావరణంలో నైట్రోజన్, ఆక్సిజన్‌ల నిష్పత్తి ఎంత?
ఎ) 20 : 60 బి) 78 : 20.9
సి) 80 : 15.6 డి) 95 : 5.3
41. భూవాతావరణంలో విలీనం చెందకుండా హ్రస్వతరంగాల రూపంలోనే వెనక్కి వెళ్లే సౌరపుటాన్ని ఏమంటారు?
ఎ) సౌరస్థిరాంకం బి) ఆల్బెడో
సి) సౌరపుటం డి) ఉష్ణసంతులనం
42. దేశంలో ప్రధాన వాతావరణ కార్యాలయం ఎక్కడ ఉంది?
ఎ) బెంగళూరు బి) గువహటి
సి) పుణే డి) సూరత్
43. ప్రపంచ వాతావరణ సంస్థ ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
ఎ) లండన్ బి) రోమ్
సి) వాషింగ్టన్ డి) జెనీవా
44. కింది వాటిలో సరికాని జత ఏది?
ఎ) పీడనాన్ని కొలిచే సాధనం - భారమితి
బి) పవన వేగాన్ని కొలిచే సాధనం - అనిమోమీటర్
సి) ఆర్ద్రతను కొలిచే సాధనం - హైగ్రోమీటర్
డి) ఏదీకాదు
45. భూమధ్యరేఖపై కొరియాలిస్ బలం...?
ఎ) చాలా ఎక్కువ బి) శూన్యం
సి) తక్కువ డి) బి, సి
46. హిందూ మహాసముద్ర చక్రవాతాలను ఏమంటారు?
ఎ) హరికేన్లు బి) టైఫూన్లు
సి) తుపాన్లు డి) టోర్నడోలు
47. భూమిపై సగటున 1 నిమిషానికి 1 చ.సెం.మీ. ఎన్ని కేలరీల శక్తిని గ్రహిస్తుంది?
ఎ) 1.94 బి) 2.14 సి) 3.94 డి) 4.94
48. ఒక రోజులో అధిక ఉష్ణోగ్రత మధ్యాహ్నం 2 గంటలకు నమోదుకాగా, అత్యల్ప ఉష్ణోగ్రత ఏ సమయంలో నమోదవుతుంది?
ఎ) రాత్రి 2 గంటలకు బి) రాత్రి 4 గంటలకు
సి) రాత్రి 12 గంటలకు
డి) రాత్రి 1.30 గంటలకు
49. ఎత్తు పెరిగే కొద్దీ ఉష్ణోగ్రత తగ్గడాన్ని ఏమంటారు?
ఎ) ఉష్ణోగ్రతా క్షీణతాక్రమం
బి) ఉష్ణోగ్రతా విలోమం సి) ఆల్బెడో
డి) పర్యావరణ ఉష్ణ సంతులనం

సమాధానాలు

1) బి; 2) ఎ; 3) బి; 4) బి; 5) సి;
6) ఎ; 7) సి; 8) ఎ; 9) బి; 10) బి;
11) ఎ; 12) సి; 13) ఎ; 14) సి; 15) ఎ;
16) డి; 17) ఎ; 18) ఎ; 19) ఎ; 20) సి;
21) సి; 22) ఎ; 23) ఎ; 24) ఎ; 25) బి;
26) బి; 27) ఎ; 28) డి; 29) బి; 30) ఎ;
31) ఎ; 32) బి; 33) ఎ; 34) సి; 35) బి;
36) సి; 37) డి; 38) సి; 39) సి; 40) బి;
41) బి; 42) సి; 43) డి; 44) డి; 45) బి;
46) సి; 47) ఎ; 48) బి; 49) ఎ.

విద్య, ఉద్యోగ సమాచారం

రైల్‌టెల్‌లో 40 గ్రాడ్యుయేట్/ డిప్లొమా అప్రెంటిస్‌లు

గుడ్‌గావ్‌లోని రైల్‌టెల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(రైల్‌టెల్).. వివిధ విభాగాల్లో గ్రాడ్యుయేట్, డిప్లొమా అప్రెంటిస్‌లు ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **పోస్టుల సంఖ్య:**40; **శిక్షణా కాలం:**ఒక ఏడాది.
» **విభాగాలు:** ఎలక్ట్రానిక్స్-టెలికమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్/బీఈ, డిప్లొమాలో ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 18 నుంచి 27 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** గ్రాడ్యుయేట్ ఇంజనీర్‌లకు నెలకు రూ.14,000, డిప్లొమా ఇంజనీర్‌లకు నెలకు రూ.12,000.
» **ఎంపిక విధానం:**విద్యార్హతల్లో సాధించిన మెరిట్,ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 16.08.2025
» **వెబ్‌సైట్: https://www.railtel.in**

ఆర్‌వీఎన్‌ఎల్, న్యూఢిల్లీలో అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు

న్యూఢిల్లీలోని రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్(ఆర్‌వీఎన్‌ఎల్) రెగ్యులర్ ప్రాతిపదికన అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(కామర్స్), సీఎస్(ఇంటర్), సీఏ(ఇంటర్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 32 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.30,000 నుంచి 120000.
» **ఎంపిక విధానం:**రాతపరీక్ష/ఇంటర్వ్యూ ద్వారా
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డిస్పాచ్ సెక్షన్, గ్రౌండ్ ఫ్లోర్, ఆగస్టు క్రాంతి భవన్, భికాజి కామా ప్లేస్, ఆర్‌కే పురం, న్యూఢిల్లీ-110066 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 27.08.2025.
» **వెబ్‌సైట్: https://rvnl.org**

ఐఐటీ బీహెచ్‌యూ, వారణాసిలో జేఆర్‌ఎఫ్

వారణాసిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) బెనారస్ హిందూ యూనివర్సిటీ(బీహెచ్‌యూ) ఒప్పంద ప్రాతిపదికన జూనియర్ రీసెర్చ్ ఫెలోలు(జేఆర్‌ఎఫ్) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం ఖాళీల సంఖ్య:** 01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో 60 శాతం మార్కులతో పీజీ(ఫిజిక్స్)లో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి. **వయసు:** 28 ఏళ్లు ఉండాలి.
» **ఫెలోషిప్:** నెలకు రూ.37,000 నుంచి 42,000
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా.
» **ఈమెయిల్: pcpandey.app@iitbhu.ac.in**
» **దరఖాస్తులకు చివరితేది:** 08.08.2025.
» **వెబ్‌సైట్: https://iitbhu.ac.in**

వ్యోమగాములు ఆహారంగా ఉపయోగించే శైవలం ఏది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ

క్రీ.పూ.2000లో భారతీయులు అధర్వణ వేదంలో ఔషధ మొక్కల గురించి వివరించారు. పరాశరుడు వ్యవసాయం, కలుపు మొక్కల గురించి వివరిస్తూ 'కృషి పరాశరం'; అడవులు, ఔషధ మొక్కలు, మొక్కల బాహ్య, అంతర్నిర్మాణం గురించి వర్ణిస్తూ 'వృక్షాయుర్వేదం' గ్రంథాలను రచించారు. ఈయనను 'భారతదేశ వృక్షశాస్త్ర పితామహుడు'గా పేర్కొంటారు.



మొక్కలు - వర్గీకరణ, విస్తరణ

ప్రకృతిలో పిండిపదార్థాన్ని స్వయంగా తయారుచేసుకొని, వినియోగించుకొని ఇతర జీవులకు ఆహారంగా అందించేవి మొక్కలు. మానవుడికి ఇవి అనేక విధాలుగా తోడ్పడుతున్నాయి. ఔషధాలు, కాగితం తయారీలో, వివిధ పరిశ్రమల్లో వీటిని విరివిగా ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా ప్రాణులు జీవించడానికి అవసరమైన ఆక్సిజన్‌ను ఇవి అందిస్తున్నాయి.

మొక్కల గురించి తెలుసుకోవడానికి సౌలభ్యం కోసం వీటిని విభిన్న సముదాయాలుగా విభజించారు. జీవపరిణామక్రమం, ఆకృతులు, విస్తరణ ఆధారంగా వీటిని వివిధ రకాలుగా వర్గీకరించారు. మొట్టమొదటిసారిగా మొక్కలను వాటి స్వరూపం ఆధారంగా అరిస్టాటిల్ మూడు రకాలుగా వర్గీకరించారు.

అవి:
1) గుల్మాలు
2) పొదలు
3) వృక్షాలు

క్రీ.పూ.4000 ఏళ్ల కిందట ఈజిప్టు, అస్సీరియన్ దేశస్థులు పైరు మొక్కలు, ఫలాల మొక్కలు తదితరాలుగా వీటిని చిత్రపటాల (హీరోగ్లిఫిక్స్) రూపంలో నమోదు చేశారు. క్రీ.పూ. 2500 సంవత్సరాల నాటికే చైనా దేశస్థులు మొక్కలు, వాటి సాగు గురించి వివరించారు.

గ్రీకు తత్వవేత్తలైన సోక్రటీస్, ప్లేటో, అరిస్టాటిల్ వృక్షశాస్త్ర అభివృద్ధికి ఎంతగానో తోడ్పడ్డారు. థియోఫ్రాస్టస్‌ను వృక్షశాస్త్ర పితామహుడిగా భావిస్తారు. ఈయన మొట్టమొదటిసారిగా 500 రకాల మొక్కల లక్షణాలను వివరిస్తూ 'హిస్టోరియా ప్లాంటారం' గ్రంథాన్ని రచించాడు.

16, 17 శతాబ్దాల్లో ఔషధ మొక్కలపై విస్తృత అధ్యయనం జరిగింది.

18వ శతాబ్దంలో లిన్నేయస్ (స్వీడన్ శాస్త్రజ్ఞుడు) ద్వినామీకరణ విధానాన్ని అభివృద్ధి పరిచి మొక్కలను వర్గీకరించారు. జీవ పరిణామ క్రమం ప్రకారం మొక్కలను వృక్ష రాజ్యంగా పేర్కొని వాటిని భిన్న రకాలుగా విభజించారు. వీటిలో అనేక లక్షణాలను పరిగణనలోకి తీసుకున్నారు. లిన్నేయస్‌ను వర్గీకరణ శాస్త్ర పితామహుడుగా పరిగణిస్తారు.

పుష్పించని మొక్కలు (క్రిప్టోగామ్స్)

పుష్పించని మొక్కలు పుష్పాలు, ఫలాలు, విత్తనాలను కలిగి ఉండవు. నిర్మాణం ఆధారంగా వీటిని మూడు రకాలుగా వర్గీకరించారు.

1. **థాలోఫైటా:** ఇవి వేరు, కాండం, పత్రాలుగా విభేదనం చెంది ఉండవు. వీటి దేహ భాగాన్ని 'థాలస్' అంటారు. వీటిలో మళ్లీ రెండు రకాలు ఉన్నాయి.

ఎ) ఆల్గే (శైవలాలు): శైవలాల గురించి చేసే అధ్యయనాన్ని ఆల్గాలజీ/ఫైకాలజీ అంటారు. ఇవి ఆకుపచ్చగా ఉంటాయి. సాధారణంగా వీటిని 'నాచు' అని పిలుస్తారు. ఇవి సాధారణంగా నీటిలో ఆవాసం చేస్తాయి. వీటిలో వివిధ వర్ణాలు కలిగిన శైవలాలు ఉంటాయి.

అవి:
i) క్లోరోఫైసి-ఆకుపచ్చ
ii) ఫియోఫైసి-గోధుమ రంగు
iii) రోడోఫైసి-ఎరుపు రంగు

ఆహారంగా, ఆర్థికంగా ఉపయోగపడే శైవలాలు అనేకం ఉన్నాయి. స్పైరులినా, అల్వా, క్లోరెల్లా, ఫోరిఫైరా, సెనిడెస్మస్, క్లాడోఫోరా మొదలైనవాటిలో ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. ఇవి ఏకకణ ప్రోటీన్ల రూపంలో ఆహారంగా ఉపయోగపడుతున్నాయి.

ఎరుపు రంగు శైవలాలైన గ్రాసిల్లేరియా, జిలాడియం నుంచి అగార్-అగార్, లామినేరియా నుంచి అయోడిన్ లాంటి పదార్థాలు లభ్యమవుతున్నాయి. డయాటమ్‌లు ఎరువుగా, వడపోత విధానంలోనూ ఉపయోగపడతాయి.


బి) ఫంగి (శిలీంధ్రాలు): సాధారణంగా వీటిని 'బూజులు' (Mould) అంటారు. శిలీంధ్రాల గురించి చేసే అధ్యయనాన్ని 'మైకాలజీ' అంటారు. శిలీంధ్రాలు సాధారణంగా కొన్ని పూతికాహారులు, మరికొన్ని పరాన్నజీవులు. వీటి కణకవచం కైటిన్‌తో నిర్మితమై ఉంటుంది. శిలీంధ్రాలలో ఆహార పదార్థం గ్లైకోజన్ రూపంలో నిల్వ ఉంటుంది. ఇవి బహుకేంద్రక, ద్వికేంద్రక స్థితుల్లో ఉంటాయి. వీటిలో ప్రత్యుత్పత్తి సిద్ధబీజాల(spores) ద్వారా జరుగుతుంది. సాధారణంగా రొట్టెల మీద పెరిగే శిలీంధ్రం రైజోపస్.

అలెగ్జాండర్ ఫ్లెమింగ్ 1928లో పెన్సీలియం లాంటి శిలీంధ్రాల నుంచి 'పెన్సిలిన్' అనే యాంటీబయాటిక్‌ను ఉత్పత్తి చేశారు. న్యూరోస్పోరా లాంటి శిలీంధ్రాలను జన్యుశాస్త్ర పరిశోధనల్లో విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. మొరెల్స్, ట్రపుల్స్ అనేవి తినదగిన శిలీంధ్రాలు. మష్‌రూం అంటే 'స్పాంజి' అని అర్థం. కొన్ని శిలీంధ్రాల్లో ముఖ్యంగా తినగలిగే వాటిలో పుట్టగొడుగులు ముఖ్యమైనవి. విష పూరితమైన పుట్టగొడుగులను 'టాడ్‌స్టూల్స్' అంటారు. భారతదేశంలో అగారికస్ బైస్పోరస్ (White button Mushroom) అనే తినదగిన పుట్టగొడుగులను సాగు చేస్తున్నారు. పుట్టగొడుగుల విత్తనాలను 'స్పాన్' అంటారు. కొన్ని రకాల శిలీంధ్రాలు మొక్కల్లో కుంకుమ తెగులు, కాటుక తెగులు లాంటివాటిని కలిగిస్తాయి.

2. **బ్రయోఫైటా:** వీటిని సాధారణంగా వృక్షరాజ్య ఉభయచర మొక్కలు అంటారు. వీటి గురించి చేసే అధ్యయనాన్ని 'బ్రయాలజీ' అంటారు. ఇవి ఏక స్థితికంలో ఉండే మొక్కల మాదిరిగా కనిపిస్తాయి. వీటిలో ఉండే వేరు లాంటి నిర్మాణాలను రైజాయిడ్స్, కాండం లాంటి నిర్మాణాలను కాలాయిడ్స్, పత్రాల లాంటి నిర్మాణాలను ఫిల్లాయిడ్స్ అని అంటారు. వీటిలో లివర్ వర్ట్స్, హార్న్‌వర్ట్స్, మాసెస్ అనే మూడు రకాలు ఉన్నాయి. వీటిలోని లైంగిక భాగాలను ఆంథిరీడియం (పురుష ప్రత్యుత్పత్తి భాగం), ఆర్కిగోనియం (స్త్రీ ప్రత్యుత్పత్తి భాగం) అని అంటారు. మాస్ మొక్కలు నేలపై తివాచీల మాదిరిగా కనిపిస్తాయి. మాస్ మొక్కల శైశవ దశను 'ప్రథమ తంతువు' అంటారు.

ఉదా: పాలిట్రైకం, ఫ్యునేరియా, స్పాగ్నం. బ్రయోఫైటా. వీటిని మొదటి నేల మొక్కలుగా పేర్కొంటారు.

3. **టెరిడోఫైటా:** సాధారణంగా ఈ రకమైన మొక్కలను అలంకరణ కోసం ఉపయోగిస్తారు. వీటికి సంబంధించిన అధ్యయనాన్ని 'టెరిడాలజీ' అంటారు. వీటిని గార్డెన్‌క్రీపర్స్, గార్డెన్ స్నేక్స్, నాళికాయుత పుష్పించని మొదటి నిజమైన నేల మొక్కలు అని అంటారు. క్లబ్ మాస్, హార్స్‌టెయిల్స్, ఫెర్న్ మొదలైనవి టెరిడోఫైటాకు చెందిన మొక్కలు. వీటిలో భిన్నమైన ప్రసరణ స్తంభాలు ఉంటాయి. టెరిడోఫైటా మొక్కలు అతి తక్కువ భౌగోళిక ప్రాంతాలకు పరిమితమై ఉంటాయి. వీటిలో ప్రత్యుత్పత్తి నిర్మాణాలు ఆంథిరీడియం, ఆర్కిగోనియం. వీటిలో సంయోగ బీజదశను 'ప్రథమాంకురం' అంటారు. **ఉదా:** టెరిస్, లైకోపోడియం, ఈక్విసిటం.



మాదిరి ప్రశ్నలు

1. శైవలాల గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఏమంటారు?
ఎ) మైకాలజీ బి) ఫైకాలజీ
సి) టెరిడాలజీ డి) పేలినాలజీ

2. కిందివాటిలో ఎరువుగా ఉపయోగపడే శైవలం ఏది?
ఎ) స్పైరోగైరా బి) క్లామిడోమోనాస్
సి) స్పైరులినా డి) డయాటమ్స్

3. 'మొదటి నేల మొక్కలు'గా వేటిని పేర్కొంటారు?
ఎ) టెరిడోఫైటా బి) శైవలాలు
సి) బ్రయోఫైటా డి) జిమ్నోస్పెర్మ్స్

4. 'అయోడిన్' దేని నుంచి లభిస్తుంది?
ఎ) క్లామిడోమోనాస్ బి) క్లాడోఫోరా
సి) లామినేరియా డి) క్లోరెల్లా

5. కిందివాటిలో జీవ ఎరువుగా ఉపయోగపడేవి ఏవి?
ఎ) అజోల్లా బి) రైజోబియం
సి) నీలి ఆకుపచ్చ శైవలాలు
డి) పైవన్నీ

6. 'కెల్ప్స్' అనేవి ఏ వర్గానికి చెందుతాయి?
ఎ) శిలీంధ్రాలు బి) శైవలాలు
సి) బ్యాక్టీరియా డి) బ్రయోఫైటా

7. ఆంథిరీడియం అంటే ఏమిటి?
ఎ) పురుష ప్రత్యుత్పత్తి భాగం
బి) స్త్రీ ప్రత్యుత్పత్తి భాగం
సి) కేసరావళి డి) అండకోశం

8. మొక్కల్లో 'ఫ్రాండ్స్' అనేవి?
ఎ) వేర్లు బి) పత్రాలు
సి) కాండం డి) పుష్పాలు

9. కిందివాటిలో మైకోరైజాలో ఉండేది ఏది?
ఎ) శిలీంధ్రం బి) శైవలం
సి) ఎ, బి
డి) నీలి ఆకుపచ్చ శైవలాలు

10. కిందివాటిలో అలంకరణ కోసం పెంచే పుష్పించని మొక్కలు ఏవి?
ఎ) బ్రయోఫైటా బి) శైవలాలు
సి) శిలీంధ్రాలు డి) టెరిడోఫైటా

11. 'అగార్ - అగార్' వేటి నుంచి లభిస్తుంది?
ఎ) గ్రాసిల్లేరియా
బి) క్లామిడోమోనాస్
సి) నీలి ఆకుపచ్చ శైవలాలు
డి) పైవన్నీ

12. వ్యోమగాములు ఆహారం కోసం ఉపయోగించే శైవలం ఏది?
ఎ) క్లోరెల్లా బి) వాల్‌వాక్స్
సి) స్పైరులినా డి) పైవన్నీ

13. పెన్సిలిన్‌ను ఎవరు కనుగొన్నారు?
ఎ) వాక్స్‌మన్
బి) అలెగ్జాండర్ ఫ్లెమింగ్
సి) వాట్సన్ డి) లివెన్ హక్

14. జన్యుశాస్త్ర ప్రయోగాల్లో వేటిని ఉపయోగిస్తారు?
ఎ) న్యూరోస్పొరా
బి) అగారికస్ సి) అజొల్లా
డి) రైజోబియం

15. జీవ పరిణామం ప్రకారం పుష్పించని మొక్కల్లో చివరి దశలో ఉండేవి?
ఎ) బ్రయోఫైటా బి) టెరిడోఫైటా
సి) శైవలాలు డి) శిలీంధ్రాలు

16. లైకెన్స్‌లో ఉండేవి?
ఎ) శిలీంధ్రం, శైవలం
బి) శైవలం, బ్రయోఫైటా
సి) శిలీంధ్రం, బ్రయోఫైటా
డి) బ్రయోఫైటా, టెరిడోఫైటా

17. 'వృక్ష రాజ్య తివాచీలు'గా ఏ మొక్కలను పేర్కొంటారు?
ఎ) శైవలాలు బి) శిలీంధ్రాలు
సి) బ్రయోఫైటా డి) టెరిడోఫైటా

సమాధానాలు

1) బి; 2) డి; 3) సి; 4) సి; 5) డి; 6) బి; 7) ఎ; 8) బి; 9) ఎ; 10) డి; 11) ఎ; 12) ఎ; 13) బి; 14) ఎ; 15) బి; 16) ఎ; 17) సి.

To read between the lines...



BANK EXAMS
GENERAL ENGLISH

Choose the correct form of the verb (1-3)

1. My uncle ____ with us for last three years.
1) stay 2) stayed 3) stays
4) has been staying

2. He ____ tired because he ____ since morning.
1) feel; work 2) feels; works
3) felt; had been working
4) felt; worked

3. She told me his name after he ____ the room.
1) leave 2) left 3) leaves
4) will leave

Fill in the blanks with appropriate preposition (4-6)

4. He aspires ____ the post of a professor.
1) to 2) at 3) from 4) for

5. He was born ____ a family of clerks.
1) on 2) in 3) into 4) with

6. You should generally pass ____ the fault of your friends.
1) at 2) along 3) away 4) by

Fill in the blanks with an appropriate word from the four options given (7-10)

7. This is a ____ opportunity to enjoy the holiday of a lifetime in Goa.
1) brisk 2) active 3) golden
4) coarse

8. He doesn't know much about the subject, but he's very _____.
1) vociferous 2) quiet
3) enthusiastic 4) dull

9. _____ books I had kept for you were stolen.
1) few 2) a few
3) the few 4) an few

10. Officers responsible for an _____ coup were punished.
1) mature 2) young
3) successful 4) abortive

Fill in the blanks with suitable articles (11-13)

11. ____ Iron is ____ kind of material.
1) The; a 2) A; a
3) A; an 4) No article; a

12. I like using _____ knife and _____ fork while eating.
1) A; a 2) A; an
3) A; the 4) A; No article

13. We started late in ___ afternoon.
1) a 2) an 3) the 4) No article

Choose the synonym of the underlined word in the sentence (14-15)

14. An ambiguous statement means
1) Uninteresting and too lengthy
2) Forceful and convincing
3) Capable of being understood in more than one sense
4) Based upon good judgment

15. Who would like such an impudent fellow?
1) Civilized 2) Humble
3) Respectful 4) Cheeky

Choose the antonym of the underlined word in the sentence (16-17)

16. The criminal was convicted by the judge.
1) Offended 2) Criminal
3) Condemned 4) Acquitted

17. His urbane attitude won him many friends.
1) Indifferent 2) Violent
3) Rustic 4) Rude

18. To read between the lines means
1) Suspect 2) Read carefully
3) Understand the hidden meaning
4) To do useless things

19. Give a word that collocates with "Fixed"
1) Court 2) Office
3) Rate 4) Ward

Choose the meaning of the underlined word in the given context (20-21)

20. Irrigation canals provide arable lands.
1) Abundant 2) Ploughable
3) Suitable 4) Desert like

21. My husband bugs me ad infinitum.
1) At home 2) At will
3) Forever 4) Occasionally

22. **A:** Oh, I've just realized, I haven't got any money.
B's response is __________
1) Is it? 2) Was it?
3) How come? 4) Haven't you?

23. **A:** It will stop raining soon.
B: Then we'll go out.
Combine the two sentences
1) We shall be going out when it stops raining.
2) We may go out when it stops raining.
3) We'll go out when it stops raining.
4) We will be going out as soon it stops raining soon.

24. A said: "Are you in a hurry?"
B's response is __________
1) Yes, I got plenty of time.
2) No, I've got plenty of time
3) Although I got plenty of time
4) Nevertheless I may not come

25. The sentence which is incorrect from the following four options is:
1) I wish you would listen to me
2) I wish I would have more free time
3) I wish the weather would change
4) I wish you wouldn't complain all the time

26. They asked me some difficult questions at the interview. (Change into passive voice)
1) I was asked some difficult questions at the interview.
2) I was being asked some difficult questions at the interview.
3) They were asked some difficult questions at the interview.
4) I had been asked some difficult questions at the interview.

27. "Stay in the bed for a few days," the doctor said to me. (Write the reported speech)
1) The doctor tells me to stay in bed for a few days.
2) The doctor said to me to stay in bed for a few days.
3) The doctor told me to stay in bed for a few days.
4) The doctor asked to me to stay in bed for a few days.

Complete the sentence with an appropriate word.

28. ___ my parents are from London.
1) Both 2) Neither
3) Either 4) Either of

29. You have just been to a cinema. The film was extremely boring. What do you say to your friend in the above situation?
1) That's the bore film I had ever seen.
2) That's the most interesting film I've ever seen.
3) That's the most boring film I've ever seen.
4) That's the most boring film that I have seen.

30. **A:** I lost all my money and I also lost my passport.
B: I lost all my money and I lost also my passport.
Which option is correct?
1) Only A 2) Only B
3) Both A & B 4) Neither A nor B

Choose the wrongly spelt word from the options given below (31-32)

31. 1) Pronunciation 2) Precision
3) Submission 4) Parsuasion

32. 1) Jovial 2) Comission
3) Dictionary 4) Mansion

Identify the parts of speech of the underlined word (33-34)

33. We had our breakfast at a cafe near the rail station.
1) Noun 2) Adjective
3) Adverb 4) Verb

34. The weather was very cold.
1) Noun 2) Adjective
3) Adverb 4) Verb

35. The odd one out from the following:
1) An army of ants
2) A flight of birds
3) A flock of fish
4) A flock of sheep

36. Identify the complex sentence from the following options.
1) Being an English teacher with a penchant for syntactical complexity, I love simple sentences.
2) Being an English teacher with a penchant for syntactical complexity, I love to read simple sentences upon getting up and before going to bed.
3) I can name several conjunctive adverbs; consequently, my friends are impressed.
4) Because people know that I am an English teacher, they make allowances for how I dress and what I say.

37. The statue that is made of marble was bought from Jaipur. (Write the simple sentence)
1) The marble statue was bought from Jaipur.
2) The statue is made of marble and had been bought from Jaipur.
3) The statue which is made in marble was bought from Jaipur.
4) The statue of marble was being bought from Jaipur.

38. I have no money to lend you. (Convert into a complex sentence)
1) I have no money in order I can lend you.
2) I have no money that I can lend you.
3) I have no money that to I can lend you.
4) I have no money that I cannot lend you.

39. Very few boys in the class are as tall as John. (Write the comparative degree)
1) John is taller than other boys in the class.
2) John is taller than most boys in the class.
3) John is taller than much other boys in the class.
4) John is taller than most other boys in the class.

40. All the sentences mean the same except
1) Madurai is the oldest town in Tamilnadu.
2) Madurai is older than any other city in Tamilnadu
3) Many other cities in Tamilnadu are as old as Madurai.
4) No other city in Tamilnadu is older than Madurai.

41. The following sentence has the sentence structure
The leaves turn yellow.
1) S+V+C 2) S+V+O
3) S+V+IO 4) S+V+DO

Choose the appropriate question tag (42-45)

42. It won't be hard to convince her.
1) Won't it? 2) Will it?
3) Is it? 4) Was it?

43. Seetha doesn't like him.
1) Doesn't she? 2) Does seetha?
3) Doesn't seetha? 4) Does she?

44. He plays pretty well.
1) Is he? 2) Did he?
3) Was he? 4) Doesn't he?

45. She is writing her homework.
1) Is she? 2) Was she?
3) Isn't she? 4) Does she?

Key:

1) 4	2) 3	3) 2	4) 4	5) 3
6) 4	7) 3	8) 3	9) 3	10) 4
11) 4	12) 4	13) 3	14) 3	15) 4
16) 4	17) 3	18) 3	19) 3	20) 2
21) 3	22) 4	23) 3	24) 2	25) 2
26) 1	27) 3	28) 1	29) 3	30) 1
31) 4	32) 2	33) 1	34) 2	35) 3
36) 3	37) 1	38) 2	39) 4	40) 3
41) 1	42) 2	43) 4	44) 4	45) 3.